కులనిర్మూలన ఎలా?

జి.వీరాస్వామి

అంధ్రప్రదేశ్ కులనిర్మూలన సంఘం

REHB02G1250

కులనిర్మూలన ఎలా?

రచయిత :

సంఘోద్ధారక

జె. వీరాస్వామి,

అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ కులనిర్మూలన సంఘం,

ప్రచురణ :

ఆంధ్రప్రదేశ్ కులనిర్మూలన సంఘం

హైదరాబాదు.

ప్రచురణ : 1979

ప్రతులు : 1000

హక్కులు : ఆంధ్రప్రదేశ్ కులనిర్మూలన సంఘానివి

ప్రతులకు :

ప్రధాన కార్యదర్శి,
ఆంధ్రప్రదేశ్ కులనిర్మూలన సంఘం,
7-1-617/A/2 అమీర్ పేట.
హైదరాబాదు-5000 16

ముద్రణ:- హరిజన కో-ఆపరేటివ్ పబ్లిషింగ్ అండ్ ప్రింటింగ్ సొసైటి లిమిటెడ్
దారుషిపా, హైదరాబాదు. ఫోన్ నెం. 46095,

విషయసూచిక

	మా మాట	i
	"వీరశిఖామణి"	xi
1.	కులరహిత సంఘ నిర్మాణము	1
2.	మన సమాజము : కులతత్వ ధోరణులు	4
3.	యువకులు : సాంఘిక సమస్యలు	10
4.	వర్ణాంతర వివాహాలు : అనుభవాలు	14
5.	మానవత	28
6.	మూఢనమ్మకాలు – మూఢాచారాలు	30
7.	సాంఘిక విప్లవము : ప్రజలు–ప్రభుత్వము	40
8.	అంతర్వర్ణ వివాహాలు : నవసమాజ నిర్మాణం	45
9.	సమాజము – కులము	51
10.	సాంఘిక ప్రగతి : కులరహిత సమాజము	57
11.	మన సమాజంలో కులతత్వం పోవాలంటే ఏమిచేయాలి ?	62
12.	నేటి సాంఘిక సమస్యలు	74
13.	వర్ణాంతర వివాహాలు	83
14.	కులమతాలు	90
15.	సమ సమాజము–వర్ణాంతర వివాహాలు	98
16.	ఆంధ్రలో కులనిర్మూలనోద్యమం	104
17.	జాతీయ సమైక్యత--కులాంతర వివాహాలు	114
18.	కుల చిహ్నాల తొలగింపు	121
19.	హిందూ కోడ్ బిల్లు ; డా॥ అంబేద్కర్	130
20.	యుగపురుషుడు–కందుకూరి వీరేశలింగం	143
21.	కుల దృక్పథం ఎలా పోతుంది ?	153
22.	కులనిర్మూలన ఎలా ?	159

మా మా టి

సమాజ సర్వతోముఖాభివృద్ధికి రాజకీయ స్వాతంత్ర్యం ఎంత అవసరమో సాంఘిక అసమానతల నిర్మూలనం కూడ అంతే అవసరం అనే విషయం విజ్ఞులకు తెలియనిదికాదు. అందుపల్లనే ఒక ప్రక్క స్వాతంత్ర్యోద్యమం, మరొకప్రక్క సాంఘిక సంస్కరణోద్యమం రెండు మన దేశంలో ద్విముఖాలుగా సాగాయి. వాస్తవానికి భారతదేశంలో సంస్కరణోద్యమం, స్వాతంత్ర్యోద్యమం కంటే ముందుగానే ప్రారంభమైంది. 18వ శతాబ్ది ఆఖరిపాదంలో జనించిన రాజారామ మోహనరాయ్ యావజ్జీవితం కావించిన సంస్కరణ కృషి1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య మహా సంగ్రామానికి పూర్వమే జరిగింది. 1848లో జన్మించిన కందుకూరి వీరేశలింగంగారు ఒక ప్రక్క స్వాతంత్ర్యోద్యమం జరుగుతుంటే మరొకప్రక్క సంస్కరణోద్యమాన్ని అద్వితీయులై నిర్వహించారు. శ్రీయుతులు గురజాడ అప్పారావు, రఘుపతి వేంకటరత్నం, త్రిపురనేని రామస్వామి, ఉన్నవ లక్ష్మీ నారాయణ, ఆవుల గోపాలకృష్ణమూర్తి, గోరా మొదలగు మహామహులు తెలుగు సీమలో శ్రీవీరేశలింగం వెలిగించిన జ్యోతిని ప్రజ్వలింపచేస్తూ వచ్చారు. ఇంకా ఎందరో ప్రముఖులు, రాజకీయ పార్టీలు కూడ ఈ సంస్కరణోద్యమానికి చేయూతనిచ్చాయి. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పురోగమిస్తున్న సంఘ సంస్కరణోద్యమం 1971లో "ఆంధ్రప్రదేశ్ కులనిర్మూలన సంఘ" స్థాపనతో ఒక నూతన రూపాన్ని ధరించింది.

ఇంత వరకూ సంఘ సంస్కరణకు జరిగిన కృషి పాతపద్ధతుల ప్రకారమే జరుగుతూ వచ్చింది. నడకలో వేగం మందగించింది. అందువల్ల ప్రజలలో ఒక ఆలోచన రేకెత్తించడానికి సంస్కరణ కృషి చురుకుగ సాగేటట్లు చేయడానికి ఒక సంఘం అవసరమని సంస్కరణాభిలాషులు భావించారు. అట్టి వారిలో ముఖ్యులైన శ్రీ జి. సురమౌళి పూనికతో 1971 నవంబరులో కుల నిర్మూలనసంఘ స్థాపన జరిగింది. శ్రీ సురమౌళితో కలిసి శ్రీయుతులు లవణం, సి. హెచ్. సూర్య

నారయణ మూర్తి, చుండి జగన్నాధం, బి. నాగేశ్వరరావు, కె.వి. యస్. రాజు, కావూరి పట్టాభిరామయ్య, తుర్లపాటి సత్యనారాయణ, తిరువీధి రమణయ్య, కేశవరావ్ జాదవ్, మొదలగు వారు ఆం. ప్ర. షెడ్యూల్డ్ కాస్ట్స్ ప్రొటెక్షన్ సొసైటీ. సమాజవాదీ యువజన సభ, సోషలిస్టు పార్టీ, హైదలాబాదుఖాదీ సమితి, తెలంగాణ ఖాదీగ్రామీణ పరిశ్రమల సంఘం మొదలగువాటి సహకారం కూడ సంఘస్థాపనలో లభించింది.

అయితే ఇంతవరకూ వ్యక్తి గతంగానూ, సంఘటితంగానూ, కులాల వ్యత్యాసాన్ని తొలగించడానికి కులాలను. నిర్మూలించడానికీ కృషి జరిగినప్పటికి, కులనిర్మూలననే మకుటంగ ధరించిన సంఘం ఏర్పడలేదు. కులనిర్మూలన సంఘ స్థాపనతో సంఘ సంస్కరణ కార్యక్రమం ఒక విప్లవ రూపాన్ని ధరించింది. సంఘ సంస్కరణాభిలాషి, అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి శ్రీ జాగర్లమూడి వీరాస్వామి, సంస్కర్త శ్రీ డి. జి. రామారావు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఇద్దరు మహిళలతో కూడిన 26 మంది సభ్యులుగల రాష్ట్ర కార్యవర్గ సమితి ఏర్పాటు చేయబడింది. పబ్లిక్ సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం క్రింద 1972 జనవరిలో సంఘం రిజిష్టరు కావింపబడింది.

సదస్సులో ఆమోదింపబడిన విధాన తీర్మాణానికి అనుగుణంగా కులాంతర వివాహములు, సమిష్టి భోజనములు జరిపించుట, ప్రోత్సహించుట, వ్యక్తుల పేర్లలో శాస్త్రి, శర్మ, రెడ్డి, చౌదరి, గుప్త, నాయుడు వంటి కుల సంకేతాల తొలగింపుకు కృషిచేయుట, ప్రభుత్వ, సహయ సంస్థలలోని ఉద్యోగాలలో కులాంతర వివాహం చేసికొన్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని, దీనికి అవసరమైన రాజ్యాంగ సవరణ చేయాలని కోరుట, కులాల వారీగా కాలనీలు, వాడలు, బావులు నిర్మించడాన్ని నిషేధించుట, అన్ని కులాలవారు కలిసి నివసించే మార్గాలను ప్రోత్సహించుట, కులాంతర వివాహల కుటుంబాల సంక్షేమానికి, వారి సంతానానికి విద్యావకాశాల కొసం మరియు కులాంతర వివాహితుల కొరకు బడ్జెటులో ప్రత్యేక నిధిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అర్థించుట మొదలగు కార్యక్రమాలను రూపొందించి అమలు జరుపుటకు తగు ప్రయత్నములు చెయుటకు ఉద్యమించట మైనది.

సంఘ అధ్యక్ష ప్రధానకార్యదర్శులిరువురు సంఘ ఆశయా దర్శాలనుప్రచారం చేయడానికి జిల్లా సంఘాలను ఏర్పాటు చేయడానికి పూనుకొన్నారు. తత్ఫలితంగా గుంటూరు జిల్లా కులనిర్మూలన సంఘం ఏర్పాటు చేయబడింది. తెనాలిలో కుల నిర్మూలన సభను, విజయవాడలో కులనిర్మూలన మీద గోష్ఠి జరుపబడ్డాయి.

కులాంతర వివాహాలు చేసికొన్న శ్రీమతులు వి. లక్ష్మి, వేంకటేశ్వరి, సావిత్రి రామన్ గార్లతో సంఘాధ్యక్షులు వీరాస్వామిగారు జరిపిన రేడియో గోష్ఠి ప్రత్యేకంగా పేర్కొనదగినట్టిది. నెల్లూరు, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లా సంఘాలు, రేపల్లె తాలూకా సంఘం, సికింద్రాబాదులో కంటోన్మెంటు శాఖలు ఏర్పాటయ్యాయి. ఆ సందర్భంలో 1972 సెప్టెంబరులో సంఘ తోడ్పాటుతో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖవారు ఏర్పాటుచేసిన 'సాంఘిక సంస్కరణల సదస్సు' కులంతో ప్రాధాన్యత ఉంది. ఈ సదస్సులో కులాంతర వివాహాల విశిష్టత వివరింపబడటమే కాక కులాంతర వివాహాల ప్రోత్సాహానికి, అనేక ఆచరణ సాధ్యమైన సూచనలు కూడ చేయబడ్డాయి. సంఘాధ్యక్షులు ఆయా సమయాలో ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంనుండి చేసిన ప్రసంగాలను, పత్రికల్లో ప్రచురింపబడిన వ్యాసాలను కలిపి పురోగమి ప్రచురణలు, పొన్నూరు వారి తరఫున శ్రీ దేవరపల్లి మస్తానురావు డిసెంబరు 72లో 'క్రాంతి రథం' అనే పేరుతో పుస్తక రూపంలో ప్రచురించారు.

కులాంతర వివాహాలు చేసికొన్న వారికి తమిళనాడు తదితర రాష్ట్ర ప్రభుత్వాలు చేకూరుస్తున్న సౌకర్యాలవంటివే ఆంధ్రప్రదేశ్‌లో కూడ కల్పించాలని, పరికొన్ని సూచనలతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు శ్రీ యం. వి. కృష్ణారావుకు సంఘంద్వారా ఒక విజ్ఞప్తి సమర్పించబడింది. నగదు బహుమతులు; ఉద్యోగావకాశాలతో పాటుఇండ్ల స్థలాలు, నృత్తుల స్థాపనకు పడ్డీలేని అప్పులువారి పిల్లలకు ఉచిత విద్యావకాశాలు కూడ కులాంతర వివాహం చేసికొన్న దంపతులకు కల్గించాలని కోరుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది.

1973 సంవత్సరములో మహబూబ్‌నగర్ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, విశాఖపట్నం జిల్లా సంఘాలు ఏర్పరచబడ్డాయి. ఇవేగాక ఖమ్మం జిల్లా సంఘం, బోధన్ పట్టణ సంఘం, నిజామాబాదు జిల్లా సంఘాలు కూడ స్థాపించబడ్డాయి

ఆయాజిల్లాల సంఘ స్థాపనలోనూ, సంఘ కార్యక్రమాలలోనూ. శ్రీలవణం, హేమలతా లవణం, శ్రీయుతులు అరిగె రామస్వామి, డాు ఎతిరాజులు, గురిజాల సీతారామయ్య, పి. అచ్చుతరామ్, గంగాధర్, ఆంతటి నరసింహం, ఎండ్లూరి, పి. వి. చలపతిరావు, జగన్మోహనరావు, ప్రొ. వేణుగోపాలరావు, ఇస్కా వసంతకుమార్, ఆర్. పార్థ సారధి, సి. వేంకటేశ్వర్లు, డి. ఆర్. కుసుమ ప్రభృతులు నిర్వహించిన పాత్ర ఆత్యంత ప్రశంసనీయం.

సంఘం అనవరతం చేస్తున్న కృషి ఫలితంగా 1974 జులై లో అప్పటి ముఖ్య మంత్రి శ్రీ వెంగళరావు శ్రీ వీరేశలింగం 125వ జయంతి ఉత్సవంలో మాట్లాడుతూ కులాంతర వివాహితులకు, ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆ ఉత్తర్వు ప్రకారం హరిజనులకు, హరిజనేతరులకు మధ్య జరిగిన వివాహాలకు, షెడ్యూలు తరగతులకు తదితరులకు మధ్య జరిగే వివాహాలకు, అన్ని మతాంతర వివాహాలకు రు. 1000/–లు. వెనుక బడిన తరగతులకు మధ్యజరిగిన వివాహాలకు రు. 500/–లు నగదు బహుమతులు, ఇవ్వబడుతవి. సంఘ ప్రోద్బలముతో ఇటువంటి బహుమతులు, హరిజనులలోనే కల ఉపకులముల మధ్య జరిగే వివాహాలకు కూడ రు. 1000/–లు ఇచ్చునట్లు ప్రభుత్వ ఉత్వర్వులు జారీచేయబడినాయి. స్పెషల్ మారేజ్ ఆక్ట్ క్రింద జరిగే కులాంతర, మతాంతర వివాహాలకు రిజిస్ట్రేషన్ రుసుము రద్దు చేయడమైనది. కులాంతర వివాహాలకు ప్రభుత్వాధికారులు ఆహ్వానింపబడినపుడు, వారు విధిగా హాజరుకావాలని, ఆదేశింపబడింది. షెడ్యూలుకులాలు, వెనుక బడిన తరగతుల వారికి ప్రభుత్వం ద్వారా లభించు సౌకర్యాలు వారిసంతానానికి కూడ అమలులోనున్న ఉపకారవేతనములు, హాస్టలు సదుపాయములు మొదలగునవి కల్పింప బడినాయి. ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజిలో కులాంతర వివాహితులకు ప్రాధాన్యత ఇచ్చుటకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినది, వ్యక్తుల పేర్లలోని కులసంకేతాలను తొలగించు కొంటూ పేరుమార్పు కొననిశ్చయించు కొన్నవారికి ఉచితముగా ప్రభుత్వ గజిటులో ప్రకటించుటకు ప్రభుత్వం ఉత్తర్వు లిచ్చియున్నది. సంఘ కృషికారణం గానే 1974–75 సంవత్సరానికి కులాంతర వివాహితుల ప్రోత్సాహానికి ప్రభుత్వం కేటాయించిన డబ్బులో మిగిలిన 4 లక్షల రూపాయలు మొత్తాన్ని, వైజాగ్, కర్నూలు,

హైదరాబాదు పట్టణాలలో శ్రీ వీరేశలింగం హాలుల నిర్మాణానికి వెచ్చించడానికి గాను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కులాంతర వివాహాలు జరుపడానికి గాని, మతాంతర వివాహితులు కొద్ది కాలం వుండటానికి అనువైన స్థలం ఇంతవరకు హైదరాబాదులో లేదు. అందువల్లనే ప్రభుత్వం నిర్మించబోయే వీరేశలింగం హాలు తయారైతే ఇలాంటి సంస్కరణ కార్యక్రమాలకు ఎంతో అనుకూలంగా ఉంటుంది.

1975 ఏప్రిల్ 15వ తేదీన జరిగిన రాష్ట్ర సంఘ వార్షిక మహాసభలో శ్రీ జె. వీరాస్వామి, శ్రీ వి. నాగేశ్వర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఒక నూతన కార్య వర్గం ఎన్నుకోబడింది. ఈ మహాసభల సందర్భంగా జరిగిన బహిరంగ సభకు ప్రముఖ సర్వోదయ నాయకులు శ్రీ ప్రభాకర్‌జీ అధ్యక్షత వహించారు. ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఆవుల సాంబశివరావు ప్రారంభోత్సవం చేశారు. ప్రముఖ పత్రికా రచయిత శ్రీ నార్ల వేంకటేశ్వరరావు మొదలగు ప్రముఖులెందరో పాల్గొనడం సంఘం చేసిన సేవలకు గుర్తింపు. సంఘం పొందిన ప్రజాదరణకు నిదర్శనాలు. ఈసందర్భం లోనే కర్నూలు జిల్లాలోని కోయిలకుంట్ల నియోజక వర్గానికి చెందిన అప్పటి శాసన సభ్యులు శ్రీ యం.వి. సుబ్బారెడ్డి కులనిర్మూలన ఎడతసకు గల ప్రగాఢ అభిమానము సూచించుచు, సంఘ కార్యవర్గ సభ్యత్వానికి ఆటంకంగానున్న తన పేరులోని కుల చిహ్నాన్ని తొలగించడానికి మారుగా తన పేరునే పూర్తిగా మార్చుకొని 'గామాగో' అని నూతన నామధ్యేయంతో వ్యవహరిస్తున్నారు.

1975 ఏప్రిల్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా శ్రీ వీరేశలింగం జన్మదినోత్సవాన్ని పురస్కరించు కొని రవీంద్రభారతిలో సంఘ సహ కారంతో మూడు కులాంతర వివాహాలు జరుపబడ్డాయి. ఈ సందర్భంలోనే కులాంతర వివాహాలు, వితంతు వివాహాలు చేసికొన్న కొందరికి సన్మానాలు జరిగాయి.

జంటనగరాల్లో సంఘ కార్యక్రమాలు, చురుకుగా కొనసాగించే ఉద్దేశ్యంతో 75 జూన్‌లో శ్రీ డి. జి. రామారావు శ్రీ బి. వి. దేవదత్ అధ్యక్ష కార్యదర్శులుగా పట్టణ కులనిర్మూలన సంఘం ఏర్పరచబడింది.

1975వ జులైలో సాంఘిక విప్లవకారులు ప్రముఖ నాస్తికులు శ్రీ గోరా అకాల మరణంతో కులనిర్మూలనోద్యమానికి ఒక అంతపడిపోయినట్లయింది.

1975 ఆగస్టులో విజయవాడలో ప్రభుత్వ ప్రోత్సాహంతో జరిగిన సాంఘిక సంస్కరణల సదస్సులో రాష్ట్రంలోని ఎందరో సంస్కర్తలు, సంస్కృతడాభి లాషులు, పుంత్రులు పాల్గొన్నారు.

1976 ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో రాష్ట్రస్థాయి హరిజన మహాసభలు హైదరాబాదులోని లాల్‌బహదూర్ స్టేడియం వద్ద జరిగాయి. ఈ సందర్భంలో రాష్ట్ర కులనిర్మూలన సంఘం ఎగ్జిబిషన్‌లో ఒక స్టాలును ఏర్పాటు చేసింది. అందులో కుల నిర్మూలన సంఘ ఆశయాదర్శాలు, కులాంతర వివాహితుల ఫోటోలు, గ్రాఫులు మొదలైనవి ప్రదర్శింపబడ్డాయి. అగ్రకులాలను బడేవారికి హరిజనులకు మధ్య జరిగిన వివాహాలే ఎక్కువ శాతం వున్నట్లు గ్రాఫు ద్వారా వెల్లడైన ముఖ్య విషయం. అంతే గాక జిల్లాలవారిగా లభ్యమైన సమాచారాన్ని బట్టి కులాంతర వివాహం చేసికొన్న వారి పేర్లు, స్థలం, తారీఖులతో సహా ప్రాసి ప్రదర్శించడం జరిగింది. రోజు ఎన్నో పందల మంది ఈ స్టాలును దర్శించేవారు. ముగింపు దినాన ప్రభుత్వేతర స్టాల్సు లన్నింటిలోను ఈ స్టాలుకు ప్రథమ బహుమతి లభించింది. ఈ విధంగా హరిజన మహా సభల సందర్భంగా కులనిర్మూలన ప్రచారం ముమ్మరంగా జరిగింది. మహాసభల సందర్భంగా సంఘ ఆధి పత్యంలో 3 కులాంతర వివాహాలు జరిగాయి. వీటిని ప్రముఖ బ్రహ్మసమాజ నాయకులు శ్రీ తల్లాప్రగడ ప్రకాశరాయుడు జరిపించారు. ప్రభుత్వ ఆహ్వానంపై బహు సంఖ్యలో విచ్చేసిన కులాంతర వివాహితులకు ఆల్పాహార విందు ఏర్పాటుచబడింది. ఎందరో యువతీయువకులు కులాంతర వివాహం చేసికోవడానికి ముందుకు వచ్చారు. 1976 మే 16న సంఘ అధ్వర్యంలో జూలాజికల్ పార్కులో కులాంతర వివాహితుల ఇష్టా గోష్టి సమావేశం ఏర్పాటు చేయబడింది. 150 మంది కులాంతర వివాహితులు ఆనాటి సమావేశానికి హాజరై ఉమ్మడి సమస్యలను గూర్చి పరస్పరం చర్చించుకొన్నారు.

కుల నిర్మూలన సంఘ అధ్వర్యంలో జరిగే అనేక గోష్టులు, సదస్సులు, కులాంతర వివాహాలకు ఆయా సందర్భాలలో అనేక మంది ప్రముఖులను ఆహ్వానించి వారికి సంఘ కార్యక్రమాలను పరిచయం చేయడం జరిగింది ఆయా సందర్భాలలో ఆప్పటి గవర్నరు శ్రీమతి శారదాముఖర్జీ ముఖ్యమంత్రి శ్రీజలగం వెంగళరావు మంత్రులు భట్టం శ్రీరామమూర్తి, జి. రాజరాం, అంజయ్య, వేంకటస్వామి, బి. వెంకటరామ్ ప్రముఖ, కవి బోయిభీమన్న న్యాయమూర్తి శ్రీ కె. పున్నయ్య, పబ్లిక్ సర్వీస్ కమిషన్

సభ్యులు శ్రీ టి. వి. నారాయణ, బి. నాగేశ్వరరావు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయ కార్యదర్శి శ్రీ యం. ఎల్. నరసింహారావు ప్రభృతులు పాల్గొని సంఘ కార్య క్రమాలలో ఎంతో ఆసక్తి కనబరచారు.

కులాంతర వివాహం చేసికొనగోరే యువతీయువకులు అనేక మంది సంఘ కార్యాలయానికి వస్తూంటారు. వారందరికి రకరకాలైన సమస్యలుంటాయి. వీరిలో హెచ్చు భాగం ఉభయుల తల్లి దండ్రులు ఆమోదించనివే. అయితే ఒక్కొక్కప్పుడు వధువు తల్లిదండ్రులు ఆమోదిస్తే, వరుని తలిదండ్రులు ఆమోదించని సంబంధాలు, వరుని తల్లిదండ్రులు ఆమోదిస్తే వధువు తల్లిదండ్రులు ఆమోదించని సంబంధాలు ఉంటాయి. వీరిలో కొందరు ఉద్యోగం లేకపోయినా, పిల్లకు ఆమెతల్లిదండ్రులు మరొక సంబంధం చేయబోతున్నారు గనుక వెంటనే పెళ్ళికావాలని కారణాలు చెబుతుపస్తూం టారు. కులనిర్మూలన సంఘ ఆధ్వర్యంలో జరిగే వివాహాలు స్పెషల్ మ్యారేజ్ యాక్టు క్రింపనే నోటీసు ఇచ్చి చేసికోవాలని సంఘం తీర్మానించింది. దీనికి కారణం వివాహవంతులు, ఖర్చులు లేకుండా, కేవలం రిజిస్టరులో సంతకాలతో తగుప్రమాణా లతో వివాహం జరుగుతుంది. అన్నివుతములవారికి ఉపయోగపడుతుంది. ఈ వివాహా నికి 30 రోజుల గడువు ఏ అభ్యంతరాలున్నా సూచించడానికి అవకాశం కల్గుతుంది. ఒక వేళ 30 రోజులు ఆగడం కష్టమనుకొన్నవారు హిందూ వివాహముల చట్టం క్రింద పెళ్ళి చేసికొని వెంటనే రిజిస్టరు చేయించుకొని వేరేకాపురం పెట్టిన వారు న్నారు. ఇట్టివారికి మొదట్లో తల్లిదండ్రుల ఒత్తిడి, పోలీసుల బెడద తప్పడంలేదు. కాని సంఘ సహాయంతో వారుతమ ఇబ్బందులను అధిగమించి సుఖజీవనం గడుపుతున్న వారెందరో ఉన్నారు. మొదట్లో వ్యతిరేకించిన తల్లిదండ్రులు కాలక్రమేణ తమ మనస్సులు మార్చుకొని కులాంతర వివాహితులైన తమ పిల్లలతో కలిసి పోయిన సందర్భాలే హెచ్చుగా ఉన్నాయి.

ఒక్కొక్కప్పుడు కొందరు తలిదండ్రులే వచ్చి తమ పిల్లలకు కులాంతర వివాహం చేయ సంకల్పించామని తగిన సంబంధంవుంటే తెలుపమని కోరుతుంటారు. ఇలా వచ్చే వారిలో మూడు రకాలైన వ్యక్తులు కన్పిస్తారు. మొదటివారు – కులమత భేదాలు కృతకాలు, గుణం ప్రధానంకాని, కులంకాదు, ఆస్తికాదు, అని చిత్త శుద్ధితో కోరేవారు. రెండవరకం తమ కులంలో తగిన వ్యక్తులు లభించక పోవడంవల్ల కులాంతర వివాహాన్ని కోరేవారు. అయితే వీరిలో పూర్తి మార్పుగోచరించదు. వీరిలో కులాభిమానం నశించదు. వీరి దృష్టిలో కొన్ని కులాలు గొప్పవి. మరికొన్ని కులాలు

తక్కువవి. అందువల్ల తాము గొప్పవని భావించే కులాల వారితో తమ పిల్లల సంబంధాలు జరిపించాలని భావిస్తారు. అందుకని వీరు మొదట్లో కులాంతర వివాహాలు మంచివని వగైరాలు చెప్పి చివరకు తమ పిల్లలకు ఫలానా కులాలు తప్ప తక్కువ వాటిలో చూడండని కోరుతుంటారు. మూడవ రకంవారు తమ పిల్లలకు కట్నం ఇవ్వలేక వయస్సు పెరిగి పోతున్న దృష్ట్యా, ఇక పిల్లలకు పెళ్లి చేయలేమని భయపడి కులాంతర వివాహం చేద్దామని సిద్ధపడేవారు. అయితే వీరిలోనూ కులతత్వం నశించదు. కులాలయెడ ఆసక్తిపోదు. కాని తప్పనిసరిగా మార్పుకు సిద్ధపడటం జరుగుతుంటుంది.

ఒక్కొక్కప్పుడు పిల్లలు తమ కిష్టంలేని వివాహం చేసికొంటే వారి పెళ్లి చెడగొట్టడానికి వెనుకాడని తల్లిదండ్రులు కూడ ఉంటారు. ఇలాంటిదే ఒక ఘటన. ఒక తక్కువ అనబడే కులానికి చెందిన అబ్బాయి, పై కులం అనబడే కులానికి చెందిన అమ్మాయి, ఇరువురు ప్రేమించి పెళ్లి చేసికొన్నారు. అమ్మాయి తల్లిదండ్రులకు ఇది ఇష్టం కాలేదు. అందువల్ల వారు ఒక డాక్టరు వద్దకు వెళ్లి పిల్ల వయస్సు 18 సంగలు నిండలేదని, అబ్బాయి మోసగించి అమ్మాయిని తీసుకొని వెళ్లి పెళ్లి చేసికొన్నాడని కేసుపెట్టారు. వాస్తవానికి ఇద్దరు మేజర్లే. అబ్బాయికి 25 ఏండ్లు అమ్మాయికి 19 ఏండ్లు ఉన్నాయి. వారిరువురి స్కూలు సర్టిఫికెట్ల ప్రకారం నమోదు చేయబడిన వయస్సులవి. అయితే పోలీసులు జోక్యం చేసికొని అబ్బాయిని బెదిరించడం వగైరా చేయడమే కాకుండా ఆ అమ్మాయిని స్టేట్ హోంలో ఉంచారు. పున అధ్యక్షులు చట్టాన్ని గురించి గట్టిగా పోలీసు ఆఫీసరుకు తెలియజేయడంతో వారు ఉపసంహరించుకొన్నారు. కేసు కొట్టివేయబడింది. ఇట్టా ఎన్నో కేసుల్లో సంఘం జోక్యం చేసికొని కులాంతర దంపతులకు రక్షణ కల్పించడం జరిగింది.

ఎవరైనా కులాంతర వివాహం చేసికోవాలని సలహా కోరి వచ్చినప్పుడు సంఘం ముఖ్యంగా నాలుగు విషయాలను పరిశీలిస్తుంది. ఒకటి, వధూవరులిరువురిలో ఎవరూ మైనరు కాదు గదా! అందుకవసరమైన సర్టిఫికెట్లు పరిశీలించడం జరుగుతుంది. రెండు, ఇరువురికి ఇంత క్రితమే వివాహం జరుగలేదు గదా! ఒకవేళ జరిగితే అవతలి వారు సజీవులైతే చట్టబద్ధంగా విడాకులు పుచ్చుకొన్నారా లేదా అనే విషయం పరిశీలింపబడుతుంది. మూడు, వారిరువురి నిర్ణయం దృఢమైనది, స్థిరమైన గాఢప్రేమతో కూడినదా కాదా? వారితో చర్చించి రానున్న సమస్యలను ఎదుర్కొగల మనోస్థైర్యం పరిశీలించటం జరుగుతుంది. నాలుగు, యువతీ యువకు

లిరువురిలో ఏఒకరికైనా కుటుంబపోషణ కష్టసాధ్యమైన ఆదాయం ఉన్నదా లేదా? ఒకవేళ లేకపోతే వారికి అవకాశం కలిగే వరకు ఆగండని సలహా ఇచ్చి పంపడం జరుగుతుంది. కారణమేమంటే సాధారణంగా ఉభయులు తల్లిదండ్రుల సహాయ సహకారాలు కోల్పోయినప్పుడు తామంతట తాము జీవించే అవకాశం లేకపోతే వివాహం విఫలమయ్యే ప్రమాదం వుంది. అందువల్ల నేటి సమాజంలో నూటికి 99 కులాంతర వివాహాలు సుఖవంతంగా వున్నా, ఒకటి చెడిపోయినా కులాంతర వివాహాలన్నీ విఫలమౌతున్నాయని ప్రచారం చేయడం జరుగుతుంది. కనుక ఎన్ని వివాహాలు జరిపించామని కాక, చేసిన వివాహాలన్నీ సుఖంగా వుండాలనే లక్ష్యానికే ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుంది. కులనిర్మూలన సంఘం స్థాపించిన తర్వాత రాష్ట్రంలో దాదాపు వెయ్యికి పైగా కులాంతర వివాహాలు జరగటమే ఉద్యమం యీ ఏడు సంవత్సరాలలో బలాన్ని పుంజుకున్న దానికి నిదర్శనం.

పోతే సంఘం ఒక రాష్ట్ర రాజధానికి మాత్రమే పరిమితమైలేదు. దీనికి రాష్ట్రంలో 12 జిల్లా సంఘాలు కూడ ఉన్నాయి. అవి కూడ ఆయా సందర్భాలలో కులాంతర వివాహాలు జరిపిస్తూ ఉన్నాయి. అయితే 1976 సం॥లో శ్రీకాకుళం జిల్లా సంఘం, అచ్చటి యువజన సంఘంతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో సుమారు 70 కులాంతర వివాహాలు జరిపించింది.

కులనిర్మూలనమనేది ఒక ముఖ్యమైన సాంఘిక సమస్య. కులాంతర వివాహాలనేవి ఏ ఇరువురు స్త్రీ పురుషుల మధ్య జరిగే వ్యక్తిగత కార్యకలాపాలు కావు. కులాల పేరున అస్తవ్యస్తంగా విభజింపబడి, అనైక్యతతో, పరస్పర విద్వాధిమానాలతో కొట్టు మిట్టాడుతున్న సమాజంలో ఐక్యత, సుహృద్భావం, సమానత్వం, స్వాభిమానం పెంపొందించుటకు తోడ్పడే అత్యవసరమైన చర్య ఇది. దీనికి ప్రచారం, ప్రోత్సాహం ఎంతైనా అవసరం. సంఘాధ్యక్షులు శ్రీ జె. వీరాస్వామి శ్రీయుతులు డి. జి. రామారావు, సురమౌళి, వి. నాగేశ్వర్ తదితర కార్యకర్తలు, కార్యవర్గ ముఖ్యసభ్యులు చేసిన రేడియో ప్రసంగాలు, పత్రికా రచనలు సభలు సమావేశాలలో ప్రబోధాలు, డా॥ ఆంబేద్కర్, శ్రీ వీరేశలింగం ప్రభృతుల జన్మదినోత్సవ సభలు కులనిర్మూలన ప్రచారానికి విరివిగా తోడ్పడ్డాయి.

పోతే సంఘాన్ని గురించి ఒక్కమాట, దీనికి ప్రభుత్వ సహాయం ఆర్థికంగా ఏమిలేదు. సంఘకార్యకర్తలే పూనుకొని దీని కార్యక్రమాన్ని దీక్షతో నిర్వహిస్తున్నారు.

ఒక పదేళ్ళ క్రితం వేర్వేరు కులాలకు చెందిన యువతీ యువకులు పేమించుకొని వివాహం చేసుకో గోరితే, అందుకు పెద్దలు అంగీకరించకపోతే వారి ఆత్మహత్యకు దాం తీసే పరిస్థితులుండేవి. ఈనాడిట్టి పరిస్థితిలేదు. సంఘంయొక్క ప్రధానపల్ల ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూఎందరో స్ఫూర్తినిపొంది ధైర్యంతో కులాంతర వివాహాలు చేసుకోగలుగుతున్నారు, ఎందరో తలిదండ్రులు కూడ లోగడ సంకోచంతో నిస్సహాయులుగా వుండి పోయేవారు. కాని ఈనాడు తామంతట తాముగా వచ్చి తమ పిల్లలకు కావలసిన సంబంధాలను ఎన్నుకొని స్వయంగా చేస్తున్నారు. ఇందుకు మా సంఘం ఎంతైనా సంతోషిస్తూంది.

ఈ పుస్తకరచయిత శ్రీ జె. వీరాస్వామి మాసంఘాధ్యక్షులు, సంఘంస్థాపించిన నాటినుండి ఉద్యోగ నిర్వహణ కాలం మినహాయించి మిగతా సమయమంతా ఈ సొమ్ము కోద్యమానికి వినియోగిస్తున్నవారు. వీరిని గురించి ఇచ్చట ఏమి చెప్పినా మమ్మల్ని మేమే ప్రశంసించుకొన్నట్లవుతుంది. అందువల్ల వారిని గురించి ప్రత్యేకంగా పరిచయం చేయబూనడంలేదు. కులనిర్మూలన ఆశయం. అందుకు కులాంతర వివాహాలు ఏకైక మార్గం, కార్యక్రమం. ఈ వ్యాసాలలో వేర్వేరు దృక్పథాల నుండి విషయాన్ని పరిశీలించడం జరిగింది. ఇంతకు క్రితం 'క్రాంతి రథం' అనేపేరుతో వెలువడిన పీరివ్యాస సంపుటినుండి కొన్ని వ్యాసాలను, తర్వాత ఆంధ్రప్రదేశ్ తదితర పత్రికలలో ప్రచురింపబడిన వ్యాసాలు తేడియో పరిసంగాలను కూర్చి సంఘం తరపున ప్రచురిస్తున్నాము. ఇది మా మొదటి ప్రచురణ. ఇందలి విషయ ప్రాముఖ్యతను గమనించి ఆంధ్ర ప్రజానీకం మా కృషిని ప్రోత్సహించగలదని విశ్వసిస్తూన్నాము.

హైదరాబాదు,
1-10-1978.

వి. నాగేశ్వర్
ప్రధాన కార్యదర్శి.
ఆంధ్రప్రదేశ్ కులనిర్మూలన సంఘం

"విరసిఖామణి"

ఎప్పుడు పుట్టిందో తెలియదుగాని, దానాపు మూడువేల సంవత్సరాలనుంచి కులవ్యవస్థ మన దేశాన్ని కృంగదీస్తున్నది.

ఏవిధంగా పుట్టిందో తెలియదుగాని, అన్నివిధాల కులవ్యవస్థ మన జాతిని అధోగతి పాల్జేస్తున్నది.

కాగా, అది ఎవరికోసం పుట్టించో ఆవిషయమై సందేహానికి ఆస్కారమే లేదు. అగ్ర వర్ణాలకోసం అది పుట్టింది, వారిలో ప్రత్యేకించి పురోహిత వర్గంకోసం పుట్టింది.

అయితే, వారికైనా దానివల్ల జరిగిన లాభంకంటె నష్టం హెచ్చు, మేలుకంటె కీడు హెచ్చు.

కులవ్యవస్థ ప్రకారం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు ద్విజులు. దేశ ప్రజల సంఖ్యలో వీరు బహుశా నూటికి 20పంతులకు మించరు. కాగా, వీరికుటుంబాలకు చెందిన స్త్రీలకు సయితం ద్విజ ప్రతిపత్తి లేదు. అందువల్ల, డాక్టర్ రామమనోహర్ లోహియా ఎక్కడనో వ్రాసినట్టు, ద్విజులు మొత్తం జనాభాలో నూటికి పదివంతులు మాత్రమే.

నూటికి 90 మందిని క్రిందికిత్రొక్కివేస్తే, తక్కిన పదిమందికూడా పైన నిలువగలరా ? నిలవగలమని వారు నమ్మితే, అది పిచ్చిభ్రమ. ఈ సంగతిని మన దేశ చరిత్ర ఎన్నోసార్లు రుజువు చేసింది.

క్రీస్తుకుపూర్వం నాల్గవ శతాబ్దిలో అలెగ్జాండర్ మొదలుకొని, 1962లో చైనా వారివరకు మనదేశంపై ఎందరెందరో దండయాత్రలు చేశారు. వాటిని మనం తిప్పి కొట్టిన సందర్భాలు నూటికి పదివరకైనా లేవని చెప్పవచ్చు. మన ఈ బలహీనతకు అతి ముఖ్యమైన కారణం మన కులవ్యవస్థే.

1931నాటి జనాభా లెక్కల ప్రకారం, మనదేశంలో కులాలసంఖ్య దాదాపు మూడువేలు. ఇప్పుడు ఈ సంఖ్య నాలుగువేలవరకు దేకివుండవచ్చు.

చిరుగు పట్టనేరాదుగాని, ఒకసారి చిరుగు పట్టిన తర్వాత చాపతిరిగి తిరిగి చిరుగుతూనే పోతుంది. మన సంఘానికి ఆదిలోకావాలనే అయిదు చిరుగులు పెట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు కొత్త చిరుగులు ఎప్పటికప్పుడు తప్పడంలేదు.

మీరు విన్నారో, లేదో — 1911–1921 సంవత్సరాలమధ్య ఒక్క కేరళ ప్రాంతంలోనే 195 కొత్త కులాలు పుట్టుకు వచ్చాయి.

మీకు తెలుసునో. లేదో— సంఘంలో ఆట్టడుగుకు ప్రొక్కి వేయబడిన హరిజనులలో (శ్రీ జగ్‌జీవన్‌రామ్ అంచనా ప్రకారం) 563 శాఖల వారున్నారు. వీరిలో కొన్ని శాఖలవారు ఒకరినొకరు తాకరు, భోజనంచేయరు, వివాహాలు చేసుకొనరు.

కట్ట కడపటినుంచి, మొట్టమొదటికివెళ్లిచూస్తే, బ్రాహ్మణులలో శా లు ఇంతకు దాదాపు మూడు రెట్లు. ఒక అంచనా ప్రకారం వారిలో శాఖలు 1800కు పైగా.

తక్కిన కులాల వారిలో సయితం తిరిగి ఇదే విధంగా శాఖలున్నాయి, ఉప శాఖలున్నాయి వీటినన్నింటిని లెక్కకట్టినవారు లేరు. అవి అరలక్షకు మించిపోతే ఆశ్చర్యపడ నక్కరలేదు.

అన్నట్టు, కులం ఒక అంటు వ్యాధి, కలరాకంటె అదిత్వరగా ప్రాకుతుంది, మశూచి కంటె గట్టిగా మచ్చలను మిగుల్చుతుంది. క్రైస్తవ మతంలో కులాలకు తావు లేదు; ఇస్లాంలో కులాలకు తావులేదు. అయినా, ఆ రెండింటిలో కులాలు తావు చేసుకున్నాయి.

అన్నట్టు, ఎప్పుడెప్పుడు — ఎవ్వరెవ్వరుకులవ్యవస్థ నిర్మూలనకై మహోద్యమాన్ని ప్రారంభించినా, దాని ఫలితం ఒక కొత్త కులాన్ని సృష్టించడమే అయింది. ఈ సందర్భంలో బసవన్న, రామానంద్, కబీర్, జ్ఞానదేవ్, తుకారామ్, దాదూ, లాల్ డెద్, వేమన్న, లాల్‌దాస్, నానక్, సర్వజ్ఞుడు, చండీదాస్, చైతన్యుడు మున్నగువారిని ఒకసారి జ్ఞాపకం తెచ్చుకోండి.

అటీవలి కాలంలో కులవ్యవస్థ నిర్మూలనకై కృషిచేసిన బ్రహ్మణ సమాజం, మొదలైనవి కూడా పాత కులాలకు కొత్తవాటిని కలపడానికే కొంతవరకు తోడ్పడి నట్లు చెప్పక తప్పదేమో !

ఆయినప్పుడు, మనకులవ్యవస్థ ఈ విధంగా కొనసాగవలసిందేనా ?

శాఖోప శాఖలుగా ఇది పెరుగుతూ పోవలిసిందేనా ?

కానక్కరలేదు.

ఎందుకు కానక్కరలేదో, ఆంధ్రప్రదేశ్ కులనిర్మూలన సంఘం అధ్యక్షులు జె. వీరస్వామిగారు ఈ గ్రంథంలో వివరించారు. కేవలం వివరణలతో సరివుచ్చక, కార్యరంగంలో నిలిచి, కులవ్యవస్థపై ఆయన హోరాహోరిగా సమరం సాగిస్తున్నారు.

వీరాస్వామి గారి గ్రంథంలోని విషయాలను గురించి నేను తిరిగి ప్రస్తావించ బోను: పోతే, నాకు గల ఒక పరమవిశ్వాసాన్ని మీకు నివేదిస్తాను.

కులవ్యవస్థకు కులాచారాల బలంవున్నది. అది క్రమంగా సన్నగిల్లుతున్నది.

కులవ్యవస్థకు కులవృత్తుల బలం వున్నది. అని సయితం తగ్గిపోతున్నది.

కాగా చెక్కు చెదరకుండా మిగులుతున్నట్టిది కులవ్యవస్థపుగల మత విశ్వాసాల బలం. ఆ బలం దానికి రెండు పచ్చి కల్పనల ద్వారా రెండు పిచ్చి సిద్ధాంతాలద్వారా సిద్ధిస్తున్నది. వాటిలో మొదటిది – కర్మసిద్ధాంతం. రెండవది – పునర్జన్మసిద్ధాంతం.

కర్మ, పునర్జన్మలను పరమసత్యాలుగా గుర్తిస్తే, కులవ్యవస్థను ప్రకృతిధర్మంగా గుర్తించాలి; దేవతలైనా తప్పించుకొనలేని ప్రకృతిధర్మంగా గుర్తించాలి. మన ప్రాచీన గ్రంధాలలో కొన్ని సరిగా ఇదే విషయాన్ని స్పష్టంచేశాయి.

వెనకటి మతసంస్కర్తలలో, సంఘ సంస్కర్తలలో కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలను ప్రోసిపుచ్చినవారు చాలాపు లేనందునే కులవ్యవస్థ పునాదులు కదలడంలేదు.

ఎప్పటికైనా సరే, పునాదితో సహా కులవ్యవస్థను తొలగించాలంటే, ముందుగా దెబ్బతీయవలసింది కర్మసిద్ధాంతంపై. పునర్జన్మసిద్ధాంతంపై.

పీరాస్వామిగారి నాయకత్వాన ఆంధ్రప్రదేశ్ కులనిర్మూలన సంఘంవారు నెరపు చేస్తున్న ఈ సూచనను గురించి ఆలోచించగలరని అమలుపరచగలరని ఆశిస్తున్నాను.

పంటలను మనంషడ్రసాలంగా పండించవచ్చు, పాడిని విశేషంగా పెంచుకోవచ్చు. పారిశ్రామికంగా మనం పురోభివృద్ధిని సాధించవచ్చు: దేశంలో సుఖాన్ని నెలకొల్పవచ్చు. అయితే, ఎన్ని రంగాలలో – ఎన్ని విధాల – ఎంతెంతగా – పురోగతిని సాధించినా, కులవ్యవస్థను నిర్మూలించనిదే మన దేశానికి సమైక్యత సిద్ధించదు; మన శత్రువుం పదిలంకాదు, మనముధ్య ప్రజాస్వామం సుస్థిరంగా నెలకొనదు. ఈ మూడు లక్ష్యాలకు – సమైక్యత, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం – కులవ్యవస్థ ప్రథమ శత్రువు పబల నిరోధి. అందువల్ల నా దృష్టిలో వీరాస్వామిగారు కొనసాగిస్తున్నది. ఒక ధర్మయుద్ధం, ఒక జాతీయసమరం.

కులవ్యవస్థను విమర్శించడం ఈనాడు ఒక "ఫ్యాషన్". ముఖ్యంగా, రాజకీయ వాదులలో, వారు వేదికలపైనే వీరశిఖామణులు, వీరాస్వామిగారివలె కార్యరంగంలోకాదు. అందుకు చిత్తశుద్ధికావాలి, ధర్మనిష్ఠకావాలి; రెండింటినిమించి, ధీరోదాత్తత కావాలి. ఈ గుణగణాలు వీరాస్వామిగారిలోవున్నాయి కనుకనే ఆయన కులనిర్మూలనోద్యమాన్ని మన రాష్ట్రంలో ఇప్పటికే ముందుకు నడిపించారు; కాలక్రమాన దాన్ని పురింతగా ముందుకు నడిపించగలరు.

ఆయనకు, ఆయన మహోద్యమానికి నా జోహారులు.

నార్ల వెంకటేశ్వరరావు

"లుంబిని"
బంజారాహిల్స్,
హైదరాబాదు – 34.

కులరహిత

సంఘ నిర్మాణము

కులంలేని హిందూ మతస్థులంటూ ఎవ్వరూఉండరు. కులవ్యవస్థ పుట్టుకను గురించి ఒక దానితో ఒకటి పొసగని కారణాలుఎన్నో కనిపిస్తున్నాయి. ప్రాచీన కులవ్యవస్థ వృత్తులు చేపట్టే వృత్తులపై ఆధారపడినట్లు చెప్పబడుతోంది. ఈవృత్తి విభజన ప్రకారం బ్రాహ్మణులు అధ్యాపకులుగా, క్షత్రియులు యుద్ధ వీరులుగా, వైశ్యులు వ్యాపారస్తులు, శూద్రులు జనపదాలలోని సాంఘిక వ్యవస్థకు అవసరమైన సేవావిధులు సమకూర్చి వస్తునిర్మాణము చేసేవారుగా ఉంటూవచ్చారు. చతుర్విధ వర్ణవ్యవస్థ నేడు చారిత్రక విలువను మాత్రమే కలిగివుంది. కాలక్రమేణా కులాలు ఉపకులాలుగా చీలిపోయాయి. సామాజిక శాస్త్రవేత్తల అంచనా ప్రకారం ఇప్పుడు భారతదేశంలో వందలకొలది కులాలు ఉన్నాయి. వృత్తివిద్యలు బోధించడానికి బహిరంగ పాఠశాలు లేనంతకాలం "కులవిద్యకు సాటిరాదు గవ్వలుచెన్నా" అన్న సామెత చక్కగా నడిచింది. దీనికి కారణం ఊహించడం కష్టతరంకాదు. బహిరంగ పాఠశాలలు లేనప్పుడు తండ్రి సహజంగా తనకుమారునికి గురువై పనిపాటలు నేర్పడం పరిపాటి. కుమారునికి జీవనోపాధి కల్పించడానికి తండ్రి చేయగలిగిన సహాయమే ఇది. కులవృత్తిలో నేర్పు, కీర్తిప్రతిష్టలు కుమారునికి వంశపారం పర్యంగా సంక్రమిస్తూ ఉండేవి ప్రాచీనకాలంలో వృత్తి నైపుణ్యం వంశానుగతంగా తండ్రినుంచి కుమారునికి సంక్రమిస్తూ ఉండటంవల్ల భారతదేశంలో సమాజ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడానికి ఉపయోగపడింది.

ఆధునిక నాగరికత వస్తువుల ఉత్పత్తి పద్ధతిలోను మతసిద్ధాంతముల ప్రాతిపదికపై ఏర్పాటైన జీవనముపైన ఎక్కువ మార్పును తెచ్చింది, సమాజ ఆర్థిక అభివృద్ధి వ్యక్తులు అనుసరించే మతము లేక ఆచారముపైకంటే ఎక్కువగా స్వేచ్ఛాయుతమైన పోటీపై ఆధారపడిఉంది. ఆధునిక శాస్త్రవేత్తలు, సంఘసంస్కర్తలు కులతత్వము స్వేచ్ఛాయుతమైన పోటీ సిద్ధాంతములకు గొడ్డలిపెట్టుగా ఉందని వ్యక్తి సుఖసంతోషాలకు ఉపకరించేది కాదని నిరసిస్తున్నారు. కులము అనే శబ్దానికి సంస్కృతంలో సరియైన అర్థము వర్ణము. తరగా

శరీరచ్ఛాయ. ప్రపంచములోని ప్రభుత్వములన్ని శరీరచ్ఛాయపై ఆధారపడిన విచక్షణను ప్రతిమబిస్తూ ఉన్నాయి. కులములు శరీరచ్ఛాయపై ఆధారపడి ఏర్పాటైనట్లు తలంచినప్పటికీ, దానికి ఆధునిక సంఘములో ఎట్టి స్థానము లేదు. స్వాతంత్యం రాకముందే రాజారామ మోహనరాయ్, కందుకూరి వీరేశలింగం పంతులువంటి సంఘసంస్కర్తలు హిందూసంఘములోని దురాచారముల నిర్మూలనకై వారి జీవితములనే అంకితము చేసియున్నారు. వారు హిందూమతమును ద్వేషించలేదు. అయితే సతీసహగమనం, విధవావివాహ నిషేధం, బాల్య వివాహం, అంటరానితనం, కులప్రాతిపదికపై చేయబడిన ఉచ్చ నీచస్థితులవంటి ఆత్మ హత్యాత్మకమైన దురాచారాల నిర్మూలనద్వారా హిందూమతమును సంస్కరింపవలెనని వారు కోరారు. కాని, వారి ప్రయత్నాలు భారతదేశంలోని అప్పటి బ్రిటిష పరిపాలన దేశీయ మతములలోను, వారి సాంఘిక ఆచారములలోను జోక్యము కలుగజేసుకొనే పద్ధతి అవలంబింపక పోవుటవల్ల పూర్తిగా ఫలించలేదు.

భారత రాజ్యాంగకర్తలు కులవ్యవస్థను ప్రతిఘటిస్తూ భారతదేశ పురోభివృద్ధికి వ్యక్తిహోదాలోను, అవకాశాలలోను సమానత్వం ఉండాలని నిర్ణయించారు. కులతత్వము తరతరాలుగా వస్తూఉండటంచేత అది ప్రతి హిందువు అతని ఆరోగ్యం, బుద్ధి, నడవడి, సంస్కృతి లెక్కలోనికి తీసుకోకుండా అతని జననముపైననే ఆధారపడి ఒక ప్రత్యేకాధికారమును, హోదాను కలుగజేసింది. కులమనే ముద్ర ప్రతి హిందుపునకు పుట్టుకతోనే వస్తూఉంది. రక్తసంబధమే కులములను నిర్ణయించజానికి మూలాధారమైయున్నది. కుల నియంత్యత్వము ప్రజాస్వామ్యాభివృద్ధికి ఆటంకమని రాజ్యాంగకర్తలు తలచినందున ప్రభుత్వము తన పౌరులలో మతము, జాతి లేక కులముపై ఆధారపడిన విచక్షణను నిషేధించి అవకాశములలోని సమానత్వమును ప్రాధమిక హక్కులలోని సమానత్వమును ప్రాధమిక హక్కులలోఒక భాగముగా పరిగణించింది. కులవ్యవస్థను అదుపులో పెట్టడానికి అస్పృశ్యతా నివారణ, బిరుదుల రద్దు, వెట్టిచాకిరి నిర్మూలన వంటి కొన్నిచర్యలను ప్రభుత్వము తీసుకొన్నది. కులవ్యవస్థను హిందూదేశముయొక్క సాంఘిక నిర్మాణము నుండి ఉపన్యాసములు లేక ఉపదేశముల ద్వారా నిర్మూలించలేమనేది ముఖ్యముగా గమనించవలసి ఉంటుంది. అందువలన ఈ కులవ్యవస్థ నిర్మూలనకై చేయదగిన ఏకైక పద్ధతి వర్ణాంతర వివాహములను ప్రోత్సహించడమే. సాంప్రదాయంగా హిందువులు వరాంతర వివాహాలకు సుముఖత చూపించరు. ఏదో ఒక ప్రేమ వ్యవహారంలో పడి వర్ణాంతర వివాహాలు అడపా దడపా జరుగుతున్నాయి. వర్ణాంతర వివాహాలకు సుముఖంగా ఉన్న యువకులు కూడ, సాంఘిక బహిష్కరణకు, వారి సంతానమునకు సరియైన వివాహ సంబంధములు దొరకవనికూడ భయపడుచు, తమ ప్రేమను కుల పరిహద్దులను మించి పోనివ్వలేకుండా ఉన్నారు. ఈ హిందూ సంఘములోని కులతత్వమువల్ల సంఘానికి, దేశా

నికి కలిగే కీడు, కష్టనిష్టూరాలు అందరికి విదితమైనవే. వాని నన్నింటిని ఇక్కడ వివరించవలసిన అవసరం ఏమాత్రం లేదు. వాస్తవికంగా చెప్పవలెనంటే హిందూ సంఘములోని ప్రగతివాదులందరు కులతత్వ రహిత సంఘము నెలకొల్పవలెనని ఉద్ఘోషిస్తూ ఉంటారు. కాని వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించడానికి ఎట్టిచర్య తీసుకోలేదు. ఈ ఆశయాలను ఆచరణలో పెట్టుటకు తగు ప్రోత్సాహము కలుగజేస్తేనే తప్ప కులవ్యవస్థను నిర్మూలించడం ఎండమావులలాగే తయారవుతుంది. యువకులు వర్ణాంతర వివాహాలను చేసికొనుటకు తగు ప్రోత్సాహాన్ని కలిగించడం ప్రభుత్వము యొక్క కర్తవ్యమై ఉంది. అట్లు చేయడంవల్లనే హిందూసంఘమంనుండి కులనిర్మూలన సాధ్యమౌతుంది. ఈ విషయములో ప్రభుత్వంలోను ప్రభుత్వ సంస్థలోను ప్రాంతీయ మరియు ఇతర అధికార సంస్థలలోను పదవులు భర్తీచేయునపుడువర్ణాంతర వివాహముచేసికొన్న వ్యక్తులకు ప్రాధాన్యము ఇచ్చుట లేదా కొంత శాతము పదవులు కేటాయించుట ఆచరణ యోగ్యమైన మార్గం. అయితే మన రాజ్యాంగము వర్ణాంతర వివాహములు చేసికొన్న వారికి అట్టి ప్రాధాన్యతకు, కేటాయింపుకు అంగీకరించదు. ఇప్పుడు ప్రాధమిక హక్కుల అధ్యాయాన్ని కూడ సవరణ చేయుటకు పార్లమెంటు అధికారము పొందింది. కాబట్టి ఈ ప్రయోజనములను సాధించుటకు రాజ్యాంగాన్ని సవరణ చేయడం కష్టసాధ్యమైన పనికాదు. పదవులలో ఈ కేటాయింపు లేదా ప్రాధాన్యం ఇవ్వడం ప్రస్తుతం అమలులో ఉన్న షెడ్యూలు కులాలు, జాతుల తదితర వెనుకబడిన వర్గాలవారికి ఇస్తూవున్న రక్షలను కొంతకాలం కొనసాగిస్తూ చేయవలసి ఉంటుంది. ఈ సూచన సంఘ సంస్కర్తలు, శాసనమండలులు, పార్లమెంటు సావధానంగా పరిశీలిస్తారని ఆశిద్దాం.

ఆంధ్రప్రభ 7-3-72

మన సమాజము - కులతత్వ ధోరణులు

1971 డిశంబరులో జరిగిన పదునాల్గు రోజుల యుద్ధంలో భారతదేశం సాధించిన విజయం బంగ్లాదేశ్ అవతరణ.— మనం పాటిస్తూ, సర్వమానవ జాతి ఆవలంభించదగినవి మనం విశ్వసించే స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సామ్యవాదం అనేసిద్ధాంతం ఘనవిజయంగా పరిగణింపబడింది. స్వాతంత్ర్యం సంపాదించిన అనంతరం భారత పౌరులందరికి న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సమకూర్చు మౌలిక సూత్రాల నాధారం జేసికొని 'రిపబ్లిక్‌గా' అవతరించిన భారతదేశం నేడు బంగ్లాదేశ్ అనే మరొక 'రిపబ్లిక్' స్థాపనకు దోహదకారియై ఇతర దేశాలకు ఆదర్శప్రాయమైంది. నేడు మనదేశ కీర్తి ప్రతిష్టలు ఇనుమడించి యావత్తు మానవజాతి శ్రేయస్సుకు అనుపగు ఆశయాలకు అంకితమై మార్గదర్శకమైన, దేశంగా పలువురి ప్రశంసల నందుకొన్నది మన భారతదేశం.

ఇట్టి తరుణంలో మనం ఒకమారు మన అంతరంగిక సమాజ పరిస్థితిని అవలోకించి ఒకరు వేలుపెట్టి చూపదగిన లోపాలను తొలగించుకోపడం సమయోచితమేగా: చాల అవసరం కూడ, లేనిచో భవనానికి సున్నంకొట్టి ఇంటిలో బూజు తుడవకుండ పదలినట్లు అవుతుంది.

మన దేశంలో "కులము" అనే పిశాచం జాలిని నిర్జీవంచేస్తూ విలయతాండవం చేస్తున్నదంటే అతిశయోక్తిగానేరదు. భారతదేశంలో అధిక సంఖ్యాకులైన హిందువులు ఛిన్నాభిన్నమై నాల్గువేల కులాలుగా విభజింపబడి తప చుట్టు నిర్మింపబడిన సామాజిక మైన అడ్డుగోడల మధ్య జీవించుచున్నారు. పుట్టుక కారణంగా గుర్తింపు పొందుచున్న 'కులము' అనే కట్టుబాటు పేర చాలా అన్యాయాలు, అక్రమాలు, అమానుషత్వాలు తరతరాలుగా జరిగాయి, ఇంకనూ జరుగుతునే ఉన్నాయి. ఈ స్వతంత్ర యుగంలో సులవ్యవస్థ

మరింత బలాన్ని పుంజుకున్నది. ఇది కులాలమధ్య ద్వేషంగా పరిణితి పెరిగి హత్యలు గృహదహనాలు, హింసలకు దారి తీస్తున్నది.

భారత రాజ్యాంగ ముఖ్య నిర్మాత, న్యాయశాస్త్ర కోవిదుడు డాక్టర్ అంబేడ్కర్ ఇలా అన్నాడు. "మరో మాటలో చెప్పాలంటే ఎటువైపు పయనించినాసరే యీ కులమనే భూతం నీపూర్గానికడ్డు తగుల్తూనేపుంటుంది. ఈ భూతాన్ని తుదముట్టించనిదే ఏ రాజకీయ సంస్కరణగానీ, ఆర్థిక సంస్కరణగానీ సాధ్యంకాదు."

సాంఘికరంగంలో అభివృద్ధిని సాధించనంతవరకు తదితర రంగాలలో అభివృద్ధిని సాధించజాలం. దురాచారాల దుష్ఫలితంగా దోషభూయిష్టమై పోయివున్న సంఘాన్ని సంస్కరించేందుకు నిరంతర కృషి అవసరం.

అసలు యీ కులవ్యవస్థ పుట్టుపూర్వోత్తరాలు ఉహాతీతములు. గుణకర్మవిభాగాలనుబట్టి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాలుగు జాతులను పూర్వము తానే సృష్టించినట్లు శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పారు.

సృష్టికర్త లోక శ్రేయస్సుకై తననోటినుండి బ్రాహ్మణులను, చేతులనుండి క్షత్రియులను, తొడలనుండి వైశ్యులను, పాదములనుండి శూద్రులను సృష్టించెనని తన సృష్టినంతటిని సంరక్షించుటకు యీ నలుగురికి విడివిడి ధర్మములు నిర్ణయించెనని మనుస్మృతిలో చెప్పబడింది. ఒకే నేరానికి తక్కువ వర్గము వారికున్న శిక్షలు హెచ్చు వర్గమువారికి ఉండవు. బ్రాహ్మణులు గురువులుగను, క్షత్రియులువీరులుగను, వైశ్యులు వ్యాపారులుగను, శూద్రులు పై మూడు వర్ణాలకు సేవ జీయువారుగను— వారి ధర్మములు మనుస్మృతిలో చెప్పబడినవి.

ధర్మశాస్త్రవేత్తలు శూద్రులకొరకు వేసిన కట్టుబాట్లు ఎన్నివండివనగా, మచ్చుకు కొన్ని ఉదహరిస్తాను —

1. సంఘంలో శూద్రునికి తక్కువస్థానం.

2. అతడు అపరిశుద్ధుడు, గనుక ఏ పవిత్ర కార్యమును అతనికి కనపడునట్లు విసపడునట్లు చేయరాదు.

3. ఇతరవర్ణాలవారితో సమముగ ఆతనిని గౌరవించరాదు.

4. స్త్రీలైనా, పురుషులైనా శూద్రుల ప్రాణానికి విలువ లేదు. ఒకవేళ కొద్ది విలువ వున్నా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులతో పోల్చినచో శూద్రుల జీవితపు విలువలు చాల తక్కువ. పరిహారం లేకుండగనే ఎవరైనను వారిని చంపవచ్చును.

5. అతడు విజ్ఞానార్జన చేయరాదు. అతనికి విద్య గఱపుట నేరము, పాపము. కర్ణుడు సూతపుత్రుడని భావించి విలువిద్య నేర్పిన పరశురాముడు అతనిని శపించుట దీనికి చక్కని ఉదాహరణ.

6. అతడు ఆస్తిని సంపాదించరాదు. అతని ఆస్తిని ఒక బ్రాహ్మణుడు తనఇష్టానుసారము పరిగ్రహింపవచ్చును.

7. అతడు ప్రభుత్వోద్యోగములో ఉండరాదు.

8. అతని విధి, మోక్షము, పై వర్ణములవారికి సేవ జేయుటలో నుండును.

9. అతడు బానిసత్వంలో జన్మిస్తాడు. సర్వదా అతనిని బానిసగానే ఉంచాలి

ఇంకా ఘోరమైన విషయమేమిటంటె "పంచములు" అని సోదర మానవులలో మరొక వర్ణమును సృష్టించి, వారు అస్పృశ్యులని, వారిని గ్రామానికి దూరంగా నివసింప జేశారు. వారు ఎట్టి అనుమానాలకు, క్రూర హింసలకు గురిచేయబడిరో చెప్పడానికి మానవ త్వమునకే సిగుచేటు.

మన సమాజంలో పట్టణ, గ్రామములలో మన కళ్ళముందు జరిగిన, జరుగుచున్న నిత్యజీవన సంఘటనలను, వార్తలను పరిశీలించినచో పూర్వము అట్టి ఘోరాలు జరిగివుండవచ్చు ననుటలో ఎట్టి సందేహం వుండనవసరం లేదు.

ఇది ఇట్లుండగా రానురాను అసంఖ్యాకంగా చిన్నచిన్న ఉపకులాలు ఉద్భవించి, ఈనాడు "స్వజన", "ఉచ్చ", "నీచ"అను భావాలకు ఆలవాలమై స్వేచ్ఛా సమాజం నిర్మాణానికి ఆటంకంగా పరిణమించాయి.

మహాత్మగాంధి "కులము ఒక ఆచారము దాని మూలము నాకు తెలియదు. నా ఆధ్యాత్మిక తృష్ణను తృప్తిపరచుటకు కులముయొక్క మూలమును నేను తెలిసికొనవలసిన అవసరములేదు. కాని ఆధ్యాత్మిక మరియు జాతీయ అభివృద్ధికి కులము హానికరమైనదని మాత్రము నాకు గట్టిగా తెలియును" అని అన్నారు.

''పెచ్చు – తగ్గు'' భావములు ప్రాథమిక, నైతిక సూత్రాలకే విరుద్ధం. శూద్రుల గురించి స్మృతులలో చెప్పబడిన శ్లోకాలు మానవతా భావానికి విరుద్ధమైనవిగ పూర్తిగా త్రోసి పుచ్చనగునని మహాత్మగాంధీ ఉద్బోధించారు.

కులమును గూర్చిన భావాలు, ఆదిలో మనుష్యుల వృత్తులను నిర్వచించు చాతుర్వర్ణ విభజనలో నుద్దేశింపబడిన లక్ష్యాలకు వక్రమార్గం పట్టించి నేడు చెడుగా మారాయి. ఈ గకంగా వర్ణాశ్రమ ధర్మంతో ప్రారంభమై మనుష్యుల బ్రతుకులతో చెలగాటాలాడి, కడకు వాటినే ధ్వంసంచేసింది ఈ కులవ్యవస్థ.

మహాత్ముడు వర్ణధర్మముయొక్క అంతరార్థము అతి సూక్ష్మమైనదని చెప్పారు. అదేమన, తండ్రియొక్క వృత్తిని కొడుకు నైతిక సూత్రాలకు అనుగుణ్యముగ నుండు నంతవరకు జీవనోపాధిని సంపాదించుకొను విషయంలో మాత్రమే ఆవలంభించుట. ఇది సమస్త మానవ జాతికి వర్తించు సత్యం, ప్రకృతి సిద్ధాంతం, అంతేకాని, ఈ రోజు మనం చూస్తున్న వికృతాకారం దాల్చిన కులవ్యవస్థ కాదు. వర్ణాశ్రమానికి. కులానికి ఎట్టి సంబం ధం లేదు. 'కులము నిస్సందేహంగా హిందూ మతాభివృద్ధికి ప్రతిబంధకమని గాంధిజీ ఉద్బో ధించారు.

హిందూమత గ్రంథాలపై ఆధారపడినది 'వర్ణాశ్రమ ధర్మము' కాగా 'కులవ్యవస్థ'. సాంఘిక అవసరాలకు లోనైన ఏర్పాటు మాత్రమే.

కులవ్యవస్థను ఎంత త్వరగా బహిష్కరిస్తే అంతమంచిదని చెప్పారు గాంధీజీ. కులవ్యవస్థ వున్నంతవరకు సంఘమునందు. అవకాశములందు సమానత్వము అసంభవమని మరియు రాజకీయ ప్రజాస్వామ్యమునకుగాని, ఆర్థిక ప్రజాస్వామ్యమునకు గాని తావు వుండ దని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ అన్నారు. హిందూ తత్వ శాస్త్రవేత్త డాక్టర్ రాధాకృష్ణన్: ''కులము దురదృష్టముగ సాంఘిక దురాచార మగుట పూర్తి అయి ఇప్పుడు రాజకీయ పర ముగను, పరిపాలనా యంత్రాంగమునందును దుష్టశక్తిగా 'మారినది.'' అని అన్నారు. ఎన్ని కలు కుల ప్రాతిదికపై నడుస్తున్నందుకు విచారాన్ని వ్యక్తపరచరు. పరిపరివిధాలుగా సమా జంలో చెరుపుకు కారణభూతమైన కులవ్యవస్థను నిర్మూలించడం తప్పనేడు గత్యంతరంలేదు.

భారత రాజ్యాంగం జాతి సమైక్యతకును, ప్రగతికినిప్రతిబంధకమైన కులవ్యవస్థకు స్వస్తి చెప్పుచున్నది. అభినవ ''మనువు'' అయిన డా॥ అంబేడ్కర్‌గారు ముందుచూపుతో కులరహిత సమాజ స్థాపనకు దోహదకారియగు సూత్రములను స్పష్టముగ రాజ్యాంగము

నందు చేర్చిరి. సమతా సాధనకై షెడ్యూలు కులాలకు, వెనుకబడిన తరగతులకు ప్రభుత్వ పరంగా ప్రత్యేక శ్రద్ధ లభించుచున్నది. అస్పృశ్యత రాజ్యాంగము ద్వారా నిషేధింప బడింది.

కుల నిర్మూలనా లక్ష్యసాధనకు కులాంతర వివాహాలను, సమిష్టి భోజనాలు ప్రధాన సాధనాలు. కులాలను తెలిపేబొట్టు, జుట్టువంటి బాహ్యాచిహ్నాలను, శర్మ, శాస్త్రి, రెడ్డి, చౌదరి వంటి సంకేతాలను దూరంచేసుకోవలసిన ఆవశ్యకతగూడ ఉంది. ఇట్టి బాహ్య చిహ్నాల తొలగింపు చర్య మొదటిమెట్టు మాత్రమే. కులాల ఉపశాఖల పాటింపులో కొద్ది మార్పులొచ్చినా కులాలు చిరస్థాయిగా నిల్చి వుండడానికి కారణం ఒక్కటే. వివాహం పద్దకు వచ్చేసరికి 'ఆదేకులంలో చేసుకోవాలి' అనే కులాచారం ఇందుకు కారణం. ఈ రకంగా కులవ్యవస్థయెక్క అస్థిపంజరాన్ని కాపాడుచున్నది వివాహ పద్ధతియే. కనుక కుల ప్రసక్తి లేకుండ వివాహాలు జరిగిననాడే కులవ్యవస్థ కూలిపోతుంది. నేటి సమాజంలోని ఈ అరిష్టాన్ని శాశ్వతముగ తొలగించడానికి కులాంతర వివాహాలు ప్రభావవంతమైన ఏకైక మార్గము.

ఇట్టి కులనిర్మూలన లక్ష్యము, ఉద్దేశ్యాలతో ఇటీవలనే ఈ సంస్కరణ రంగంలో కృషి సల్పుచున్న కొందరు ఔత్సాహికులను సంఘటిత పరచి, ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘము ఏర్పాటుచేసి పబ్లిక్ సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టముక్రింద రిజిష్టరుచేయబడినది. ఈ సంఘమునకు అధ్యక్షునిగా నన్ను ఎన్నుకొని గురుతరమైన బాధ్యతను, కార్యభారమును నాపై ఉంచారు. ఈ సంఘానికి ప్రధాన కార్యదర్శియైన శ్రీ డి. జి. రామారావుగారు వర్ణాంతర వివాహం చేసుకున్నవారు. వారు బ్రాహ్మణ కులస్థులు. వారి సతీమణి తెలగ. అటువంటివారు ఈ సంఘమునకు ప్రధాన కార్యదరి గా వుండటము అందరికి ఆదర్శప్రాయమైన విషయము. వీరి తండ్రిగారైన శ్రీ ఫ్రాంక్లిన్ రాంమహమ్మన్‌గారినుండి వీరి వంశములో క్రమేణా వచ్చిన సంస్కరణ దృక్పథము చాల ముదావహము. వారి పేరుతోనే సర్వమత సహనము, సాంఘిక సంస్కరణాభిలాష ఉట్టిపడుతూ ఉన్నాయి.

కులం వుండకూడదన్న విషయంలో ఏ రాజకీయ పార్టీల మధ్యకూడా బేధాభిప్రాయం ఉన్నట్లు కనబడదు. కాని కులదృక్పథం పోగొట్టటానికి గట్టిప్రయత్నం ప్రభుత్వ పరంగా గాని, రాజకీయ పార్టీల ద్వారాగాని జరగలేదు.

కుల నిర్మూలనకుఏకైక మార్గమైనటుపంటి వర్ణాంతర వివాహాన్ని అందరూ ప్రోత్స హించటం అవసరం. ప్రభుత్వోద్యోగాలు, స్థానిక సంస్థలలోఉద్యోగాలు, ప్రభుత్వ సహాయక సంస్థలలోని ఉద్యోగాలు, గ్రామాల్లో మునసబు, కరణం వంటి ఉద్యోగాలు, కులాంతర వివాహాలు చేసుకొన్నవారికి కొంతనిష్పత్తిలో కేటాయించాలని, లేదా పదవుల నియామకంలో కొంతప్రాధాన్యంయివ్వాలని, అంతేగాక గ్రామ పంచాయితీలలోను, జిల్లా పరిషత్తులలోను, శాసనమండలులలోను, పార్లమెంటులోను కొన్నిస్థానాలను వర్ణాంతర వివాహాలు చేసుకొన్న వారికి కూడ కేటాయించాలని దీనికి ఆవసరమైన రాజ్యాంగ సవరణ చెయ్యాలని గూడ యాకుల నిర్మూలన సంఘం కోరుచున్నది. బంజరుభూముల పంపిణీలోను తదితర ప్రభుత్వ సహాయక కార్యక్రమాలలోను వర్ణాంతర వివాహము చేసికొన్నవారికి ప్రభుత్వము సహా యము చేయవలసి ఉంటుంది.

హరిజనులకు, ఊరివెలుపల ఎక్కడో ఇంటిస్థలాలు కేటాయించి నంచువల్ల వారికి ఆర్థిక సహాయం చేరుతుందేకాని అస్పృశ్యతా నివారణకు ఏమాత్రం తోడ్పడదు. గ్రామం లోని అన్నివాడల్లోను లభ్యమయ్యేస్థలాలను ప్రభుత్వంసేకరించి వాటిని హరిజనులకు తడి తర కులాల వారికి. ఉచితంగా పంచిపెట్టాలి. ఇప్పుడున్న హరిజన వాడల్లో తదితర కులాల వారు ఇండ్లుకట్టుకోవడానికి తగిన ప్రోత్సాహంఇవ్వాలి. సమిష్టి సహజీవనానికి ఇలాంటి చర్య ఉపయోగకరంగా ఉంటుంది.

ఈ కృషిలో అవసరమగు శాసనములను తూపొందించుటకు, సమాజంలో కుల చక్కథమును పోగొట్టుటకు ప్రభుత్వముయొక్క తోచ్చాటుతోపాటు, సంఘసంస్కరణాభి లాషులైన రాజకీయవేత్తలు, సంస్థ ఇతర వ్యక్తులయొక్క సహకారమును "ఆంధ్రప్రదేశ్ కులనిర్మూలన సంఘము" అభ్యర్థిస్తున్నది.

రేడియో ప్రసంగం 17-4-72

యువకులు - సాంఘిక సమస్యలు

ఏ జాతిలోనైనా నేటి యువకులే రేపటి పౌరులు. యువకులు తమ యౌవ్వనంలో పెంపొందించుకున్న శీలప్రవృత్తి వారి భావి జీవితంలో ప్రతిబింబిస్తుంది. మననాగరికత ప్రపంచ మండలి మిక్కిలి ప్రాచీనమైన నాగరికతలలో ఒకటి. ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే అన్నట్లు, మానవ శీల ప్రవృత్తి దిగజారిపోతున్నపుడు సాంఘిక మత సంస్కర్తలు ఉద్భవిస్తారు. ఇది యుగ యుగాలుగా, తరతరాలుగా జరుగుతూ వస్తున్న సత్యం. అట్టివారిలో బుద్ధ భగవానుడు మహోన్నత సంఘ సంస్కర్త. ఆయన మానవ వ్యవహారాల్లోను, ప్రవర్తనలోను, అన్ని మతాల్లోను పొందుపరచబడిన సమత, సౌభ్రాతృత్వము, స్వేచ్ఛ అను మూడు మౌలిక సూత్రాలను పాటించాలని ప్రబోధించారు. బౌద్ధమతాన్ని స్వీకరించిన డా॥ అంబేద్కర్‌గారు మన రాజ్యాంగ చట్టముయొక్క ముఖ్య నిర్మాతలలో ఒకరు. అట్టి మహనీయుడు బౌద్ధమతములోని ఆ మూడు మౌలిక సూత్రాలను మనరాజ్యాంగ చట్టమునందు పొందుపరచుటలో ఆశ్చర్యము లేదు. పౌరులందరికి సమాన హోదా సమానావకాశాలు కలుగ జేయాలండే పేదలకు, అణగ ద్రొక్కబడిన వర్గాలకు ప్రత్యేక సహాయము చేయుటం అవసరం అనే సూత్రాన్ని గూడా మన రాజ్యాంగములో పొందుపరచారు. "మానవ సేవయే మాధవ సేవ". ఇదే అన్ని మతాలయొక్క పరమ రహస్యం. ఎందువల్ల ననగా యావద్ విశ్వంలోను, సృష్టిలోను మానవుడిని మించిన ప్రాణి లేదు. అందువల్లనే కొన్ని మతాలవారు దేవుడిని కూడ మానవుని రూపధారిగానే ఊహించడం జరుగుతోంది. ప్రజలకు అన్యాయాలు చేసి డబ్బు గడించిన వ్యక్తి దేవుడున్నాడని నమ్మి తన అన్యాయార్జిత విత్తంలో కొంత భాగాన్ని మొక్కుబళ్ళ రూపంలో - కాదు, లంచం రూపంలో - భగవంతునికి సమర్పిస్తే, అట్టివాడిని పచ్చి, మోసగాడు అని పిలువండి. వాడిని బట్టబయలుచేసి అనుమానాలపాలు చేయండి. తోటిమానవుడికిగాని, మానవాళికిగాని క్రోధాన్ని తలపెట్టే ఏ కార్యమైనా భగవంతుడికి సమ్మతమౌతుందా? ఏ మతమైనా దీన్ని హర్షిస్తుందా? అవినీతి, దోపిడీ, అంతగొంది తనము మతమౌఢ్యము, కులతత్వము, బంధుప్రీతి, నిర్లక్ష్య స్వభావము ఈనాటి మన సాంఘిక వ్యవస్థలో కరుడుచట్టుగపోయాయి. సరిపడీనన్ని మత ప్రభోధక పత్రికలు, ఆకాశ

వాణిముంటి తగినన్ని మతభోధక ప్రసంగాలు ప్రచారము కావలసినన్ని ప్రార్థనా మందిరాలు, పూజా మంటిరాలు తేకపోవడం ఈనాటి మన దుస్థితికి కారణమా? మన నాయకులు మతాన్ని నిర్లక్ష్యం చేయడంవల్ల ఇట్టి పరిస్థితి వాటిల్లిక మానదా? ఇందుకు జవాబు వెదుకోవ్రనక్కర లేదు. ఈనాటి సాంఘిక వ్యవస్థలో మనం మతాలలోని మూల సూత్రాలవల్ల సవతితల్లి ప్రేమను చూపుతున్నాము. వానిలోని లోపభూయిష్టమైన భావాలకు దాసోహం అంటున్నాం. లేకపోతే మతాలపేర హింసాకాండ ఎలా జరుగుతోంది? కాలక్రమేణా సాంఘిక దురాచారాలు ఎందుకు వృద్ధిచెందుతున్నాయి? విధి, లేక కర్మసిద్ధాంతములందలి విశ్వాసము యువజనుల్లో కార్యాపేక్షను అణచివేస్తుంది. వారు తమ విధిపూర్వ నిర్ణీతం కాదని, అది తమ చేతుల్లోనే, తామునేయు కార్యములపైనే ఆధారపడి ఉంటుందని ఎల్లప్పుడు భావించాలి. పరకట్నాలను గుంజుకొని ఆడపిల్లల తల్లితండ్రుల సంసారాలను ఆర్థికబాధలకు గురిచేయడం భావ్యంకాదని మన యువకులకు తెలియచెప్పటానా? మన యువకులు హేతువాద దృక్పథం అలవర్చుకోకపోతే మన సాంఘిక దురాచారాలు, అంతం కావడమనేది ఉండదు. ఈనాడు వాయు వేగ మనోవేగాలతో పెరిగిపోతున్న జనాభా దృష్ట్యా యువకులు ఏమతస్థులైనా కుటుంబ నియంత్రణయొక్క అవశ్యకతను కాదనగలరా ? అందరికి ఒకే సివిలు చట్టము ఉండ వలసిన అవసరమును విస్మరింపగలరా ? మనకు రాజకీయ స్వాతంత్ర్యము వచ్చినమాట నిజమేకాని సాంఘిక రంగంలో సమూలాపకాశాలు సంపూర్ణంకాని రాజకీయ స్వాతంత్ర్యం మనలనుగాని మనజాతినిగాని ఉద్ధరించనేరదు. ఇది మనకు స్పష్టంగా తేటతెల్లంగ విస్మరింప వీలులేని రీతిగా గోచరిస్తున్న సత్యం.

మన యువకులయొక్క సొయిని వృద్ధిపొందించడమే మనకు మిగిలిన ఆశ. ఈనాడు మనదేశంలో దిగజారిపోతున్న ప్రమాణాలతోపాటు యువజనలోకం అధఃపతనం కాకుండ మనం జాగ్రత్తపడాలి. ఏ సంస్కరణకైనా ప్రథమ ఆవశ్యకత యువజన లోకంలో క్రమశిక్షణ. ఇతరులు విధించిన క్రమశిక్షణకంటె ఎవరికి వారు అలవరచుకొన్న క్రమశిక్షణ వాంఛనీయమైనది. బస్సుకోసమో సినిమాటికెటుకోసమో వరుసలో నిలబడటం చాల సులభమైన విషయంగానే గోచరిస్తుంది. కాని మనలో ఎంతమంది దీనిని నిత్యజీవి తంలో ఆచరిస్తున్నారు ! జీవితంలో ఒకరంగంలో క్రమశిక్షణ ఉంటే ఇతర రంగాల్లోను క్రమశిక్షణ అలవడుతుంది.

ఈనాటి విద్యావిధానంలో కాపీకొట్టడం అనే దురాచారం ప్రవేశ్ల నాటుకోబోతున్నదా అను భయం కల్గుతుంది. ఈనాడు కాపీకొట్టేయువకులు తాము పరీక్ష హాల్లో పర్యవేక్షకులను, పేపర్లుదిద్దేవారిని వంచించామనుకదా అని సంబరపడి పోవచ్చును. కాని తుదకు అటుపంటి ఆత్మ వంచనవల్ల వారే చింతింపవలసి వస్తుంది. కష్టపడి యదార్థ మైన కృషిచేసి విజ్ఞానార్జ్

సాధించకపోతే, ఎటువంటి ప్రయత్నములేకుండ వంచనాశిల్పంతో పొందిన డిగ్రీ వాస్తవ జీవితంలో ఏ విధంగాను ఉయోగపడదు. జీవితరంగాలన్నిటిలోను ప్రగతి సాధనకు న్యాయ మైన పోటీ ఉండాలి. ప్రపంచదేశాల మధ్య భారతావని అర్హస్థానము పొందాలంటే, ప్రజలు న్యాయోచితమైన రీతిని ప్రవర్తించాలి. కష్టవడి పనిచేయాలి. జపానువంటి ఒకచిన్నదేశం పెద్దపెద్దదేశాలతో సమానమైన ప్రగతిని సాధించడమే కాదు కొన్నివిషయాల్లో వాటినికూడ అధిగమించి పోయిందంటె అచ్చటి ప్రజల స్వచ్ఛంద క్రమశిక్షణ, చిత్తశుద్ధి. కష్టపడి పని చేయగల శక్తి అందుకు కారణం. పూర్వము భారత దేశము కుటీర పరిశ్రమలకు పేరెన్నిక గన్న దేశం. తన కళాకారుల నైపుణ్యానికి గర్వపడిన దేశం. కాని ఈనాడు శ్రమలో గల గౌరవం మనలో అనేకమందికి తెలియనే తెలియదు. లేక తెలిసినవారు కూడ దానిని ఉపేక్షిస్తున్నారు. శ్రమలో గల గౌరవాన్ని మన యువజన లోకం అవగాహన చేసుకోవాలి. మానవ జాతికి ఉపయోకకరమైన ఏ పని నీచమైనదని కాని తక్కువదని కాని మనం పరిగణించ కూడదు.

ఈ మధ్యకొందరు విద్యార్థులు అన్నిరకాల రాజకీయ వ్యవహారాల్లోనుపాల్గొంటు న్నారు. వారు తమ శ్రద్ధను చదువునందే కేంద్రీకరించాలి. భాషాసమస్య కొరకుగాని, మరి యే ఇతర సంకుచిత విషయము కొరకుగాని విద్యార్థులు తమలో తాము హింసాత్మక పోట్లా ఓలకు, కొట్లాటలకు దిగకూడదు. దోపిడీల లాంటి పనులకు పాల్పడకూడదు. ప్రాణహానిని, ఆస్తుల వినాశమును, విద్యాసంస్థలను, విశ్వవిద్యాలయాలను తాత్కాలికంగా మూయవలసిన పరిస్థితిని కలుగజేసెడి చర్యలను ప్రమేయం పెట్టుకోరాదు. ఒకరి నోటినుండి వెలువడే మాటలు. ఒకరు లిఖిత పూర్వకముగా వ్రాసిన వ్రాతలు, వారు అనుకొన్న విధంగా వేరొకరికి స్ఫురింపచేయడం భాషయొక్క ముఖ్యోద్దేశ్యము. భాషలన్నిటి ఉద్దేశ్యము అదే ఆయినప్పుడు మతాలన్నింటి ఉద్దేశం మానవ శ్రేయస్సే అయినపుడు భాష పేర, మతం పేర ఎందుకీరగడ. మనం అంతా మొట్టమొదట భారతీయ పౌరులం ఆనే యదార్థాన్ని ఒకరి దృక్పథాన్ని మరొ కరు సహృదయతతో అర్థం చేసుకుంటూ మనలోగల భేదాలను స్నేహ పూర్వకంగా, శాంతి యుతంగా సర్దుకోవాలనే సత్యాన్ని మరచిపోతున్నాం. పరస్పర సహకారం, సద్భావన అవ గాహనవల్ల పరిష్కారం కాని సమస్య ఆంటూ ఏది ఉండదు. స్నేహయుత సహజీవనమనే దాన్ని మనం అలవర్చుకోవాలి. దురదృష్ట వశాత్తు కొందరు అమాంతంగా నాయకులమై పోదామని ఆనుకుంటారు. మతంపేర, భాషపేర తదితర సంకుచిత దృక్పథాలపేర ఉద్రేకాలను రేకెత్తించడానికి వారు నీచమైన పన్నాగాలు పన్నుతారు. ఇటువంటి సాంఘిక వ్యతిరేక శక్తులకు చెప్పవలసిన విధంగా బుద్ధిచెప్పాలి. ఇటువంటి వారు చూపిన మార్గాన్ని మన యువజనులు, మనజాతి అనుసరిచండం చాల ప్రమాదకరం.

సంఘంలో దూరాచారాలు పెరిగిపోతుంటే యువకులు చూస్తూ ఊరుకోకూడదు. అరికట్టడానికి శాయశక్తులా ప్రయత్నించాలి. ఉదాహరణకు కంట్రోలు ధరకంటె ఎక్కువ ఇచ్చి ఏవస్తువును కొనకూడదు. కొరతగా ఉన్నవస్తువుల వాడకమును తగ్గించుకోవాలి. అది వీలుకాకుంటే కనీసం వారిఆవసరాలకు మించి ఆటువంటి వస్తువును నిలువచేయకూడదు. మనకంటె ఎక్కువ ఆర్హత, సమర్థత కలవారికన్న ప్రాధాన్యత పొందేందుకై మామూళ్ళు, లంచాలు, ఇవ్వకూడదు. అటువంటి అత్యాచారాలు వారిదృష్టికి వస్తేవాటిని సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి, సాక్ష్యము ఇవ్వడానికి సంసిద్ధులు కావాలి. చట్టరీత్యా నేరాలని ప్రకటింపబడిన చర్యల విషయంలో కూడ అదేరకమైన సహకార దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. మన యువజన లోకంలో ఇటువంటి అలవాటు పెంపొందకపోతే చట్టాలు, నియమాలు, నిబంధనలయొక్క లక్ష్యాలు నెరవేరడంకాని, వాటిద్వారా సంఘసంస్కరణ జరగడం కాని సాధ్యంకాదు. సామ్యవాద వ్యవస్థా నిర్మాణానికి రూపొందించబడుచున్న భూసంస్కరణ చర్యల విషయంలోను, ముందు రూపొందించబడనున్న ఇతర చట్టాల విషయంలోను కూడ ఈ మాటే వర్తిస్తుంది. మననాయకులు గూడా తామేది ప్రబోధిస్తున్నారో దానినే ఆచరించి యువకులకు మార్గదర్శకులు అవుతారని ఆశిదాం.

ఆంధ్ర జ్యోతి 7-3-72

వర్ణాంతర వివాహాలు:

అనుభవాలు

పరిచయ కర్త : శ్రీ జె. వీరస్వామిగారు.

1. శ్రీమతి సి. లక్ష్మిగారితో పరిచయం.
2. శ్రీమతి బి. వెంకటేశ్వరిగారితో పరిచయం.
3. శ్రీమతి సావిత్రీ రామన్‌గారితో పరిచయం.

జె. వీరస్వామి : తొలిపలుకులు

వర్ణాంతర వివాహాలమీద ఈమధ్యహెచ్చుగా పత్రికలద్వారా తర్క వితర్కాలు జరుగుతున్నాయి. కేవలం సాంఘిక సమస్యగా ఈ సమస్య చర్చింపబడుతోంది. కులరహిత సంఘ నిర్మాణానికి, వర్ణాంతర వివాహాలు దోహదం చెయ్యగలవని పలువురు భావిస్తున్నారు. కొందరు మాత్రం ఆహార నియమాలు; ఆచారవ్యవహారాలు, భాష: పరాంతర వివాహాలకు ఆటంకాలుగా ఉంటాయని భావిస్తున్నారు. దీనికి సమాధానం కేవలం ఆలోచించి చెప్పడం కంటే అనుభవపూర్వకంగా చెప్పడం మంచి పద్ధతి. ఈ కార్యక్రమంలో ముగ్గురు శ్రీమతులు తమ అనుభవాలు వెలిబుచ్చబోతున్నారు.

శ్రీమతి శ్రీ లక్ష్మిగారితో పరిచయం

1. ప్రశ్న :– ఏమండీ లక్ష్మిగారూ మీరు బ్రాహ్మణ కుటుంబములో జన్మించారు గదా, వర్ణాంతర వివాహము చేసుకోవాలన్న అభిలాష ఎలా, కల్గింది?

జవాబు :– కులనిర్మూలన, వర్ణ, వర్గరహిత సమాజస్థాపన, వర్ణాంతరవివాహాలు వంటిఆలోచనలకు ఆరంభం మావారు శ్రీ నాగేశ్వర్‌గారి పరిచయంతోటే కలిగింది. అప్పట్లో

ఆయన శ్రీ గోరాగారి కుటుంబంతో సన్నిహితంగా ఉంటూ సంస్కరణ కార్యక్రమాల్లో పాల్గొంటుండేవారు. అవిధంగా మొదలైన మా పరిచయం మావివాహానికి దారితీసింది.

2. ప్రశ్న :— మరి మీ వివాహానికి మీ తల్లిదండ్రులు అనుమతించారా ?

జవాబు :— లేదండీ, వివాహానికి ముందు నానిశ్చయాన్ని మా తల్లితండ్రులకు చెప్పాను. వారు తీవ్రంగా ప్రతిఘటించారు. ఆయన తక్కువ కులానికి చెందినవారని, పైగా మంచి స్థితిలో లేరని వాళ్ళ ఆక్షేపణ. చివరకు వాళ్ళ ఒప్పుదల పొందడం జరగని మా వివాహం మేమే చేసుకున్నాం.

3. ప్రశ్న :— వివాహం ఎలా జరిగింది ?

జవాబు :— మా వివాహం 1968లో బంచరు రిజిస్ట్రారు ఆఫీసులో శ్రీ జొన్నల గడ్డ రామలింగయ్యగారి ఆధ్వర్యంలో జరిగించి. అదికూడా చాల సింపుల్‌గా జరిగింది. ఘనాఘాపంవల్ల పెళ్ళిఖర్చు 150 రూ. లతో సరిపెట్టాం. కాపురానికి కావలసిన సామానులు ఒక 60 రూ. పెట్టి తీసుకున్నాం. అప్పుడు ఒక నలబదిరూపాయలలో నేనొక రెండు చీరలు కూడా తీసుకోవలసివచ్చింది.

4. ప్రశ్న :— మీ వివాహం వలన మీ పుట్టింటివారిలో ఎల్లాంటి పరిణామాలు కలిగాయి ?

జవాబు :— మావివాహంతో నాతల్లిదండ్రుల దిగ్గర్నుంచి దూరపు బంధువులదాకా నాపేరుకూడా తలపడంమానేశారు. మావారు అంతక్రితమే — చెల్లెలికి వర్ణాంతర వివాహంచేసి తన బంధుకోటికి దూరంఅయ్యారు. కానీ బెల్లంచుట్టూ చేరే చీమలపంటి మా బంధుజనుల ఆగ్రహానుగ్రాల విషయం మేం ఎప్పుడూ తలవలేదు.

5. ప్రశ్న :— ఆర్థిక సమస్యలేమైనా ఎదుర్కొవలసి వచ్చిందా ?

జవాబు :— ఆర్థిక సుస్థిరత లేకుండె కనీస నికరాదాయం లేకుండా వివాహం అందునా వర్ణాంతర వివాహం చేసుకోకూడదని గట్టిగాభావించి — వివాహం చేసుకుందామను కున్న తర్వాత — యమ్. యస్.సి. అయేంతవరకు, 5 సం॥లు మా వివాహాన్ని వాయిదా వేశాము. అయినా కొన్ని ఇబ్బందులు మాకు తప్పలేదు. ఉద్యోగాలమీద ఆశలు పెట్టుకునే చాలామంది మల్లేనే - మాఆశలు అడియాసలని, ఊహలు కేవలం ఊహలేనని త్వరలోనే

తెలిసింది. మావారికి రికమెండేషను లేందే ఉద్యోగం రాదని స్పష్టమైందిమేమిద్దరం ఏకులా నికి చెందకపోవడంకూడా మాకునష్టాన్ని కలిగించింది. అప్పట్లో నా ఆరోగ్యం ఉద్యోగం చేసేటంత మంచిస్థితిలోకూడా లేదు.

అలాంటి సమయంలో ఒక సంవత్సరంపాటు గాడాంధకార బంధురంగా కనిపిస్తున్న భవిష్యత్తులో వెలుగు రేఖల్ని ఊహిస్తూ, మావారు చేసే చిన్న ఉద్యోగంలో వచ్చే రాబడి లోనే గడిపాం. ఆ స్థితికి తట్టుకుని నిలబడడానికి కారణం ఎలాంటి స్థితినైనా తట్టుకుని, నిలబడేందుకు మనస్సుని చిక్కబట్టుకోవడం, అంతకన్న తక్కువ రాబడిలో పెద్ద పెద్ద సంసార భారాన్ని మోస్తున్న చాలామందితో మాస్థితి పోల్చుకోవడం అనుకుంటాను.

వివాహ జీవితపు ప్రథమాధ్యాయంలోనే మేమీ తీవ్రస్థికి గురికావడం ఒక విధంగా మంచిదేననిపిస్తుంది. ఎప్పుడో పరీక్షలు, ఎన్నడో ముష్కలితాలకన్న – ప్రధమంలోనే గట్టి పరీక్షలకు తట్టుకొని, మా బంధం మరింత గట్టిపడింది. కోరుకున్నవార్ని చేసుకోవాలనుకునే వారు కొంత కష్టపడక తప్పదేమో!

6. ప్రశ్న :– తర్వాత మీకేమై నా ఉద్యోగం వచ్చిందా ?

జవాబు :– ఆ ! సంవత్సరం తర్వాత ప్రభుత్వంలో మెరిట్‌కి ఉన్నస్థానంవల్ల నాకు పి. ఆండ్ టి. లో ఉద్యోగంవచ్చింది. దానితో మా ఆర్థికస్థితిలో అనుకోనంత మార్పు కలి గింది. అంతవరకు భయపడుతూ బెరుకుబెరుకుగా నన్ను దగ్గరకి చేరదీయలేక బాధపడే నా తల్లిదండ్రులు దగ్గరగా వచ్చారు. కాని ఇప్పటికీ వాళ్ళు మావారిని అల్లుడుగా స్వీకరించలేదు. భవిష్యత్‌లోకూడా సంబంధ బాంధవ్యాలు మామూలు పద్ధతిలో జరుగుతాయనే ఆశ నాకులేదు.

7. ప్రశ్న :– వర్ణాంతర వివాహాల గురించి మీ అనుభవ పూర్వక అభిప్రాయా లేమిటో చెబుతారా?

జవాబు : డబ్బు, పెద్దవుద్యోగం – కనీసం చదువు–ఈ మూడింటికో ఏదిఉన్నా మన పట్టణాల్లో ఉండేవారు - సమస్య తమది కానంతవరకు వర్ణాంతర వివాహాల్ని సహిస్తు న్నారనే అనుకుంటాను. అందువల్లనే సంఘపరమైన సమస్యలేవీ మమ్మల్ని బాధించలేదు.

ఆర్థిక సుస్థిరత్వం వివాహ విజయానికి పునాది. కాని అంతకుమించి పరస్పరాను రాగం, సహకారం, సర్దుబాటు మావివాహ విజయానికి కారణ భూతాలని అనుకుంటున్నాను.

గ్రామ ప్రాంతీయుల్ని మినహాయించినా ఈనాటికీ వర్ణాంతర వివాహాల్ని ఇవ్వ గించని వారిని చాలామందిని విచ్ఛిన్నంతుల్లోనే చూస్తున్నాం. ఆర్థిక రాజకీయరంగాల్లో ఏవిధమైన ప్రతిపత్తినీ పలాయి, సాంఘికాభివృద్ధివైపు పయనిస్తున్న మనసమా జంలో ఏవిధంగానూ అవసరం లేదనీ—పైపెచ్చు సమసమాజ స్థాపనకు గొడ్డలి పెట్టు లాంటిదనీ — వారంతాఎప్పుడు గ్రహిస్తారు? ఏకులంవైపూ మొగ్గని కేవలం భారతీ యులమని చెప్పుకునే వర్ణాంతర వివాహదంపతుల్ని గాని, వారి బిడ్డల్నిగాని వారు ఎప్పుడు గౌరవించడం నేర్చుకుంటారు? కులమత వర్గరహిత సమాజ స్థాపనవైపు మనదేశం ఎప్పుడు పురోగమిస్తుందో — అంతుపట్టకుండా ఉంది.

శ్రీమతి బి. వెంకటేశ్వరిగారితో పరిచయం

1. శ్రీమతి వెంకటేశ్వరిగారూ, మీకుబ్రాహ్మణ యువకులైన శ్రీ రామారావు గారితో వివాహం ఎలా సాధ్యపడింది ?

జవాబు :- మాతల్లితండ్రులకు మేము 6 గురు ఆడ పిల్లలం, 4 గురు మగ పిల్లలం. నేను ఆడ పిల్లలలో 4వ దానిని. మా అమ్మగారికి ఆడపిల్లలను ఎక్కువ చదివించడం యిష్టంలేదు. ఎందుకంటే వాళ్ళ పెళ్ళిళ్ళకు కట్నాలని, కానుకలని డబ్బు ఖర్చు ఎక్కువ వుంటుంది కాబట్టి. అందువలన మా అమ్మగారు నేను యస్. యస్.యల్.సి. ప్యాసయాక, కాలేజీకివెళ్లుటకు యిష్టపడలేదు. కాబట్టి నేను మావాళ్ళతో నాకు "పెళ్ళిప్రయత్నం చేయవద్దు చదువుకొని ఉద్యోగం చేస్తాను. అప్పుడు ఎవర యినా కట్నంకానుకలు తీసుకోనివాళ్ళువస్తే నాకు నచ్చితే అప్పుడు వివాహంచేసుకుం టానని చెప్పాను. అట్లాగే నన్ను బి.యస్.సి.బి.ఇడి. చదివించారు.

నాకు ఇంటర్‌మీడియట్ చదువుచున్నప్పటి నుండి వర్ణాంతర, మతాంతర వివా హాలన్నా, బలవంతపు కట్నంకానుకలులేని పెళ్ళిళ్ళన్నా యిష్టంగా వుండేవి

బి.ఇడి., అయ్యాక ఉద్యోగప్రయత్నంలో, యస్.ఇ.ఓ. ట్రైయినింగు గురించి మధుర జిల్లాలోని గాంధీ గ్రామమునకు వెళ్ళవలసివచ్చింది. ఈ ట్రైయినింగులో మావారు, నేను, కోట్రయినీసు అయ్యాం. గాంధీగ్రామ్, గాంధీజీ సూత్రాలపై నడచు ఒక పెద్దసంస్థ. మేము ట్రైనింగుకు వెళ్ళిన మొదటిరోజే అక్కడ ఒకబ్రాహ్మణ

యువకునికి, ముస్లిమ్‌యువతికి మతాంతర వివాహం జరిగింది. ఈ సంఘటన మమ్ములనెంతో ఆకర్షించింది.

యస్.ఇ.ఓ. ట్రైయినింగు 8 నెలలో, మావారి పరిచయములో వారితండ్రిగారు ఒక పోస్టల్ వర్కర్ అని, కాంగ్రెస్ ఉద్యమములో 3 సార్లు జైలుకు వెళ్ళారని, వారికి కులమత భేదములు లేవని, తనపేరుకూడా డి.సి. నరసింహారావు నుండి ఫ్రాంక్లిన్‌రామ్ మహమ్మద్‌గా మార్చుకున్నారని తెలిసినది. మావారికి వర్ణాంతర వివాహం చేసికోవాలని అభిలాషవున్నట్లు కూడా తెలిసింది. మా ఇద్దరి ఆశయాలు, ఆలోచనలు కలసి మేము వర్ణాంతరవివాహము చేసికొనుటకు నిశ్చయించుకున్నాము.

2. ప్రశ్న వివాహం ఎలాజరిగిందమ్మ ?

జవాబు :— మా ఇద్దరి తల్లిదండ్రుల, బంధు మిత్రుల సంఘ సంస్కర్తల ఆశీర్వాదములతో 1957 డిశంబరులో అందరికీ వర్తించే రిజష్టరు వివాహము స్వల్ప ఖర్చుతో నెల్లూరుటౌను హాలులో జరుపుకున్నాము.

3. ప్రశ్న :— మీ వివాహంవల్ల మీ ఇద్దరి కుటుంబాల్లో సమస్యలేమైనా ఉత్పన్నమయ్యాయా ?

జవాబు : నేను వర్ణాంతర వివాహము చేసికోవడము వలన మా చెల్లెళ్ళిద్దరికి, తమ్మునికి, వివాహములకు ఆటంకమేమీరాలేదు. వాళ్ళిద్దరికీ మామూలు వివాహాలే జరిగాయి. మావారు ఎప్పుడైనా అమ్మగారింటికి వచ్చినా మిగతా అల్లుళ్లను చూసినట్లే మర్యాదతో చూచేవారు.

మావివాహమయి 15 సం. లయినది. మామామగారు, మావారు, సంఘసంస్కరణకు చేయూతనిచ్చు వ్యక్తులు కావటాన నేను ఇంట్లో ఆచార వ్యవహారములలో అట్టే యిబ్బందులు ఎదుర్కొనలేదు,

మావారి నాయనమ్మ మడీ ఆచారములు బాగా పాటించేది. మొదట్లో మావివాహానికి యిష్టపడని ఆమె పెళ్ళయిన 3 సం. లలో మాతోకలసి వుండటం నన్ను ఆదరాభిమానాలతో చూడటం జరిగింది

మా దాంపత్య జీవితంలో ఎటువంటి కలతలు రాలేదు, ఆర్థిక యిబ్బందులులేవు. మా అత్తమామలు, ఆడబిడ్డ మావద్దనే వుంటున్నారు. మా తల్లిదండ్రులు యిప్పుడు లేరు. కాని నాకు తల్లిదండ్రులు లేనిలోపం రానీకుండా మా అత్త మామలు చూచుకుంటున్నారు. మేమంతా ఒకరికొకరు తోడునీడగా, కలసిమెలసి వుంటున్నాము. మా ఇద్దరి బంధువుల మా మధ్య రాకపోకలు సంబంధ బాంధవ్యాలు కొనసాగుతూనే వున్నవి.

4. ప్రశ్న :— శ్రీ రామారావుగారు శాఖాహార కుటుంబములోను, మీరు మాంసాహార కుటుంబములోను జన్మించారుగదా అందువల్ల ఏమైన ఇబ్బందులు వచ్చాయా ?

జవాబు : భోజన పద్ధతులలో ఇబ్బంది ఏమీ రాలేదండి. మావారు శాకాహారి అయినా నేను ఇంట్లో, బయటా మాంసాహారినే, మా పిల్లలలో ఒకరు శాకాహారి. ఇద్దరు మాంసా హారులయ్యారు. మా బంధువులెవరయినా వచ్చినా వారికి మాంసాహారం వంటలు చేస్తున్నాం.

శ్రీమతి సి, ఏ. సావిత్రీరామన్ గారితో పరిచయము

1. ప్రశ్న :— సావిత్రీరామన్‌గారూ మీ వివాహం కులాంతరమే కాకుండా కేరళ, ఆంధ్ర రాష్ట్రాలకు సంబంధించినదని తెలిసింది. వివాహం ఎలా అయిందో చెప్తారా ?

జవాబు :— నా జన్మస్థలము రాజమహేంద్రవరము. మా వారైన శ్రీ సి. ఏ. రామన్ గారిది కేరళ. వారి నాన్నగారు భద్రాచలంలో వ్యాపారం చేస్తారు. చదువు నిమిత్తమై మావారు రాజమండ్రి రావటం, మా యిద్దరికీ పరిచయమై నాల్గు సంవత్సరాల అనంతరం అది పెండ్లికి దారితీయటం జరిగింది. మా వివాహం మా ఇంట్లోని వారెవరికీ ఇష్టంలేదు. నా ఆలోచనలకు అభిప్రాయాలకు మాతోటి వారంతా ప్రతిఘటించారు. మా లక్ష్యం సాధించటంకోసం నేను మా వారితో కేరళకు వెళ్ళటం జరిగింది. అక్కడి పరిస్థితులు ఎలా ఉంటాయో ? మా వారి తల్లిదండ్రులు మా వివాహానికి ఆమోదిస్తారో లేదో ఎటువంటి పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందో

అని చాలా ఆందోళన పడ్డాము. స్వయంగా మా కాళ్ళమీద మేము నిలబడగల శక్తి వుందా అంటే అదీలేదు. కేవలం మా వారి బి. యస్సీ. చదువు పూర్తి అయింది. కానీ ఉద్యోగ విషయంలో ఇంకా ఎట్టి ప్రయత్నాలు చేయలేదు. అటువంటి పరిస్థితులలో మా అత్తవారింట కాలుపెట్టటం జరిగింది. పూజ్యులయిన మా అత్తగారి, మామగారి ఆధ్వర్యంలో వారి అనుమతితో మా వివాహం జరిగింది.

2. ప్రశ్న :– కొత్తగా కేరళ వెళ్లారుగదా మీకేమీ భాష వ్యత్యాసములో ఇబ్బంది కలుగలేదా ?

జవాబు :– నూతన ప్రవేశం, క్రొత్త భాష, క్రొత్త భావాలు. పరిసరాలు క్రొత్తవి. అడుగుపెట్టిన వివాహ జీవితం కొత్తది. ఈ పరిస్థితులలో నేను అందరితోనూ కలిసి నా జీవితం సాగించగలనా అనిపించింది. తెలుగు మాట్లాడే వారు ఒక్కరూ కనిపించేవారు కాదు. ఏ సుకృతంవల్లనో మా మామగారు భద్రాచలంలో కొన్ని సంవత్సరములు వుండుట వలన మా అత్తగారికి మామగారికి తెలుగు మాట్లాడటం కొంతవచ్చును. వారిద్దరితోను, మావారితోను తప్ప నాకు తెలుగు మాట్లాడే అవకాశమే లేదు. మా మరిదిగార్లు, ఆడపడుచులు, నాతో ఏమో ఉత్సాహంగా మాట్లాడాలని ప్రయత్నించేవారు. కానీ ఒకరిభాష ఒకరికి తెలిస్తేకదా. ఒక విధముగా అదీ మంచికే జరిగింది. నాకు మళయాళం త్వరలోనే నేర్చుకునే అవకాశం కలిగింది. కొన్ని నెలల వ్యవధిలోనే చక్కగా మాటాడగల్గటం, కొంచెంగా వ్రాయటం నేర్చుకోగలిగాను. ఇప్పుడు నన్ను మళయాళీ అమ్మాయి అనే అనుకుంటారు నేనే మళయాళం బాగా మాట్లాడుతున్నానని, మావారే తెలుగువారేమో అని అనుమానిస్తుంటారు. మా ఇంటికి వచ్చిన మళయాళపు స్నేహితులన్నారు.

3. ప్రశ్న :– కేరళ వివాహపు పద్ధతుల గురించి చెప్తారా ?

జవాబు :– మనవైపులాగ పెండ్లికి పురోహితుని మంత్రాలు వుండవు. చాలా సింపుల్‌గా జరుగుతుంది. పసుపు పరుంచేత ప్రమాణాలు చేయిస్తారు మంగళసూత్రం కట్టిన తరువాత ఉంగరాలు, దండలు ఒకరికి ఒకరికి మార్పిస్తారు. ఆ వేడుక అయిన తరువాత రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్ళి సంతకాలు చేస్తారు ముఖ్యంగా మన ప్రాంతాల్లోలాగ వరకట్నం ఇచ్చే ప్రశ్నే లేదు.

4. ప్రశ్న :– కేరళకోసు, ఆంధ్రకోసు ఆహార నియమాల్లో తేచాయస్న యసుకుంటారే ?

జవాబు :– మా వివాహం జరిగిన మూడు నెలలకు మావారు ఉద్యోగ నిమిత్తమై బొంబాయి వెళ్ళినపుడు నేను ఒంటరిగా ఒక సంవత్సరంపాటు మా అత్తగారింట్లో గడిపాను. ఆహార విషయంలో కూడ చాలా తేడాలు వున్నవి. కొబ్బరినూనె ఎక్కువగా వాడతారు. ముఖ్యంగా ఉప్పుడు బియ్యం వాడుతారు. క్రొత్తలో ఉప్పుడు బియ్యం అన్నం తినాలంటే ఏడ్పు వచ్చే పర్యంతమయేది. భోజనం సరిగా చేసేదాన్ని కాదు. ఇది చూచి మా మామగారు కొన్ని పడ్లు నేరుగా పంపించి పచ్చి బియ్యం అన్నాన్ని నాకోసం వేరుగా వండించేవారు. నన్ను వారిచ్చరూ, పిల్లలూ ఎంతో ఆదరంగా చూసేవారు. నా తల్లిదండ్రులకు దూరమయా నన్న ఆవేదన నా స్మృతిపథంలోకి రానిచ్చేవారు కాదు.

5. ప్రశ్న :– మీ ఇతర అనుభవాల గురించి చెప్తారా ?

జవాబు :– మావారు బొంబాయిలో పుండగానే, మా అమ్మగారు స్వర్గస్థురాలయినట్లు మా రెండో అన్నయ్య ఉత్తరం ద్వారా తెలిసింది. అప్పుడు నేను గర్భవతిగా వున్నాను. అప్పటి నా పరిస్థితి నా జీవితంలో మరువలేనిది. తిరిగి ఆమ్మను ఎప్పటికీ చూచుకోలేని దుస్థితి, నన్ను చాలా క్రుంగదీసింది. ఆ పైసుతో మా అత్తగారు, మామగారు నన్ను ఓదార్చి కంటికి రెప్పలా చూసుకున్నారు.

మా వారు ఉద్యోగరీత్యా హైదరాబాదు రావటం మా పెదబాబు పుట్టిన తరువాత నేనుకూడా కేరళ నుండి హైదరాబాదు రావటం జరిగింది. మా బావగారైన శ్రీ జె. వీరాస్వామిగారు, మేము హైదరాబాదు వచ్చిన తరువాత, మా పుట్టింటివారితో కలుపటానికి చాలా కృషిచేసి సాధించారు. పూజ్యులు, పుష్పలత మా తండ్రిగారి దగ్గరకు మా వారితోసు, మా ఇద్దరి బాబులతోసు వెళ్ళి నమస్కరించినపుడు ఆయన మమ్మల్ని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ పది సంవత్సరాలలోనూ మా జీవితంలో యెట్టి కలతలూ లేకుండా సౌఖ్యప్రదంగానే గడచిపోయాయి. మా వారికి వివాహమైన కొద్ది నెలలకే మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగం లభించటం. ఎల్లవేళలా మేము ఎవరిమీదా ఆధారపడకుండా ఉండగల్గటం మా సుఖజీవితానికి తోడ్పడిందని, సంఘంలోకూడా మాకు గౌరవం లభించిందని అనుకుంటున్నాము. మా పెదబాబుకి

ముందు మా రెండో అన్నయ్య డాక్టరు ప్రకాశరావుగారు కూడా డాక్టరు లీలావతిని పెండ్లి చేసుకున్నారు. ఆదికూడా వర్ణాంతర వివాహమే. మా పిల్లలిద్దరు కూడ తెలుగుతోపాటు మళయాళంకూడా బాగా మాట్లాడ గలరు.

సమీక్ష : శ్రీ జె. వీరాస్వామిగారు

వీరి ముగ్గురి వివాహ అనుభవాలపల్ల తేలిందేమంటే, ఆహారం, భాష క్రొత్త పరిసరాలు ఇవేవి వర్ణాంతర వివాహానికి అడ్డు పడవనీ, సంకల్పం, పట్టుదల ఆర్థిక వనరులు వుంటే మామూలు వివాహ్లలాగే వర్ణాంతర వివాహాలు గూడా జయప్రదం కాగలవని స్పష్టమవుతుంది.

కులంతో నిమిత్తం లేకుండా తనకు మనస్ఫూర్తిగా నచ్చిన వారిని జీవిత భాగస్వామిగా చేసుకోవడం ద్వారానే కుల దృక్పధల చాలవరకు పోతుంది.

ఆకాశవాణి 31–7–72

మానవత

మనిషిలోనుంచి మానవతను మినహాయిస్తే మిగిలిపోయేది ఒక అటవిమ నివాసి-ఒక ద్విపాద పశువు.

కొన్ని వేల సంవత్సరాల క్రిందట మనిషికి పంట పండించుకోవటం, వంట వండుకోవటం లాంటి వేమీ తెలియదు. అనాగరికంగా ఉంటూ, అడవుల్లో తిరుగుతుండే వాడు, జంతువుల్ని వెంటాడి, వేటాడి తన ఆకలి తీర్చుకునేవాడు. ఆకలికొన్న క్రూర జంతువుల వాతబడి అతడు ఆహుతి అయిపోవటం గూడా జరుగుతుండేది. అప్పుడు మనిషి మొదటిసారిగా తన బలహీనతను తెల్సుకున్నాడు. తోటివాళ్ళను కల్సుకుని తన మనుగడకు సహకార దృక్పథాన్ని అలవరుచుకొన్నాడు. అంతా సమైక్యంగా మసులుకుంటూ, సంపాదించుకున్నది సాయంత్రాన సమానంగా పంచుకుంటూ, సంఘీ భావాన్ని పెంచుకోవటం నేర్చుకున్నారు ఆదిమ నివాసులు. అలా ఏర్పడ్డదే మొదట్లో సంఘం.

"కష్టంలో, సుఖంలో నీకు నేను, నాకు నీవు తోడుగా విడిపోని జోడుగా ఉండిపోదాం" అనే మానవతా దృక్పథపు పునాదుల మీద నిర్మించబడ్డదీ సంఘం. అప్పట్లో వారికి వ్యక్తిగతమైన ఆస్తులంటూ ఏమీ ఉండేవి కావు.

కాలం మారే స్వభావం కలదీ, కలిగించే ప్రభావం కుదీ రావటంవల్ల, అష్టా నాంధకారంలో నిలబడ్డ మనిషి చుట్టూ కోటి విజ్ఞాన దీపాల్ని వెలిగించుకుంటూ మెళ్ళ సాగింది. గుంపులు గుంపులుగా నివసించే మనుష్యుల్లో తగాలూ, జాతులూ కనిపించ సాగాయి. పల్లెలు రూపొందాయి. పంట చేలు పెంపొందాయి. పలురకాల పనిపాటలు, వృత్తులూ వృద్ధిజెందాయి. భారతదేశంలో వృత్తుల ఆధారంగా కులాలు ఉచ్ఛ్వించాయి. వృత్తితో ఆరంభమైన కులాలు పుట్టుకతో ముడిపెట్టబడి, ఇప్పుడు పెకలించటానికి వీల్లేనంత బలంగా సంఘంలో వేళ్ళు దించుకుని, స్థిరపడిపోయినయి. ఈ కులాలు

మనిషినుంచి మనిషిని వేరు చేశాయి వారి మధ్యస్పర్థలు, స్పర్ధాపేక్ష లూ ఎక్కువ అయ్యాయి. దేశం విదేశీయులు వారికి గురి అయింది. ఇతర మతాలు రావటంతో మతాల వేర గూడ సంఘర్షణలు ప్రారంభమయ్యాయి.

సంమీభావంతో మనలాలి అనే మానవత్వపు పునాదుల మీద నిర్మించబడ్డ సంఘం క్రమంగా తన ఆకృతిని మార్చుకుంటున్నది. అంచెలు అంచెలుగా సంఘం తన అంతస్తులు పెంచుకుంది. మానవత్వపు పునాదులు మాత్రం తమ పటిష్టాన్ని పోగొట్టు కున్నాయి.

ఒక పక్క మనిషిని బాధనుంచి ఎలా రక్షించాలా అని అహర్నిశలూ లక్షల మంది డాక్టర్లు తమ జీవితాలను వెచ్చించి, విజ్ఞానాన్ని పెంచించి పరిశోధనలు సాగిస్తుంటే, మరో పక్క క్షణికోద్రేకంలో పక్కవాణ్ని పొడిచి చంపేస్తున్నాడింకో మనిషి. ఆకలిమీద, జ్ఞానంమీద మధ్య మధ్య విలయతాండవం చేస్తున్న ప్రకృతిమీద యుద్ధం చేస్తున్న చిన్న చిన్న దేశాలపై పక్కదేశాలు కయ్యానికి కాలు దువ్వు తున్నాయి. పెద్ద పెద్ద దేశాలు కీచులాడుకుంటున్న దేశాల్లో ఒకదానికి మందుగుండు సామాగ్రిని మరోదానికి మందుల సామగ్రిని ఒడలనిండా దిగుమతిచేసి ధనార్జన చేస్తూ తమ రాజనీతిజ్ఞతను తామే ముసిసి పోతున్నాయి. ఇక మానవత్వం మాట ఎవరికి గుర్తుంటుంది? అది గుర్తుంటే ఘర్షణే ఉండదు. గౌతమ బుద్ధుడు మానవత్వాన్ని ప్రబోధించాడు. బౌద్ధమతం జపాను వరకు విస్తరించి, అక్కడి ప్రజలను ఉత్తేజితుల్ని చేసింది. కర్తవ్యాన్ని, మానవత్వాన్ని గుర్తెరిగిన ఆ దేశ ప్రజలు సర్వతోముఖాభి వృద్ధి పొందారు. బౌద్ధమతానికి జన్మస్థానాన్ని అని చెప్పుకునే మనదేశంలో మాత్రం ఆ మతం క్షీణదశకు వచ్చింది.

మనదేశం పరదేశీయుల పరిపాలనలో అనేక సంవత్సరాలు ఉన్నందువల్ల అభివృద్ధి కుంటుపడింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ పాతికేళ్ళలో వర్గప్రయోజ నాలకు, వ్యక్తిగత స్వలాభాలకు మాత్రమే తగిన ప్రోత్సాహం లభించింది. సమాజం లోని అనేకమైన సాంఘిక దురాచారాలను అరికట్టి మనిషిలోని మానవత్వపు విలువల్ని పెంచే ప్రయత్నాలు గాని సంఘ సంస్కరణలను పూనుకున్న ప్రయత్నాలు గాని జరుగలేదు.

రాను రాను సామాజిక ధృక్పథాల్లో మార్పులు వస్తున్నాయి, ఎదుటివాడ్ని ఎంత తెలివిగా మోసం చెయ్యటమా అనే ప్రతివాడూ ఆలోచిస్తున్నాడు. కాలాను గుణంగా తలవంచక నమ్ముకున్న నీతికోసం ఎవడైనా నిజాయితీగా నిలబడ దల్చు కుంటే, వాడికి హరిశ్చంద్రుడికొచ్చినన్ని కష్టాలు వచ్చి పడుతున్నాయి. ఇది నేటు మనకు అన్ని రంగాల్లోనూ కనిస్తూనేవుంది.

అందువల్ల మనిషి తనలో అంతర్గతంగా ఉన్న కొద్దిపాటి మంచితనాన్ని హృదిలోపలి అరలపొరల్లో ఎక్కడో భద్రంగా దాచేసుకొని, అంతరాత్మ పీకనొక్కేసి అపలీలగా అపతలివాణ్ణి మోసంచేసి, అందరికిచ్చుకపిప్పి, అవసరమైన వాళ్ళనోట్లకపిప్పి, తనుమాత్రం పెద్దమనిషిలా నోరుతెరచి నవ్వేస్తున్నాడు. ఎందుకిలా చేస్తున్నాడు?

మనిషిని మనిషి ఇంత అమానుషంగా కాటేస్తున్నాడే ఎందుకోసం? స్వార్థం కోసం.

సూక్ష్మంగా చూస్తే, కొద్దో గొప్పో స్వార్థం లేని మనిషి ఎపరూ ఉండరు. ఉండలేడు గూడా. అందరూ సన్యాసులైతే పుట్టుకే ఉండదుగా. స్వార్థచింతన కొంచెం గూడా లేకపోతే పురోభివృద్ధి కుంటుపడటంకూడా తథ్యమే. ఏమాత్రమూ స్వార్థం లేనివాడు భగవంతుడయి ఉండాలి. లేదా వొట్టి పిచ్చివాడయినా అయి ఉండాలి. ఎందువల్లనంటే, ఏ కోరికలూ లేవని చెప్పుకునే సన్యాసికి గూడా స్వర్గానికి చేరుకోవాలనే కోరిక ఉంటుంది. అదీ స్వార్థమేగా.

స్వార్థం లేకపోతే మనిషికి పురోభివృద్ధి లేదు. మానవత్వం లేకపోతే అతను మనిషే కాదు. సరిగ్గా ఇక్కడే వస్తున్నది అసలు పేచీ.

స్వార్థం, మానవత్వం – ఈ రెండూ పరస్పరం విరుద్ధమైన స్వభావాల్ని కలవి. కానీ ఈ రెండూ మనిషికి రెండు ఊపిరితిత్తుల్లాంటివి. అతని జీవిత ప్రధానికి రెండు చక్రాల్లాంటివి. ఈ రెండూ సరిసమానంగా పనిచేస్తేనేగాని అతను పరిపూర్ణమైన మనిషిగా ఎదగలేడు, ఉదాత్తలక్ష్యాలవైపు పయనించలేడు. అయితే చైనంచిన జీవితం లోకి వచ్చేటప్పటికి ఈ సూత్రాల విలువ సన్నగిల్లుతున్నది.

కాలచక్రం వేగాన్ని పుంజుకుంటున్నది. ఆ చక్రంలో ఒక చిన్న పనిముట్టు లాంటి మనిషి ఆ వేగానికి, ఒరవడికి తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు.

పెరిగిపోతున్న జీవితావసరాలకు సంపాదన అనే పగ్గాలు వేసి అదుపులోకి లాక్కోలేక పోతున్నాడు. జీవిత రథానికి స్వార్థం, మానవత్వం అనే రెండు చక్రాలున్నాయని అనుకున్నాం గదా ఈ స్వార్థం అనే చక్రం మనసులోని కాఠిన్యంతోటి, కావేషంతోటి తయారు చేయబడింది. మానవత్వం అనే చక్రం మనసులోని ఆర్ద్రతతోటి, మార్ధవం తోటి తయారు చేయబడింది. అందువల్ల ఈ రెండో చక్రం ఎక్కువ వేగాన్ని అందుకో లేకపోతున్నది. తొందరగా ఆగిపోతున్నది. వెనుకబడితే లాభంలేదనుకుని తన రథానికి రెండో చక్రాన్ని గూడా స్వార్థంతో చేసినదాన్నే చేసుకుని ముందుకు పరుగెడుతున్నాడు మనిషి. కటువుగా తోచినా ఇది మాత్రం కాదనలేని సత్యం.

నేడు సమాజంలో మన చుట్టూ ఉన్న విషయాల్ని ఒకసారి పర్యాలోకనం చేస్తే మానవత అనే మణిని మనం ఎక్కడ పోగొట్టుకున్నామో, విలువైనదాన్ని పోగొట్టుకుని జీవితంలో ఆనందాన్ని రాబట్టుకోవాలని వెర్రిగా ఎండమావులవైపు ఎలా పరుగెడు తున్నామో అర్థమవుతుంది.

ఒక వ్యక్తికి డబ్బు అవసరమవుతుంది. ఇంకొక వ్యక్తి దగ్గరకెళ్ళి అప్పు అడుగుతాడు. అప్పు ఇచ్చినందుకు కొంత వడ్డీని తీసుకోవచ్చు. ఈ వడ్డీ వ్యాపారాన్ని అడ్డంగా పెట్టుకుని, దగ్గరకొచ్చినవాణ్ణి బలగలా పట్టుకొని, మానినెత్తురు పిండేసి అసలుకు మించిన వడ్డీలుగుంజి, వీలైతే వాడి తాలూకు ఆస్తినంతా మింగి పెద్దవాడై పోవటం ఎంత హేయం?

కొన్ని వస్తువులు టోకుగా కొన్ని చిల్లరగా అమ్ముకోవటం వ్యాపారం. తాము కొంత లాభాల్ని కలుపుకుని, ఆ వస్తువుల్ని విక్రయించటం వ్యాపారసరళి. కాని టోకున కొన్న వస్తువుల్ని గిడ్డంగిలో దాచేసుకుని, లేని కొరతని సృష్టించి, జనంలో అలజడి సృష్టించి, ధరలు పెంచి. తమలాభాలు పెంచుకునే వ్యాపారస్తులున్నారు. తిండి గింజలు లేక తల్లడిల్లిపోతున్న పేదవాడి గోడు సుష్టుగా భోంచేసి బయటకొచ్చి బొజ్జ నిమురుకునే వాడికేం తెలుస్తుంది?

మంచులో కత్తీలు, ఆహారపదార్థాలలో కత్తీలు రక్తదాహంతో సమానంగాదా?

స్వార్థ చింతనతో రాజకీయాల పేరున అరాచకీయాలు కల్పించే వాళ్లు కొందరు. ఆ సుడిగుండంలో పడి విలవిల్లాడే వాళ్ళు ఇంకొందరు.

మతంపేర అక్రమ హత్యలు, కుల విశిష్టత ఆధారంగా అన్యాయాలు, అక్రమాలు, భాషపేర ఉన్మాదం, హింసాకాండ – వీటన్నిటికీ ముఖ్యకారణం మనిషి పూర్వ చరిత్రాన్ని మర్చిపోవటమే.

ఈ ఉద్యోగం చేస్తే, ఇంతజీతమిస్తామని ముందే చెబుతారు. ఒప్పుకుని ఉద్యోగంలో జేరతాడు. జేరిన మార్నాటినుంచి పైన ఏమాత్రం దొరుకుతుంటుంది? అని అడుగుతుంటారు అతన్ని. అంటే నెలకు జీతంలాగా లంచాలుగూడ తప్పనిసరిగా వస్తుంటాయనే భావం ఉంది చాలామందికి. లంచగొండితనం, కాలక్రమేణా వృద్ధి బొందుతుండటమే దీనికి కారణం. లచపుచ్చుకున్న ఉద్యోగిని పట్టివ్వ వలసినప్రజలే, తమ పనులు ఏమైనా అతనిద్వారా కావలసివచ్చినప్పుడు, అదే అడ్డదోవన నడుస్తుంటారు. కొండొకచో, దురదృష్ట వశాత్తూ పై అధికారి అలాంటి అలవాటున్నవాడైతే, క్రిందవాడు ఎంతనిజాయితీగా ఉందామన్నా, అతనికి అన్నీ అగ్నిపరీక్షలే ఎదురవుతుంటాయి. తన మానవత్వాన్ని తాత్కాలికంగా అపతలివాడి స్వార్థానికి తాకట్టు పెట్టవల్సివస్తుంది.

కొన్నికొన్ని ఆచారాలు కృతిమించి దురాచారాలుగా మారుతుంటాయి. దురాచారాలు సంఘానికి పట్టిన జాడ్యాల్లాంటివి. అవి మనుష్యుల్ని ఆరోగ్యంగా ఎదగనివ్వవు. అలాంటివాటిల్లో నేటి కట్నాల సమస్యకూడా ఒకటి. తన పిల్లను పెళ్ళి చేసికున్నందుకు గాను తన సంతోషానికి చిహ్నంగా లాంఛన ప్రాయంగా పిల్ల తండ్రి అల్లుడికి ఒక రూపాయి కట్నం కానుకల క్రింద చదివించే ఆచారం ఉండేది మొదట్లో. రానురాను ఆ ఆచారం అతని జీవన విధానం మీదనే దెబ్బకొట్టేదిగా తయారయింది. ఈనాడు ఒక ఆడపిల్ల పెళ్ళి చెయ్యాలంటే ప్రతివాడూ తనస్తోమతకు మించిన డబ్బు ఖర్చు చెయ్యాల్సివస్తున్నది. ఉన్న ఆస్తి అమ్మకోపలసి వస్తున్నది. లేదా అప్పులపాలు కావలసిపస్తున్నది. 'మిమ్మల్ని అందర్నీ ఏడిపించి నేను పెళ్ళిచేసుకుని ఏం సుఖపడతాను నాన్నా? నాకు పెళ్ళిపద్దు' అన్న అమ్మాయిల్ని మనంచూస్తూ ఉన్నాం జాలితో. ఆడపిల్లలుగల తల్లిదండ్రుల్ని కట్నాల కొరడాలతో శిక్షించటం అమానుషం.

ప్రతిచోటా, ప్రతివారూ మనుష్యులంతా ఒకటేనని వేదిక లెక్కా ఉపన్యాసాలిస్తూనే ఉంటారు. అయితే ఈ మనుష్యులందర్నీ కలిపి వారి మధ్యనున్న కులమతాల అడ్డుగోడల్ని కూలదోసి స్వేచ్ఛగా చేతులు కలిపి తిరిగేందుకు దోహదం చేసే కార్య

కమాలు జరగవల్సినంతగా ఇంతవరకూ జరగకపోవటం విచారకరం. అభ్యుదయ భావాలుగల యువతరం ఇందుకు ముందంజ వేస్తున్నది. కానీ కొన్నిచోట్ల సనాతన సాంప్రదాయాల తాలూకు రాక్షసత్వంవిశృంఖలంగా విహారం చేస్తున్నదనటానికి తార్కాణమే అప్పుడప్పుడు మనకు పేపర్లో కనబడే వార్తలు. ఫనానా చోట ఫలానాపర్గానికి చెందిన మనుష్యుల సజీవ దహనంలాంటి ఘోరాలు జరుగుతున్నాయని విన్నప్పుడు ఆ దారుణ హత్యాకాండకు కారణభూతులైన మనుష్యులు ద్విపాద పశువుల స్థాయి నుంచి ఎంతమాత్రం ఎదగలేదని అనిపిస్తుంది.

మనిషిని మనిషి మోసంచెయ్యటంతో ఆగలేదు. దేవుడ్నిగూడా మోసం చెయ్యటానికి వెనకాడటంలేదు. దేవుడి పేరుమీద గుళ్ళూ, గోపురాలూ కడతామని చందాలు వసూలుచేసి స్వాహా చెయ్యటం, దేవుడి ఆస్తిని సొంతఆస్తికన్నా ఎక్కువగా అనుభవించటం లాంటివి అలా ఉంచండి. దేవుణ్ణి దర్శించి, పూజిద్దామని వస్తే, దేవుడి దగ్గరున్న పూజారి రూపాయిపుచ్చుకుని, సగంమంత్రాలు మింగేసి దేవుడిముందు నిలబడ్డ వాణ్ణి నెడబట్టిముందుకు నెడుతున్నాడు. ఎందుకీ ఆత్మవంచన? 'ఏమయ్యా ఎందుకిలా వాళ్ళని నమ్మకంగా మోసం చేస్తున్నావు?' అని దేవుడు ఆ పూజారిని అడిగితే ఏమంటాడో? బహుశా రెండు చెంపలూ వాయించుకుని 'స్వామీ, నీకు తెలియని దేముంది? ఎలాగో ఒకలా నేనూ బ్రతకాలిగదా?' అని అంటాడేమో. భగవంతుని సృష్టిలో ఉత్కృష్టమైన ప్రాణి మానవుడు. అన్ని మతాలు మానవసేవే మాధవసేవ అని చెబుతున్నాయి. ఆ పరమరహస్యాన్ని గంగపాలు చేసి, తోటి మానవుడికి, మానవాళికి ద్రోహంచేసి సంపాదించిన కొంత విత్తాన్ని భగవంతునికి కానుకగా మొక్కుబడిగా సమర్పిస్తున్నానని తన్నుతాను మోసం చేసుకుంటున్నాడు మానవుడు.

ఇలా చుట్టూ ఉన్న అనేక రకాల అన్యాయాల్ని, అక్రమాల్ని మనం చూస్తుంటాం. వీటిని అరికట్టాల్సిన బాధ్యత ఈ తరంవారి భుజస్కంధాల మీద ఉన్నది. చిన్న చేపను పెద్ద చేప మింగుతుంది. పెద్ద చేపను తిమింగలం మింగుతుంది. లేనివాణ్ణి ఉన్నవాడు తన స్వార్థానికి ఎరగా వాడుకుంటున్నాడు. ఆ 'ఉన్నవాణ్ణి' అంతకన్నా గొప్పవాడు తన స్వప్రయోజనాలకు తగినట్లుగా వినియోగించుకుంటున్నాడు. ఇలా బలవంతుడు బలహీనుణ్ణి మింగేస్తుంటే, మనిషికి ఆ జలచరానికి తేడా ఏమిటి? మానవుడికి మేధస్సు ఉంది. న్యాయాన్యాయాలను విచారించే విచక్షణా జ్ఞానం ఉంది. అందువల్ల బలవంతుడి దారినుంచి బలహీనుడికి అన్ని విధాలా తగిన రక్షణ కల్పించే సమాజం విలసిల్లాలి..

యుగం మారినప్పుడు యుగధర్మం మారుతుంటుంది. ఎన్ని ధర్మాలు మారినా అవన్నీ మానవత్వం అనే ముడి పదార్థంతో తయారు చేయబడినవే, కనుక నిత్యజీవిత విధానంలో మానవత్వాన్ని ప్రదర్శించటంకన్న గొప్ప ధర్మం మరొకటి లేదు.

మనిషిని మనిషిగా ఎవ్వుడు గుర్తిస్తామో, మానవత్వం పెంపొందించుకుని తోటి మానవుడికిగాని, మానవుడుగాని హాని లేక ద్రోహాన్ని తలపెట్టకుండా మన జీవితాన్ని గడుపుకుంటామో అప్పుడే — స్వర్గం అనేది ఉందో లేదోగాని — మనము స్వర్గసుఖములు ఈ భూలోకంలోనే అనుభవిస్తాం. అలా జీవితము గడపలేనపుడు మన శాంతి కరువై బోగభాగ్యము లున్నాగాని – నరకం అనేది ఉందో లేదోగాని – నరక యాతన ఈ లోకంలోనే అను నిత్యం అనుభవించక తప్పదు.

అందువల్లనే పునరావృత్తి అయినా మళ్ళి చెబుతున్నాను. మనిషిలోంచి మానవత్వాన్ని మినహాయిస్తే, మిగిలిపోయ్యేది ఒక ఆదిమ నివాసి. ఒక ద్విపాద పశువు.

"జయశ్రీ", "తెలుగు భూమి", "చేత జ్యోతి"

ప్రచురణ 15–8–72

"మూఢనమ్మకాలు
మూఢాచారాలు"

మనిషి బ్రతకటానికి ముఖ్యంగా కావల్సినవి గాలి, నీరు, నిద్ర, ఆహారం అని అందరికి తెలుసు. ఈ కోవకు చెందినవే మరో రెండు ఉన్నాయ్ – బ్రతకాలనే ఆశ, భవిష్యత్తుమీద నమ్మకం.

మనం సరిగ్గా గమనించంగాని ఈ 'నమ్మకం' అనేది ప్రతివారి జీవితంలోను చాలా ప్రముఖపాత్ర వహిస్తుంది. అదే అడుగడుగునా చెయ్యి పట్టుకుని మనల్ని ముందుకు నడిపిస్తూ ఉంటుంది. మన డబ్బు బ్యాంకులో ఉంటే ఎక్కడికీ పోదని బోలెడంత నమ్మకం. కన్నకొడుకును పైకితీసుకొస్తే కష్టాల్లో ఆదుకుంటాడని కొండంత నమ్మకం. భార్యా భర్తల మధ్య నమ్మకం ఉండాలి. యజమానికీ, సేవకునికీ మధ్య నమ్మకం ఉండాలి. వ్యాపారానికి నమ్మకం ఆయువు పట్టు. నిజమైన స్నేహితుల మధ్య నమ్మకం ఉంటాలి. ఇలా మనిషి మనుగడకు ఎంతో ముఖ్యమైనదీ నమ్మకం.

ఎక్కడ నమ్మకం బీటలువారుతుందో అక్కడ అనుమానం తొంగిచూస్తుంది. చుట్టూ సుఖమయ జీవితాడంబరాలు ఎన్ని ఉన్నా, తన చుట్టూ ఉన్నవారి మీద రవ్వంత నమ్మకమైనా లేకపోతే అతని జీవితం ముళ్ళపాన్పే.

అయితే ప్రతిదానికి గాలి కావాలిగదా అని గాలి దుమారంలో నిలబడలేం, బ్రతగటానికి నీరు కావాలిగదా అని వరదలో కొట్టుకుపోలేం. నిద్ర కావాలిగదా అని బ్రతుకంతా నిద్రలో గడపలేం. ఏదైనా క్రమబద్ధంగా ఉన్నప్పుడే దాని అందం, ఆనందం. ఈ నమ్మకం శృతిమించి రాగానపడితే మూఢ నమ్మకం అవుతుంది. నమ్మకానికి మూఢనమ్మకానికి ఉన్న వ్యత్యాసం తెలుసుకుంటేనే మానవ పురోభివృద్ధి సాధ్యమవుతుంది.

ఒక పక్క నమ్మకం చెయ్యిపట్టుకుని నడుస్తూనే మరోపక్క మూఢనమ్మకాల బారినుంచి తప్పించుకొని బయట పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ రెండింటినీ వేరుచేసి చూడటంలోనే మనిషి ప్రజ్ఞ, ఉపజ్ఞ ద్యోతకమవుతుంటుంది. అయితే ఏది మూఢవమ్మకం అన్నది ముఖ్య ప్రశ్న.

ఏది తర్కానికి, హేతుబాదానికి నిలబడదో ఏది మన ప్రగతికి పగ్గాలు వేసి ఉగ్గబడుతున్నదో, ఏది మనచేత అర్థంలేని ఆచారాలను పెంపొందింప జేస్తున్నదో అవల్లా మూఢ నమ్మకమే.

ఈ మూఢ నమ్మకాల గాఢ ప్రభావానికి లోనయిన వాళ్ళలో అజ్ఞానులు, నిరక్ష రాస్యులు, వివేక హీనులే కాదు విద్యాపంతులు, సంస్కార హృదయులు, పండిత పర్యులు గూడ మనకు కనబడతారు. గొప్ప శాస్త్రవేత్తలు అని చలామణీ అవుతున్న వారిలో గూడ ఇవి ఉండడం మన దేశపు వింతల్లో ఒకటి. వీటికి కారణాలు అసంఖ్యా కంగా దొరుకుతయి. పెద్దవాళ్ళు చెప్పారు గాబట్టి వినేవాళ్ళు కొందరు, సాంప్ర దాయంగా వచ్చేదాన్ని నమ్మకపోతే ఏమవుతుందోసని ముందే భయపడేవాళ్ళు ఇంకొందరు, పాలించలేపు కాబట్టే మొన్న వాడలా దెబ్బతిన్నాడని ఉదాహరణలతో సహా ఉపన్యసించేవాళ్లు మరికొందరు. ఈ కొందరు, ఇంకొంచరు, మరి కొందరు కల్సి ఎదురు తిరిగినవాళ్ళమీద దుమ్మెత్తి పోస్తారు,

ఇలా మూఢ నమ్మకాలు తరతరాలుగా వేళ్లు దించుకుని, శాఖోపశాఖలుగా విస్తరించి, ఊడలు దించుకుని, పెకలించటానికీ వీల్లేని వటవృక్షాల్లా ఎదిగిపోయినయి. ఈ వటవృక్షాల నీడలో నిద్రపోతున్న వాళ్ళు చాలామంది ఉన్నారు. ఈ చెట్టు మరి దేన్ని ఎదగనివ్వటంలేదు. కర్మ సిద్ధాంతాల కథలు చెప్పుకుంటూ నిద్రపోవటానికి, కార్యదీక్షను, ఆలోచనా శక్తిని చంపటానికి తప్ప మరి దేనికీ ఇది ఉపయోగపడటం లేదు. దీన్ని పూర్తిగా కొట్టేసి, సత్సాంప్రదాయాల కొత్త మొక్కల్ని అందంగా నాటుకుని, బ్రతుకుని బృందావనం చేసుకుందాం అంటే చెవిని పెట్టరు. ఇదీ స్థూలంగా నేటి మన సమాజంలోని స్థితి.

తొండముదిరి టీసరవెల్లి అయినట్లుగా, ఈ మూఢనమ్మకాలు క్రమంగా దురా చారాలుగా మారినవి. విజ్ఞానము పెంపొందుతూ ఉండే మూఢ నమ్మకాలు సడలి పోతూ ఉండాలి. కాని అలా జరగటంలేదు. మనిషి ఈ దురాచారాల ముళ్ళబాటన

నడుస్తున్నాడే తప్ప తన దారిని సుగమం చేసుకుందామని అతను ఆలోచించినట్లే కనబడదు. అతని ధ్యాస అంతా ధనార్జనమీదే. ఇప్పుడు భూమి తన చుట్టూ తాను తిరుగుతూ, డబ్బుచుట్టూ తిరుగుతున్నది. 'ఈజీ మనీ రావాలి, రోజూ పువ్వులా బ్రతకాలి' - ఇదీ ఈవేళ ప్రతివాడి జీవిత లక్ష్యం. దీనికి నిదర్శనం కావాలంటే, లక్షల కొద్దీ అమ్ముడు పోతున్న లాటరీ టిక్కెట్లను చూడండి. పందలకి పందలు జేబులో వేసుకుని గుర్రపు పందెములకు పరుగెడుతున్న ప్రజావాహిని వంక చూడండి. ఇలా ఎన్నో రకాలుగా డబ్బు తగలేస్తున్న వాళ్ళందరి ధ్యేయం ఒకటె. ప్రతివాడి ఆశా కష్టపడకుండా డబ్బు సంపాదిద్దామనే. నూటికి తొంభై తొమ్మిది మంది లాటరీల్లోను, జూదాల్లోను డబ్బు పోగొట్టుకుంటారని అందరకూ తెలుసు. ఆ ఒక్కడూ తనెందుకు కాగూడదు అనే మూఢ నమ్మకమే తప్ప తనూ మిగిలిన తొంభై తొమ్మిది మందిలో జేరటానికే ఎక్కువ అవకాశం ఉన్నదనే సత్యాన్ని విస్మరిస్తాడు. ఇది అర్థంలేని గుడ్డి నమ్మకం. వీళ్ళంతా పోటీలుపడి చందాలేసుకుని ఒకణ్ణో, ఇద్దర్నో లక్షాధికార్ని చేస్తున్నారు. ఎప్పటికప్పుడు అ లక్షాధికారి పీఠం కోసం ఉన్నదందా తగలేసుకుని లక్షలాదిమంది భిక్షాధికారులుగా మిగులుతున్నారు. ఉన్నది ఊడ్చిపెట్టడమే కాక అప్పులుగూడా చేసి జూదాలు ఆడుతున్నారంటే వాళ్ళని గూర్చి బాధపడాలో, జాలిపడాలో గూడా తెలియడంలేదు.

మనం ఏదైనా పనిమీద బయల్దేరి వెళ్ళేటప్పుడు ఎవరైనా తుమ్మితే, వెళ్ళినపని కాదు అని ముందుగానే మనవాళ్ళు నిర్ధారణ చేసి చెబుతారు. అలాగే శకునం గూడా. పిల్లిగాని, పిచ్చివాడుగాని, విధవరాలుగాని. ఒంటి బ్రాహ్మణ వ్యక్తిగాని ఎదురు పడటం అపశకునంగా భావిస్తారు. ఎన్నిసార్లు అలా ఎదురు వచ్చినప్పుడు నష్టం కష్టం వచ్చింది అన్న ప్రశ్న వేసుకోరు. కష్టాలు, నష్టాలు వస్తూనే ఉంటాయి. ఇదీ ప్రకృతిసిద్ధం. ఆది జరిగినప్పుడే శకునానికి ముడిపెడుతూ ఉంటారు. ఎన్నోసార్లు అలా జరుగకపోయినా శకునం మాట జ్ఞప్తికి రాదు. ఈ నమ్మకాలు ఎప్పుడు ఎలా ప్రారంభమైనవో తెలియదుగాని నేటి సగటు మనిషిమీద వాటి ప్రభావం చాలా ఎక్కువగా ఉన్నది. జీవితంలో ప్రతిదీ అనుకున్నట్లు జరుగదు. జరిగినా అనుకున్నవెంటనే అన్నీ జరగవు. కొన్ని పనులు ఆలస్యంగా జరుగుతుంటయి. మరికొన్ని పనులు అసలు జరగవు. ఈ పని జరగనప్పుడో, ఆలస్యంగా జరిగినప్పుడో ఈ నిరాశను మరోదానికి ముడి వెయ్యటం మనకు బాగా అలవాటు. ఆ శకునం మంచిది కాదుగాబట్టి ఆ పని జరగలేదు అని ముద్ర వేస్తారు. మరి మంచి శకునం చూసుకుని

వెళ్ళినప్పుడు గూడా చాలా పనులు జరగవు. ఆ మనిషి వొరకడు. దొరికినా ప్రయోజనం ఉండదు. ఇక్కడా శకునం ప్రభావం ఏమైనట్లు? మంచి శకునం, మంచి ముహూర్తం పని పూర్తిచేయించాలిగదా? ఎందుకు విఫలమవుతున్నది? ఏ దోవా దొరక్కపోతే చివరకు దాన్ని తీసుకపోయి కర్మ సిద్ధాంతానికి ముడిపెట్టేస్తారు. వాడి కా ప్రాప్తం లేదనో, యోగం లేదనో తేల్చేస్తారు. ఇంకలో ఇంకో గమ్మత్తు గూడా ఉంది. ఈ దుశ్శకునాలకు కొన్ని పరిహారాలు లున్నాయి. వెనకనుంచి తుమ్మితే ఫరవాలేదుట. జలుబు చేసినవాడు తుమ్మితే పట్టింపు లేదుట. ఇంట్లో తిరిగే పెంపుడు పిల్లి ఎదురయితే అపశకునం కాదుట. వీటినిబట్టి తెలుస్తుంది, ఇవన్నీ నాటి మూఢ నమ్మకాలేగాని వాటి వెనుక ఎలాంటి శాస్త్రీయ పరిజ్ఞానమూ లేదని. అయితే కొన్ని ఉదాహరణలు చూపిస్తారు. ఇవి కేవలం యాదృచ్ఛికాలు.

జన్మ నక్షత్రాలు చూసి, జాతకాలు చూసి, గ్రహాలను సంప్రదించి, విగ్రహాలను పూజించి సుముహూర్తంలో పెళ్ళి జరిపిస్తారు. అయినా వచ్చే కీడు తొలగిపోవటం లేదు. పెళ్ళయిన కొద్దిరోజులకే పెళ్ళికొడుకు ప్రమాదంలో మరణించిన సందర్భాలూ ఉన్నాయి. పెళ్ళి అవుతుండగానే ప్రమాదాలు జరిగిన సందర్భాలూ లేక పోలేదు. ఈ ముహూర్తాల ప్రభావం ఏమైనట్లు? అమావాస్య హిందువులకు చాలా చెడ్డరోజు. ముస్లిములు ఆ రోజు వివాహాలు చేసుకుంటారు. అది చాలా పవిత్ర దినం వారికి. ఒకే రోజు మహమ్మదీయులకు మంచీ, హిందువులకు చెడువు చేస్తుందా? కనుక ఈ మంచి రోజు, చెడ్డ రోజు అన్నది కొందరు తమ సంతృప్తికోసం నిర్ణయించుకున్నదే గాని మరేం లేదు. రోజుకు మంచి. చెడ్డ ఆపాదించటం ఒక మూఢ నమ్మకమే.

ఫలానా పీడకల వస్తే, ఫలానా కీడు జరుగుతుందని చెబుతుంటారు. చెప్పినట్లుగానే ఒక్కోసారి ఏదో కీడు జరుగుతుంటుంది. ప్రతిసారి జరగదు. వందసార్లు జరగకపోయినా దాన్ని పట్టించుకోం. ఒక్కసారి జరిగితే మాత్రం అది రూఢి అయిపోయినట్టే భావిస్తాం. ప్రతి మనిషి రోజుకు దాదాపు ఏడెనిమిది గంటలు నిద్రలో గడుపుతారు. అంటే రోజులో మూడోవంతు నిద్రలో గడిపేస్తున్నాం. ఆ లెక్కన ముప్పయి ఏళ్ళ మనిషిని తీసుంటే కనీసం పదేళ్ళపాటు నిద్రతో గడిపాడన్నమాట! ఇంత సుదీర్ఘమైన కాలంలో కొన్ని వందలసార్లో, పీడకలలు వచ్చి ఉంటాయి. అవన్నీ వాస్తవంలోకి సరఫరా చెయ్యబడుతున్నవా? ప్రతి పీడకలా నిజమవుతున్నదా? లేదు.

నిద్రలో కలలు మంచివీ చెడువీ కలగాపులగంగా వస్తుంటాయి. పొద్దుస లేచాక ఎన్నో పనులు మంచివీ, చెడువీ కలగాపులగంగా జరుగుతుంటయి. మనం పనిగట్టుకుని వాటికీ, ముడివెయ్యాలని ముప్పు తిప్పలు పడుతుంటాం. అలా పోల్చుకుని తృప్తిపడటంలో మనస్సుకు అదోరకమైన ఓదార్పు. ఆంతకన్నా మరేంలేదు.

అలా అంతరాత్మను చిచ్చికొట్టి నిద్రపుచ్చటానికి చేసే ప్రయత్నాలే ఈ మూఢ నమ్మకాలన్నీ. మనిషి చనిపోయిన తర్వాత ఈ ప్రాణి ఏమవుతున్నదనేది ఎవరికి అంతుపట్టని విషయం. అయినా దానిమీద అంతులేనన్ని కథలున్నాయి. పైన స్వర్గం ఉందనీ, క్రింద నరకం ఉందనీ పాప పుణ్యాలనుబట్టి వాళ్ళ కక్కడ సీట్లు దొరుకుతుంటాయనీ చెబుతుంటారు. పోయిన మనిషిజాడా ఏమీ మనకు కన్పడదు. కానీ ఆ చని పోయిన వాళ్ళ ఆకలి తీర్చటం కోసం మాసికాలనీ, తద్దినాలని ఏర్పాటు చేశారు. శాస్త్రకారులురోదసి నంతాశోధించారుగాని ఈ స్వర్గం అనేది ఎక్కడా కనబడలేదు. నరకం అనేది అసలే అంతు దొరకలేదు. కాని శ్రాద్ధాలు తప్పటంలేదు.

ఇహ భగవంతుడు ప్రపంచంలో దేవుణ్ణి గురించి జరిగినంత చర్చ బహుశా మరే విషయంమీదా జరిగిఉండదు. అయినా ఆయన ఆచూకీ తెల్సినవాళ్ళెవరూ లేరు. అసలు దేవుడున్నాడా లేదా అన్న సందేహం ఇవాళ కొత్తగా కలిగిందేమీ కాదు. కలడు కలండ నెడి వాడు కలడో లేడో అన్న సందేహం అనాదిగా అందర్ని వేధిస్తూనే ఉన్నది. దేవుడున్నాడన్నారు కొంతమంది. లేడన్నారు కొంతమంది. దేవుడు మనిషి ఊహలోనే ఉన్నాడు, మనిషి లేకపోతే దేవుడు లేడు అంటారు ఇంకొంచరు. 'భగవంతుడనేవాడు నిజంగా లేకపోతే ఆయన్ని సృష్టించాల్సిన అవసరం ఉందంటాడు' వోల్టైర్ అనే మహాశయుడు.

దేవుడనేవాడు ఒక్కడే అంటాడు ఒకాయన. తమ దేవుడు ఒక్కడే సరియైన దేవుడంటాడు ఇంకొకాయన. రాముడు, కృష్ణుడు, ఏసుప్రభువు (దేవుని కుమారుడు), అల్లా వీళ్ళంతా దేవుళ్ళే. అగ్ని, వాయువు, వర్షం ఇవన్నీ మనిషికి ఎంతో అవసరమైనవి గనుక ఇవి గూడా దేవుళ్ళ జాబితాలోకే చేరిపోయినయి. పాము కాటువల్ల మనిషి ప్రాణాలు పోగొట్టుకోవటం జరుగుతుండేది. అందువల్ల నాగుబామును గూడా పూజించటం మొదలుపెట్టారు. ఇంకా కొన్ని పందలమంది చిల్లరదేవుళ్ళు ఉన్నారు. తమ దేవుడొక్కడే ప్రపంచాన్ని సృష్టిస్తాడు, రక్షిస్తాడు అని నమ్మేవారు భక్తులు. ఇన్ని కరువు కాటకాలు, కష్టాల మున్లు, నష్టాల పరంపరలు ఎందుకొస్తున్నట్లు? బంగ్లాదేశ్, వియత్నాం మారణహోమం లాంటివి ఎందుకు జరుగుతున్నట్లు?

పాపం పెరిగిపోయింది కాబట్టి వర్షాలు పడటంలేదంటారు. అందరూ పాపాలు చేయటంలేదుగదా. కొందరుపాపాలు చేస్తుంటేమరికొందరు దానికిబలిఎలా అవుతున్నారు? భగవంతుడు ఆ పాపకర్మలను మాత్రంశిక్షించి మిగిలిన వారిపై తన కరుణారసధారల్ని కురిపింపవచ్చునే; పోని ఒకరి దేవుడికి కోపమొస్తే మరొకరి దేవుడయినా తన కటాక్ష వీక్షణాల్ని ప్రసరింపవచ్చునే?

వర్షాలు కురవటంకోసం క్రతువులు చెయ్యాలంటారు. అందరూ కల్సి చేస్తున్నారా? లేదు. ఒక వర్గంవాళ్ళే చేస్తున్నారు. మిగిలిన వర్గాలవాళ్లు ఆ దేవుణ్ణి నమ్మరు. ఆ క్రతువులు చెయ్యరు. చేసినా, చెయ్యకపోయినా వర్షాలు వచ్చినప్పుడు పులమతపర్గ విభేదాలు లేకుండా పడ్తున్నాయి. దానప్పుడు ఎవరి మహిమా పనిచెయ్యటం లేదు. క్రతువుల కోసంఖర్చయ్యే డబ్బులు, నెయ్యిడబ్బాలు ఆహార పదార్థాలుమాత్రం అందరికీ ఉపయోగపడేవే గదా అనిపిస్తుంది. నలభై రోజులు వర్షాకాలంలో క్రతువు ప్రారంభిస్తే ఏదో ఒకరోజు వర్షం పడకుండా ఉంటుందా? అదిగో ప్రభావం అంటారు. ఈ మధ్య ఒక పెద్ద గుడిదగ్గర చాలా పెద్ద క్రతువు జరిగింది. వర్షము ఆ జిల్లా అంతటిలో పడలేదు. శ్రద్ధగా క్రతువు జరగలేదంటారేమో. ఏ క్రతువు జరగని ఉత్తర హిందూస్థానములో వర్షము ఎలా పడింది? క్రతువు జరిపించుకొని, మొక్కులు తీర్చుకొని, పూజలు జరిపించుకొన్న తర్వాత గాని ప్రజల కష్టాలు తీర్చ బూనుకోడా భగవంతుడు?

తన దేశం దుర్భిక్షం కాకుండా ఉంటాలని, తన రక్తంతో శివుడికి అభిషేకం చేసే యువకులు. ధనధాన్యాదులకోసం కన్నబిడ్డల్ని కాళీమాతలకు బలి ఇచ్చే అక్షౌహిణులు మనలో ఉన్నారని విన్నప్పుడు 'అయ్యో పాపం' అనిపిస్తుంది. కాళికాదేవిని తాను పూజిస్తానని. ఆమె భక్తుడనని, ఆమె వాహనమైన సింహం తనని ఏమీ చెయ్యదనీ ఒక యువకుడు 'జూ' లోని సింహంతో పోరాడి ప్రాణాలు పోగొట్టుకున్నాడు ఈ మధ్యే. ఎంత మూఢ నమ్మకం గలవాళ్లు ఉన్నారో చూడండి.

మనకున్న వందలాది దేవుళ్ళకు వేలాది ప్రతినిధులు ఉన్నారు. వీళ్ళకీ ఆ దేవుడి అడ్రసు తెలియదు. కానీ వాళ్ళకి తెలియదని లేదని కొందరు ప్రచారం చేస్తుంటారు. ఆ ప్రతినిధులకున్న అసంభ్యాకమైన శిష్యకోటి. ఈ దేవుడి ప్రతినిధులు వారి మహిమ చూపటంకోసం కొన్ని 'ఫీట్స్' చేసి ప్రజల్ని ఆశ్చర్య సముద్రంలో ముంచేస్తుంటారు. విదేశపు గడియారాలను, విభూదిని ఊహామాత్రములో

స్పష్టించి చేతి కందించగలరు. తీర్థం ఇచ్చి దీర్ఘరోగాల్ని నయం చెయ్యగలమనేవారు కొందరు. ఆ స్వామీజీలు, గురూజీలు, ఆకలితో అలమటిస్తున్న అశేష ప్రజానీకానికి తమ మహిమచేత అన్నపానాదుల కొసగి తృప్తి పరచవచ్చునే! ఆస్పత్రు అవసరం లేకుండా రోగాల్ని నయం చెయ్యొచ్చునే! ఆదేమని అడిగితే వాళ్ళదగ్గర 'రెడిమేడ్' సమాధానం ఉంది. ఎపరి ఖర్మను వాళ్లు అనుభవించాలని అంటుంటారు. అటాఅయితే ఆ స్వామీజీల, గురూజీల మహిమ ఏమిటి. వారి భ్రమలో పడిపొయ్యేవారు కేవలం యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం లేనివారు కాదు. మిక్కిలి విద్యావంతులైనవాళ్ళు, పదిమందికి ఆదర్శప్రాయంగా నిడబడవల్సిన వాళ్ళు, శాస్త్రవేత్తలు గూడా ఉన్నారు. అటువంటివారే దాసోహం అంటూంటే సామాన్యులు మూఢనమ్మకంతో ఆ స్వాముల్ని కొలవటంలో ఆశ్చర్యమేముంది?

కొచ్చిన్‌లోని శ్రీ కోవూర్ అనే పేరుబడిన డాక్టరు మహిమలు, మహత్తులు గలవా రెవరైనా సరే దైనిక శక్తులున్నాయని ఋజువు చేసినట్లయితే లక్ష రూపాయలు బహుమతి నిస్తానని ఈ మధ్యే సవాల్ చేశారు. ఆయన తన యాభై సంవత్సరాల జీవితాన్ని ఈ పరిశోధనలోనే గడిపి, చివరకీ మహిమలన్నీ వట్టి బూటకాలని నిర్ధారణకు వచ్చి, వాటిని ఋజువు చేసినవారికి లక్ష రూపాయలు ఇస్తానని, తాను జీవించి ఉన్నంత వరకు ఎప్పుడైనా సరే ఈ సవాల్‌ను ఎదుర్కొనవచ్చునని పేర్కొన్నాడు. తన తర్వాత తన కుమారుడు గూడా ఈ పంచెం ఉంచుతాడని ఆశిస్తున్నాననీ ప్రకటించాడు. ఎంతో మంది మహానుభావులు తాము సాక్షాత్తు భగవంతుని ప్రత్యక్ష రూపాలని చెప్పుకుంటున్నారుగదా వీరు మరి ఆ ఆపకాశాన్ని వినియోగించుకుని జనబాహుళ్యానికి సందేహాల నివృత్తి కలిగించుతారా?

దేవుడి పేరుమీద అప్పుడప్పుడు కొన్ని సంచలనం కలిగించే వార్తలు పుడుతుంటాయి. మద్రాసులో ఒకచోట దేవుని విగ్రహం భూమిలోంచి పైకి ఆవిర్భవిస్తుంటే నేను చూశానంటే, నేను చూశానని చెప్పుకొచ్చారు. ఆ దేవుని మహిమ ఇంతా అంతా కాదని, కోరిన కోరికలు వెంటనే తీర్చే ప్రత్యక్ష దైవంగా పూజించారు. కథలు అల్లారు కావల్సినంత ప్రచారం చేశారు. తర్వాత పోలీసులు ఆరా తీసి కనుక్కుంటే ఆ దేవుని విగ్రహం భూమిలోనుంచి పుట్టింది కాదని, కావాలని తీసుకొచ్చి ప్రతిష్టించిందేనని తేలింది. తమ స్వార్థ ప్రయోజనాలకై కొందరు దేవుడిపేరుమీద గూడా ప్రజల్ని ఎంత సమ్మకంగా మోసం చెయ్యటానికి సిద్ధపడుతున్నారో చూడండి.

అన్ని మతాలు ఒక్క విషయాన్ని ఏకగ్రీవంగా ఒప్పుకుంటున్నాయి, మానవ సేవే మాధవ సేవ అని మనిషిని ధర్మానికి, న్యాయానికి కట్టుబడి నడవమని బోధిస్తున్నాయి. పక్కవాళ్ళకి పిడికెడు జాలిని పంచిపెట్టమని, తోటివాడి కోసం కనీసం ఓ వీసం ఎత్తయినా త్యాగం చెయ్యమనీ ప్రబోధిస్తున్నాయి. భయానికి లొంగినంతగా మనిషి బోధపడి లొంగడు. మనిషిలో పడగవిప్పే స్వార్థాన్ని అణగకొట్టడంకోసం, భయపెట్టి అయినా అన్యాయార్జితాన్ని కొంత ఖర్చు చేయించటంకోసం పూజలనీ పునస్కారాలనీ కల్పించారు. వీళ్ళకోసం స్వర్గంలో రంభలూ, నరకంలో కాగుతున్న నూనె బాండీలు తయారుగా ఉన్నాయన్నారు. పాప పుణ్యాల లెక్కల్నీ, చిత్రగుప్తుడి చిట్టాలనీ అడుగడుగునా గుర్తుచేసేది మనిషిని ఆత్మ విమర్శ చేయించుటనే దానికేమో అనిపిస్తుంది.

మనిషికి ఎన్నో ఆలోచనలు, ఎన్నో ఆందోళనలు. ఆనుక్షణం అంతులేని మనస్తాపంతో మనిషి కృంగిపోతుంటాడు. ఈ బాధలను మర్చిపోయి కాసేపయినా ప్రశాంతంగా గడపటంకోసం భారాన్నంతా భగవంతుని మీద నిలిపి ప్రార్థన చేయమన్నారు. ఈ ప్రార్థనవల్ల మనస్సుకు కాస్తంత ఊరట కలుగుతుంది. మనిషికి కాస్తంత ధైర్యం కలుగుతుంది. నిశ్చలమైన మనస్సుతో తిరిగి తన కార్యకలాపాలను కొనసాగించుకొనే అవకాశం ఉంటుందనే ఉద్దేశ్యంతో అన్ని మతాలు భగవంతుని ప్రార్థన చెయ్యమని చెబుతున్నాయి. కానీ ఏ మనశ్శాంతిని పొందటానికైతే ప్రార్థనాలయాలు, దేవాలయాలు ఏర్పడ్డాయో అక్కడ ఆ మనశ్శాంతి కరువవుతున్నది. జన సందోహంవల్ల దోపిడి, తొక్కిసలాటలు జరుగుతున్నాయి. ఉత్సవాల పేరుపెట్టి లౌడుస్పీకర్లు పెట్టి అర్ధరాత్రిదాకూ పరిసర ప్రాంతాలవారికి నిద్రాభంగమయ్యే అర్థంలేని గంద్రగోళం చేస్తుంటారు. ఇందువల్ల ఆ ప్రార్థనలు ఏర్పరచిన అసలు ఉద్దేశ్యమే భంగమైపోతుంది. ప్రశాంతమైన వాతావరణము, నిర్మలమైన మనస్సు, ఆర్భాటములేని భక్తి భగవత్ప్రార్థనకు ఎంతయినా అవసరం.

దయ్యాల్నిగురించిగూడా చెప్పకుంటారు. ఇవి మనుష్యులతో మాట్లాడతాయనీ, పాడుతాయనీ, ఆడుతాయనీ ఎన్నోరకాలుగా వర్ణిస్తారు. ఈ దయ్యాల నివాసం ఊరి చివరనో, పాడుబడ్డ కొంపల్లోనో అయి ఉంటుందిట. ఎప్పుడో, ఎక్కడో గుర్తులేకుండా ఒకటో దయ్యాలున్నాయని కొంతమంది లేవని కొంతమంది వాదించుకున్నారు. దయ్యాలు లేవనేవాడు ఎవడైనాసరే ఆమావాస్య అర్ధరాత్రి దయ్యాల కొంప

అని పేరుబడ్డ ఆ భవనం చుట్టూ తిరిగి రావాలని సవాల్ చేశారు. ఒక ప్రవాసు ముందు కొచ్చాడు. అమాస్యణాటి అర్ధరాత్రి వాళ్లంతా ఒకచోట పోగయినారు. అతనా బిల్డింగ్ చుట్టూ తిరిగి వచ్చినందుకు గుర్తుగా గోడమీద గజానికొక చోట 'X' మార్కు గీతలు గీయమన్నారు. సరేనని వెళ్లాడు. వెళ్లినవాడు తెల్లారేదాకా రాలేదు. పొద్దున మిగిలిన వాళ్లంతా వెళ్ళి చూస్తే అతను చచ్చివడి ఉన్నాడు. పరీక్షగా చూసిన తర్వాత తేలిన దేమంటే అతని చొక్కాకి గోడరున్న మేకు ఒకటి పట్టి వెనక్కి లాగింది. భయంతో బిక్కచచ్చిపోయి ఉన్న అతనికి గుండె ఆగింది మనిషి ఎక్కువగా భయపడేది భయానికే గదా !

ఇలాంటి మూఢ నమ్మకాలు గాఢంగా పాతుకుపోయినందువల్లనే కొన్ని కొన్ని అలవాట్లు దురాచారాలుగా మారి దుర్భరంగా తయారవున్నాయి.

పెళ్లికెదిగిన పిల్లలున్నా గూడా భార్య చనిపోతే భర్త తిరిగి వివాహం చేసుకోవచ్చు. 'ఈ పిల్లలంతా ఎవరి దోవన వాళ్ళు వెళ్ళిపోతే పెద్దతనంలో నన్ను చూసేవాళ్లు ఎవరున్నారు ?' అనీ పమర్థించుకుంటారు పునర్వివాహాల్ని. నిజానికి మగవాడికన్న ఆడదానికున్న సాంఘిక సమస్యలే ఎక్కువ. మరో మగ మనీషి సహకారాలు లేకుండా స్త్రీ తన శేష జీవితానీకి సంబంధించిన సమస్యల్ని పరిష్కరించుకోలేదు. అందువల్ల పునర్వివాహం పురుషుడికన్నా స్త్రీకే ఎంతో అవసరం. నిజాని కిప్పుడు జరుగుతున్న దేమిటి ? భర్త చనిపోయిన తర్వాత జీవితానందానికి దూరం కావటమే గాక విధవరాలు అయి, అనాకారి అయి, తోటి వాళ్లకు తన ముఖాన్ని గూడా చూపించలేనదయి కుళ్లి పోతున్నది. ఎంత క్రూరమైనదీ ఆచారం ?

మగవాడు తీరుగుబోతు అయినా సరే, తాగుబోతు అయినా సరే, రోగిష్టివాడయినా సరే, తన్ని పదిలేస్తున్నా సరే కట్టుకున్న నేరానికి ఆ భాధలన్నీ భరించాల్సిందే స్త్రీ. ఇది పతివ్రతా ధర్మంగా భావిస్తారు. మగవాళ్ళు ఇష్టము వచ్చినట్లు తిరుగవచ్చు. ఆయన భార్య మాత్రం పాతివ్రత్యాన్ని పాటించాలి. ఇది ఏమి కట్టుబాటు ? అన్యోన్య అనురాగము, సరిసమాన బాధ్యతలు లేని దాంపత్యం ఎపరిని సుఖపెట్టుంది ?

మగవాడు పుచ్చుకున్న స్వేచ్ఛను స్త్రీకి గూడా కాస్తంత పంచిపెట్టడం ఆవసరం. మంగళ సూత్రాలు, మల్లెపూలు పసుపు కుంకుమలు కేవలం స్త్రీ సౌందర్యాన్ని, ఇనుమడింప జేయటానికీ ఆమెకు అందించినవే గాని మరేంలేదు. అవి ధరించని అనేక

మంది మిగిలిన మతాల స్త్రీలకు విదేశీ పనితలకు పతిగౌరవం లేదని అనగలమా ? కాక పోతే అవి మన అలవాట్లు. ప్రతివాళ్ళూ వాళ్ళ అలవాట్లకు ఏదో ఒక విశేషాన్ని జోడించి చెబుతుంటారు. సిగరెట్టు తాగకపోతే పిచ్చెక్కి పోతుందంటారు ఒకడు. తాగని వాళ్ళందరికి పిచ్చెక్కుతున్నదా ? ఆ అలవాటు అతణ్ణి అంతగా లొంగదీసు కున్నదని అర్థం. ఏమైనా నేటి మన సమాజంలో స్త్రీకి కొంత అన్యాయమే జరుగు తున్నది. భర్త ఉన్నన్ని రోజులూ అతని యిష్టా యిష్టాలకు అనవుగా లొంగ దీయటం. భర్త చనిపోగానే ఆమే జీవితాన్ని బండలపాలు చెయ్యటం అమానుషం. మూఢ నమ్మకాల ఇనుప గుప్పిటినుంచి బయటపడి ఆలోచించలేక పోవటమే దీనికి కారణం. నీతిగాని, శీలంగాని, సుఖంగాని మగవాడికి, స్త్రీకి సమానంగా వర్తింప చెయ్యాలి. జనాభా పెరుగుదలను అరికట్టకపోతే మానవ జాతికి అరిష్టాలు తప్పవని అభ్యుదయము సాధించిన అన్ని దేశాల శాస్త్రజ్ఞులు అంటూవుంటే మన దేశంలో మత గురువు లనబడేవారు కుటుంబ నియంత్రణ పద్ధతి తప్పు అని ప్రచారము చేస్తూ ఉంటే, ఇటువంటి మత మౌఢ్యాలు ఎప్పుడు అంతరిస్తాయా అని సందేహము కల్గుతోంది. విజ్ఞాన దీపికతో ప్రకృతిలోని రహస్యాలను కనుగొని, కృత్రిమ పర్వాన్ని గూడా కురిపిస్తూ, ఆరోగ్యము, సిరిసంపదలు అభివృద్ధి జేసికొని ఇతర దేశపు మానవులు పురోగమిస్తూంటే ప్రాచీన యుగములోని మూఢ సిద్ధాంతాలను పల్లె వేస్తూ ఉండటం ఎంత తెలివిమాలిన పని !

తర్కానికి, హేతువాదానికి లొంగనిది ఏదైనా మూఢ నమ్మకమే, మూఢ నమ్మ కాలు దురాచారాలకు దారి తీస్తాయి మనిషి ప్రజాస్వామ్యంలో ఈ దురాచారాల మూళ్ళ జెముడు పొదల్ని పెకిలించివేసి, ప్రమాణానికి నిలబడే సత్సాంప్రదాయాల తీగల్ని పెంచుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకొని మానవుడు పురోగమించాలని ఆశిద్దాం.

తుని 5-10-72

సాంఘిక విప్లవము -

ప్రజలు ప్రభుత్వము

మానవుడు సాంఘిక జీవి. సంఘం; వ్యక్తి పరస్పరాశ్రితాలు, సంఘం నిర్మాణానికి కారణభూతుడైన వ్యక్తి వివిధ రకాలైన సాంఘికాచార వ్యవహారాలతో ప్రభావితుడౌతుంటాడు. అయితే ప్రాచీన కాలంనుండి సాంఘికాచారా లనేవి మతాచారాల రూపంలో వ్యక్తిగత జీవితాన్ని శాసిస్తూ వచ్చాయి. అందువల్లనే ఆయా కాలాల్లో విభిన్న మతాలు వేర్వేరు రూపంలో వ్యక్తిగత జీవితాన్ని తీర్చిదిద్దడానికి ప్రయత్నించాయి. అయితే రాను రాను ఈ మతాల ప్రభావం కూడ పన్నుగిల్లింగి.

మరొకటి వ్యక్తిగతాభిరుచి, ఇది స్వతంత్ర ప్రవృత్తి. వివిధ విషయాల్ని సాకల్యంగ పరిశీలించి స్వతంత్రాభిప్రాయాల్ని రూపొందించుకొంటుంది.

ఈ విధంగా మానవ వ్యక్తిత్వం రూపొందుంతుంది. కనుక ఒక వ్యక్తి ఆలోచనా విధానంలోనూ, ఆచరణలోనూ ప్రభుత్వం, ఆర్థికస్థితి, సాంఘిక వాతావరణం, వ్యక్తిగతాభిరుచుల ప్రభావం స్పష్టంగా ద్యోతకమౌతుంది.

అయితే ఒక రాజకీయ విధానాన్ని బలపరచే ఆర్థిక శాస్త్రజ్ఞులు సమాజంలోని అన్ని చెడులకు ఆర్థిక అసమానత్వమే కారణం కనుక తన్ని వారణతో వాటంతటవి తొలగిపోతయి అని చెబుతుంటారు. కాని ఈ దృక్పథంలోని విషయ ప్రాముఖ్యతను గ్రహించినా ఇదే సర్వ రోగాలకు రామబాణం వంటిదని నేను తలచడంలేదు. సాంఘిక ఆర్థిక రంగాలలో మార్పులు సమగతిలో రావాలి. ఒక వ్యక్తికి ఆర్థిక సౌష్టవం చేకూర్చినంత మాత్రాన తోటి సంఘీయునకు అతనియెడ అమాంతంగా సుహృద్భావం, గౌరవభావం ఏర్పడడం అంత సులభసాధ్యం కాదు.

భారత దేశంలో తరతరాలుగా సాంఘిక అసమానతలు పాదుకొని యున్నాయి. అవన్నీ ఆర్థికస్థితినిబట్టి ఏర్పడినవి కావు. అయితే వృత్తులనుబట్టి ఏర్పడిన వర్ణ వ్యవస్థలోని అసమానతలు రాను రాను సాంఘికైక్యతకు అడ్డుగోడలుగా పరిణమించి అభివృద్ధి నిరోధకంగా తయారయ్యాయి. ఈ రకంగా చీలి అనైక్యతతో, పరస్పర వైషమ్యాలలో సతమత మౌతున్న సమాజాన్ని సంస్కరించడానికి ఆయా కాలాల్లో చేయబడ్డ యత్నాలే సాంఘిక విప్లవాలు.

అతి ప్రాచీన కాలంలో క్రీస్తుకి పూర్వమే భారత దేశంలో ఈ వర్ణవ్యవస్థ మీద తిరుగుబాటు చేసి అందరినీ సమదృష్టితో చూచిన మహామనీషి గౌతమ బుద్ధుడు గొప్ప విప్లవ వీరుడు. మానవ జీవితంలోని హింసను పోగొట్టి సత్యము - అహింసలకు ప్రాముఖ్యాన్ని ఇవ్వడం ద్వారా సంఘములో నూతన మానవత్వపు విలువల్ని ఏర్పరచడానికి ప్రయత్నించారు. ఆయన ఆచరణ, ప్రచార ప్రభావం ప్రపంచమంతా ప్రసరించింది. ఆయన తర్వాత భారత దేశంలో ఆయా కాలాల్లో తలెత్తి సంఘ క్షేమానికి వ్యతిరేకంగా పరిణమించిన దురాచారాల్ని రూపుమాపడానికి శ్రీ రాజరామ మోహనరాయ్, దయానంద సరస్వతి నుండి శ్రీ వీరేశలింగంగారి వరకు ఎందరో విప్లవకారులు తమ శక్తియుక్తుల్ని తృణప్రాయంగా ఒడ్డి సాంఘికాభ్యుదయానికి అనన్యమైన కృషి చేశారు. మహాత్మగాంధీ రాజకీయ రంగంలోనే కాకుండా సాంఘిక రంగంలో కూడ హిందూ సమాజానికి కళంకమైన అస్పృశ్యతను పోగొట్టటానికి, అజ్ఞాన సంలోపు, పారతంత్ర్యంలోనూ ఇంకా ప్రమగ్గిపోతున్న స్త్రీల మానసిక వికాసం, స్వావలంబన కల్గించడానికి స్త్రీ విద్యను, కుటీర పరిశ్రమల్ని ప్రోత్సహించారు. ఇవన్నీ జాతీయ జీవితాన్ని ప్రగతి పథంలో నడిపించుటకు చేసిన యత్నాలు ప్రభుత్వం కూడ ఈ సందర్భములో సాంఘిక అసమానతల్ని తొలగించడానికి చట్టబద్ధమైన చర్యల నెన్నింటినో తీసికొంది.

అయితే సాంఘిక విప్లవాలు ప్రభుత్వ శాసనాలవల్లనే సత్ఫలితాలను ఇవ్వజాలవు. ప్రభుత్వం అస్పృశ్యతను నిషేధిస్తూ శాసనాన్ని వీనాడో చేసింది. అయినా ఈ నాటికి ఏదో రూపంలో ఎక్కడోఅక్కడ అస్పృశ్యత మనకుసాక్షాత్కరిస్తూనే ఉంది. అలానే సహగమనం, బాల్య వివాహాల నిషేధ శాసనాలు ఉన్నాయి కాని అప్పుడప్పుడూ పత్రికల్లో సహగమనం, బాల్య వివాహాలకు సంబంధించిన వార్తలు ప్రచురితమవ్వటం మనం చూస్తూనే ఉన్నాం. ఇలానే వరకట్నం, కన్యాశుల్కాల్ని నిషేధిస్తూ కూడ శాసనాలు

ఉన్నాయి. కాని ఎందరో ఆడపిల్లల తండ్రులు కట్నాలు ఇవ్వలేక పోవడంవల్ల యుక్త వయస్కురాండ్రైన తమ కుమార్తెలకు వివాహాలు చేయలేక విలపించుచున్నారు.

కనుక ప్రజలలో ఈ మార్పులకు అవసరమైన మానసిక చైతన్యం రావాలి. వారు హృదయపూర్వకంగా ఈ సాంఘిక విప్లవాలకు తమ తోడ్పాటు నివ్వాలి. వారు తమకు పట్టనట్లుగా వ్యవహరించినంత కాలం ఈ కృషి కొద్దిమంది వ్యక్తుల పరిధి పరిమితమై యుంటుంది కాని సాంఘిక విప్లవరూపాన్ని ధరించలేదు.

ఈనాడు భారత సమాజం కుల, మత వ్యవస్థలతో, మూఢ నమ్మకాలతో, అజ్ఞానంతో లుకాలుకలై ఉంది. మనది ప్రజాస్వామ్యదేశమైనా ప్రజాస్వామ్యవ్యవస్థా విజయానికి అవసరమైన సమానత్వం గాని, సమానత్వ దృష్టిగాని లేదు. అందువల్లనే స్వాతంత్ర్యం సంపాదించి 25 సంవత్సరాలైనా మన దేశ పురోగమనం తాబేలు నడకలానే ఉంది. భారత దేశంలో ఈనాటికీ బలంగా వేళ్లు నాటుకొని యున్న కులవ్యవస్థ ఈ దేశాభ్యుదయానికి గొప్ప ప్రతిబంధకం. ఈ కుల వ్యవస్థ 2,500 శాఖల వరకు చీలివున్నదంటే భారత ప్రజానీకం ఇన్ని చీలికలతో ఎంత బలహీన పడ్డారో బోధపడుతుంది. సాంఘిక జీవితంలో మొదటినుండి ప్రముఖ స్థానాన్ని సంపాదించిన అగ్రకులస్థులు అనబడేవారు ఏ విషయంలోనూ తక్కువ వారి అభిప్రాయాలకు అంతగా విలువ ఇవ్వక పోవడంవల్ల, అధిక సంఖ్యాకులైన నిమ్న జాతులనబడేవారు దేశరక్షణలోనూ, తక్కిన విషయాల్లోనూ ఉపేక్ష వహిస్తూవచ్చారు. కనుకనే దేశం విదేశీయుల దండయాత్రలకు తలొగ్గి వారి పాదాక్రాంతమైంది. దేశరక్ష ణకు గాని, అభ్యుదయానికిగాని జరిగే కృషిలో అధిక సంఖ్యాకుల అభిప్రాయాలకు విలువ ఇవ్వకపోవడం గొప్ప తప్పిదం. ఇందువల్లనే అనేక సాంఘిక విప్లవాలు విఫల మయ్యాయికూడ. ఇక భవిష్యత్తులో ఇలా జరుగరాదు. అందులకు గాను నిమ్న జాతులనబడే వారిలో చైతన్యం కల్గించాలి. ఈదేశం వారి అందరి క్షేమంలోనూ నా క్షేమం మిళితమైయుంది అనే భావాన్ని కల్గించాలి.

అంతేకాదు. దురదృష్టం, కర్మ, పునర్జన్మ మొదలైన మూఢ నమ్మకాలను పోద్రోలి వారిలో శాస్త్రీయ దృష్టిని కల్గించాలి, తమ దారిద్ర్యానికి, నిమ్నత్వానికి బాధ్యత ఇతరులమీద త్రోసివేసి తాము 'పీడితులము, బాధితులము', ఇతరులు తమని ఆదరించాలి, జాలివహించాలి అనే పరాధీన దృష్టిని పోగొట్టాలి. వారిని స్వావలంబకులుగా తయారుచేయాలి.

ఈ రకమైన మానసిక మార్పు కల్గించడానికి ఈనాడు మనకు అడ్డంకులుగా వున్న పుస్తకాలను తిరిగి వ్రాయించాలి. బాలురలో శాస్త్రీయ దృష్టిని పెంపొందించని గ్రంథాల్ని నిషేధించాలి.

అంతేగాక పురోగామి చీలియున్న సమాజంలో ఐక్యత నెలకొల్పి చేయడానికి వివిధ కులస్థుల మధ్య భోజన ప్రతి భోజనాలు, వివాహ సంబంధాలు విధిగా జరగాలి. కులగౌరవం, వంశ మర్యాద అన్న పదాలు సాంఘిక అసమానతలకు చిహ్నాలు. గౌరవం అందరికీ కావాలి. పురోభివృద్ధి ఆందరికీ అవసరం. కనుక వ్యక్తులలో నేను, మేము అను భావాలకు బదులుగా మనం, అందరం, ఉమ్మడి క్షేమం అను దృష్టి అలవడాలి.

ఇది ఒక సాంఘిక మహాసిద్ధవం. ఇది ఏ కొద్దిమంది వ్యక్తులవల్ల పూర్తయ్యేది కాదు. ఈ కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. పరిస్థితులనుబట్టి లుగా చేయడానికి సాంఘిక సంస్థలతో తోడ్పడతాయి. ఒక పక్క ప్రభుత్వమూ, మరొక ప్రక్క స్వచ్ఛంద సంస్థలు కలిసి కృషిచేసినప్పుడే సుఖం ఆశించిన సత్ఫలితాలు రావడానికి అవకాశం వుంది. అందువల్ల ప్రజలు – ప్రభుత్వం పరస్పర సుహృద్భావంతో, సహకారంతో సాంఘిక విప్లవానికి కృషి చెయ్యాలి. అందులకుగాను స్వచ్ఛంద సంస్థగా ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ సంఘం తరపున కార్యకర్తలా కృషి చేస్తుంది.

ప్రభుత్వం వైపునుండి మన కృషిని బలపరుస్తూ ఇటీవలే 'సాంఘిక సంస్కరణలు' అనే విషయంమీద హైదరాబాదులో ఒక సెమినార్ జరిగింది. వర్ణాంతర వివాహాలు చేసుకొన్నవారికి ఉద్యోగ నియామకాలలో ప్రత్యేక సదుపాయాలు కల్పించడానికి అవసరమైతే భారత రాజ్యాంగాన్ని సవరించాలని, ఆర్థిక పురస్కారాలు కల్పించాలని, ఇండ్ల స్థలాలు మిగులు భూములు పంపిణీలలో ప్రత్యేక అవకాశం కల్పించాలని, పాఠ్య గ్రంథాలలో కుల మత ప్రసక్తి లేకుండా ఉండాలని, హేతువాద దృక్పథం పృద్ధిజేసే పాఠ్య భాగాలను చేర్చాలని, వివిధ స్థానిక సంస్థలలోనూ, శాసనసభ, శాసనమండలి, పార్లమెంటు ఉభయసభలలోనూ ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించబడాలని, వితంతు వివాహాలకు ప్రభుత్వ ప్రోత్సాహం లభించాలని, హరిజన కాలనీల పేరుతో హరిజనులను శాశ్వతంగా వేరుగా ఉంచకూడదని, శాస్త్రి, శర్మ, రెడ్డి, రాజు, చౌదరి, నాయుడు

వంటి కుల సంకేతాలను మార్చుకొనడానికి ఉచితంగా గజట్టు ప్రకటనకు సదుపాయాలు కల్పించాలని, అట్టి సంకేతాల వాడుక విరమించాలని ఇకముందు తమ సంతానానికి ఈ కుల సంకేతాలను పెట్టవద్దని మొదలైన సూచనలు సెమినార్ ప్రభుత్వానికీ, ప్రజలకు చేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం అంతా ఐకమత్యంతో పరస్పర సహకారంతో వ్యవహరించి సాంఘిక విప్లవం విజయవంతం కావడానికి తోడ్పడగలరని విశ్వసిస్తున్నాను.

14–10–72 విజయవాడ సభ

అంతర్వర్ణవివాహాలు - నవసమాజనిర్మాణం

వ్యక్తిగత జీవితంలో, అలవాటుకు ఉన్న ప్రాధాన్యతే, సాంఘిక జీవితంలో, సాంప్రదాయానికి ఉన్నది. ఈ రెంటికి కాసుల ప్రమేయం లేదు. వీటిని అతిక్రమిస్తే, జైలు శిక్షో, లేక జరిమానాయో, విధింపబడుతుందనే భయంకూడా లేదు. నిజంగా ఆలోచిస్తే, పాపపుణ్య విశ్వాసాలకు కూడ, తావులేదు, కాని, అవాట్లు సంప్రదాయాలు, మానవుని జీవితాన్ని కాసిస్తున్నాయి. ఇవే. ఒక్కొక్కప్పుడు, వంశ గౌరవం వంశప్రతిష్ట అనే పేరుతోగూడా చలామణి అవుతూ వ్యక్తిని మానసిక బాధలకు కష్ట నష్టాలకు గూడా గురిచేస్తూంటాయి. ఇవి మనకు నిత్యజీవితంలో కలుగుతున్న అనుభవాలే.

మనం ఏ రైలులోనో ప్రయాణం చేస్తున్నప్పుడు అనేక అనుభవాలు కలుగుతుంటాయి. అయితే, అందరికీ సాధారణంగా కలిగే అనుభవం ఒకటుంది. రైలు బయలుదేరాక మనం కాస్త సీటులో కుదురుకోగానే, ప్రక్క సీటులోనే కూర్చొన్న ఓ పెద్దమనిషి, మనల్ని వేసే మొదటిప్రశ్న, మీరెవరండి ? అని. అంటే మీ కులమేమిటి అని. మనకులం చెప్పకపోతే, మీ ఇంటి పేరేమిటని ప్రశ్నిస్తాడు. అదీ జవాబివ్వకపోతే, మీకు ఫలాని వాళ్ళ బంధువులేనా, అనో లేక మీ బంధువులు, ఏ ఊళ్లలో ఉన్నారో, చెప్పమని అడుగుతాడు. ఈ రకంగా మనం ఏ కులస్థుడమో, తెలిసికొని తీరాలన్న పట్టుదలతో తన శక్తియుక్తుల్ని ప్రయోగిస్తాడు అయితే ఈ రకమైన కుతూహలం యువకులలో కంటే, వయస్సు మళ్ళిన వాళ్లలోనే చొప్పున కన్పిస్తుంది. ఇంతకీ, మనం ఎవరైతే అతనికేమిటని ఆలోచిస్తే, అతని ప్రశ్న ఏ లాభనష్టాల్ని బేరీజు చేసుకొని వేసిందిగాదని, అదొక సాంఘిక మర్యాదమాత్రమే అని, స్పష్టమౌతుంది. కులము తెలిసికొన్న తరువాత సంభాషణ ధోరణి, సంభోషణా క్రమం, మారుతూ ఉంటాయి.

సాంప్రదాయ వివాహాలు అంటే ఆయా కులస్థుల మధ్యనే జరిగే వివాహాలు. హెచ్చుభాగం, తల్లిదండ్రులు లేక ఇతర పెద్దలు, నిర్ణయించినవి. వీటిలో వధూవరుల అభిరుచులకు ప్రాధాన్యత ఉండదు. తల్లిదండ్రులు, ఏ ఆర్థిక లాభాన్నో లేక చుట్టరికాన్నో దృష్టిలో ఉంచుకొని తమ పిల్లల పెళ్ళిళ్లు నిర్ణయిస్తూంటారు. కొంచెము అభ్యుదయ భావాలుకల పిల్లలు కూడ, ఆర్థిక లాభం చేకూరుతుందంటే ఆ భావాల్ని ఒక అరలోవేసి కప్పిపెట్టో, లేక తల్లిదండ్రుల తృప్తికొరకనో సాకులు చెప్పి మాట్లాడకుండా పెళ్ళి చేసేసుకొంటూంటారు. తల్లిదండ్రుల ఆస్తిపాస్తులు చక్కబడే భయంతోగూడా పిల్లలు వారు కుదిర్చిన సంబంధాలకు ఎదురు చెప్పరు. విద్యాభివృద్ధి అవుతున్న కొద్ది, ప్రేమలు కుల కట్టుబాట్ల పరిధులు దాటుతున్నా, అవి ఎక్కువగా వివాహాల రూపము పొందలేక పోతున్నాయి.

పూర్వం కంటే, ఇటీవలి కాలంలో వర్ణాంతర వివాహాలు పెంచల సంఖ్యలో జరుగుతున్నాయనటం నిర్వివాదాంశమే. వీటిలో హెచ్చుభాగం స్వయంపరాలే, వీటికి తగిన అవకాశం కల్పిస్తున్నవి, ఒకటి విద్యాలయాలు. రెండు ఉద్యోగాలు మూడు కాలానుగతముగా విదేశీయ సంపర్కముద్వారా వచ్చేమార్పు యుక్తవయస్కులైన స్త్రీ, పురుషులు పరస్పరం ఆకర్షించబడటం సహజం. అట్టి స్థితిలో వారి మధ్య కులమత భేదాలకుగాని, ధనిక పేద వ్యత్యాసాలకుగాని, ఆఖరికి ఆచరణకుగాని తావుండదు. ఆవర్ణంకొరకు చేసికొనే కులాంతర వివాహాల సంఖ్య చాల తక్కువ. ఇరువురి మధ్యకల పరస్పరాకర్షణవల్ల ఇరువురు వివాహానికి ఉద్యుక్తులవుతారు. ఆ ఆవేశంలో వారికి ఏవిధమైన ఇబ్బందులైనా అత్యల్పంగానే కన్పిస్తాయి. స్వయం పోషణాశక్తి లేకపోయినా, ఇద్దరూ కలిసివుంటే చాలనే వాంఛ బలీయంగా కన్పిస్తుంది. ఈ సందర్భంలో అట్టి యువతీయువకులు రకరకాలైన ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి యుంటుంది. వాటిలో కొన్ని మనం ముచ్చటించుకోవడం, అనుచితం కాదను కొంటాను.

1. వారిద్దరూ కళాశాల విద్యార్థులు. సహపాఠులు. కొన్ని సంవత్సరాల కళాశాల సాహచర్యంవల్ల ఇరువురు సన్నిహితులై వివాహం చేసికోవాలనే నిశ్చయానికి వచ్చారు. అమ్మాయి తల్లిదండ్రులు, ఈ సమయంలోనే తమకు సచ్చిన, ఒకొక సంబంధాన్ని ఖాయంచేసి, పరీక్షలు కాగానే పెళ్ళి చేసేద్దామని అనుకొంటారు. ఇంతకీ ఈ సహపాఠులిద్దరూ ఏక కులస్థులు కారు. కనుక ఉభయుల తల్లిదండ్రులు వారి పెళ్ళికి ఎటూ అంగీకరించరు కనుక, ఎలా పెళ్ళిచేసికోవడమా అనే సమస్య ఎదురవు

తుంది. పిల్లకు వెర సంబంధం నిశ్చయిస్తున్నారని తెలియగానే కుల నిర్మూలన సంఘ సహకారముతోగాని వారి మిత్రులు, అనుచరుల సహకారముతోకాని రిజిస్టరు పెళ్ళి చేసికొంటారు. అంతవరకూ ఈ పెళ్ళిని వ్యతిరేకిస్తూ పచ్చిన తల్లిదండ్రులు మనస్సు మార్చుకొని, కూతుర్ని, అల్లుణ్ణి తమ ఇంటికి తీసికొని వెళ్లుతూ ఉంటారు.

2. మరొక సంధర్భంలో వధూవరులిద్దరూ ఉద్యోగులు ఏదో కంపెనీలో పని చేస్తున్నారు. ఇరుపురు పెళ్లిచేసికో గోరుతున్నాపని మొదట్లో తమ తల్లిదండ్రులకు తెలిపితే ఇరుపక్కాల వారూ వ్యతిరేకించారు. అయినా వారిద్దరూ రిజిష్టరు మేరేజి చేసికొన్నారు. వేరేచోట కాపురం పెట్టారు. ఈ విషయం నచ్చని పిల్ల తల్లిదండ్రులు అబ్బాయి అమ్మాయిని లేపతీసికొని పోయాడని, పిల్ల మైనరని అబద్ధము చెప్పి, తప్పుడు కేసు బనాయించారు. దానితో చిన్న పోలీసు ఉద్యోగులు అబ్బాయిని అరుపు లోనికి తీసికొన్నారు. ఈ విషయం కుల నిర్మూలన సంఘం దృష్టికిరాగా, ఉన్నత పోలీసు అధికారుల సాయంతో, పిల్లవాణ్ణి నిర్బంధం నుండి విడిపించడం జరిగింది. పిల్ల తల్లిదండ్రులను పిలిపించి వారికి సచ్చచెప్పగా, వారు తమ తప్పు తెలిసికొని పశ్చాత్తాప పడి తమ చేత్తో స్వయంగా పెద్దఎత్తున మళ్లా వెళ్ళి చేశారు.

3. మరొక ఉదాహరణ అబ్బాయి, అమ్మాయి, ఇద్దరూ యూనివర్సిటీ విద్యార్థులు. అంతిమ పరీక్షహాడ ప్రథమ శ్రేణితో ఉత్తీర్ణులయ్యారు. ఇప్పుడు ఉద్యోగాలు కూడ చేస్తున్నారు. పెళ్లి చేసికోవాలనుకొన్నారు. ఈ విషయం తమ తల్లిదండ్రులకు తెలియజేశాను. అయితే పిల్ల తల్లిదండ్రులు తాము పెద్ద కులస్తులమని,తమ కంటె పిల్లవానికి తక్కువ కులమని చెప్పి వారి పెళ్లికి సమ్మతించలేదు. అంతేకాదు, మాయమాటలతో పిల్లను ఇంటికి పిలిపించి నిర్బంధంలో ఉంచారు. పిల్లవాణ్ణి బెదరించారు. అమ్మాయిని ఉద్యోగం నుండి మాన్పించారు. ఎట్టిపరిస్థితిలో అమ్మాయి అతన్నే పెళ్లిచేసికుంటానని లేకపోతే ఆత్మహత్య శరణ్యమని, పట్టుపట్టి, కూర్చోపడంతో, తల్లిదండ్రులు లొంగిరాక తప్పలేదు. వారిద్దరికి కులనిర్మూలన సంఘ అధ్వర్యంలో హైదరాబాదులో వివాహం జరిగింది.

4. మరోజంట విషయం. అబ్బాయి. అమ్మాయి ఇరువురు వేరు వేరు వెనుక బడిన తరగతులకు చెందినవారు. అయితేనేం, అమ్మాయి తల్లిదండ్రులు వారి పెళ్లికి అంగీకరించలేదు. కారణం అబ్బాయికి చదువులేదని కాదు. అతను సభ్యుడు. ఉద్యోగం లేదనికాదు ఓ కంపెనిలో పనిచేస్తూ నెలకు నాలుగు ఐదు వందలు సంపా

దిస్తున్నాడు. వయస్సూ, ఈడూ, జోడూ బాగానే ఉంది. అంతేగాదు అమ్మాయి తల్లిదండ్రులు అతి పేదవారు. వారికి పూటగడవటమే కష్టంగా ఉందికూడ. అయినా వారి అభ్యంతరం అమ్మాయి కులాంతర వివాహం చేసికొంటున్నందుకు కూడ కాదు. కులాంతర వివాహం చేసికొనేటప్పుడు తమకంటే పెద్దకులం పిల్లవాణ్ణి ఎన్నుకుంటే బాగుండేదికదా! అని వారి అభిప్రాయం. తమ కులంకంటే పిల్లవాని కులం తక్కువ కులం, కనుక ఆ పెళ్ళికూడదు అని వారిఅభ్యంతర · అయినా ఇటీవలే వారివివాహం జరిగింది. అయిన పిమ్మట తల్లిదండ్రుల ఆమోదంగూడ లభించింది.

5. మరొక రకమైన సమస్య ఎదురైంది ఇంకో వివాహంలో. అమ్మాయి ఉన్నత కులస్థురాలు. అబ్బాయి షెడ్యూల్డు కులానికి చెందినవాడు. ఇరువురు ప్రేమించుకొని వివాహం చేసికొవాలనుకొన్నారు. అయితే ఇక్కడ అబ్బాయి తల్లి దండ్రులే వారి పెళ్ళికి ఒప్పుకోలేదు. అమ్మాయి తల్లిదండ్రులు తమ అంగీకారం తెలిపారు. అబ్బాయి తల్లిదండ్రుల అభ్యంతరానికి కారణం, పిల్ల తల్లిదండ్రులు ఉద్యోగస్తులు కారు. పెద్ద హోదాగాని ఆస్తిపాస్తులుగాని లేవు. అందుపల్ల వారి పెళ్ళి కూడదని వారు నిరాకరించారు. ప్రభుత్వోద్యోగం చేస్తూ స్వయంగా తన కుటుంబాన్ని తాను పోషించుకొనే శక్తిగల అబ్బాయి, గట్టిగా పట్టుబట్టడంవల్ల, వారి వివాహం కూడ ఇటీవలే జరిగింది.

కులాంతర వివాహం చేసికోదలచిన యువతీయువకులు పట్టుదలతో వ్యవహరించినప్పుడు, తల్లిదండ్రులుగూడా క్రమేపి, తమ ఆదరాభిమానాల్ని అందిస్తారని పై ఉదాహరణలపల్ల ఋజువవుతుంది.

కృత్రిమమైన సంప్రదాయపు సంకెళ్లను తమ ఆచంచల ఆవర్శంతో విరుగగొట్ట బూనుకొన్నవారే సంస్కర్తలు. రాజారామ మోహనరాయ్, మహదేవ గోవింద రెనడే, జ్యోతిబా పూలే, వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం, మొదలగు సంస్కర్తల జీవితాల్ని పరిశీలిస్తే అణ్వంచయ నిరోధకమైన, అసహాజమైన ఈ సంప్రదాయాల్ని కూల కుట్టించడానికి సహజంతో వారు హోరాహోరి పోరు సల్పవలసి వచ్చినట్లు విదితమౌతుంది. సాంఘిక సంస్కరణను ఒక ఉద్యమంగా చేపట్టినవారు సమాజంలో పరిచే ఎన్నో ఇబ్బందులకు గురిఅయ్యారు. అవమానాలు పొందారు. కొందరు దెబ్బలు కూడ తిన్నారు. అయినా అణుమాత్రం చలించకుండా తమ ఆదర్శంపైనే పయనించడంవల్ల వారు యువతరానికి ఒక నూతన మార్గాన్ని ఏర్పరచారు. అందువల్లే

తొలిటికంటే ఈనాడు ఈ దుస్సాంప్రదాయ విచ్ఛేదన సులభమైనది. సాధారణంగా సంప్రదాయవాదులైన తల్లిదండ్రులు కూడ కొంచము ఈనాడు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకొని తమ పిల్లలకు కులాంతర వివాహం జరిపించడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. వర్ణాంతర వివాహాల్లో ఇది రెండవ దశ. దీనివల్ల స్వేచ్ఛా వివాహాలు చేసికోవలచుకొన్న పిల్లలు ఎదుర్కొవలసివచ్చే ఒక ముఖ్యమైన అడ్డంకు సులభంగా తొలగిపోతుంది. వరకట్నపు బెడదగూడా, ఈ వివాహాలవల్ల తగ్గుతుంది.

సాంఘిక అసమానతలు తీసివేయకుండా, ఆర్థిక ప్రగతి సాధించినంతమాత్రాన్నే భారతీయ సమాజం కాంక్షించే సుఖశాంతులు లభ్యంకావు. ఆర్థిక రంగంలో దేశం ప్రగతి పథాన పయనిస్తున్న ఈ సమయంలో సాంఘిక రంగంలోగూడ, అసమానతల నిర్మూలనకు దీక్షాయుతమైన కృషి జరగాలి.

ఈ దేశాన్ని తరతరాల నుండి పీడిస్తున్న పెద్ద జబ్బు కులవ్యవస్థ. దీనిని కూర్చికటి వేళ్లతో సహా పెకలించి వేయందే, నవసమాజ నిర్మాణం సాధ్యం కాదు. అందుకుగాను మతాతీత సమాజంతోపాటు కులరహిత సమాజం నిర్మాణం కావాలి. కులరహిత సమాజానికి ఏకైక మార్గం వర్ణాంతర వివాహాలేనని డా।। అంబేడ్కర్ తన 'కుల నిర్మూలన' అనే గ్రంథంలో స్పష్టంగా పేర్కొన్నారు. బాపూజీ గూడా కులాంతర వివాహాలను ప్రోత్సాహించారు. మన దేశనాయకులలో కొందరు వర్ణాంతర, మతాంతర వివాహాలు చేసికొని మార్గదర్శకులయ్యారు. కుల నిర్మూలన, ఒక మహత్తర ఉద్యమంగా చేపట్టకుండా, ఆయా కులస్థులకు వెనుకబడి యున్నారని కేవలం ఆర్థిక సహాయం చేస్తూ పోతూఉంటే కులాలు మరింత బలపడతాయే కాని, కులాల మధ్య అవసరమైన ఐక్యత ఏర్పడదు. అందుకు కారణం కులాలున్నంత వరకు ఆయా కులస్థులు తమ కుల ప్రయోజనమే చూస్తారు గాని మొత్తం సమాజం క్షేమాన్ని గమనించరు. అప్పుడు వివిధ కులస్థుల మధ్య తప్పనిసరిగా సౌహార్ద్రత, సుహృద్భావాలు లోపిస్తాయి. కనుక భారతదేశంలో మనం ఆశించే నవసమాజ నిర్మాణం జరగాలంటే కుల నిర్మూలన అత్యవసరం. కుల నిర్మూలనకు ఏకైక మార్గమైవర్ణాంతర వివాహాల్ని ప్రోత్సాహించవలసిన అగత్యం ఎంతైనా ఉంది. ఈ వాస్తవాన్ని గమనించిన మన ప్రభుత్వాలు వర్ణాంతర వివాహాల్ని ప్రోత్సాహిస్తూ అనేక చర్యలు తీసుకొంటున్నాయి. హరిజనులకు, హరిజనేతరులకు జరిగే వివాహాలలో వధూపరులకు మన ప్రభుత్వం వేయిరూపాయిలు, వెనుకబడిన తరగతివారికి తదితరులకు

వివాహం జరిగితే ఐదువందల రూపాయలు పారితోషికం ఇస్తూంది. ఇలాగే గుజరాత్, తమిళనాడు, కేరళ, కర్నాటక, పాండిచ్చేరి ప్రభుత్వాలు కూడ వర్ణాంతర వివాహాల్ని ధనంద్వారాను, తదితర రూపాల్లోనూ ప్రోత్సహిస్తున్నాయి.

ఈనాటి యువకులు సంప్రదాయాల మీద బహిరంగంగానే తమ అసంతృప్తి ప్రకటిస్తున్నారు. సాంఘిక అసమానతల్ని ఏమాత్రం పాటింప గూడదని కూడ, భావిస్తున్నారు. కులరహిత వ్యవస్థ నిర్మాణానికి తోడ్పడటానికిముందుకు వస్తున్నారుకూడ భారత యువత అభ్యుదయంలోఎప్పుడూ ముందంజ వే స్తుంది.ఈ విషయంలో గూడా ముందంజవేయడంలో ఎట్టిసందేహంలేదు. అయితే తమ కాళ్లమీద తాము నిలబడటానికిగాను వర్ణాంతర వివాహాలు చేసికొనేవారికి జీవనోపాధి చూపించే భాధ్యత ప్రభుత్వం స్వీకరించాలని యువకులు కోరుతున్నారు అందుకు అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించాలని కూడకోరడం జరిగింది. ఈవిషయప్రాముఖ్యతను గమనించి త్వరలో అందుకవసరమైన శాసనాలు రాగలవని ఆశిద్దాం.

సమాజము - కులము

మానవుడు సంఘజీవి. తనను, తన కుటుంబాన్ని, ఆరోగ్యాన్ని, సంపదను రక్షించుకోవడానికి, విజ్ఞానార్జనకు, ప్రకృతిని తనకు లాభసాటిగా మలచుకోవడానికి, అన్నిటికి మించి మానసిక శాంతికోసం మానవుడు సంఘజీవితాన్ని రూపొందిస్తున్నాడు. కాని ఇప్పుడున్న సంఘం ఒక్కసారి ఏర్పడ్డది కాదు. గతంలో ఎన్నోమార్పులు, పరిణామాలు కారణంగా కాలక్రమాన ఏర్పడ్డదే నేటి మానవ సమాజం. మానవుడు ఇంగితజ్ఞానంలేకుండా జంతువులా మనుగడ సాగించిన కాలం ఉంది. చరిత్రకారులు, సాంఘికవేత్తలు స్థూలంగా మనం అర్థంచేసుకోవడానికి పాతరాతియుగమని, కొత్త రాతియుగమని, వ్యవసాయక యుగమని కాలవిభజన చేశారు. కొన్నివేల సంవత్సరాలు గడచిన తర్వాతనే మానవుడు సాంఘిక జీవనం ప్రారంభించాడు అన్నది నిర్వివాదాంశం.

సంఘజీవనంలో చాలా ముఖ్యపాత్ర వహించింది మతం. సాంఘిక కట్టుబాట్లు చాలావరకూ మతాన్ని ఆశ్రయించినట్టివే. భారతీయ సంఘంలో కట్టుబాట్లకు విశిష్ట స్థానం ఉంది. ముఖ్యంగా సాంఘికరంగంలో తు. చ. తప్పకుండా సాంప్రదాయబద్ధంగా నడచుకొనే వాళ్లకే గౌరవం, ఆదరణలభిస్తూ ఉండడం అందరకూ తెలిసిందే. మానవుడు సంఘజీవి కాబట్టి సాంఘిక కట్టుబాట్లను దూరంగాపోయి సహజీవనం జరపలేదు. సాంఘిక భద్రత అక్కరలేనివాళ్లు బహు అరుదుగా ఉండడంచేత కష్టమైనా నష్టమైనా పాతుకుపోయిన అలవాట్లకు దాసోహం చేయడం మనకు తెలిసిందే. అయితే పాతకట్టుబాట్లు అన్నీ మంచివే, అనుసరించదగ్గవే అని మనంచెప్పలేము. కాలగమనంలో వెర్రితలలువేసి, ఉద్దేశించిన ధ్యేయాన్ని విస్మరించి సాంఘికఐక్యతకు గొడ్డలిపెట్టుగా తయారైన కట్టుబాట్లు, వ్యవస్థలు కొన్ని ఉన్నాయి. వాటిలో కులవ్యవస్థ తలమానికం. ఇది హిందూమాతాన్ని ఆశ్రయించినట్టిది. భారతీయసంఘంలోని సిక్కులు, బ్రహ్మసమాజికులు, బౌద్ధులు కులవ్యవస్థను పాటించడంలేదు. విదేశీ మతాలైన మహమ్మదీయ, క్రైస్తవమతాలలో కులవ్యవస్థ లేనేలేదు.

కులవ్యవస్థ ఎప్పుడు పుట్టిందో ఇదమిద్దంగా ఎవ్వరమూ చెప్పలేము. వేదకాలం నుండి ఈ వ్యవస్థ భారతీయ సంఘంలో చోటుచేసుకొన్నట్లు కనబడుతుంది. ఋగ్వేద సంహితలోని పురుష సూక్తులలోనూ, విష్ణుపురాణం, మనుస్మృతి మొదలైన క్రోడీకరణ చేయబడ్డ గ్రంథాలలోనూ కులవ్యవస్థ పేర్కొనబడింది. భగవద్గీతలో కుల ప్రస్తావనవుంది. 'చాతుర్వర్ణ్యం మయాసృష్ట్యం' అంటాడు భగవంతుడంతటివాడు. కొందరు విమర్శకులు ఈ కులప్రస్తుతులు తర్వాతికాలంలో చేర్చబడ్డాయని, వాటికి శాస్త్రప్రమాణం ఇవ్వడానికే కొందరు ఛాందసులు వేదంలోనూ, స్మృతులలోనూ, కులసంబంధమైన విషయాలను చొప్పించారని చెబుతున్నారు. ఇందులో ఎంతవరకూ సత్యముందో మనంచెప్పలేము. కులవ్యవస్థ భారతీయ సంఘం ఏర్పడ్డప్పటినుండి ఉన్నాలేకపోయినా పురాణ వ్యవస్థఅని చెప్పకతప్పదు. అనూచానంగా వస్తూవున్న ఆచారమే యిది. మొదటినుండి భారతదేశం సౌభాగ్యవంతంగా ఉండేది. పరదేశీయులు భూమార్గాన, జలమార్గాన మన దేశానికి రావడం మనసంపదను కొల్లగొట్టుకోవడం కాలక్రమాన ఇక్కడి వాతావరణ, నాగరికత, సారవంతమైన భూభాగాలనూ చూచి విడిచిపెట్టలేక స్థిరనివాసం ఏర్పరచుకోవడం మనకు తెలుసు. అలా స్థిరపడిపోయిన వారు అంతకు పూర్వం నివసిస్తున్నవారు వేరువేరు సంఘాలుగా ఉండిపోవడం కద్దు. అంటరానితనం, ఇతర వ్యత్యాసాలు ఈ రకమైన సాంఘిక వ్యవస్థలలోనుండి ఉద్భవించాయని చెప్పడానికి చాలా ఆధారాలు ఉన్నాయి. ముఖ్యంగా పరిశీలిస్తే బుద్ధునకి పూర్వం ఉన్న కులవ్యవస్థకు, బౌద్ధమతం అంతరించిన తర్వాత కులవ్యవస్థకు అంతరము చాలావుంది. నేటి కులవ్యవస్థను పూర్వరూపం వర్ణాశ్రమధర్మం. పౌరాణికమైన వర్ణాశ్రమధర్మానికి నేటి చతుస్సహస్ర వర్ణవ్యవస్థకు ఎట్టి సంబంధంలేదు. వర్ణాశ్రమ ధర్మం వృత్తిధర్మంగా సంఘం పడుదుడుకులకు లోనుగాకుండా సాఫీగా నడపడానికి ఏర్పరుపబడ్డదని చెబుతున్నారు. ఇందులో ఎంతవరకూ సత్యం వుందో మనకుతెలియదు. కాని వర్ణవ్యవస్థ నిర్మాణంలోనే ఒకరికి ఒకరికి మధ్య వ్యత్యాసాలు ఆరోపించబడ్డాయి. ఋగ్వేదంలోని పురుషసూక్తంలో సర్వాంతర్యామి, ఆదిమధ్యాంతరహితుడు, సృష్టికర్తఐన భగవంతుని నోటినుండి బ్రాహ్మణులు, బాహువులనుండి రాజన్యులు, తొడలనుండి వైశ్యులు, పాదములనుండి శూద్రులు ఉద్భవించినట్లు చెప్పబడింది. దీని పల్ల భారతీయసంఘంలో కొందరు ఉత్తములు, కొందరు మధ్యములు, మరి కొంచరు, సామాన్యులు, ఇంకా కొందరు నీచులు అనే అసందర్భమైన భావన ఒకటి సృష్టింపబడింది. ఇందులో అతి ముఖ్యమైన విషయమేమిటంటే సృష్టికర్త నోటినుండి పుట్టిన వారి సంతానం వంశపారంపర్యంగా తరువాత గుణ కర్మలతో నిమిత్తం లేకుండా

భూసురులుగానే చెలామణీ ఔతారు. అదే ప్రాతిపదిక మీద క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు పుట్టుకతోనే సంఘంలో హెచ్చుతగ్గులకు గురియౌతారు. కులవ్యవస్థ ఎప్పుడు పుట్టింది అని ఆలోచనచేస్తే పౌరాణికమైన ఆధారం ఒకటి కనబడుతుంది. వాయు పురాణాన్ని బట్టి త్రేతాయుగంలో కులంపుట్టినట్లు చెప్పబడింది. ఆయుగంలో మహా బలపరాక్రమశాలియైన పురూరవ చక్రవర్తి వర్ణాశ్రమ ధర్మం నెలకొల్పినట్లు చెబుతారు, కృతయుగంలో సత్యము, శౌచము ముఖ్యమైన గుణాలు కాబట్టి ఆ యుగంలో ప్రజలు అందరూ విప్రులేనట. త్రేతాయుగంలో జ్ఞానం ముఖ్యస్థానం వహించింది. కాబట్టి మనుష్యుల ఆలోచనా క్రమంలో వ్యత్యాసాలు పుట్టి, చేసేపనులలో కూడా వైవిధ్యం ఏర్పడి జనులు వర్ణాలుగా విడిపోగానే వర్ణవ్యవస్థ ఏర్పాటు జరిగినట్లు నమ్మకం. ద్వాపరయుగంలో త్యాగము ముఖ్యధర్మం. కలియుగంలో అంతా అంధకారమే కాబట్టి రానురాను ఆనేక వేల కులాలుగా సంఘం విడిపోయిందనీ నచ్చ చబుతున్నారు. ఇవన్నీ నమ్మకంమీద ఆధారపడ్డ సిద్ధాంతాలు. ఆధునిక యుగంలో హేతువాదం, తార్కికవిలువలు బలపడిన తర్వాత మూఢనమ్మకాలకు తావులేదు. చైతన్యం గలిగిన ఏ సంఘమైనా మారుతున్న విలువలకు అనుగుణంగా తమ్ముతాము మలుచుకోవలసిన అవసరం ఉంటుంది. అలాంటి సదుపాయంలేని సంఘాలు కాల క్రమంలో శక్తి, యుక్తులను కోల్పోయి హీనస్థితికి దిగజారిపోతూ ఉంటాయి.

ప్రపంచంలో ఇతర జనసమూహాలను, వారి సంస్కృతులను పరిశీలిస్తే మనకు నిజం తెలుస్తుంది, రోమను సామ్రాజ్యకాలంలో ఇంగ్లండులోనూ తదితర ఐరోపా దేశాలలోనూ కులవ్యవస్థకు దగ్గరగా ఉన్న పద్ధతి ఒకటి వాడుకలో ఉన్నట్లు మనకు కనుపిస్తుంది. అయితే ఆది అన్నివిధాల భారతీయ కులవ్యవస్థకు ప్రతీకమాత్రం కాదు. తండ్రి వృత్తి కుమారులకు సంక్రమించేంతవరకు మాత్రం కులవ్యవసను పోలి ఉండేది. ఆరోజుల్లో వృత్తివిద్యలు నేర్పడానికి ప్రభుత్వ పాఠశాలలుగాని, సహకార సంస్థలు తదితర ఏర్పాట్లుగాని లేవు. అందుచేత నిపుణుడైన కళాకారుడు తన వృత్తిని భావికాలంవారికి పనికిపచ్చేటట్లు శాశ్వతీకరించాలి అంటే తన కుమారులకు ఆ విద్య క్షుణ్ణంగా నేర్పి భావితరాల వారికి ఉపయోగడేలా విడిచిపెట్టడం తప్ప మరో మార్గంలేదు. అదిగాకుండా, తన కొడుకులకు తాను విద్యనేర్పడంలో దాపరికం లేకుండా హృదయ పూర్వకంగా, పూర్తిశ్రద్ధవహించి నేర్పడానికి కొంత స్వార్థ పరత్వం సహజంగా ఉంటుందికాబట్టి వృత్తివిద్యలు అభివృద్ధిపొందాయి. కాని ఐరోపా సంఘం లో ఎవరుకూడా ఒకవృత్తికి సంబంధించిన కుటుంబానికి చెందిన వ్యక్తి

ఉరోపృత్తి నేర్చుకోడానికి ఇతర నిపుణులపద్ద ప్రవేశ చేయడానికి అంక్షలులేవు. కాని భారతీయ సాంప్రదాయం దీనికి భిన్నంగా, విరుద్ధంగా ఉండేది. ఏకలవ్యుడు ఎంకల వర్ణస్థుడు కాబట్టి విలువిద్య నేర్చుకోడానికి వీలులేదు. సూతకుమారుడు సహజ కవచకుండలాలతో జన్మించిన మహాతేజశ్శాలి కర్ణుని గతి అంతే అయ్యింది. పరశురాముని వద్ద కులందాచుకొని విలువిద్య నేర్చుకోవలసిన దౌర్భాగ్యం అతనికి కలిగింది. ఉత్సాహం, నేర్పు, ఆకాంక్ష, అచంచలదీక్ష ఉన్నవారుకూడా కుల ప్రాతిపదికపై తమకు నచ్చిన విద్యను నేర్చుకోడానికి వర్ణాశ్రమ ధర్మాలకు సంబంధించిన, ఆంక్షలు యుగయుగాలుగా భారతీయ సంఘంలో నిష్టవేసుకొని ఉండడంచేత మన సంఘం నిర్వీర్యమైనదని చెప్పడానికి వెనుకాడవలసిన పని లేదు. ఐరోపా ఖండంలోనూ, ఈజిప్టుదేశంలోనూ పంశపారంపర్యంగా వృత్తులను స్వీకరించే పద్ధతి పూర్వకాలంలో అవలంబించినప్పటికీ భారతీయ కులవ్యవస్థకు అక్కడి వృత్తి వ్యవస్థకు మౌలికమైన రెండు తేడాలు ఉన్నాయి. మనదేశంలోవలె కులాన్నిబట్టి, వృత్తినిబట్టి హెచ్చుతగ్గులు ఆయాదేశాలలో లేవు. ఏవృత్తిచేపట్టినవారైనా ఇతరులతో సమానంగానే పరిగణింపబడ్డారు. రెండవది ఒకవృత్తి చేపట్టిన కుటుంబంలోని వ్యక్తులు మరొక వృత్తిలో నిపుణత్వం సాధించి కొత్తవృత్తును అనుసరించడానికి అక్కడ ఎట్టి అభ్యంతరాలు లేవు. ఈ స్వేచ్ఛ వల్లనే ఆదేశాలవారు ఒకరితో ఒకరు సహకారాన్ని సౌభ్రాతృత్వాన్ని, సదవగాహనమును, కలుపు గోలుతనాన్ని పెంపొందించుకో గలిగారు. దానివల్ల ప్రజలకు, దేశాలకు ఎనలేని ప్రగతి సౌభాగ్యం కలిగాయి. మన దేశంలో ఆనాటినుండి అలాంటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేకపోవడంచేత ఒకరంటే ఒకరికి పడకపోవడం, ఒకవృత్తి అభివృద్ధి చెందుతుంటే చూచి ఓర్వలేనితనం మొదలైన వైశాచిక ఊహలు అలవాట్లు మనసంఘంలో స్థానంఏర్పరచుకొన్నాయి. అందుచేత వర్ణాశ్రమధర్మంపైకి ధర్మసూత్రంగా కనుపించినా వాడుకలో సర్వ అనర్థాలకు కారణభూతమై భారతీయ సంఘం చిన్నాభిన్నమై వేలవేలుకులాలు. ఉపకులాలు పుట్టుకు రావడానికి, అడ్డుగోడలు, వ్యత్యాసాలు నిర్మాణంకావడానికి దోహదంచేసింది. వందలాది సంవత్సరాలు సువిశాలమైన అఖండ భారతదేశం పరదాస్యం క్రింద క్రమ్మగిపోవడానికి కులతత్వం మూలకారణంగా పనిచేసింది.

ఇక్కడ ఒక ప్రశ్న ఉత్పన్నమౌతుంది. వర్ణాశ్రమధర్మం, లేదా వర్ణవ్యవస్థను యథాతథంగా కాపాడుకొంటూ కులాలమధ్య చెలిమి, సమానత్వం సాధించవచ్చా ? లేదా ? ఈ ప్రశ్న కొత్తది కాదు. ఆర్యసమాజికులు ఈ అపోహలోపడి కులతత్వం

పోగొట్టడానికి చాతుర్వర్ణ వ్యవస్థను పునఃస్థాపించడానికి ప్రయత్నం చేశారు. వారి వాద మేమిటంటే పుట్టుకతో ఎవరూ ద్విజులుకారు. గుణ, కర్మలను బట్టి ఏపర్ణస్తుడైనా విప్రుడు, రాజన్యుడు, వైశ్యుడు, శూద్రుడు కావచ్చునని భావించారు. అర్ధశతాబ్దికాలం గడచినా పుట్టుకతో బ్రాహ్మణ కుటుంబములో పుట్టినవాడు గుణకర్మల వల్ల శూద్రుడైనవాడుగాని, శూద్రుడు తన సంస్కారంవల్ల బ్రాహ్మణుడైన వాడుగాని మనకు కనబడడు. అందుచేత ఇది శుష్కవాచం. ఆచరణయోగ్యమైనదికాదు. ఈ సిద్ధాంత ప్రచారంవల్ల – బ్రాహ్మలు యజ్ఞోపవీతాలు ధరించుకోవడం. బ్రాహ్మణ శబ్దాన్ని, క్షత్రీయ బబ్దాన్ని తనకులాల వెంబడి తగిలించుకొని తృప్తిపడడం జరుగుతోంది తప్ప కులతత్వంలో మార్పు ఏమాత్రం రాలేదు. కాబట్టివర్ణవ్యవస్థ ఏ రూపంలో ఉన్నా ఇప్పటికి కులతత్వం పోయేదికాదు. కులనిర్మూలన జరిగినప్పుడే కులాలు, కులతత్వం నశిస్తాయి. దీనికి వేరేమార్గంలేదు.

కులతత్వంవల్ల సామాజిక వ్యవస్థలోనూ, రాజకీయ వ్యవస్థలోనూ, పరిపాలనా వ్యవస్థలోనూ ఎల్లాంటిఅనర్థాలు, అన్యాయాలూ జరుగుతున్నాయో అందరకూ తెలుసు సమాజ ప్రగతికి కులం అడ్డంగా ఉన్నప్పుడు దానిని తుడిచివేయడానికి సామాజిక వేత్తలుగాని, రాజకీయ వేత్తలుగాని, సంఘసంస్కర్తలుగాని ఎట్టిప్రయత్నం చేయడం లేదు. కులతత్వం వల్ల కొందరికి తాత్కాలికమైన ఉపకారాలు కలుగుతాయి కాబట్టి కులనిర్మూలనకు జరుగుతున్న ప్రయత్నాలకు సమాజంలో పలుకుబడిగల వ్యక్తులు ఎవరూ సహకరించకపోగా వ్యతిరేకిస్తున్నారు. భావితరాలు బాగుపడి శాశ్వతమైన విలువలు, ప్రగతి సాధించడానికి కులతత్వం నశించితీరాలి. కొందరు ప్రగతి శీలక వాదులు కులతత్వం నశించాలని వాంఛిస్తారు. కాని వ్యక్తిగతకారణాలవల్ల సమాజాన్ని ఎదిరించే శక్తిలేక ముందుకురావడంలేదు. రాజారామమోహన్‌రాయ్‌వంటి ప్రజ్ఞ సంకల్పుడు పుట్టి సతీసహగమనం. వితంతు వివాహాన్ని తుడిచి పెట్టిసట్లు, తుడిచిపెడితే తప్ప కులవ్యవస్థ పోదు. ఆనాడు సతీ సహగమనం నిషేధాన్ని వ్యతిరేకించి వితంతు వివాహం తప్పు అనిచెప్పిన వారే కులాంతర వివాహాలకు వ్యతిరేకత తెలుపుతున్నారు. వర్ణాంతర వివాహాలపట వ్యతిరేకత తెలుపుతున్నారు. వర్ణాంతర వివాహ పద్ధతిద్వారా భారత దేశంలో కులాలు ఒకదానితో

ఒకటి సంలీనమైపోయి వ్యత్యాసాలు, కులాధిక్యతలు మరచిపోయినప్పుడే భారతీయ సంఘంలో ఐక్యత, సదవగాహన, నిజమైన విలువలు, సౌభ్రాతృత్వం, సమానత్వం పునఃప్రతిష్టాపింపబడతాయి. సమాజప్రగతికి అడ్డంగా నిలుస్తూవున్న కుల శృంఖలాలు ఛేదించినప్పుడే భారతదేశం; నిజమైన సర్వసత్తాక స్వతంత్ర, గణతంత్ర రాజ్యంగా మనుగడ సాగించగలుగుతుంది.

ఆకాశవాణి సౌజన్యంతో

సాంఘిక ప్రగతి -

కులరహిత సమాజము

సాంఘిక ప్రగతిఅంటే సంఘంయొక్క అభివృద్ధి. దేశములోని, వ్యక్తులందరి సముదాయాన్ని, మనం సంఘం అంటున్నాము. కొద్దిమంది వ్యక్తులు, లేదా, వర్గాల యొక్క అభివృద్ధిని. మొత్తం సంఘంయొక్క పురోగతి అని భావించడానికి వీలు లేదు. గతంలోను. ఇప్పుడుకూడా, ఏదోకొన్నివర్గాలకు చెందినవారు, కొన్ని ప్రత్యేక అవకాశములు కలిగిన కుటుంబాలవారు, ముందుకు వెడుతునే ఉన్నారు. కాని, మనం అట్టివర్గాలు లేక కుటుంబాల పురోగతిని, దృష్టిలో పెట్టుకొని. ఒక మానవసంఘం గాని, దేశంగాని ప్రగతిని సాధించిందని, చెప్పలేము. నిజంచెప్పాలంటే, అనేక దేశాలలో, విప్లవాలు రావడానికి, రాజరికాలు, తదితర పరిపాలనా వ్యవస్థలు పతనం కావడానికి, ఆయాదేశాలలో, కొందరు మాత్రమే అభివృద్ధి సాధించగా, బహుజనులు, కనీస అవసరాలకు ఇక్కట్లుపడడమే కారణముగా కనబడుతోంది. కాబట్టి సాంఘిక ప్రగతి "సర్వే జనాః సుఖినోభవన్తు" అన్న సిద్ధాంతానికి చేరువలో ఉంటుంది. మన దేశంలో, ఎప్పుడూ సిద్ధాంతాలకు లోటులేదు. ఎటొచ్చి, వాటిని అమలు జరుపడంలోనే, ఎక్కడలేని అడ్డంకులు, పక్షపాతాలు అభిమానాలు అడ్డువస్తుంటాయి. పలాభిమానం, దురభిమానంగా మారి, భారతదేశంలో ఏవ్యవస్థ వచ్చినా, దాని ప్రయోజనాలను, ప్రయోజకత్వాన్ని, సంఘపరంకాకుండా, పర్గపరంచేస్తున్న, ఏకైక వ్యవస్థ, కులవ్యవస్థ. కులంఉన్నన్నాళ్లు, కులతత్వం ఉంటుంది. కులం కులతత్వం అనేవి ఒక దానిపై ఒకటి ఆధారపడిఉన్నాయి. సూర్యునకు, వెలుగుకు ఉన్నంత సన్నిహిత సంబంధం, కులానికి కులతత్వానికి ఉంది. వివాహాలకు, పంక్తి భోజనాలకు, చుట్టరికాల రాకపోకలకు, అన్నిరంగాల కార్యకలాపాలకు, కులప్రాధాన్యత ఉన్నది. ఇతర వ్యవస్థలన్నిటిలోనికి, కులపక్షపాతాన్ని ఎగుమతి చేస్తూఉంది ఈ కులవ్యవస్థ. భారతీయ సాంఘిక వ్యవస్థలో, పురోభివృద్ధికి, మొదటి అవరోధం. కులవ్యవస్థ. కులరహిత సంఘనిర్మాణముపైన, భారతీయ సాంఘికాభివృద్ధి ఎక్కువగా ఆధారపడియుంది.

స్వాతంత్ర్యము వచ్చింది. ప్రతిపౌరునికి, సమాన ప్రతిపత్తి. హోదా, అవకాశం కల్పించేందుకు, సర్వప్రజల శ్రేయస్సుకు వీలు కల్పించే విధంగా, మత ప్రమేయములేని లౌకిక వ్యవస్థను స్థాపిస్తూ, ఉత్తమ రాజ్యాంగాన్ని నిర్మించుకున్నాము. ప్రపంచ రాజ్యాంగాలలో, భారత రాజ్యాంగం మేటిగా పరిగణింపబడుతోంది. వయోజన ఓటింగు హక్కు, స్త్రీ, పురుష, తదితర వర్గభేదం లేకుండా సంక్రమింపజేసుకొన్నాము. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, మన రాజ్యాంగంలో పొందుపరుపబడ్డాయి. స్వాతంత్ర్యము వచ్చి రెండున్నర శతాబ్దాలు అయింది. ఇప్పటి, మన పరిస్థితి ఏమిటి? ఎన్నికలలో, రాజకీయ వ్యవస్థలలో కులతత్వం క్రమంగా చోటు చేసుకొని, వీరవిహారం చేస్తూ ఉంది. అన్ని రంగాలలో, కులతత్వం ప్రవహించి వాతావరణాన్ని కలుషితం చేస్తూ, ఐకమత్యాన్ని పోగొట్టి మానవత్వాన్ని నశింపజేస్తూ ఉంది. కుల సంఘాలు నానాటికి పెరుగుతునే ఉన్నాయి. 'ఇందుగలడందులేవని సందేహము వలదు' అన్నట్లు ఉంది, ఈ కులవ్యవస్థ. 'మనవాడు, దొంగ వ్యాపారముగాని, కల్తీ వ్యాపారముగాని చేస్తున్నా, లంచగొండి ఐనా, మనకు దోషాలుగా కన్పించవు. పైగా, ఇతర కులాలవాళ్ళు దొడ్డిదారిన సంపాదించిన ఉదాహరణలు చూపి వాళ్ళకు లేని తప్పు, మనకెక్కడిది అని సమర్థించడం, మనకు పరిపాటి. వాడిని, అపరాధ విముక్తుడిగా, చేయడానికి సర్వ విధములా ప్రయత్నములు చేస్తాము.

అవినీతి, నానాటికి హెచ్చు అవటానికి, ఒక ప్రధానకారణం కులతత్వం, మన సాంఘిక వ్యవస్థ, ఎ త అస్తవ్యస్తంగా, కలుషితంగా ఉందో, చాలామంది గమనించడంలేదు. సంపద పెద్దపెట్టున ఉత్పత్తిచేస్తే, మన లోప్లన్ని తీరిపోతాయని, ఇన్నాళ్లు భ్రమలో ఉన్నాము. సంపద, ఉత్పత్తి, పెరుగగానే, పేదరికం, దానంతట అదే పోతుందని, చెప్పలేకుండా ఉన్నాము, ఎందువల్లనంటే, ఎన్నో ప్రణాళికలు రూపొందించుకొని, ఉత్పత్తి ఎక్కువ చేసుకున్నాము. జనాభా తగ్గుదలకు, కుటుంబ నియంత్రణ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టాము. అయినా, పెరిగిన సంపద సక్రమంగా పంపిణీ కావటంలేదు. పెరిగిన సంపద, ఎక్కువభాగం, కొద్దిమంది బ్లాక్ మార్కెటు వ్యాపారుల రహస్య మందిరములలోను స్వలాభము కొరకు, ప్రజానీకానికి ఘోర ప్రమాదాలను కలుగజేస్తూఉన్న, కల్తీ వ్యాపారస్థుల ఆస్థిపాస్తులలోను, కష్టపడకుండా, ఈ జీవానికి అలవాటుపడ్డ, స్పెక్యులేషన్ కొరుగోలు వ్యాపారస్తుల ఆడదండలలోను, లంచగొండి ఉద్యోగస్థులు. పస్ను ఎగవేతదారుల ఆస్తులలోను, ఉండిపోతూఉంది. సంపదను, ఉత్పత్తిచేస్తూఉన్న శ్రామికజనం తాము ఉత్పత్తిచేసిన,

సంపదలో, తగినపాలు పంచుకోవాలి. మన దేశంలో, అనాదిగా, తక్కువ కులాలను బడేవారు, శ్రామికజనంగా ఉంటూ వచ్చారు. కాయకష్టంచేయడం, వాళ్ల వృత్తి' పయస్సుతో నిమిత్తము లేకుండా, కుటుంబములో. అందరు సాటుపడితేగాని భుక్తి గడవదు. పూర్వజన్మ, దుష్కృతంవల్ల, తమతమ కర్మవల్ల, వాళ్ళు తక్కువగా చూడబడే కులాలలో పుట్టారుగాబట్టి, వాళ్లకర్మ అంతే అనేధోరణి చెలామణిలో ఉంది. 'ప్రారబ్ధకర్మ', సుదుటివ్రాత, పెట్టిపుట్టడం అనే సిద్ధాంతాలు, హిందూసమాజములో, తిష్టవేసుకొని ఉన్నాయి. ఈ దుష్ప్రభావం, కులనిర్మూలనతోనే అంత మొందుతుంది. ఆర్థిక సమానత్వం దానంతట అదే వస్తుందనడంగూడా ఒక భ్రమే. సాంఘిక, అసమానతలు తొలగించడానికి, ప్రత్యేకచర్యలు తీసుకోవాలి. సాంఘిక విప్లవకారుడు, దేశ స్వాతంత్ర్యంకంటే, సాంఘిక సంస్కరణ, ముందుజరగాలని భావించారు, యుగపురుషుడైన కందుకూరి వీరేశలింగంగారు, హిందూ సమాజం, మూఢాచారాలు, మూఢవిశ్వాసాలతో, శిధిలావస్థలో ఉన్నదని, సంస్కరణ ద్వారా. సాంఘిక పునఃనిర్మాణము చేస్తేనే తప్ప, రాజకీయ స్వాతంత్ర్యము వచ్చినా, పూర్తిగా అనుభవించేభాగ్యం మనకు కలుగదని చెబుతూ వచ్చారు. ఆయన స్వాతంత్ర్య సమరంలో, ముఖ్య పాత్ర వహించడంలేదని, ఎంతసేపూ సాంఘిక దురాచారములను, దుయ్యబట్టడంలోనే కాలం వ్యర్థం చేస్తున్నారని, ఆనాటివారు, ఆయన్ని విమర్శించడం జరిగింది కాని, ఆయన వెనుకాడకుండా, తన సాంఘిక సంస్కరణ కార్యక్రమాన్ని, నిర్విఘ్నంగా, కొనసాగించారు. సంఘంలో, నీతి, నిజాయితీ, ఓర్మి, ఋజువర్తన, లోపించినపుడు, పరిపాలనా విధానం ఏదైనా, ఫలప్రదం కాజాలదు. ఈనాడు మన సంఘంలో ఉన్న దోషాలకు, ఒక ప్రధాన కారణం సాంఘిక పరివర్తన పట్ల, మనం శ్రద్ధ వహించక పోవడమే, ఈ దశాబ్ది ప్రారంభంలోనే, వీరేశలింగంగారు, చెప్పిన మాటలలోని సత్యం ఈ రోజు మనకు కండ్లకు కట్టినట్లు కనబడుతోంది. స్వార్థపరత్వం పెచ్చుపెరిగి, సమాజం విలువ కోల్పోయినపుడు, స్వాతంత్ర్యం, అడవినగాసినవెన్నెలలాగా, నిరుపయోగమౌతుంది. భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ అంబేడ్కర్ గూడా దేశానికీ రాజ్యాంగాన్ని అందిస్తూ, మనకు రాజకీయ స్వాతంత్ర్యము మాత్రమే వచ్చిందని, సాంఘిక స్వాతంత్ర్యము రాలేదని, దానిని సాధించేవరకు భారతీయులు విశ్రమించరాదని హెచ్చరించారు. ఆధ్యేయంతోనే, 'హిందూకోడ్ బిల్లు' ను, ఆయన రూపొందించి, పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేయడానికి ప్రయత్నించారు. తను అనుకున్న పద్ధతిలో, బిల్లు ఆమోదంపొందే అవకాశం సన్నగిల్లినపుడు, న్యాయశాఖా మంత్రిగా, రాజీనామా చేయడానికి గూడా ఆయన వెనుకాడలేదు. కులనిర్మూలన జరగనిదే

అంటరానితనం పోదని, ఆయన స్పష్టం చేశారు. సాంఘిక వ్యవస్థ మారాల్సిందే, భారతీయ సమాజాన్ని కూలంకషంగా అర్థం చేసుకోవాలన్న పెద్దలఅభిప్రాయం మనదేశంలో ఏ సంస్కరణగాని, కులవ్యవస్థను మార్చడంతో ప్రారంభం కావలసి ఉంది. రక్త సంబంధం, ఇతర సంబంధాలకన్న విలువైనది. రక్తసంబంధం అనేది, వివాహ వ్యవస్థపైన ఆధారపడి ఉంటుందనేది, నిర్వివాదాంశము. వివాహ విషయంలో, వ్యక్తి స్వాతంత్ర్యంలేకుండా, సమాజపరంగా ఒత్తిడి ఉన్నంతకాలం, కులాలవారిగా, ప్రజలు విడిపోయి, అస్వాభావికమైన, వర్గాలుగా విడిపోక తప్పదు. కుల ప్రాతిపదికపై, ఎన్నికలు ప్రయివేటు ప్రాక్టీసు, వ్యాపార సరళి, పరిశ్రమ స్థాపన, రాజకీయ తదితర వ్యవస్థల, నిర్మాణం తప్పనిసరిగా ఏర్పాటు చేయవలసి ఉంటుంది. వైకి వినడానికి హాస్యాస్పదంగా ఉంటుందిగాని, మన దేశంలో జరుగుతున్నది. దీనికి భిన్నంగా ఉందని అనగలమా? అంటరానితనాన్ని, నిర్మూలిస్తూ, అది పాటించడం అనుసరించినా, అట్టివారిని శిక్షించడానికి చట్టం ఉంది. అయినా, అంటరానితనం పోయిందనిగాని, పోతూఉందనిగాని గట్టిగా చెప్పలేని స్థితిలో ఉన్నాము. ఎందువల్లనంటే, దేశములోని వివిధ ప్రదేశాలలో అడపాతడపా, హరిజనులను హింసించడం, మనము గమనిస్తూనే ఉన్నాము. కుల ప్రాతిపదికపై, విచక్షణ, లేక పక్షపాతం ఉండరాదని మనరాజ్యాంగంలో పొందుపరుపబడే ఉంది. కాని, భారతీయ సాంఘిక వ్యవస్థలో, ప్రముఖ స్థానం ఏర్పరుచుకున్న కులవ్యవస్థ గట్టి ప్రయత్నము చేయకుండా పోయేదికాదు. కులవ్యవస్థ, సంఘ ఐకమత్యానికి, శ్రేయస్సుకు గొడ్డలిపెట్టుగా ఉన్నదని, ప్రజలకు తెలియజెప్పే కార్యక్రమం, ప్రభుత్వం ముమ్మరంగా చేపట్టాలి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళరాష్ట్ర ప్రభుత్వాలు, వర్ణాంతర వివాహాలు, చేసుకొన్నవారికి నగదు బహుమతులు ప్రకటించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యుగపురుషుడు. నవ్యాంధ్ర నిర్మాత, సాంఘిక విప్లవాన్ని ప్రజ్వలింపజేసిన మహానాయకులు, కందుకూరి వీరేశలింగంగారి 125వ జన్మదినోత్సవం జరిపి, కొందరు వర్ణాంతర వివాహాలు చేసికొన్న దంపతులకు, ఆ సందర్భంలో, సన్మానముచేసి, వారి గౌరవార్థం ఒక ప్రత్యేక తపాల బిళ్లను కేంద్ర ప్రభుత్వము వారిచే ప్రచురింపచేశారు. ఒక వర్ణాంతర వివాహముగూడా, ఆ సందర్భములో చేయించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని, ఈ విషయములో మనము అభినందించవలసిఉంది ఈ ప్రయత్నమే చాలా ఉధృతమైన పూనిక కావాలి. పునరూజ్జీవనము పాటుపడుతున్న, స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహించి, పునరూజ్జీవనము, ప్రత్యేక కార్యక్రమం. ఏర్పాటు చేసికొని, అంచెలవారిగా, అమలుజరపాలి వర్ణాంతర వివాహాలు

చేసుకొన్నవారికి, ఉద్యోగాలలో, కొంత ప్రాముఖ్యత ఇవ్వటానికి, రాజ్యాంగసవరణ, ఆలోచించవలసి ఉంటుంది. విద్యార్థులకు, కులవ్యవస్థ పాటించటంవల్ల, దేశం, ఏలాంటి అనర్థాలపు గురిజౌతుందో, సోదాహరణంగా, తెలియజెప్పి, వారిని కర్ణాంతర వివాహాలకు, సుముఖులుగా చేయాలి. పాఠ్య గ్రంథాలలో, కులాధిక్యతను కులవ్యవస్థను సూచించే భాగాలను చేర్చరాదు. వ్యక్తుల ఆర్హతలనుబట్టి, యువతీ యువకుల మధ్య, ఆకర్షణ ఏర్పడినప్పుడు, వారి ఇష్టానుసారం, వివాహితులు కావడానికి, అభ్యంతరాలు ఉండగూడదు. ఇలా జరిగినప్పుడు, పరకట్నాల బెడద, ఆడపిల్లల పెండ్లి కొరకు తల్లిదండ్రులు పడే వేదన, చాలవరకు తగ్గుతు ది. వివాహ విషయం లో, కులం పాటించనప్పుడు ఆ దంపతులకు పులాలపట్ల అపేక్ష, ఏర్పడదు. వారి సంతానానికి, కులం ఉండనే ఉండదు. ఆ విధంగా కులమనేది భారతీయ సంఘం నుండి, వెలివేయబడుతుంది. సంకుచితమైన, కుల పరిధులనుండి, వ్యక్తులు బయట ప్రపంచంలోనికి వచ్చి, స్వేచ్ఛావాయువులు పీల్చినప్పుడు. భారతీయులంతా, ఒకటే జౌతారు. ఏ భాషమాట్లాడినా, భారతీయుల మధ్య అడ్డుగోడలుండవు. మతాంతర వివాహాలకు గూడా ప్రభుత్వ ప్రోత్సాహముంటుందని, ఇటీవల శాసన సభలో ముఖ్యమంత్రి ప్రకటించారు. ఒక ఆర్డరుగూడా ఈమధ్యనే జారీచేశాను. ఇది హర్షించ వలసిన విషయం, మతం, అనేది, వ్యక్తిగతమైన, నమ్మకముతో కూడుకున్న వ్యవస్థ మాత్రమే. భార్యాభర్తలు వేరువేరు రాజకీయ పార్టీలలో ఉండవచ్చు. ఒకరు శాఖాహారులు, రెండవవారు మాంసాహారులుకావచ్చు. అలాగేవారిద్దరు వేరువేరు మతాలలో నమ్మకము ఉంచుకోవచ్చు. వారిపిల్లలకు ఏ మతము కావాలనుకుంటే ఆ మతాన్ని వారు స్వీకరించవచ్చు. ఈవిధముగా ఒకకుటుంబములోనే భిన్నభిన్న మతాల వారున్నప్పుడు, మతపరమైన కొట్లాటలకు తావుండదు. సంఘములో, దేశములో, అదే విధమైన సర్దుబాటు, అవగాహన ఉంటే, మతపరమైన విభేదాలుసమసిపోయి, మానవత్వపు విలువలు పెరుగుతాయి. కృత్రిమమైన, మానవనిర్మితములైన, ఈఅడ్డంకులు, భారత జాతీయ భావానికి, ఐకమత్య సముద్ధరణకు అడ్డురాకుండా, మతం, భాషవిడదీసే శక్తులుగాకాక, సమ్మేళన పరిచే శక్తులుగాపనిచేస్తాయి. మానవత్వం పెంపొందితే అంటరానితనం, కిల్బిషాపరం, లంచగొండితనం, తక్కినసామాజిక దురాచారములు నశిస్తాయి. అన్నిమతాల, ముఖ్య ధ్యేయం మానవ శ్రేయస్సే కాబట్టి, మానవత్వం పెంపొందిమానవతా వాదుల సంఖ్య, దేశంలో పెరిగినప్పుడు సామాజిక వాతావరణం బాగుపడుతుంది. కనుక, కులహిత సంఘ నిర్మాణం జరిగినప్పుడు, భారతరాజ్యాంగంలో ఉదహరించిన, సౌభ్రాతృత్వం సమానత్వం, వ్యక్తిగౌరవంగల, ఆదర్శ సమాజం, మనం నిర్మించుకో గలుగుతాము.

మన సమాజంలో కులతత్వం పోవాలంటే ఏమి చేయాలి?

"కులానికి, కులతత్వానికి అవినాభావ సంబంధంవుంది.
'నిప్పు' లాంటిది కులమైతే, 'పొగలాంటిది కులతత్వం.
'కులం' అనే నిప్పుతో సమాజం తగులబడుతుంటే,
'కులతత్వం' అనే పొగ వాతావరణమంతా ఆవరించి వుంది.
నిప్పులేనిదే పొగ లేదుగదా!
మంటను ఆర్పకుండా, ఆ పొగను పోగొట్టడానికి ప్రయత్నించటం అవివేకమైన వృధా ప్రయాస".

— అంటారు శ్రీ వీరాస్వామి యీ వ్యాసంలో.

మన దేశంలోని అధిక సంఖ్యాకులైన హిందూ మతస్థుల యొక్క ప్రత్యేకత కులవ్యవస్థ. ప్రపంచంలో ఇంకెక్కడా కన్పించదు. ఇటువంటి సాంఘికవ్యవస్థ భారత జాతిని నిర్జీవంచేసి దేశాన్ని విదేశీయుల దాడులకు గురిచేసి, కొన్ని శతాబ్దాలు బానిసత్వానికి లోను చేయడానికి ఎక్కువగా తోడ్పడ్డది, ఈ కులవ్యవస్థ. లెక్కలేనన్ని కులాలను సృష్టించి, మనిషికి మనిషికి మధ్య అసహజ భేదాలను కల్పించి మన సమాజాన్ని తునకలు తునకలుగా చేసింది, ఈ కులవ్యవస్థ. కొన్ని కులాలలో పుట్టిన వారు అగ్రవర్ణస్థులుగాను, మరికొన్ని కులాలలో పుట్టిన వారు అంటరానివారుగను, పరిగణింపబడుతూ, అంచలవారిగా, హెచ్చుతగ్గులు కులాల రూపంలో దాపరించాయి,

"కులతత్వం పోవాలంటే ఏమిచేయాలి" అని ఆలోచించేముందు, "అసలు యీ కులతత్వం సమాజంలో ఎలా వ్యాప్తిచెందుతున్నది, అని విచారించటం ప్రయోజన కరంగా వుండగలదు. దాన్నిబట్టి, ఎటువంటి చర్యలు తీసుకోవాలో తేలిపోతుంది.

పుట్టుకతోనే పసిపాపను కులం ఆవరిస్తుంది. ఉగ్గుబాలతోనే, కులతత్వం బిడ్డకు నూరిపోయబడుతుంది. తల్లి దండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు కులభేదాలను దైనందిన జీవితంలో పాటించటంద్వారా, అమాయకులైన పసిపిల్లల మనసుల్లో కులతత్వ బీజాలు నాటబడతాయి. పసికందుల హృదయాల్లో, ఆ పిన్న వయస్సులోనే కులతత్వం జొరబడుతుంది. ఎదురు ప్రశ్నవేసే శక్తిలేదుగనుక, జీర్ణం చేసుకుంటూతు ఆ భావాన్ని. మంచీ, చెడ్డా తెలియని వయస్సు గనుక, తన కుటుంబ సభ్యులు, బంధువర్గంతోపాటు తాముకూడా, యీ కులతత్వ మొలకను నీరుపోసి పెంచుతూ, కులభేదాలను పాటించటంలో, తల్లిదండ్రులను అనుకరిస్తారు. తోటి పిల్లల్లోనే తక్కువ కులం వారితో కలిసి ఆడుకోరాదనీ, ఇంట్లోకి తీసికొని రాకూడదని, వాళ్ల ఇళ్లల్లో మంచినీరు త్రాగరాదని, ఏమైనా పెడితే తినకూడదనీ, తక్కువ కులంవారి యిట్లో ఏమైనా తింటే నాలుకపై చురక పెట్టాలని, మొదలైన బోధనలన్నీ అమాయిక దశలోనున్న పిల్లలకు బోధిస్తారు పెద్దలు.

ఇక పాఠశాలకు పోయే వయస్సు వస్తుంది. ఈ నాటికే కొన్ని పల్లెటూళ్ల బళ్లల్లో, విడిగా కూర్చోబెట్టడంద్వారా అంటరానితనం పాటించటం జరుగుతుంది. పాఠ్యపుస్తకాలు, వాచకాల్లో గూడా కులతత్వాన్ని బోధించేకథలు, పాఠాలుఉంటాయి. "ఆనగా, అనగా ఒక పేరుగల వ్యక్తి ఫలానా కులానికి సంబంధించినవాడు" అని కథ ప్రారంభమవుతుంది. ఇక కులాల వారి ఔన్నత్యాన్ని పొగిడే పురాణ గాథలు, పలాన్ని బట్టి గుణగణాలను బోధించే కొన్ని సూక్తులు నేర్పబడతాయి. హెచ్చుతగ్గు దృక్పథాన్ననుసరించి పంతులుగారు, శాస్త్రిగారు ఎరుకలవాడు 'చాకలివాడు' అని పాఠ్య గ్రంధాలలో ఉండటం, ఉపాధ్యాయుడు గూడా అలాంటి పద ప్రయోగం చేయటం జరుగుతుంది. ఈ రకంగా అక్షరాభ్యాసం అయిన మరుక్షణం నుంచి పాఠశాలలోగూడ, కులతత్వం పరోక్షంగా బోధింపబడుతుంది. అసలు బడికో చేరేటప్పుడు ప్రవేశ పత్రంలో కులం వ్రాయాలంటారు. ఇక, ఒకరినొకరు 'మీకులం ఏమిటి'? అనే కారగాని ప్రశ్న అడుక్కూనే ఊహపస్తుంది. అట్లా అడగ కూడదని చెప్పే వారే పుండకపోగా, 'వారు మన కులంగాదు.' వీళ్లు మనవాళ్లు" అనే భావాలను పెంపొందించే విధానం పిల్లలు గమనిస్తారు. ఈ వయస్సులో పడ్డ భావాలువారి మనస్సుల్లో గాఢంగా నాటుకుంటాయి. ఈ భావాలే, కళాశాల విద్యాస్థాయివరకు పోషింపబడి, కులతత్వపు మరా రాజకీయాలకు లోనౌతారు.

ఇక పండుగలు–పబ్బాలు, మడి–ఆచారాలు, ఒడుగులు–పెళ్ళిళ్ళు, పురుళ్లు–సూతకాలూ, పూజలు–పునస్కారాలు, ఆచార – వ్యవహార విషయాల్లో ఇంకా కులం పేరుతో, అనేక మూఢాచారాల సందర్భాలలో, కులం పూర్తిగా పాటింపబడటం. ఆయా కులాలవారే సమీక్షతంగావటం, సమాజంలో మనిషికిమనిషికీ, మధ్యవున్న అడ్డుగోడలు ఎంత గట్టివోద్యోతక మవుతుంది. వీటినిఅధిగమిస్తే, అతిక్రమించిన వారిని సమాజం ఎలా బహిష్కరిస్తుందో, చుట్టాలు, పక్కాలు ఎలామాకమౌతారో గమనిస్తారు పిల్లలు, యౌవ్వనులు. వారు అప్పటికి ఆర్జించిన శాస్త్రీయ విజ్ఞానసంకస్న, పసితనం నుంచి తమలో కరుడుకట్టుకొని పోయిన మూఢ విశ్వాసాలే బలీయంగా పనిచేయటాన హేతుబద్ధంకాని మూఢాచారాలపైనే మొగ్గు చూపుతు సమాజం యొక్కమూఢబలానికే దాసులై పోతారు.

కులాన్ని, మతం, కర్మ సిద్ధాంతం, తదితర రంగాలతో ముడిపెట్టారు. పైనందిన జీవితంలో, ప్రతి కార్యానికి సంబంధించి మూఢ విశ్వాసాలతో గూడిన విధులు, నియమాలు, క్రోడీకరించి విధించారు. ఎదురు చెప్పినవారు కులంనుండి బహిష్కరింపబడతారు. మరోకులంలో చేరేఅవకాశం పులవ్యవస్థలో లేదు. దిక్కులేని వానిగా చేస్తారు.

ఈ విధంగా సంకుచిత దృక్పథం, వివిధ కులాల మధ్య పరస్పర ద్వేషం, కులాభిమానం, మొదలైన దుర్గుణాలకు లోనైపోతారు. తమకులం తక్కువ కులముగా చూడబడుచున్నా, తమకంటే తక్కువ కులాలను చూసుకొని సంతృప్తితో మునిగి, తేలుతుంటారు. తక్కువకులపు వ్యక్తిని అగౌరవంగా సంబోధించటానికి వెనుదీయరు. మానపత్వంకన్న, కులప్రతిష్ట, కులగౌరవమే ముఖ్యం, వీరికి. ఆహార, వ్యవహారాల్లో ఆంక్షలు విధిస్తుంది కులం. కులరీత్యా కొందరు శాఖాహారులు, కొందరు మాంసాహారులు.

కులానికొక కులదైవం. ఎవరి గుడి వాళ్లది. గ్రామంలోని దేవాలయంలోనికి హరిజనులు రాకూడదు. అమాటకొస్తే, లోనికి ప్రవేశిస్తే వారిని నానా హింసలు పెట్టడమే కాకుండా, వారిని లోనికి రానిచ్చినందుకు ఆదేవుడుగూడ మైలబడ్డాడని, ఆదేవుణ్ణి గూడ వెలివేసి, ఆ దేవాలయాన్ని పాడుబెట్టిన సందర్భాలు గూడా లేకపోలేదు. ప్రాణాధారమైన మంచినీటి చెరువులలో కుక్కలను, గేదెలను, నీరు త్రాగనిస్తూ,

హరిజనులు ఆ చెరువులలో నీరు త్రాగితే వాళ్ళను నానాహింసలు పెట్టిన రోజులు, నీరుమైల పడ్డదన్న మిషతో, ఆ నీటినిగోవు యొక్క మలమూత్రాములనెడి మంత్ర జలముతో శుద్ధిచేసిన మతాచార్యులు లేకపోలేదు.

జీవనోపాధికి ఎవరే వృత్తి చేయాలో, కులమే నిర్ణయిస్తుంది. ఎవరి ఇష్టమైన వృత్తి వారవలంభించి, గౌరవంగా బ్రతక నివ్వరు కులవ్యవస్థను కాపాడే కులాలవారు. కాస్త తెల్లగుడ్డలు వేసుకొని, ఒక హరిజన వ్యక్తి గ్రామ నడిబీధిలో నడిస్తే, 'ఎంత పొగరో చూడ' మని విస్తుపోతారు. అందరికీ విద్య అక్కరలేదని, వేదం చదివినా, విన్నాశూద్రుసినాలుకను, అంటరానివాని నాలుక కాల్చాలనీ, చెవుల్లో సీసంకరిగించి పోయాలనీ న్యాయశాస్త్రాన్ని రూపొందించారు "మనులాంటి వారు. అదే నిజమైన ధర్మమని నమ్మితారు, కులతత్వవాదులు.

ఇక వివాహ విషయానికొస్తే, తమకులంలోనే వియ్యం పొందాలనే ఆంక్ష. తన జీవిత భాగస్వామిని పంచుకునే విషయంలో గూడ వ్యక్తికి సంపూర్ణ స్వేచ్ఛలేదు. కులాన్ని అధిగమించి వివాహం చేసుకుంటే, బంధుత్వాలు, రాకపోకలు ఆక్షణంనుంచి ఆకస్మాత్తుగా ఆగిపోతాయి. కుల ప్రతిష్టకు భంగం వాటిల్లిందని వారిపై అమానుషంగా దౌర్జన్యకాండకు దిగివారిని సుఖంగా బ్రతకనివ్వరు. కులంచెడ్డారని, కులం లేనివారని అదేదో సమాజంలో అనర్హతగా యెంచి, సమాజం వారియెడల. చిన్నచూపు చూచి వారిని కష్టనష్టాలకు పాలుచేస్తుంది.

ఆఖరుకి పట్టణాల్లో అద్దె ఇల్లు కావాలన్నా, ముందు "మీరెవరు" అని అడుగు తారు. "మనుషులమే" అనే సమాధానం సరిపోదు వారికి. "కులం ఏమిటో కావాలి. రైలు ప్రయాణం చేస్తున్నా కులం ఏమిటో తెలుసుకోవాలనే ఆతురత. కులము తెలుసు కొన్న తరువాత సంభాషణ ధోరణి మారిపోతూ ఉంటుంది.

అభ్యుదయ పంధాలో, హేతువాద దృక్పథంతో విద్యావంతులు, సంస్కరణా భిలాషులు, కుల రాజకీయాలను ఎదిరిస్తే వారిముందూ, చాటునా గూడ వారిని దూషిస్తుంది సమాజం.

ఈ బాధలతా ఎందుకులే' అని కొందరు అర్థంలేనితనంతో కులతత్వానికి— నాగరికతకు మిళ్ళ నలిగిపోతూ, కనీస కుల నియమాలను పాటిస్తుంటారు. ఇంట్లో

ఒక రకంగా బయట, ఒక రకంగా, జీవిస్తు, ఆత్మవంచన చేసుకుంటూఉంటారు. అవసరమైనప్పుడు, తద్దినానికో, పిల్లల పెండ్లికో జంధ్యం వేసుకొని, మిగతా రోజుల్లో తీసేస్తారు కొందరు. బంధువులేమను కుంటారోనని భోజనం దగ్గర ఆపోశనంపట్టారు వాళ్లిళ్ల దగ్గర మాత్రమే మరికొందరు, ఇంట్లో భార్యకు తెలియకుండా బయట స్నేహితుల ఇండ్లల్లో, హోటళ్లలో, మాంసాహారం భుజిస్తారు కొందరు. ఉపన్యాసాల్లో ''అంతాసమానమే అని మాట్లాడినా, హరిజన బస్తీలో మంచినీళ్లు గూడ త్రాగరు మరికొంచరు. కొన్ని ప్రాంతాల హోటళ్లలో, హరిజనులని తెలిస్తే వేరే పాత్రలు గ్లాసులు వారికి ఉపయోగిస్తారు. మరికొందరు, వర్ణాంతర వివాహాలు చేసుకోవచ్చు నంటారేగాని, తమ ఇంట్లో మట్టుకు ఈ సిద్ధాంతాన్ని పాటించరు.

స్వాతంత్ర్యము వచ్చింది. ప్రతి పౌరునికి, సమాన ప్రతిపత్తి, హోదా, అవ కాశం కల్పించేందుకు, సర్వప్రజల శ్రేయస్సుకు వీలు కల్పించే విధంగా, మత ప్రమే యములేని లౌకిక వ్యవస్థను స్థాపిస్తూ, ఉత్తమ రాజ్యాంగాన్ని నిర్మించుకున్నాము. ప్రపంచ రాజ్యాంగాలలో, భారత రాజ్యాంగం మేటిగా పరిగణింప బడుతోంది. వయోజన వోటింగు హక్కు, స్త్రీ, పురుష, తదితర వర్గభేదం లేకుండా సంక్రమింప జేసుకున్నాము. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, మన రాజ్యాంగంలో పొందుపరుపబడ్డాయి. స్వాతంత్ర్యము వచ్చి రెండున్నర దశాబ్దాలు అయింది. ఇప్పటి, మన పరిస్థితి ఏమిటి? ఎన్నికలలో, రాజకీయ వ్యవస్థలలో కులతత్వం క్రమంగా చోటు చేసుకొని, వీర విహారం చేస్తూఉంది. అన్ని రంగాలలో, కులతత్వం ప్రవహించి వాతావరణాన్ని కలుషితం చేస్తూ, ఐకమత్యాన్ని పోగొట్టి మానవత్వాన్ని నశింపజేస్తూ ఉంది. కుల సంఘాలు నానాటికి పెరుగుతూనే ఉన్నాయి. ''ఇందు గలడందులేడని సందేహము వలదు'' అన్నట్లు ఉంది, ఈ కుల వ్యవస్థ. 'మనవాడు' అన్నదానికి, మనకులం వాడన్నదే, మనదేశంలో వాడుకలో ఉన్నఅర్థం. మనవాడు, దొంగ వ్యాపారముగాని, కల్తీ వ్యాపారముగానిచేస్తూన్నా, లంచగొండి ఐనా, మనకుదోషాలుగా కన్పించవు. పైగా, ఇతర కులాలవాళ్లు దొడ్డిదారిన సంపాదించిన ఉదాహరణలు చూపి వాళ్లకు లేని తప్పు, మనకెక్కడిది అని సమర్థింపడం, మనకు పరిపాటి. వాడిని, అపరాధ విముక్తుడిగా చేయడానికి సర్వవిధముల ప్రయత్నము చేస్తాము.

అవినీతి, నానాటికి హెచ్చు అవటానికి, ఒక ప్రధాన కారణం కులతత్వం. మన సాంఘిక వ్యవస్థ, ఎంత అస్తవ్యస్తంగా, కలుషితంగా ఉందో, చాలామంది గమనించడంలేదు. సంపద పెద్దపెట్టున ఉత్పత్తి చేస్తే, మన లోట్లన్నీ తీరిపోతాయని, ఇన్నాళ్లు భ్రమలో ఉన్నాము. సంపద, ఉత్పత్తి, పెరుగగానే, పేదరికం, దానంతట అదే పోతుందని, చెప్పలేకుండా ఉన్నాము. ఎందువల్లనంటే, ఎన్నో ప్రణాళికలు రూపొందించుకొని, ఉత్పత్తి ఎక్కువ చేసుకొన్నాము. జనాభా తగ్గుదలకు, కుటుంబ నియంత్రణ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టాము. అయినా, పెరిగినా సంపద సక్రమంగా పంపణీ కావటంలేదు. పెరిగిన సంపద, ఎక్కువ భాగం, కొద్దిమంది బ్లాక్ మార్కెటు వ్యాపారుల రహస్య మందిరములలోను, స్వలాభము కొరకు, ప్రజాసీకానికి, మోరప్రమాదాలను కలుగజేస్తూఉన్న, కల్తీ వ్యాపారస్థుల ఆస్తిపాస్తులలోను, కష్టపడకుండా, ఈజీమనీకి అలవాటు పడ్డ, స్పెక్యులేషన్ కొనుగోలు వ్యాపారస్థుల అండదండలలోను, లంచగొండి ఉద్యోగసులు, పన్ను ఎగవేతదారుల అదుపులోను, ఉండిపోతూఉంది. సంపదను, ఉత్పత్తిచేస్తూ ఉన్న పారిశ్రామిక జనం, తాముఉత్పత్తి చేసిన సంపదలో, తగిన పాలుపంచుకోవాలి. మనదేశంలో, అనాదిగా, తక్కువ కులాలనబడేవారు, శ్రామిక జనంగా ఉంటూవచ్చారు. కాయకష్టం చేయడం వాళ్ల వృత్తి. వయస్సుతో నిమిత్తము లేకుండా, కుటుంబములో, అందరు పాటుబడితే గాని భుక్తి, గడవదు. పూర్వజన్మ, దుష్కృతంవల్ల, తమతమ కర్మలవల్ల, వాళ్లు తక్కువగా చూడబడే కులాలలో పుట్టారుగాబట్టి, వాళ్ల కర్మ అంతే అనే ధోరణి చెలామణిలో ఉంది. 'ప్రారబ్ధకర్మ', 'నుదుటివ్రాత, పెట్టిపుట్టడం అనే సిద్ధాంతాలు, హిందూ సమాజములో, తిష్ట వేసుకొని ఉన్నాయి. ఈ దుష్ప్రభావం, కులనిర్మూలనతోనే అంతమౌతుంది. ఆర్థిక సమానత్వం వస్తే, సాంఘిక సమానత్వం దానంతట అదే వస్తుందనడం, గూడా ఒక భ్రమే. అన్ని రోగాలకు ఒక మందు ఇవ్వలేము గదా! గొంతుజబ్బుకు, కంటి జబ్బు మందు పాడలేము. వ్యాధి లక్షణాన్ని బట్టి చికిత్స చేయాలి. సాంఘిక అసమానతలు తొలగించడానికి, ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. సాంఘిక విప్లవకారులు, దేశస్వాతంత్ర్యంకంటే, సాంఘిక సంస్కరణ, ముందు జరగాలని భావించారు. యుగపురుషుడైన కందుకూరి వీరేశలింగంగారు, హిందూ సమాజం, మూఢాచారాలు మూఢవిశ్వాసాలతో శిధిలావస్థలో ఉన్నదని, సంస్కరణద్వారా, సాంఘిక వ్యవస్థను పునఃనిర్మాణము చేస్తేనే తప్ప, రాజకీయ స్వాతంత్ర్యము వచ్చినా, పూర్తిగా ఆనుభవించే భాగ్యం, మనకు కలుగదని చెబుతూవచ్చారు. ఆయన స్వాతంత్ర్య సమరంలో, ముఖ్య పాత్రపహించడం లేదని, ఎంతసేపూ సాంఘిక దురాచారములను,

దుయ్యబట్టడంలోనే కాలం వ్యర్థం చేస్తున్నారని, ఆనాటివారు, ఆయన్ని విమర్శించడం జరిగింది. కాని, ఆయన వెనుకాడకుండా, తన సాంఘిక సంస్కరణ కార్యక్రమాన్ని, నిర్విఘ్నంగా, కొనసాగించారు. సంఘంలో, నీతి, నిజాయితీ, ఓర్మి, ఋజువర్తన, లోపించినప్పుడు, పరిపాలనా విధానం ఏదైనా, ఫలప్రదం కాజాలదు. ఈనాడు, మనసంఘంలో ఉన్న దోషాలకు, ఒకప్రధాన కారణం సాంఘిక పరివర్తనపట్ల, మనం శ్రద్ధవహించక పోవడమే, ఈ శతాబ్ది ప్రారంభములోనే, విశేషలింగంగారు, చెప్పిన మాటలలోని సత్యం, ఈ రోజునకు కండ్లకు కట్టినట్లు కనబడుతోంది. స్వార్థపరత్వం పెచ్చుపెరిగి, సమాజం విలువ కోల్పోయినప్పుడు, స్వాతంత్ర్యం అడవినగాచిన వెన్నెలలాగా, నిరుపయోగమౌతుంది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టరు అంబేద్కరు గూడా, దేశానికి రాజ్యాంగాన్ని అందిస్తూ, మనకు రాజకీయ స్వాతంత్ర్యము మాత్రమే వచ్చిందని, సాంఘిక స్వాతంత్ర్యము రాలేదని, దానిని సాధించేవరకు, భారతీయులు విశ్రమించరాదని హెచ్చరించారు. ఆధ్యేయంతోనే, 'హిందూ కోడ్ బిలు' ను, ఆయన రూపొందించి, పార్లమెంటులో ప్రవేశ పెట్టి, ఆమోదింప చేయడానికి ప్రయత్నించారు. తనుఅనుకున్న పద్ధతిలో, బిల్లు ఆమోదం పొందే అవకాశం సన్నగిల్లినప్పుడు, న్యాయశాఖ మంత్రిగా, రాజీనామా చేయడానికి గూడా ఆయన వెనుకాడలేదు. కులనిర్మూలన జరగనిదే అంటరానితనం పోదని, ఆయన స్పష్టం చేశారు. సాంఘిక వ్యవస్థ మారాలనేది, భారతీయ సమాజాన్ని కూలంకషంగా అర్థం చేసుకొన్న పెద్దల అభిప్రాయం. మనదేశంలో ఏ సంస్కరణ గాని, కుల వ్యవస్థను మార్చడంతో ప్రారంభం కావలసి ఉంది. రక్త సంబంధం, ఇతర సంబంధాల కన్న విలువైనది. రక్త సంబంధం అనేది, వివాహ వ్యవస్థపైన ఆధారపడి ఉంటుందనేది, నిర్వివాదాంశము. వివాహ విషయంలో, వ్యక్తి స్వాతంత్ర్యం లేకుండా, సమాజపరంగా ఒత్తిడి ఉన్నంతకాలం, కులాలవారిగా, ప్రజలు విడిపోయి, అస్వాభావికమైన, వర్గాలుగా నిలిచిపోక తప్పదు. కుల ప్రాతిపదికపై, ఎన్నికలు ప్రయివేటు ప్రాక్టీసు, వ్యాపార సరళిని, పరిశ్రమల స్థాపన, రాజకీయ తదితర వ్యవస్థల నిర్మాణం తప్పనిసరిగా ఏర్పాటు చేయవలసి ఉంటుంది. పైకి వినడానికి హాస్యాస్పదంగా ఉంటుందిగాని, మన దేశంలో జరుగుతున్నది దీనికి భిన్నంగా ఉన్నదని అనగలమా ?

కులానికి, కులతత్వానికి అవినాభావ సంబంధం వుంది. 'నిప్పు' లాంటిది కుల మైతే, 'పొగ' లాంటిది కులతత్వం. 'కులం' అనే నిప్పుతో సమాజం తగులబడుతుంటే 'కులతత్వమ' నే పొగ వాతావరణమంత ఆవరించివుంది. నిప్పులేనిదే పొగలేమగదా ! ఆపొగను మాత్రమే పోగొట్టటానికి ప్రయత్నించటం అవివేకమైన వృధాప్రయాస.

కులతత్వం పోవాలంటే, కులం గూడ పూర్తిగా నిర్మూలింపబడాలి. అన్ని రూపాల్లో కులం మటుమాయం కావాలి. ఆనాడే సమాజంలో కులతత్వం సమసిపోయి, ఆరోగ్యవంతమైన మానవ సమాజం ఏర్పడుతుంది. కులతత్వ జ్ఞానంలో మానవత్వం వ్యాపిస్తుంది. మనుష్యులను, సంకుచిత దృక్పథంతో ఒక కులంవారుగా కాకుండా, విశాల హృదయంతో, 'మానవులు'గా చూడగలుగుతాం.

కులవ్యవస్థ, సంఘ ఐకమత్యానికి, శ్రేయస్సుకు గొడ్డలిపెట్టుగా ఉన్నవని ప్రజలకు తెలియజెప్పే కార్యక్రమం, ప్రభుత్వం ముమ్మరంగా చేపట్టాలి.

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు, వర్ణాంతర మతాంతర వివాహాలు, చేసుకున్నవారికి నగదు బహుమతులు ప్రకటించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, యుగపురుషుడు, నవ్యాంధ్ర నిర్మాత, సాంఘిక విప్లవాన్ని ప్రజ్వలింపచేసిన మహానాయకులు, కందుకూరి వీరేశలింగంగారి 162వ జన్మదినోత్సవం జరిపి, కొందరు వర్ణాంతగ వివాహాలు చేసికొన్న దంపతులను, ఆ సందర్భంలో, సన్మానముచేసి, వారి గౌరవార్థం ఒకప్రత్యేక తపాల బిళ్ళను కేంద్ర ప్రభుత్వము వారిచే, ప్రచురింపచేశారు. ఒక వర్ణాంతర వివాహముగూడా, ఆ సందర్భములో చేయించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని, ఈ విషయమునో సరము అభినందించవలసిఉంది. ఈ ప్రయత్నమే చాలదు. ఉధృతమైన పూనిక కావాలి.

కులతత్వం పోవాలంటే, అదిసమాజంలో వ్యాపించటానికి కారణభూతమైన పరిస్థితులన్నిటిని మార్చాలి. వీటికారణాలను ఎదుర్కొని, వాటిని తొలగించుటకు కృషి చేయాలి.

1. ముందు తరాలవారికి కులభావాలు రాకుండా జాగ్రత్తపడాలి. పుట్టబోయే పిల్లలకు కుల సంకేతాలు లేకుండా నామకరణం చేయాలి. వ్యక్తులు తమ పేర్లనుండి అట్టి కులచిహ్నాలను తొలగించి కులం అన్నిరూపాల్లో అదృశ్యమయ్యేట్లు చేయాలి.

2. ప్రతి ఒక్కరు " కులం ప్రస క్తిలేకుండా ప్రతి విషయంలోను వ్యవహరిస్తే మన దృక్పథంలో మార్పువస్తుంది. మన పిల్లలకు అట్టి భావాలు వంట బట్టకుండా తగు జాగ్రత్త వహించాలి.

3. సత్వర పారిశ్రామికీకరణ ద్వారా, కులవృత్తులు అనేవి పోయి, ఎవరికి చేతనైన వృత్తిని, వారు తమ అభిరుచిని బట్టి, చేయుటకు అవకాశాలు పెంపొందింప జేయాలి. వంశపారంపర్య వృత్తులు ఎంచుకునే వ్యవస్థ క్రమేపిపోయి, వ్యక్తి, ఆసక్తి, శక్తి సామర్థ్యాలననుసరించి, వృత్తులు చేబట్టే ఏర్పాట్లు, ఉండాలి.

4. విద్యాలయాల్లో, పాఠ్యపుస్తకాల్లో, కులతత్వాన్ని స్ఫురింపజేసే విషయాలు తొలగింపబడి, సమ సమాజాన్ని, మానవత్వాన్ని, ప్రబోధించే పాఠాలు చేర్చాలి. సంఘ సంస్కర్తల జీవిత చరిత్రలు, సాంఘిక విప్లవోద్యమాల గురించి, గ్రంథాలు రచింపజేసి. బోధనా ప్రణాళికలో పెట్టాలి. విద్యార్థులలో సమసమాజ దృక్పథం నెలకొల్పటానికి, కులతత్వభావాలు విస్మరింపజేయటానికి, ఉపాధ్యాయులు ఎంతో కృషిచేయాలి. హేతువాద శాస్త్రీయ దృక్పథం నెలకొల్పి, మూఢ విశ్వాసాలను తొలగించటానికి, తగు నాన్‌డిటైల్డ్ పుస్తకాలను పాఠ్యప్రణాళికలలో చేర్చాలి.

5. వార్తాపత్రికలలోను, రేడియోల ద్వారాను, పాఠశాల్లల్లో. కళాశాలల్లో వక్తృత్వ, వ్యాసరచన పోటీలద్వారాను, సభలు, సదస్సులద్వారాను, సాంఘిక సంస్కరణలకు ఇతోధిక ప్రచారం జరగాలి. సినిమాలు, స్లైడుల ద్వారా ప్రభుత్వం కులరహిత సమాజ స్థాపనకు విరివిగా, ప్రచారం సాగించాలి. కళాశాల్లో కులనిర్మూలన సదస్సులు నిర్వహించాలి.

6. సంఘ సేవకులు, ఐచ్ఛిక సంస్థలు, యువతీ యువకులు కులనిర్మూలన కృషికి పూనుకోవాలి, ఆందుకు ప్రభుత్వ పోత్సాహం ఉండాలి.

7. కులాంతర వివాహాలు విరివిగా జరగాలి. ప్రభుత్వం, అన్ని కులాల మధ్య అంతర్వివాహాలకు ప్రోత్సాహమివ్వాలి. అట్టి దంపతులకు, ఉద్యోగావకాశాలు కల్పించాలి. రాజకీయ పార్టీలు అభ్యర్థుల నియామకములలో కులాంతర వివాహములు

చేసికొన్నవారికి ప్రాధాన్యత ఇవ్వాలి. అందుకు వీలు కల్పించే విధంగా రాజ్యాంగ సవరణగావించాలి. కులాంతర దంపతులు తమ సంతానానికి కులప్రసక్తి రానీయ గూడదు.

8. ఆడపిల్లల వివాహ వయస్సు 18 సం. కు పెంచి, తాము స్వతహాగా కోరిన వరుని ఎంచుకునే అవకాశం కల్పించాలి. స్త్రీకి గూడా, తల్లిదండ్రుల ఆస్తిలో పురుషునితో పాటు సమాన వాటా వుండేట్లు సమగ్ర సివిల్ కోడ్ రూపొందించాలి. ఆ వాటా రాకుండా చేసే పద్ధతులకు స్వస్తి చెప్పాలి. పురుషులతో పాటు స్త్రీలకు గూడా సమానంగా విద్య నేర్పించాలి. స్త్రీ పురుషుల సహ విద్యాలయాలను ఏర్పరచాలి. స్త్రీలకు పూర్తి స్వాతంత్ర్యము సమాన ప్రతిపత్తి ఉన్నవాడు వారికి ఇష్టమైన వారిని, పురుషుల మాదిరిగానే ఎన్నుకునే పద్ధతి, అమలులోకి వస్తుంది. కట్నాల బెడద గూడా తగ్గుతుంది.

9. కులాల వారీగా కాలనీలు, బావులు, హాస్టళ్ళు, నిషేధించబడాలి. అందరూ కలిసి, కులప్రసక్తి లేకుండా, సహజీవనం చేసే అవకాశం కల్పించాలి.

10. పాఠశాల ప్రవేశ దరఖాస్తులలో, దస్తావేజులలో, ఉద్యోగ దరఖాస్తులలో, ప్రభుత్వ రికార్డులలో, జనాభా లెక్కలలో, కులమత వివరాలు సేకరించరాదు

11. ఎన్నికల్లో, ఓట్లకోసం కులతత్వాన్ని రెచ్చగొట్టకుండా, రాజకీయ పార్టీలు, వ్యక్తి యొక్క నీతి నిజాయితికి ఎక్కువ విలువ ఇచ్చి, కుల ప్రసక్తి లేకుండా, సంఘసేవా పరాయణులను అభ్యర్థులుగా నిర్ణయించి, ఆదర్శ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలి. ప్రజలు కుల ప్రాతిపదికపై కాకుండా అభ్యర్థి యోగ్యతను బట్టి ఓట్లు వేసేటట్లు గట్టి ప్రచారం చేయాలి.

12. కొంత కాల పరిమితి తరువాత, యీ క్రింది చర్యలు గూడా తీసుకోవాలి.

(అ) కులాల పేరిటి సంఘాలను నిషేధించాలి.

(ఆ) రిజర్వేషనుల వలన, కులతత్వం బలపడే ప్రమాదమున్నందున, కుల పద్ధతిపై రిజర్వేషనులు రద్దుచేసి, ఆర్థికంగా వెనుకబడియున్న వారందరికి, స్కాలర్ షిప్పులు ఇచ్చి, వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలి.

(ఇ) దేవాలయాల్లో అర్చకులుగా శిక్షణ పొందటానికి అందరికి అవ్కాశ కల్పించాలి.

(ఈ) వేద పాఠశాలలు మొదలైన విద్యాసంస్థలలో ఆర్థికంగా వెనుకబడియున్న వర్గాల ప్రజలందరికి ఉపకార వేతనములిచ్చి కొన్ని సీట్లు కేటాయించాలి.

(ఉ) ప్రతి సంస్థ ఎన్నికలలోను కుల ప్రస్తి లేకుండా సాంఘిక రంగంలో కృషి చేయుచున్న వ్యక్తులను, వర్ణాంతర, మతాంతర వివాహాలు చేసికొన్న వ్యక్తులను అభ్యర్థులుగా నిలబెట్టాలని రాజకీయ పార్టీలు ఒక అంగీకారానికి రావాలి. ఓట్ల కోసం కుల ప్రచారం చేసే వారిని గట్టిగా శిక్షించాలి.

(ఊ) ప్రైవేటు కంపెనీలలో, మరియు ఫ్యాక్టరీలలో, యజమానులు తమ కులం వారికే ఉద్యోగాలివ్వటం నిషేధించాలి. ఇలా చేసే వారిని శిక్షార్హులుగా చేయాలి.

13. ఐచ్ఛికంగాను, శాసనరీత్యాను సాంఘిక విప్లవాన్ని త్యాగనిరతితోను దీక్షతోను, నిర్వహించి సమాజంలో ఏ రూపంలోను కుల ప్రస్తి రాకుండా మార్పు తేవటానికి ప్రభుత్వమూ, ప్రజలూ కలిసి కృషి చేయాలి. అనాడే, సమాజంనుండి కులతత్వం తొలగింపబడి, మానవత్వం పెంపొందుతుంది. మతాంతర వివాహాలకు గూడా ఆంధ్ర పదేశ్ ప్రభుత్వం, ఆర్థిక సహకారం ఇవ్వటం, హర్షించదగిన విషయం. మతం అనేది, వ్యక్తిగతమైన, నమ్మికతో కూడుకున్న వ్యవస్థ మాత్రమే. భార్యా భర్తలు వేరువేరు రాజకీయ పార్టీలలో ఉండవచ్చు ఒకరు శాఖాహారులు రెండవ వారు మాంసాహారులు కావచ్చు. అలాగే, వారిద్దరు వేరువేరు మతాలలో నమ్మకము ఉంచుకోవచ్చు. మతాంతర వివాహాలు గూడా జరగాలి. వారి పిల్లలకు, ఏ మతము కావాలనుకుంటే ఆ మతాన్ని వారు స్వీకరించవచ్చు. ఈ విధంగా ఒక కుటుంబములోనే భిన్న భిన్న మతాల వారున్నప్పుడు, మతపరమైన కొట్లాటలకు తావుండదు. సంఘములో, దేశములో, అదే విధమైన సర్దుబాటు, అవగాహన ఉండే, మతపరమైన విభేదాలు నసిసి పోయి, మానవత్వపు విలువలు పెరుగుతాయి. కృత్రిమమైన, మానవ నిర్మితములైన ఈ అడ్డంకులు, భారత జాతీయ భావానికి, ఐకమత్య సముద్ధరణకు అడ్డురాకుండా, మతం, భాష విడదీసే శక్తులుగా కాక, సమ్మేళన పరిచే శక్తులుగా పనిచేస్తాయి. మానవత్వం పెంపొందుతుంది. మానవత్వం పెంపొందితే, అంటరానితనం, కృత్రిమ్యాపారము, అంచగొండితనం, తక్కిన సాంఘిక దురాచారములు నశిస్తాయి. అన్ని మతాల,

ముఖ్య ధ్యేయం, మానవ శ్రేయస్సే గాబట్టి, మానవత్వం పెంపొంది, మానవతావాదుల సంఖ్య; దేశంలో పెరిగినప్పుడు, సాంఘిక వాతావరణం బాగుపడుతుంది. కనుక, కుల రహిత సంఘ నిర్మాణం జరిగినప్పుడు, భారత రాజ్యాంగంలో ఉదాహరించిన, సౌభ్రాతృత్వం సమానత్వం, వ్యక్తి గౌరవంగల, ఆదర్శ సమాజం, మనం నిర్మించుకోగలుగుతాము.



నేటి సాంఘిక సమస్యలు

మన దేశం ఇప్పుడు మిక్కిలి గడ్డు సమస్యలను ఎదుర్కొంటూ ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 25 సంవత్సరములు గడిచినప్పటికి ప్రజల్లో భాష, మతము ప్రాంతీయత సరిహద్దులాలు మొదలైన విషయాలకు సంబంధించిన విభేదాలు ప్రాణ, నష్టానికి ఆస్తి నష్టానికి, దారితీస్తున్నాయి. హిందూ సమాజంలో కులతత్వ పిశాచం తన ప్రభావాన్ని అన్ని రంగాలలోనూ చలాయిస్తూనే ఉన్నది విచ్ఛిన్నకర ధోరణులు, గతంలోకంటే, ఇప్పుడు ఇంకా ఎక్కువగా కానవస్తున్నాయి. ఇదివరకు మనం సాధించింది ఏ మైనా ఉంటే దాన్ని ఇప్పుడు సర్వనాశనం చేయడానికి పూనుకుంటున్నామనిపిస్తుంది. సమాజంలోని కొద్దిపాటి భేదాలు, గోరంతలు, కొండంతలు చేసి, తమ ప్రయోజనాలకు, వినియోగించుకోడానికి కొందరు స్వార్థపరులు విద్యార్థులను, హింసాత్మకమైన అలజడులు చేయడానికి, పురికొల్పుతున్నారు. ఆందోళన చేయనిదే ఏ సమస్యా పరిష్కారం కాదనే భావం ఈనాడు ప్రజల మనస్సులలో నాటుకొనిపోయింది. రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ, ప్రజాస్వామిక పద్ధతులు నెలకొని ఉన్నాయి. ప్రజాప్రతినిధులలో హరిజన శాసన సభలు శాసన పరిషత్తులు, పార్లమెంటు ఉన్నాయి కాబట్టి ప్రత్యేక తరగతికిగాని, వర్గానికిగాని, ప్రాంతానికిగాని సంబంధించిన ఇక్కట్లను ఈ ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ దృష్టికి, తీసుకొని రావచ్చును. సమస్యల పరిష్కారానికి, ఆస్తి నష్టము, ప్రాణహానికి దారితీసే ఆందోళనలు, అల్లర్లు చేయనవసరం లేదు. అట్టి ధోరణి, దేశాభివృద్ధికి శ్రేయస్కరంకాదు వాటిని విడనాడితే తప్ప, మన దేశము ముందంజవేయలేదు. ఇది ఎవ్వరూ కాదనలేని సత్యం.

2. జాతి సమైక్యతకు మతం ఒక్కటే ప్రాతిపదిక కానేది ఇటీవల స్వతంత్ర "బంగ్లాదేశ్" ఆవిర్భావంవల్ల రుజువైంది. ఒకే భాష మాట్లాడే ప్రజలు కలిసికట్టుగా ఉండరనేది. అనుమానాస్పదమేనని, ఆంధ్రప్రదేశ్ రుజువుచేస్తున్నది. భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలయేర్పాటు సరియైనదేనా అని ఇప్పుడు సందేహం కలుగు

తూంది. దేశంలోని ప్రతి పౌరుడు కాను భారతీయుడనే అనుకోవాలిగాని, ఏదో ఒక ప్రాంతానికి పుత్రమే చెందినవారుగానీ, ఏదో ఒక భాష మాట్లాడేవాడుగాగాని లేక ఏదో ఒక మతస్థుడనినిగాని భావించుకొనరాదు. ప్రతి రాష్ట్రీయవారు తమకు కేంద్రంనుంచి ఇతర రాష్ట్రాలకంటే ఎక్కువ సహాయం లభించాలని, తమ ప్రాంతం ఇతర ప్రాంతాలకంటే ఎక్కువ వెనుకబడి ఉన్నదని చెప్పుకోవటం పరిపాటి అయినది. తమ భాష, ఇతర భాషలన్నిటికంటే గొప్పదని చాటుకొంటూ ఉంటారు. రాష్ట్రాలను బహు భాషా ప్రాతిపదికపై పునర్వ్యవస్థీకరించి, ఆ రాష్ట్రాలలో ఆంగ్లభాషను, అధికార భాషగా అవలంభించి, రాజ్యాంగం, యొక్క ఎనిమిదవ అనుసూచికలో పేర్కొనబడిన భాషలన్నిటికి సమాన అధికార ప్రతిపత్తి కల్పించడం అసాధ్యం కాదని, అనిపిస్తూ ఉంది. ఆంగ్లభాష మనకు ఎలాంటి నష్టం చేయలేదు పైగా, అది మన జాతీయ సమైక్యతకు ఎంతగానో దోహదం చేసింది. పిల్లలవారి మాతృభాషలోనే విద్యాబోధన చేయాలనేది ప్రభుత్వ విధానమైనప్పటికి, ప్రభుత్వంలో ఉన్నత పదవులలో వున్నవారిలో చాలమంది విద్యాధికులు, ధనవంతులు తమ పిల్లలను ఆంగ్లభాషద్వారా బోధన జరిగే పాఠశాలలకే పంపుతున్నారు. ఈ కపట నాటకం, మనం ఇంకా ఎప్పుడు వదులు కుంటాం? త్రిభాషా సూత్రంకంటే, ద్విభాషా సూత్రం సులువు, ఎక్కువ ఆచరణయోగ్యం కాదా? భాష భావవ్యక్తీకరణకు, ఒకసాధనము మాత్రమే, అని మనం గ్రహించి నట్లయితే భాషాపరమైన దురభిమానానికి ఎట్టి తావూ ఉండదు. మానవుడు అంతరిక్ష ప్రయాణాలు చేస్తున్న ఈ రోజుల్లో, తమ ప్రాంతం, తనభాష అనే సంకుచిత తత్వం పనికిరాదు. మానవకళ్యాణానికి విశ్వమానవ సౌభ్రాతృత్వం, ప్రపంచ ప్రజలందరి సమైక్యత ఈనాడు ఎంతైనా అవసరం. ఆంగ్లభాషను మనం మూడు శతాబ్దాలకు పైబడి అభ్యసిస్తున్నాం. ఆ భాష మనజాతి సమైక్యత కెంతో మేలు చేకూర్చింది. అఖిల భారత సర్వీసులకై జరిగే పరీక్షలు, మరియు పార్లమెంటులోని కార్యకలాపాలు, పదునైదు, భాషలలో నిర్వహించడం అంటే ఎంత కష్టమైన పనో ఊహించండి.

3. పదవులు కోల్పోయిన కొంచరు వ్యక్తులు, సంకుచిత తత్వంతో స్వప్ర యోజనాల కొరకు, సమ్మెలు, బందులు, నిర్వహిస్తున్నారు. రవాణాసౌకర్యాలను పరిశ్రమలను స్తంభింప జేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను, ప్రయివేటు ఆస్తులను నాశనం చేస్తున్నారు. ఈ అల్లర్ల వలన పరిపాలన కూడా స్తంభించి పోతూఉంది పారిశ్రామిక ప్రగతి నిలిచిపోతూఉంది. ధరలు పెరిగిపోతున్నాయి. దొంగ వ్యాపారం

వృద్ధి చెందుతుంది. వీటన్నిటి వల్ల చిట్టచివరకు నష్టపోయేది, సామాన్య పౌరుడే. కరువు భత్యం పెంచాలని, ప్రభుత్వోద్యోగులు సమ్మెచేస్తారు. వారి కోరికలు పరిశీలించడానికి కేంద్రప్రభుత్వం కమిషన్లు, కమిటీలను నియమిస్తుంది. తమ ఉద్యోగుల భత్యంపెంచు తుంది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు కూడ తమకు తగిన ఆర్థికవనరులు లేకపోయి నప్పటికి, తమ ఉద్యోగులకు కూడా భత్యం పెంచక తప్పదు. దాంతో ఇంకా ధరలు పెరిగిపోతున్నాయి. ఉద్యోగికి భత్యం పెరిగినందువల్ల ప్రయోజనం లేకుండాపోతుంది. ఈ విధంగా అవాంఛనీయమైన సంఘటనలు పునరావృతం అవుతూ ఉంటాయి.

4. ప్రజల ఇబ్బందులు తొలగాలంటే, దేశంలో నిజమైన శాంతినెలకొ ల్పాలంటే మన దృక్పథంలో విప్లవాత్మకమైన మార్పు రావాలి. మన ఇరుగుపొరుగు రాష్ట్రాలు మనపట్ల శత్రుత్వవైఖరి అవలంబించి, మనకు నష్టం కలిగించడానికి అదను కోసం వేచివున్నాయి. ఈ పరిస్థితులలో మన దృక్పథం మారకపోతే వినాశనం తప్పదు.

5. మన ఇబ్బందుల తొలగింపుకై హింసాత్మకమైన ఆందోళనలు చేయకుండా స్వస్తి చెప్పాలి. కనీసం, పదిసంవత్సరాలవరకూ, ఎట్టి సమ్మెలుగాని జరుగనీయ కూడదు. ఇబ్బందుల తొలగింపుకు చట్టబద్ధమైన ఏర్పాట్లులేని సందర్భాలలో, కమిటీలు నియమించి వాటి సలహాలను పొంది, ఆ సలహాలను సాధ్యమైనంతవరకు పాటించాలి.

6. విద్యార్థులు ఏ పరిస్థితిలోనూ ఆస్తినష్టమునకు, హింసకు దారితీసిన చర్య లకు దిగరాదు వారుకేవలం, తమ చదువులపట్ల మాత్రమే శ్రద్ధవహించాలి విద్యార్థుల లో క్రమశిక్షణ పెంపొందించాలి. స్వాతంత్ర్యానికి పూర్వము విద్యార్థులు రాజకీయా ల్లోనికతప్పలేదు. కాని స్వాతంత్ర్యం సాధించాం కనుక ఇక విద్యార్థులు రాజకీయాల జోలికి పోపలసిన అవసరం ఏమాత్రంలేదు. ఇప్పుడు పాఠశాలలలోనూ, కళాశాలలలో నూ విద్యార్థి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. కాని, ఆవి విద్యార్థులలో సంఘీభావాన్ని పెంపొందించడానికి బదులుగా కక్షలను రేకెత్తించి, అధ్యయన వాతా వరణాన్ని కలుషితం చేస్తున్నాయి. విద్యార్థి సంఘాలు ఉండడం తప్పనిసరి అను కుంటే, ఆఖరు సంవత్సరం చదువుతున్న విద్యార్థులను మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయడానికి అనుమతించాలి. దీనివల్ల కొంతవరకు బాధ్యతతెలిసిన విద్యార్థులు మాత్రమే ఎన్నిక కావడానికి వీలౌతుంది. విద్యార్థి సంఘాలధ్యేయం కేవలం విజ్ఞానాభి వృద్ధి, విద్యాసౌకర్యాలను సమకూర్చుకొనుట మొదలైనవి మాత్రమే అయి

ఉండాలి విద్యార్థుల్లో సమ్మెచేసే అలవాటు పెంపొందితే, పరీక్షలో కాపీకొట్టడానికి దారితీయవచ్చు. కావున మనయొక్క తల్లిదండ్రులు, సంరక్షకులు విద్యార్థులు సమ్మెలుచేయకుండా నివారించాలి. నేటి విద్యార్థులే రేపటి పౌరులు. దేశంభవితవ్యాన్ని తీర్చిదిద్దవలసిన బాధ్యతవారిపై ఉంది. వారు తమ చదువులపై శ్రద్ధవుంచి కష్టపడి నిజాయితీతో పనిజేసి విజ్ఞానాన్ని ఆర్జించిననాడే, వారు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించగలుగుతారు. బ్రిటిషు ప్రభుత్వకాలంలో రూపొందించబడిన విద్యావిధానం, ఈనాటి మన అవసరాలకు తగినట్లుగాలేదు. ఈ విధానాన్ని ఇప్పటి ప్రజాస్వామిక వ్యవస్థకు అనుగుణంగా మార్చుకోవాలి. పాఠ్యప్రణాళిక విద్యార్థి భావిజీవితంలో ఉపయోగపడేదిగా ఉండాలి. చదువుకున్న ప్రతివ్యక్తికి, ప్రభుత్వ ఉద్యోగం లభించేటట్లు చేయడం ఏ దేశానికి సాధ్యంకాదు. ఒకరైతు కొడుకుగాని ఒకవర్తకుని కొడుకుగాని చదువుకున్నప్పటికి తన తండ్రివృత్తిని చేపట్టడానికి ఇష్టపడడంలేదు. కాయకష్టంతో కూడిన పని చేయడం తన గౌరవానికి భంగమని నేడు ప్రతి విద్యావంతుడు భావిస్తున్నాడు. ఈ మనస్తత్వానికి స్వస్తిచప్పాలి. కాయకష్టానికి ఉండే గౌరవాన్ని మనం గుర్తించాలి. మనం ఏపని చేసినా సరే నిజాయితీతో కష్టపడి పనిచేసి పొట్టపోసు కోవడం హీనమైనదికాదని గ్రహించాలి.

7. ఇప్పుడు గుమాస్తా ఉద్యోగాలకు కూడ కనీస అర్హత బి. ఎ. కావలసి ఉంది. నిజానికి గుమాస్తాపనిచేయడానికి బి. ఎ. వరకు చదవనక్కరలేదు. గుమాస్తా ఉద్యోగాల్లో నియామకాలకు మెట్రిక్యులేషన్ పరీక్షలోని మార్కులను మాత్రమే పరిగణనలోనికి తీసుకోవాలి. అలాచేసినపుడు, కాలేజీల్లో రద్దీ తగ్గుతుంది. వాస్తవంగా విద్య నేర్చుకోవాలనే కుతూహలం, అభిరుచి గలవారు మాత్రమే కాలేజీల్లో చేరడానికి వస్తారు. కాలేజీ చదువుల కొరకు విద్యార్థుల అభిరుచి, ఆసక్తిని పరీక్షించి వారికి ఆయా విషయాలో మాత్రమే చదువు చెప్పించాలి. ఉద్యోగాలకోసం కాలేజీ డిగ్రీలకు ప్రాధాన్యత ఈయరాదు. అభ్యర్థులను ఉద్యోగాలలో చేర్చుకొన్నపిదప, వారు నిర్వహించాల్సిన పనులను బట్టి ఆయారంగాల్లో ప్రత్యేక శిక్షణ యివ్వాలి. కర్మాగారాలను, శిక్షణ కేంద్రాలకు, పారిశ్రామిక సంస్థలకు సాంకేతిక పాఠశాలలను అధికంగా జతపరచాలి. అభివృద్ధి చెందిన దేశాల్లో పనిలో దక్షతగల వారెవ్వరూ ప్రభుత్వ ఉద్యోగాలకొరకు ప్రాకులాడరు. దక్షులైనవారంచరు, చాలావరకు ప్రయివేటు సంస్థల ఉద్యోగాలలోనే చేరుతారు. ప్రయివేటు సంస్థలలో ఉద్యోగానికి పనికిరానివారు మాత్రమే ప్రభుత్వోద్యోగాలలో చేరుతుంటారు.

8. ఇప్పుడు మనదేశంలో వ్యవసాయ భూములపైనను, పట్టణ ప్రాంత ఆస్తులపైనను గరిష్ఠపరిమితి విధించడానికి తీవ్రమైన చర్యలు తీసుకోబడుతున్నాయి. ఉద్యోగస్థుల జీతాలపై కూడ పరిమితి విధించబడాలి. ఉద్యోగ విరమణజేసి ఫించను పొందుతున్నవారు సాంఘిక సేవారంగంలో కృషిచేయాలి.

9. ఇక పారిశ్రామిక రంగం తీసుకుందాం. ఇప్పుడు పరిశ్రమల్లో చీటికి మాటికి సమ్మెలు చేయడం పరిపాటి అయిపోయింది. దీనిపల్లదత్వాన్ని చెబ్బతింటుంది. కాబట్టి సమ్మెలు చేయనవసరంలేకుండా పారిశ్రామిక వివాదాల పరిష్కారం జరిగేటట్లు ఏదైనా ఒక కట్టుదిట్టమైనా వ్యవస్థను ఏర్పరచాలి. కనీసం పదిసంవత్సరాల కాలం పాటైనా సమ్మెలను పూర్తిగా నిషేధించాలి. ఇతోధికంగా పరిశ్రమలను స్థాపించి ఉద్యోగావకాశాలను మరియు ఉత్పత్తిని, పెంచాలి. ఉత్పత్తి పెరిగినపుడే ధరలు తగ్గుతాయి. ధరలు తగ్గినపుడే సామాన్యమానవుడి బ్రతుకు బాగుపడుతుంది.

10. ఇప్పుడు సాంఘిక స్థితులను పరిశీలిద్దాం. మన సమాజంలో ముఖ్యంగా హిందూ సమాజంలో ఎన్నోమూఢనమ్మకాలు, దురాచారాలు వేళ్లూనుకొని ఉ[illegible] కులవ్యవస్థ, మన సమాజాభివృద్ధికి గొడ్డలి పెట్టుగా తయారైంది. సాంఘిక వికాస కార్యక్రమాలను, మనం ఎంత ధనం ఖర్చుపెట్టినా, కులాల నిర్మూలన జరగనిచో, అది బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. ఈ కులవ్యవస్థ, మనదేశానికి ఎన్నో అనర్థాలు తెచ్చిపెట్టింది. కాబట్టి ఈ వ్యవస్థను సత్వరంగా నిర్మూలించాలి. దేశంలో విద్యావ్యాప్తి, దారిద్ర్య నిర్మూలనతో, కుల వ్యవస్థ దానంతటదే రూపుమాసి పోతుందని. ఒక వాదన ఉంది. కానీ ఈవాదన, సరియైనది కాదు. ఎందుచేతనంటే, ఇప్పుడు వివిధ కులాలకు చెందిన సంపన్నులు అధికులు కులవ్యవస్థను పాటిస్తున్నారు. వారిలో కులతత్వం, మనస్తత్వము సమసిపోలేదు. కాబట్టి, కులవ్యవస్థ నిర్మూలన జరగాలంటే, పలాలపల్లె కలుగుతున్న అన్యాయాలను, అనర్థాలను గూర్చి పల్లెపల్లెల్లో ప్రజలకు తెలియజెప్పటానికి కట్టుదిట్టమైన ఒక ప్రచార వ్యవస్థ ప్రభుత్వం లో ఉండాలి. ఈ కులాంతర వివాహాలు ప్రోత్సహింపబడాలి. కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు వారి పిల్లలకు ఉద్యోగాలో ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రామాల్లో తరుచుగా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలి. హరిజన వాడలను, విడిగా ఊరికి

దూరంగా ఎక్కడో నిర్మించగూడదు. హరిజనులకు గ్రామంలో అందరితో పాటే, నివాసం నిర్ణయించాలి. హరిజన బాలురకు వేదమంత్రాలు నేర్పించి వారిని దేవాలయాలో అర్చకులుగా నియమించాలి.

11. మానవ సేవయే మాధవ సేవ అని అన్ని మతాలు ప్రబోధిస్తున్నాయి. అయినా కాని దురాచారాలను మతానికి. దైవభక్తికి అంటగట్టడం జరుగుతోంది. దొంగ వ్యాపారస్థులు, ఆహార పదార్థాలను మందులను కల్తీ చేసేవారు, లంచగొండి ఉద్యోగులు,ఇవంతా తమ అన్యాయార్జితంలో కొంతభాగం దేవునికి చెల్లిస్తే పాప విముక్తి అవుతుందని తలుస్తారు. దేవాలయాల్లోనే జరిగే అన్యాయాలకు అంతులేదు. దేవుని దర్శనానికి, దేవుని పూజకు గూడా రకరకాల రేట్లు నిర్ణయించారు. సంపన్నులు డబ్బు చెల్లించి, గుడిలో పూజలు కల్యాణ మహోత్సవాలు, సహస్ర నామార్చనలు చేస్తుంటారు. ఇవన్నీ జరిగే వరకు, పేదవాడు మాత్రం దేవుని దర్శనం కోసం, చలిలో, ఎండలో గంటల తరబడి వేచియుంచాలి, దేవుళ్లకు జంతు బలి, ఒక్కొక్కప్పుడు మానవ బలి గూడా ఇస్తుంటారు. ఇవన్ని కూడా, తాము చేసిన పాపాలు తొలగిపోతాయనో లేక దేవుడు అనుగ్రహించి తమకు ఏదో మేలు చేహార్చుతాడనో, చేస్తుంటారు. ఇక స్వాములు, గురువుల సంగతి చెప్పనక్కరలేదు. వాళ్లు ఈ కులవ్యవస్థ దేవుడు పెట్టించేనని అమాయక ప్రజల బుర్రల్లో ఎక్కిస్తారు. మానవుడు పౌరబ్ధకర్మను బట్టి ఆయా కులాల్లో జన్మిస్తుంటాడని చెప్తారు. హరిజనులు, తక్కువ కులాలవారు వారి పాదాలు తాకినా, అపవిత్రులైపోయినట్లు భావించుకుంటారు. ఆవులకు, పాములకు, పూజలు చేస్తే పుణ్యం వస్తుందని చెప్తారు. యజ్ఞాలు, యాగాలు చేస్తే వర్షాలు పడతాయంటారు. పూర్వజన్మలో పుణ్యం చేసిన వాళ్లే ఈ జన్మలో భాగ్యవంతులవుతారని చెబుతుంటారు. కాబట్టి ఈ స్వాముల ప్రచారాలను అరికట్టకపోతే, సంఘం ఏనాటికి బాగుపడదు. ప్రజల కష్టాలు తొలగించడానికి భగవంతుని స్తోత్రము చేయాలా? మరి ఈ సమాజంలో దుర్మార్గులూ అవినీతిపరులూ ఆమాయక ప్రజలను దోచుకొని భాగ్యవంతులై బ్రతుకుతున్నారంటే దానికి కారణం ఎవరంటారు? భగవంతుడేనా? వారు పూర్వజన్మలో పుణ్యకార్యం చేశారు. కాబట్టి ఈ జన్మలో ఇవంతా అనుభవిస్తున్నారట. ఈ జన్మలో పాపాలు చేస్తే వచ్చింతరువాత నరకానికి పోతారట అంతవరదాకా వారు ఇక్కడ హాయిగా జీవితం గడపవచ్చునట అప్పటి వరకు వారి పాప కార్యాలను గూర్చి భగవంతుడేమి పట్టించుకోడట. గురువులూ స్వాముల ఆదాయాన్ని, సొమ్మును, వారి తాలూకు భూముల ఆదాయాన్ని అపహరిస్తూ

ఉంటే దుర్వినియోగమౌతూ ఉంటే పట్టించుకోని స్వాములు, భక్తుల కోర్కెలు మన్ని స్తారంటారా ? అంతరిక్ష పరిశోధనల్లో నరకంగాని, స్వర్గంగాని ఎక్కడ ఉన్నట్లు కనిపించలేదు – వీనిని మన మత గురువులు ఎందుకు సృష్టించారంటే మానవుల్లో సత్కారాపేక్ష, పాపభీతి పెంపొందించడానికే. ఈనాడు మానవుడు, వైజ్ఞానిక రంగంలో, ఎంతో ప్రగతి సాధించాడు. మానవుల నడవడిని క్రమబద్ధం చేయడానికి సమగ్రమైన శాసనాలు రూపొందింపబడ్డాయి. కావున మానవులు తాము చేసిన పాప పుణ్యాలకు, చచ్చిన తర్వాత నరకమో స్వర్గమో అనుభవిస్తారని ప్రచారం చేయవలసిన అవసరంలేదు. అవినీతిపరులకు, మనశ్శాంతి ఉండదని ధర్మసూత్రాలు చెబుతూ ఉంటారు. అయితే అన్యాయంగా డబ్బు సంపాదించిన వారందరు మరి భ్రష్టులై పోతున్నారా ? సాంఘిక రంగంలో అభ్యున్నతుని సాధించాలంటే మూఢనమ్మకాలకు, పుక్కిటి పురాణాలకు, స్వస్తిచెప్పాలి. మానవత్వపు విలువలను గూర్చి, విరివిగా ప్రచారం చేయాలి. ప్రజల్లో హేతుబద్ధమైన దృక్పథాన్ని పెంపొందింపజేయాలి. ఆకాశవాణిలో మతసంబంధమైన ప్రసారాలను మానివేసి, ఆ సమయాన్ని సాంస్కృతిక, సాంఘిక కార్యకలాపాల ప్రసారాలకు ఉపయోగించాలి. మానవతా చైతన్యంలేక పోవడం వల్ల ప్రజాస్వామ్యంలో ఆర్థిక, సాంఘిక సమానత్వం సాధించలేకపోతున్నాం.

12. సాంఘిక రంగంలో మార్పులు రావాలంటే, ఈ క్రింది సూత్రాలు ఆమలు జరపాలి.

1. ప్రజలలో హేతుబద్ధమైన లౌకిక దృక్పథం పెంపొందింప జేయాలి.

2. మానవత్వాన్ని పెంపొందింపలేని మతం ఒక బూటకం. కులం, మతం, భాష, జన్మస్థానం, లేక నివాసంతో నిమిత్తం లేకుండా సాంప్రదాయి సిద్ధమైన పూజలు, ఉపవాసాలు, ప్రార్థనల ద్వారా కాక మానవసేవ ద్వారానే తరింప జేసేదే, మతం అని గ్రహించాలి.

3. అందరిలో ఆత్మ విమర్శనా శక్తిని పెంపొందింపజేయాలి.

4. ప్రజలలో క్రమశిక్షణను పెంపొందింపజేయాలి. ఇందుకు మొదటి చర్యగా బస్సు స్టాండులు, సినిమా హాల్సు మొదలైనవాటి దగ్గర క్యూలలో వేచియుండే అలవాటును ప్రజలలో కలిగించాలి.

5. వంద ప్రబోధాలు చేయడం కంటె ఒక్కదానిని ఆచరించడం మంచిదని గ్రహించాలి.

6. లంచగొండితనము, దొంగవ్యాపారం, ఆహార పదార్థాలను మందులను కల్తీచేయడం మొదలైన పనులను గూర్చి సమాచారం తెలియవచ్చిన వెంటనే అందుకు సంబంధించిన అధికారులకు అందజేయాలి.

7. 500 రూపాయలకు మించిన ఆదాయంగల వారందరు తమ ఆదాయంలో కనీసం ఒక్క శాతం "నిరుద్యోగ సహాయనిధికి" తప్పనిసరిగా విరాళంఇవ్వాలి. ఈ డబ్బుతో నిరుద్యోగులకు వసతి గృహాలను, భోజన శాలలను ఏర్పరచి సాంఘిక సంరక్షణ కార్యక్రమాలకు వారిని ఉపయోగించుకోవాలి. అట్టి కార్యక్రమాలలో ఎక్కువ సేవాధర్మం చూపిన వారికి అన్ని రంగాలలోనూ ప్రత్యేక అవకాశములు కల్పించబడాలి. నిధికి జమకట్టబడిన సొమ్ముతో చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ సమస్య పీలైన వరకు పరిష్కరించడానికి ప్రయత్నించాలి.

8. ఏ సమస్య పరిష్కారానికైనా సరే, హింసాత్మకమైన ఆందోళనలు జరుగకుండా చూడాలి.

9. విద్యార్థులు సమ్మెలో పాల్గొనకుండా, దౌర్జన్యపూరితమైన చర్యలకు దిగకుండా చూడాలి.

10. వ్యక్తుల పేర్లలో శర్మ, శాస్త్రి, రెడ్డి, చౌదరి, నాయుడువంటి కుల సంకేతాలు వదలివేయబడాలి.

11. హోటళ్ల పేర్లు బ్రాహ్మణ హోటలు, రాజుల హోటలు అనికాకుండా శాఖాహార హోటలు, మాంసాహార హోటలు అని మార్చబడాలి.

12. హరిజన వాడల్లో తరచుగా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయబడుతుండాలి.

13. కులాంతర, మతాంతర వివాహాలు ప్రోత్సహింపబడాలి.

14. గ్రామాల్లోనూ, పట్టణాలలోనూ పారిశుధ్య కార్యక్రమాలను స్వయంగా నిర్వహించుట ద్వారా స్వయం సహాయక శక్తిని పౌరుల్లో పెంపొందింపజేయాలి.

15 నేరములను, కామోద్రేకమును ప్రేరేపించే సినిమాలు, చూడరాదని ప్రచారం. చెయ్యాలి.

వర్ణాంతర వివాహాలు

వైజ్ఞానికాభివృద్ధితో, మానవుడు కాలం, భూమ్యాకాశాలపై ఆధిపత్యం సంపాదించాడు. ఈ దశలో, వర్ణాంతర వివాహాలప్రసక్తి కొందరికి అత్యల్ప విషయంగా గోచరింపవచ్చు. కాని ప్రపంచం మొత్తంలో, యీనాటికి, వైవాహిక వ్యవస్థకుగల ప్రాముఖ్యత ఉపేక్షనీయమైంది కాదు. వివాహం అనేది, ఇరువురు స్త్రీ పురుషులకు మాత్రమే సంబంధించినది. అయినప్పటికీ, సంఘానికి ఇందులో ప్రమేయం ఉంది. వ్యక్తి – సంఘమూ అవి భాజ్యములు, పరస్పర ఆధారితములు, కనుక వ్యక్తిలేని సంఘమూ, సంఘములేని వ్యక్తి, అభివృద్ధి చెందలేవు. వివాహ విషయంలో, వ్యక్తి గత శ్రేయస్సు, అభిరుచి కలసివుంటాయి. కాని, సంఘం వ్యక్తి వివాహ విషయంలో జోక్యం చేసికొంటుంది. అనేక కులాలు, తెగలు, జాతులు మతాలుగా చీలియున్న సంఘం, వ్యక్తిని, ఆ పరిధుల్లో బంధిస్తూంది. అతని వివాహం కూడా, ఆయా శాఖల్లోనే జరగాలని, అభిలషిస్తూంది. ఎవరైనా, ఆగీటుదాట ప్రయత్నిస్తే, వారిని నానా యిబ్బందులకు గురిచేస్తుంది. ఇందులో, కులం నుండి వెలివేయడం, అనే ఆంక్ష ముఖ్యమైంది. దానివల్ల, అతని జీవనానికి కూడా యిబ్బంది కల్గుతూంది. ఈ స్థితి, యిప్పటికీ గ్రామాలలో ఎక్కువగా కన్పిస్తూంది.

ఈ నాటికి, హిందూ సమాజంలో అధిక సంఖ్యాకులలో, ఒక భావం పాతుకు పోయింది. ఈ గడ్డపై పుట్టిన ప్రతివ్యక్తి, ఏదో ఒక కులానికి చెందియుండాలనేదే అది. కులంముందు పుట్టి, మనిషి తర్వాత పుట్టే, విచిత్రం, మన దేశంలోనే కన్పిస్తుంది. కులం లేకుండా మనిషి మనుగడను ఊహించలేనంతగా అది, యీ దేశంలో పాతుకుపోయింది. ఆదిలో, ఆయా వ్యక్తులు, తమ అభిరుచులను బట్టి, ఆయా వృత్తుల్ని చేపట్టారు. రానురాను వారి సంతానం కూడా, అదే వృత్తిలో నైపుణ్యాన్ని సంపాదించి జీవికోపార్జనకు స్థిరమైన మార్గాన్ని ఏర్పరచుకొని, దానితో, ఆయా వృత్తులు చేసే వారందరూ, ప్రత్యేక శాఖీయులుగా, రూపొందారు. ఆ శాఖలే కులాల పేరిట స్థిరపడ్డాయి.

పుట్టుక అనేది ఒక వ్యక్తి యిష్టానిష్టాలకు సంబంధించినది కాదు, పుట్టుక అనేది ఒక యాదృచ్ఛికమైన సంఘటన. కేవలం, దాని ఆధారంతోనే, ఒక వ్యక్తిని గొప్ప కులస్తుడుగను, మరొక వ్యక్తిని నీచ కులస్తుడుగాను, పరిగణించటం, అసంబద్ధమైన చర్య.

వర్ణాంతర వివాహాలు నిషేధింపబడటంవల్ల, యీనాటి సంఘం ఒకే గృహంలోవున్నా, పరస్పర సంబంధంలేని, లాభాపేక్షతో వ్యవహరించే దుకాణదారులలా వుంది. ఒక కొట్టు పక్కనే, అదే రకమైన కొట్లు పదిమంది పెట్టి, ఏ ఒక్కరికీ, చాలినంత వ్యాపారం లేక, కటకట పడుతూ, పరస్పరం అశుభాన్నికోరే, స్వేచ్ఛా విపణిలోని వ్యాపారుల్లాగా, యీ కులాలు తమతమ గొప్పతనాలు మాత్రమేచాటుకుంటూ, జీవచ్ఛ వాల్లా, జీవన యాత్ర సాగిస్తున్నాయి. తమకు మూలాధారమైన 'మానవ' శబ్దాన్ని మరచి పండుగాని పంతు, 'విభూతి పండు' లా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, చౌదరి, రెడ్డి, నాయుడు, మొదలైన విశేషణాల్ని తగిలించుకొని, వ్యవహరిస్తూన్నాయి. ఎవరైనా సాహసించి కులాల రూపంలో ఏర్పడిన యీ అడ్డుగోడల్ని, వర్ణాంతర వివాహాలనే వాకిళ్లు ఏర్పరచి, తొలగించవూనుకుంటే, ఆర్థికబలం అంగబలంతో, మతెక్కిన గుత్త వ్యాపార సంస్థ, పేద వ్యాపారిని, బికారిని చేసి వదిలినట్లు, ఒక్కొక్కమ్మడిగా, అట్టి వారిని ఆర్థికంగాను, సాంఘికంగానూ, నానా యిబ్బందులు పెట్టడానికి సంకోచించడం లేదు. ఇందుకు యిటీవలే, పార్లమెంటులో కూడా చర్చ జరిగిన, దేశవ్యాప్తంగా అలజడి కల్గించిన, పంజాబుకు చెందిన అజీత్–దలవిందర్‌ల వివాహం. హోషియార్‌పూర్ – జిల్లాకోని, మహిల్‌పూర్ కాలేజీలో, లెక్చరర్లుగా పనిచేస్తున్న వీరిరువురిలో, యువకుడు హరిజన్, యువతి జాట్ కులస్థురాలై యుండి, వివాహం చేసికోబూనడమే, వీరు చేసిన మహాపరాధం. ఈ కారణంగా వీరిని ఉద్యోగాలనుండి తొలగించటానికి, చట్టం అడ్డువస్తుందని వారిరువురూ ప్రిన్సిపాల్‌ని దూషించారనే కుంటి సాకు చూపించి, కాలేజీ మేనేజ్‌మెంటు, వారిరువురను ఉద్యోగాల నుండి తొలగించింది. ఇందులో అన్యాయమేమి లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం కళ్లు మూసుకుంది. అప్పుడు అన్యాయాన్ని సహించలేని కొందరు సభ్యులు, పార్లమెంటులో యీ ప్రశ్న లేవనెత్తగా, ప్రధానమంత్రి వారిరువురుకూ తగినన్యాయం కల్గిస్తామని, హామి యివ్వడం జరిగింది. తన జీవిత సహచరి లేక సహచరుణ్ణి, ఎన్నుకునే హక్కు వ్యక్తులకు లేకుండా చేయడం. మానవుల ప్రాథమిక హక్కులకే భంగకరం. ఈ జాత్యహం కార ధోరణి, మహాభారత కాలంనుండీ కన్పిస్తుంది.

మహావీరుడుగా ప్రసిద్ధిచెందిన కర్ణుని, సూత పుత్రుడని, రాధేయుడని, అవహేళన చేయడం జరిగింది. ఆనాడు అధికార బలాన్వితులగిన, క్షత్రియవంశానికి, తానూచెందిన వాడిననే విషయం, నిరూపించుకోలేక పోవడం వల్లనే, కర్ణుడు అడుగడుగునా అవమానింప బడ్డారు. ఆధునిక కాలంలో అపర మనువుగా ప్రసిద్ధిచెందిన డా॥ అంబేద్కర్ కూడా, ప్రారంభదశలో అగ్రజాతుల విచక్షణాయుత చర్యలకు, గురియయ్యారు. అంచుకే, ఉన్నత కులాలు తక్కువ కులాలుగా చెలామణి అవుతున్నవారి మధ్య వివాహాలు, విరివిగా జరగండే, యీ కుల వ్యవస్థ, నిర్మూలనం కాదు అని అయన ఉద్ఘోషించాడు. ఈ కుల వ్యవస్థలోని చెడులను, బాగా గ్రహించడంవల్లనే, యీ సంకుచిత కుల వ్యవస్థ, భారత దేశానికి, చెడుపు చేస్తున్నదని గాంధీజీ, నెహ్రూలు, నిశితంగా ఖండించారు.

అయితే యిది మాటలద్వారాను, శాసనాలద్వారాను, మాత్రమే జరిగే పనికాదు. ఈ కాలంలో యింకా కులం ఎక్కడవుంది ? అని అన్నంత మాత్రాన ఏమీ ప్రయోజనముండదు. పల్లెటూళ్లలో తప్ప, పట్టణాలలో కులవ్యవస్థ పాటించబడడం లేదనే ఒక దురభిప్రాయం గూడా ఉంది. నేను హరిజనుడనని చెప్పుకుంటే, పట్టణాలలో తక్కిన కులాలవారు యిల్లు అద్దెకు ఇస్తారా? యిలాంటి విచక్షణ వెనుకబడిన కులాలని చెప్పబడే వారిపట్ల గూడా చూపబడుతుంది. ఆర్థిక అభివృద్ధి జరిగినప్పుడు, కుల వ్యత్యాసాలు వాటంతటవే పోతాయనే అభిప్రాయము ఒకటుంది. ఇంచుమించు, ఒకే ఆర్థిక స్థితిలో ఉన్న కులాలవారు, తమలో తాము కులముతో నిమిత్తము లేకుండా ఎందుకు వివాహం చేసుకోరు? ఒకే కులమునకు చెందిన బీదవారు భాగ్యవంతులు, తమ కులము వారినే అన్ని రంగాలలో బలపరుస్తున్నారనే బలమైన వాదన ఒకటుంది. కులవ్యవస్థ నెరగని క్రైస్తవమతం, హిందూదేశములో రెడ్డి క్రైస్తవులను, మాదిగ క్రైస్తవులను ఎలా సృష్టింప గల్గింది? ఆర్థిక రంగంలో విప్లవం సామాజిక రంగంలో విప్లవం, ఒకటే అని అనగలమా ? ఏ రోగానికి ఏ మందు వేయాలో ? అదే వేయాలిగాని, అన్ని రోగాలకు ఒకే మందు సరిపడదు గదా ? ఎన్నో ఏళ్లుగా పస్తున్న యీ వ్యవస్థను, మార్చకపోయినా, అందరం కలసి జీవిస్తున్నామా లేదా, అంటె జాతి సమైక్యతకు, పటిష్టతకు ఎంతహాని అన్ని రంగాలలో కలుగుతున్నదో, జ్ఞాపకము తెచ్చుకోవలసి ఉంటు ది.

"ఉడుముండదె నూరేట్లను
పడియుండదె, పేర్మిపాము పదినూరేళ్లైనస్"

అన్నట్లుగా మనం, ఏదో విధంగా జీవించ కోరడం లేదుకదా! సమాన గౌర వాదరాలతో ఒకరి కష్ట సుఖాలతో, మరొకరు భాగం పంచుకునే నాగరికతాయుత జీవితాన్ని మనం కోరుతున్నాం. భారతదేశ ప్రజలందరు, ఒకే మానవ జాతిగా మనుగడ సాగించాలి మత ప్రమేయములేని మానవ శ్రేయస్సు, అందరికీ సమాన అవకాశాలు కల్పించి సాంఘిక న్యాయం చేకూర్చటంగూడా మన రాజ్యాంగ లక్ష్యమే! అందుకే కులాల నిర్మూలన అత్యవసర చర్యగా వర్ణాంతర వివాహాలు పరిగణింపబడాలి. రక్తం – రక్తం కలిసినప్పుడే, వ్యక్తి వ్యక్తికీ, జన్మవల్ల వచ్చే తేడా తొలగుతుంది. ఇరువురు కులస్థుల కలయికవల్ల జనించిన బిడ్డకు. ఏ కులాన్ని అపాదిస్తాం? ఇలాంటి కులంలేని వారి సంఖ్య విరివిగా పెరిగినప్పుడే కులనిర్మూలన జరుగుతుంది. కులరహిత, నూతన సాంఘిక వ్యవస్థ ఏర్పడుతుంది.

వర్ణాంతర వివాహాలకి సామాన్యంగా చెప్పే అభ్యంతరాలు, కొన్ని ఉన్నాయి. అవేమంటే, ఒకటి–ఆహార వ్యవహారాలలోని తేడావల్ల, భార్యా భర్తలతో విభేదాలు వస్తాయని, రెండు–ఎన్నో వివాహాలు విఫలం అవుతున్నాయని, మూడు–ఇరువురి తరుపు వాళ్ళు వ్యతిరేకించడంవల్ల, వారికి అవసరమైన సహాయ, సహకారాలు కొరవడి వారు కష్టపడతారని, నాలుగు–వారి సంతానానికి వివాహ సమస్య ఎదురవుతుందని.

పై సమస్యలను వర్ణాంతర వివాహాలు, చేసికొన్న దంపతులు ఎదుర్కొంటూనే ఉన్నారు. అయితే, వీటికి వ్యతిరేకులు భావించినట్లుగా, అవి అంత అపరిష్కృతమైన సమస్యలు కావు.

ఆహార వ్యవహారాల్లో, యిద్దరి వ్యక్తుల మధ్య ఉండేతేడా, వర్ణ విభేదంవల్ల కొంచెం అధికంగా, కన్పించ వచ్చు. అయితే పరస్పర ఆవగాహన, స్నేహ దృష్టి, సమభావం మొచలై నవాటిద్వారా దంపతులు యీ యిబ్బందుల్ని, సులభంగా అధిగమించవచ్చు.

వర్ణాంతర వివాహాలు తక్కిన వివాహాల్లాగానే విఫలం కావచ్చు. అయితే దీనికి అన్ని సందర్భాలలోనూ, వర్ణ భేదమే కారణమని, అనుకోనక్కరలేదు. మామూలుగా

జరిగే వివాహాలు, విచ్ఛిన్నం అవడానికి దారి తీసిన విషయాలే, వీటికీ కారణభూతా లవుతాయి. అయితే వర్ణాంతర వివాహాలయెడల కుల వ్యతిరేకత కారణంగా గోరంతలు, కొండంతలుగా చేసి, వీటిని భూతద్దంలోనుంచి చూడటం జరుగుతున్నది.

ఇక మూడవది, సంఘ వ్యతిరేకత కారణంగా కష్టపడవలసి వస్తుందనేది. ఇది నిజమే. సంఘం వ్యతిరేకంగా భావించే వివాహం జరుగగానే, అంతవరకూ బంధు మిత్రులనుండి లభిస్తూ వచ్చిన సహాయ సహకారాలు కుంటుపడతాయి. పైగా ఒక్కొక్కప్పుడు జీవనాధారానికి, జీవితానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. వర్ణాంతర వివాహంచేసికొన్న యువకుల్ని కొట్టించటం యువతుల్ని సంభంధించడం, చివరకు చంపడం కూడా యీనాడు జరుగుతూనే యున్నాయి. కనుకనే యీ అన్యాయ కరమైన, సాంఘిక స్థితిని ఎదుర్కొవాలంటే, ఒక విషయాన్ని గుర్తు చేసికోవలసి ఉంది.

ఒకనాడు బహుళ సంఖ్యాకుల ఆమోదాన్ని పొందినా, సాంఘిక దురాచారమైన సహగమనాన్ని తానొక్కడైనా ఫర్వాలేదనే, అచంచల దీక్షతో, రాజా రామ మోహన రాయి, ఎదుర్కొనబట్టే కదా! ఎన్నో నిండుప్రాణాలు, ఒక సాంఘిక దురాచారానికి, బలికాకుండ రక్షింపగల్గింది! అలానే, వితంతువులైన స్త్రీలు తమ యావజ్జీవితం దుఃఖాంధకారంతో గడుపవలసిన హీన స్థితినుండి, అద్వితీయుడుగా శ్రీ వీరేశలింగం రక్షించి, స్త్రీ పునర్వివాహాల్ని ఎన్నో కష్ట, నష్టాలకు, సాంఘిక బహిష్కృతా లపు ఓర్చి, జరిపించబట్టే కాదా, ఈనాడు స్త్రీ సమాజం అంతా, ఆ మహా పురుషునకు, నివాళులర్పిస్తుంది! సాంఘిక విప్లవానికితోడ్పడే, కార్యక్రమమేదైనా హేతువాద దృక్ప థంతోను, చిత్త శుద్ధితోను, యువతీ, యువకులు, కష్ట, నష్టములు లెక్క చేయకుండా, చేపట్టినప్పుడే, సాంఘిక పురోభివృద్ధి సాధింప గలుగుతాం. స్వయం పోషణాశక్తి లేకుండా యువతీ యువకులు, యీ వివాహాలకు పూనుకోరాదు. ఆర్థిక స్వాతంత్ర్యమున్నప్పుడు, సంఘ వ్యతిరేకత ఏమిచేయలేదు. స్వతంత్రులు, సమర్థులు, వివేకవంతులైన, భార్యా భర్తలకు సంఘం తలవంచి తీరుతుంది. అంతిమ విజయం కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులదే అవుతుంది.

వర్ణాంతర వివాహాలవల్ల కలిగిన పిల్లలకు, వివాహం గురించి, మనమేమి ఆందోళన చెందనవసరం లేదు. కాలం గడుస్తున్న కొద్దీ వర్ణాంతర వివాహం చేసు కొన్నవారి సంఖ్య పెరుగుతునే వుంటోంది. అప్పుడు వారు తమ కిష్టంవచ్చిన వారినే,

ఎవరినైనా వివాహం చేసుకోవచ్చును. ఆవిధంగా వారికి, వివాహావకాశాలు పెరుగుతవే గాని, తరుగవు. ఐనా వారి పెళ్లిళ్లను గురించి ఇప్పుడే ఆందోళన పడటం, అప్రస్తుతమూ, అసంమంజసమూ కూడా అవుతుంది.


పశుగణాభివృద్ధికి, వ్యవసాయాభివృద్ధికి (**Cross Breeding**) అంటే సంకర జాతి మిశ్రమం, మంచిదని వైజ్ఞానికంగా నిరూపింపబడింది. కొద్ది సంఖ్యలోవున్న, శాఖీయులు, తమ శాఖీయులతోనే, వివాహాలు జరుపుకొన్నచో ఆ శాఖీయుల సంతతి క్షీణించి, దుర్బలులై, పాలిపోయిన శరీరాలతో ఉండటం, మనం చూస్తున్నాం. శాస్త్రీయ పరిజ్ఞాన దృష్ట్యా గూడా, వర్ణాంతర వివాహాలు, జాతియొక్క సర్వతోముఖాభి వృద్ధికి దోహదం చేస్తాయనటం అతిశయోక్తి కానేరదు.

ఈ సందర్భంలో, ప్రజాస్వామ్య సోషలిస్టు సమాజ నిర్మాణమే తమ ధ్యేయ మని చెపుతున్న ప్రభుత్వ బాధ్యతకూడా ఎంతైనా ఉంది. మన రాష్ట్ర ప్రభుత్వము, యుగపురుషుడు, నవ్యాంధ్ర నిర్మాత సాంఘిక రంగంలో విప్లవాన్ని ప్రజ్వలింపచేసిన మహా నాయకుడు, శ్రీ కందుకూరి వీరేశలింగం 125వ జయంతి మహా వైభవ ముగా జరిపి, భారత ప్రభుత్వము వారిచే, శ్రీ వీరేశలింగం ప్రత్యేక తపాలా బిళ్లను ప్రచురింపచేసి, వరాంతర వివాహములు చేసుకొన్నవారికి నగదు, ధన రూప ములో ధన సహాయము లభింపజేస్తూ ఆర్డర్లు జారీచేసింది. ఇందు నిమిత్తం ఐదు లక్షల రూపాయలు కేటాయించి, ప్రభుత్వ అధికారులు, ఈ వివాహాలకు ఆహ్వానించ బడ్డప్పుడు విధిగా వెళ్ళాలని, వ్యక్తుల పేరులలో ఉన్న కుల సంకేతాలను ఉచిత గజిటు ప్రకటనతో వదలివేయుటకు అవకాశము కల్పించింది. అదే సందర్భములో ఒక వర్ణాం తర వివాహముగూడా రాష్ట్ర ప్రభుత్వ అధ్వర్యములో ఆంధ్ర ప్రదేశ్ కుల నిర్మూలన సంఘ సహకారముతో జరిగింది. ఆ సందర్భములో వర్ణాంతర మతాంతర వివా హము చేసికొన్న దంపతులను ప్రభుత్వము ఘనముగా సన్మానము చేసినది. వర్ణాంతర వివాహము చేసికొన్న సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి గూడా సన్మానింపబడ్డారు.

ఇటీవల, శాసనసభతో, మతాంతర వివాహాలకుగూడా ప్రభుత్వ సహకారము లభిస్తుందని ముఖ్యమంత్రి సెలవిచ్చారు. ఈ విషయములో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,

ప్రత్యేకంగా ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు విద్యాశాఖామాత్యులు శ్రీ మంతెన కృష్ణారావు సాంఘిక సంక్షేమ మంత్రి శ్రీ ఘాట్టం శ్రీరామమూర్తి అభినందనీయులు.

జాతీయ ఐక్యత వైపు నడిపించే,వర్ణాంతర మతాంతర వివాహాలవైపు యువతరం ధైర్యంగా అడుగు వెయ్యాలి. జాతీయ సమైక్యతను, తద్వారా దేశ సౌభాగ్యాన్ని సాధించాలని ఆశిద్దాం



కులమతాలు

ఆది మానవుడు, సంఘజీవి కాదు. ప్రపంచంలో ఉన్న ఇతర జంతుజాలం లాగానే, ఆటవికమైన అలవాట్లకు లొంగినవాడు. బట్టకట్టుకోవడం నేర్వని మన జాతికి మతం అంటూ ఒకటుండేదని చెప్పలేము. కొన్ని వేల సంవత్సరాల పాటు, జంతు సమూహంతో కలసి, జీవితం గడిపిన మనిషి, వావివరుసలు పాటించని మనిషి మిగతా జీవరాసులకు లేని, తన మేధా సంపత్తితో, అనుభవపూర్వకంగా కొన్ని సత్యాలను, కష్టనష్టాలను తెలుసుకొని, తన చర్యలను క్రమబద్ధం చేసుకుంటూ, కాలక్రమంగా ప్రకృతి సహజమైన, పరిణామం పొంది, మనోవికాసాన్ని అభివృద్ధి చేసికొని, స్థిర నివాసం, వృత్తి, తదుపరి, మతం, అవలంభించినట్లు పరిశోధకులు చెబుతున్నారు. నిజం కూడా అంతే, మనం చూస్తుండగానే మానవుల అలవాట్లు, ఆలోచనలు మారుతున్నాయి. సృష్టి, ఆదినుంచి, ఈ పరిణామం జరుగుతూనే ఉంది. మతమనేది, మానవ జాతి చరిత్రలో ఎప్పుడు బోటుచేసుకుందో, మనం చెప్పలేము. అన్ని ఖండాలలోనూ, అన్ని దేశాలలోనూ, మతం ఒక్కలాగా లేదు. ఒక్కసారి పుట్టి వుండదు. అయితే మతం యొక్క ఆవశ్యకతకు, పుట్టుకకు కారణాలు మాత్రం, ఇంచుమించు ఒక్క విధంగా ఉన్నాయి, అని చెప్పడానికి సందేహం ఎంత మాత్రం లేదు.

ప్రకృతి శక్తులు, మానవుని మనుగడకు విఘాతం కలిగిస్తూ ఉండడం, అందరకూ తెలిసిందే. వాటిని అధిగమించడానికి, మానవుడు ప్రయత్నిస్తూ, కొత్త సాధనాలను సమకూర్చుకోవడం, నూతన మార్గాలను అనుసరించడం, మొదటినుండి జరుగుతూనే ఉంది. మానవజాతి ప్రగతికి ఈ ప్రయత్నమే, జీవగట్టి. ఇతర జీవరాసికి, మానవునికి మధ్య భేదం ఇదే. అంటే, మతి లేదా బుద్ధిని ఉపయోగించడం మానవుని ప్రత్యేకత. మతి అంటే ఆలోచన, లేక తప్పు, మతము మతికి సంబంధమైనదే. మానవులు ఆటవిక జీవితం గడపకుండా, మనుగడ సాగించడానికి, సృష్టికర్త ఒకడు ఉన్నాడని నమ్ముతూ, సంఘ వ్యతిరేక చర్యలు చేసేవారిని, అతడు క్షమించడని, శిక్షించడం చేస్తాడనే సహజ భయం, సృష్టి కర్తపట్ల గౌరవం పెంచిన ఫలితే మతం.

అంతకు మించి ఏమిలేదు. గాలి, వాన, సూర్యరశ్మి, అగ్ని, మానవుని మనుగడకు ముఖ్యమైనవి కాబట్టి, వాటిని ప్రసాదించే శక్తులను దైవ సమానులుగాభావించి, పూజించడం ద్వారా, మతం ప్రారంభమైనదని మనం నమ్మడానికి ఎక్కువ అవకాశం ఉంది. పాముకాటుకు బలియైన మానవుడు, పామును దేవతల జాబితాలో చేర్చి, పాములను పూజించి, పాముల కాటునుండి తప్పించు కోవచ్చునకున్నాడు. అలాగే, మశూచి కానికి మారెమ్మ దేవతని. దేవుళ్ల జాబితా, దేవతామాతల జాబితా వృద్ధిచెందింది. మానవాతీత శక్తుల సంపాదనకు, జబ్బుల నివారణకు జంతు బలులు, నర బలులు కోరే దైవాలను కూడా సృష్టించుకొన్నారు. ఆ బలులు ఈ రోజుకు గూడా జరిగే సంఘటనలు మనం అప్పుడప్పుడు వార్తాపత్రికలలో గూడా చదువుచునే ఉన్నాము. సంతానానికి నరబలి ఇచ్చిన దుస్సంఘటన ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగింది. మానవుడు చంద్రలోకాన్ని, దేవతాలోకంగా సృష్టించుకొన్నాడు. మానవ నాగరికతలో చోటు చేసుకొన్న మతం, కాలం గడచిన కొద్ది, అనేకమైన మార్పులు పొందింది. మతాచార్యులు ఉద్భవించారు. వారి బోధనలను పాటించని వారు శిక్షింపబడ్డారు. పాత మతాలకు ఎదురు తిరిగిన వ్యక్తులు తమ వాదనా పటిమ వల్ల, శక్తియుక్తుల వల్ల, జనాన్ని ఆకట్టుకొని, కొత్తమతాలు స్థాపించి, ప్రచారంచేసి పాత మతాలపై చావు దెబ్బ తీశారు. పాత మతాల పట్ల ఆసక్తి కలవారు. క్రమంగా బలం పుంజుకొని కొన్ని కొన్ని మార్పులు చేసుకొని, విజృంభించి, పాత మతాలను పునఃస్థాపించినట్లు కనబడుతుంది. హిందూమతంపై దెబ్బ తీసిన బౌద్ధ, జైన మతాలు, తిరిగి హిందూ మతం చేతిలో ఓడిపోయాయి. బుద్ధ దేవాలయాలు ఏర్పడి, బుద్ధుడు ఆరాధ్య దైవంగా, కొంత కాలం పూజింపబడినా, బుద్ధుని ప్రవచనాలు, మానవతా సూక్తులు విస్మరింపబడ్డాయి. బుద్ధుని పూజా కార్యక్రమములో, ఆయన చూపిన, ఆచరించిన, మానవతా ధర్మాలు, అడుగంటాయి. అంటే, ఆయనను పువ్వులతో, టెంకాయలతో పూజించటం, ఎక్కువైంది ఆయన చెప్పిన ధర్మాలను ఆచరించటం శూన్యమైంది. బుద్ధ దేవాలయాలు, బుద్ధుని విగ్రహాలు, నిర్జీవ ప్రతిమలుగా, హిందూదేశములో నిలిచిపోయాయి. అయితే, బౌద్ధ, జైన మతాల స్థాపనకు ముందు ఉన్న హిందూ మతానికి, తర్వాత మార్పుచెందిన హిందూ మతానికి చాలా భేదము ఉన్నది. బౌద్ధ, జైన మతాలు ప్రచారం చేసిన అహింస, భూతదయ, మానవసేవే మాధవసేవ, అనే సిద్ధాంతాలను హిందూమతం, కొంతవరకు అంకితం చేసుకొంది. ఇలాగే, యుగయుగాలుగా, దేశదేశాలలో, మత శక్తుల మధ్య కలహాలు జరిగాయి. ఏ మతమైనా స్థాపించిన నాడు, గొప్ప ఉద్దేశం కలిగి ఉంటుంది. బుద్ధుడు, మహావీరుడు, ఏసుక్రీస్తు, శంకరాచార్యుడు, రామానుజా

చార్యుడు, మధ్వాచార్యుడు, మహమ్మదు, గొప్ప తత్వవేత్తలు, వారి ధ్యేయం గొప్పది. మానవ శ్రేయస్సు వారి బోధనలలో అడుగడుగునా కనబడుతుంది. అందరూ స్వార్థాన్ని నిరసించినవారే. సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని బోధించినవారే. కాని, వారు గతించిన తర్వాత, వారి శిష్యులు, అనుయాయులు మత సిద్ధాంతాలను వ్యాఖ్యానిస్తూ, ప్రజలను వక్రమార్గం పట్టించారు. మతం, మంత్రశాస్త్రంగా మారిన రోజులున్నాయి. భూత పిశాచాలను వదిలించటం అన్న నెపంపై, కర్మకాండ జరిగిన రోజులున్నాయి. నియమ నిష్టలతో ఉండవలసిన మతాచార్యులు, నానా అలవాట్లకులోనై, ప్రజలలో తమ గౌరవాన్ని పోగొట్టుకొని, తాము ప్రచారం చేసే మతాలకు సహితం, చెడ్డపేరు తెచ్చారు. మతంయొక్క ప్రాబల్యం ప్రజలపైననే కాకుండా, పరిపాలకులపై కూడా, చాలా ఎక్కువగా ఉన్నట్లు కనబడుతుంది. ఆధునిక యుగంలో ఐరోపా దేశాలవారు, నూతన భూభాగాలను కనుగొన్నప్పుడు, క్రైస్తవ మతాధిపతి 'పోప్' కొత్తగా కనుగొన్న దేశాలను, ఐరోపా దేశాల మధ్య పంపకం చేయడం ఇందుకు తార్కాణం. మత యుద్ధాలు రాజుల మధ్య, దేశాల మధ్య జరిగిన, వాటిని ప్రోత్సహించినవారు. మతాచార్యులే. భగవంతుడు ఒక్కడే నన్న ధృఢ నమ్మిక లేకపోవడం చేత, మానవ సేవకు మించిన దైవసేవ లేదనే సత్యాన్ని విస్మరించడం వల్ల, ఒక మతం వారు ఇంకొక మతం వారికంటే అధికులమన్న దురభిప్రాయం ఎక్కువై భిన్న మతస్థుల మధ్య యుద్ధాలు జరిగాయి, మతాలపేర ఇంకా ఎన్నో ఇతర అన్యాయాలు జరిగాయి. ఒకే దేశంలోనే భిన్న మతస్థుల మధ్య, ఒకే మతస్థుల మధ్య వ్యత్యాసాలు సృష్టింపబడడం మనం చూస్తూనే ఉన్నాము. మూఢనమ్మకాలు, మూఢాచారాలు మన దేశంలో చోటు చేసుకొన్నట్లు, మరి ఏ దేశంలోనూ అంత గాఢంగా అవి అంటుకున్నట్లు కనబడదు. మనో బలాన్ని పెంపొందించుకోవటానికి, మానసిక ఆందోళనను పోగొట్టుకోవటానికి, మనో ధైర్యాన్ని, నిశ్చలత్వాన్ని అలవరచుకోవటానికి, విగ్రహారాధన వచ్చింది. ఆలయాలు వెలిశాయి. విగ్రహారాధన ఉన్నత ఆశయముసకే, ప్రారంభింపబడి, రానురాను కొన్ని అనర్థాలకు గూడా దారితీసింది. మానవుడు, తన ఆకారంలోనే భగవంతుడిని ఊహించి, సృష్టించుకొన్నాడు. "ఇందుగలడందు లేడని సందేహము వలదు" అని, ప్రారంభించిన భగవంతుడు మానవునిలాగే ఉంటూ, బంగారపు కిరీటాలు పెట్టుకొని, పెండ్లి చేసుకొని, పిల్లలు కని, మానవ జీవితపు సరళి నడుపుతూ కనబడ్డాడు. మానవుడే కాకుండా, ప్రపంచంలో అనేక జీవరాసులు ఉన్నాయి కదా! అలాంటప్పుడు భగవంతుడు ఇతర జీవరాసుల ఆకారంలో ఎందుకు ఉండడు? ఆ జీవరాసులకు ఊహా శక్తి లేదుగా! పురాణాలలో, ఆ జీవరాసుల రూపంలో గూడా

కనబడతాడు దేవుడు. కొందరు మతస్థులు విగ్రహాలకు పెళ్ళిళ్లుచేస్తారు. ఒక్క భార్య కాడు, అనేకమందిభార్యలున్నట్లు చూపుంతుటారు. కథలు చెప్పినమ్మిస్తారు. పవ్వళింపు సేవ, మేలుకొలుపు సేవ, స్నానాల సేవకళ్యాణ సేవ వగైరా కార్యక్రమాలు, తంతులు పెట్టి, అమాయకులైన ప్రజలను నమ్మించి, ఈ కర్మకాండ ద్వారా డబ్బు గుంజుకొని, మతమంటే ఖర్చుతో కూడుకొన్న సమస్యలాగ మార్చి పారవేస్తున్నారు. చేతిలో డబ్బు ఉంటే సేవలు, దర్శనాలు సులభంగా లభిస్తాయి. పైసా చేతిలో లెకపోతే, దర్శనానికి గూడా పడిగాపులు కాయవలసిందే. ముడుపులు, మొక్కుబడులు, కానుకలు, చెల్లించుకుంటేనే, అష్టోత్తర, సహస్రనామ పూజలు చేయిస్తేనే, భగవంతుని కటాక్షము అబ్బుతుందనే నమ్మకము, అపోహ, ఎక్కువైంది. చేసిన పాపము, సంఘ విద్రోహ, కార్యకలాపాల చుర్మార్గం (అంటే దొంగ వ్యాపారం, కల్తీ వ్యాపారం, మానవహింస లంచగొండితనం, పన్నుల ఎగవేత వగైరా భగవంతుని నామము ఒక్కసారి స్మరించగానే పోతుందనే నమ్మకం, చలామణిలో ఉంది. చట్ట వ్యతిరేక కార్యకలాపాలతో, సంఘ విద్రోహ చర్యలతో గడించిన డబ్బుతో, కొంతబాగం దేవాలయాలకు ప్రార్థనా మందిరాలకు, విరాళాలుగా ఇచ్చి, కొంత మంది పెద్ద మనుష్యులుగాను, దైవభక్తి పరాయణులు గాను, అమాయక ప్రజల ఆసరణ పొందుతున్నారు. గౌరవాన్ని పెంచుకుంటున్నారు. చేసిన పాపపోతుందన్న నమ్మకంతో, కొంతమంది పేరు ఊరు తెలుపకయే, హుండీలలో లక్షల డబ్బు గుమ్మరిస్తుంటారు మరి కొందరు అలాచేస్తే భగవంతుని అనుగ్రహం కటాక్షంతో, ఎక్కువ ధనార్జన చేయవచ్చునను భ్రమలో ఉంటారు. చేసినతప్పుడు పనులు, ప్రతిదినం కొనసాగిస్తూనే, భగవంతుని పేర కొంత సొమ్ము ముట్టచెప్పి, పాపాన్ని వదిలించుకొని పుణ్యం సంపాదించినట్లు భావించి, తృప్తిపొందుతారు. భగవంతుని ఈ విధముగా, మోసము చేయగలరా ? భగవంతుని లంచగొండిగా, పొగడ్తలకు లొంగేవాడిగా ఊహించడం ఎంతఅపరాధమో, గోచనీయమో, గ్రహించక మనిషి చనిపోతే, ఎంతఖర్చుతో కర్మకాండ జరిపిస్తారో ! చనిపోయినవారి, తిండి తిప్పలకొరకు, శ్రాద్ధాలు. వారు చేసిపోయిన పాపపుణ్యాలువారితో పోవు. కాకులు, పిండాలు కావాలని, వారి ఆత్మలు తిరుగుతూ ఉంటాయనే నమ్మకం ఉంది. చనిపోయినవారి ఆత్మకు, శాంతి ఏమో గాని, ఈ శ్రాద్ధాల వల్ల, కొందరు సోమరిపోతుల జీవనం, బాగా సాగిపోతూ ఉంటుంది. కొన్ని వందలమంది భూతవైద్యులు, జ్యోతిష్యులు, హస్తసాముద్రిక పండిత శ్రేష్టులు మూఢనమ్మకాలపై, డబ్బుకాజేసి కొని సుఖజీవనం సాగిస్తున్నారు. వైజ్ఞానిక రంగంలో, మనము వెనుకబడి ఉండటానికి మూలకారణం, ఈ మూఢ ఆచారాలు మూఢనమ్మకాలే. పురుషులతోపాటు స్త్రీలకు

సమాన ప్రతిపత్తి, గౌరవం సమాజంలో లేదు. మనులాంటి మత గ్రంథకర్తలు స్త్రీలు విద్యకు అర్హులు గారన్నారు. జనాభాలో సగభాగము స్త్రీలైనప్పుడు వారు ఎక్కువమంది అజ్ఞానవంతులుగా ఉన్నప్పుడు స్త్రీజాతి అనేక బాధలకు గురియౌతున్న ప్పుడు సమాజముఎలా అభివృద్ధి సాధించగలదు? ఈదౌర్భాగ్యం చాలదన్నట్లు, ఎక్కడ చూచినా, భగవంతుని అవతారాలని చెప్పుకునే అమ్మలు, మాతలు, బాబాలు, స్వాములు మతాధిపతులు వెలుస్తున్నారు. ఆస్వాములు, వారికున్న జబ్బుల నివారణకు, డాక్టర్ల దగ్గ రకు పోతారు. వారికున్నవని చెప్పుకొనే దైవికశక్తులు, వాటికి ఉపకరించవు. కొందరు, విభూది, శివలింగాలు సృష్టిస్తామనిచెప్పుకొని, ప్రజలనుఆకట్టుకొంటారు. చేయించినఉంగ రాలు, కొన్నవిచేశవస్తువులుఊహామాత్రములోసృష్టించినట్లునమ్మించి, ప్రసాదిస్తుంటారు. ఇంతటి దైవశక్తి గలవారు, ఆహారం ఎందుకు సృష్టించరు? కరువుకాటకాలను ఎందుకు అరికట్టరు? రెండు నదుల మధ్యసేతువు ఎందుకు నిర్మించరు? చేతగాక, వారికిచేతనైన దల్లా, గారడీచేసిఅమాయకప్రజలనుమోసంచెయ్యడమే. శాస్త్రవేత్తలు, పెద్దపెద్దఉద్యోగ స్థులువారినిఆరాధించడం, మనదౌర్భాగ్యం. అది మనానాగరికతలకుగొడ్డలిపెట్టు కొబ్బరి కాయలు కొడితేను, హుండీలోదండిగాధనంవేస్తేను, పూజ పునస్కారాలు చేయిస్తేనూ భగవంతుడు మన కోరికలు తీరుస్తాడని నమ్మకం పుట్టిస్తారు. సృష్టికర్తయైన భగ వంతుడికి కూడా, కోర్కెలు ఉంటాయా? పూర్వము కొంచరు రాజులు, వారిని పొగ డటానికి, కొందరికి ఉద్యోగాలిచ్చి, పొగడ్తతో తబ్బిబ్బవుతూ బట్టాజు పొగడ్తలకు లొంగిపోతుండేవారు. ఈ లక్షణం భగవంతునికి ఆపాదించడం న్యాయమంటారా? మతం యొక్కధ్యేయం. ప్రజలను సన్మార్గంవైపు నడిపించడం మానవసేవ అనే సిద్ధాంతాన్ని అమలుచేయడమే, మతం యొక్క కార్యక్రమంకావాలి. అదే అన్నిమతాల యొక్క ధ్యేయం. అన్నిమతాలలోని, ఈ ముఖ్య అంశం మరుగున పడిపోయింది. చెత్త చెదారం, వివిధ మతాల భిన్న భిన్న కర్మకాండల రూపంలో గింజల క్రింద చలామణి అవుతున్నాయి. ఒక్కొక్కప్పుడు, మతాల పేర జరిగే ఉత్సవాలలో, ప్రజలకు ఒత్తి డులలో, ప్రాణాపాయం, మాన భంగం, నిద్రాభంగం, ప్రశాంతతలేకపోవడం, జరు గుతూఉంటుంది. భయానో, భయానో, చందాలరూపంతో వసూలు చేసినడబ్బు దుర్వినియోగమవుతూ ఉంటుంది. ఆరూపంలోకొందరు డబ్బుజేసుకోవడంగూడా జరుగుతోంది. మానవత్వం నానాటికిక్షీణిస్తూనేఉంది. ఆలయాలు, క్రైస్తవ దేవాలయాలు, మసీదులు, ప్రార్థనా మందిరాల, సంఖ్య తగ్గలేదు. అవినీతి, అక్రమాలు, దురాగతాలు ఎక్కువవు తూనే ఉన్నాయి. మతాల ముఖ్యధ్యేయం, అడుగున పడిపోయింది. ఇప్పుడు మతం

పేరిట పట్టణాలలో మరీ విపరీతమైన దుశ్చర్యలు జరుగుతున్నాయి. వీధిలోనికి గోడలుపెంచి, ఇళ్ళుకట్టి, వాటిమూల ఆంజనేయస్వామి ఆలయమో, అమ్మవారి మందిరమో, రాత్రికిరాత్రి నిర్మాణంచేస్తారు. మునిసిపాలిటీవారు, గృహంపడగొడదామంటే, ఆలయం అడ్డువస్తుంది. ఆలయం పడగొడితే మత కలహాలు, హత్యలు, హింసలు, మారణహోమాలు తప్పవు. మతంపేరిట జరుగుతున్న, ఈ అన్యాయాలు, అక్రమాలు నశించాలి. ఏ మతానికి ప్రభుత్వపరంగా, ధనసహాయము సహకారము లభింపగూడదు. ఎపరి మతం, వారి ఇష్టానికి సంబంధించింది. ఒక దేశంలో, అనేక మతాలవారు ఉండవచ్చు. వారు పౌరులైనపుడు, మతాధారంపై విభజించి ప్రోత్సహించడం కూడని పని. అందుకే, మనరాజ్యాంగంలో, మత పక్షపాతం చూపగూడదని, నిషేధం విధింపబడ్డది. ఎవరికి కావలసిన దుస్తులు వారు ధరిస్తున్నట్లే, ఎవరికి నచ్చిన మతాన్ని వారు అవలంభించడంలో తప్పులేదు ఎటొచ్చీ, మత సహనం కావాలి మతం పేరిట, హింస జరుగకూడదు. మతాలు మానవ శ్రేయస్సుకు తోడ్పడాలి. ఈ విషయాన్నే మహాకవి గురజాడ అప్పారావుగారు తమ గేయంలో సొగసుగా చెప్పారు. "మతం వేరై తేను ఏమోయ్ – మనసులొకటై మనసులుంటే". మతంపేరిట జరుగుతున్న మారుణహోమాన్ని నిరసిస్తూ, ఒకపాటలో, శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు "మతం వద్దూ – గితం వద్దూ మారణహోమం వద్దు" అన్నారు. గోరాగారు, నాస్తికవాదాన్ని లేవదీసి ప్రచారం చేసిందికూడా మతంపేరిట సమాజంలో జరుగుతున్న అమానుషమైన అలవాట్లను, మనస్పర్ధలను, కొట్లాటలను, అరికట్టడానికేనని, మనంగుర్తించాలి, ప్రతిపని భగవంతుడు మనచేత చేయిస్తున్నాడు, మనం నిమిత్తమాత్రులము. చెడ్డపని గాని మంచిపనిగాని మనచేత చేయించేవాడు దేవుడు. కాబట్టి మన ప్రమేయం ఏమీ లేదని సమర్థించుకొంటారు. మన చేతవల్ల ఇతరులు ఎవరైనా కష్టపడుతుంటే, వారు పూర్వజన్మలో చేసిన పాపపాట్లకు " ప్రాయశ్చిత్తం అనుభవిస్తున్నట్లు లెక్క, అనే ఉపదేశం, మన ఆధ్యాత్మిక దేశంలో బహుళ ప్రచారంలో ఉంది. ఇది. చాల ప్రమాదకరమైన సిద్ధాంతం. పీడితప్రజానీకానికి, బాధ కు గురిచేయబడ్డవారికి మీపూర్వజన్మ ఫలం, అని చెప్పటం నేరం కాద టారా? అక్రమ ధనార్జన, పూర్వజన్మ సుకృతమౌతుందా? కర్మసిద్ధాంతము దేశమునకు ఎంతో కీడు తెచ్చింది. బడుగుప్రజలందరు, పూర్వజన్మలో పాపము చేశారా ఈజన్మలో, బీదలుగానే నశించాలా. భగవద్గీతలో ఫలాన్ని ఆశించకుండా, కర్మచేయమని చెప్పబడింది. ఫలాన్ని కోరి, భగవంతుని పేర, ఎంతో కర్మకాండ జరుగుతోంది. మనందొక్క పరమార్థం, పూర్వజన్మ కర్మ ఫలం అనుభవించడ్ర, అని చెప్పేటట్లయితే, మానవశక్తిని మనం శంకించిన వారు

మౌతాము. మనిషి ఆచర్యవంతంగా జీవించాలనే మానవతా సిద్ధాంతానికి స్వస్తిచెప్పిన వారమౌతాము. మతం ఉన్నా లేకపోయినా, మానవతా దృష్టిఉంటేచాలు. తోటి మానవుణ్ణి భ్రాత్భావేమతో చూడలేనివాడు, మత గ్రంథాలు ఎన్ని కంఠస్తంచేసినా ప్రయోజనం లేదు అందుకే, మనకు మతంలేని మానవత్వమైనా కావాలిగాని, మానవత్వంలేని మతంమాత్రంవద్దు. తాను ఇతరులనుండిఆశించేదే, తాను గూడా వారికి అది ఇస్తేచాలు. మతాల ఆశయం నెరవేరినట్లే. సృష్టి కర్తకూడా, మానవుని దగ్గర నుండి ఇంతకన్నా ఆశించడు.

కులం, హిందూ మతానికి ముక్కాళ్ల పీటలాంటిదని కొంచరి అభిప్రాయం, కులం లేని వాడు హిందువు కాడు. మనవాడు అంటే, మన కులంవాడనే చలామణిలో ఉంది. వృత్తిని బట్టి కులాలు పుట్టాయని మన వాళ్లు చెబుతారు. వృత్తి మారినా, కులం మారని దుస్థితిలో మనం ఉన్నాము. భగవద్గీతలో గుణాలబట్టి వర్ణాలు వస్తాయని చెప్పబడిఉంది. విపరీత వ్యాఖ్యానముతో, పుట్టుకతో కులము వస్తూవుంది. ఫలానావాడు ఫలానా కులానికి చెందినవాడు కాబట్టి వాడితో కలిసి మెలసి తిరుగరాదు. సరసన కూర్చోగూడదు, సహపంక్తి భోజనం చెయ్యగూడదు, పిల్లనివ్వకూడదు. ఇంటిలోపలికి రానివ్వకూడదు. చెరువు త్రవ్విన వ్యక్తి అంటరానివాడు. కాబట్టి, చెరువులో నీరు చేర్చినప్పుడు, అతడు ముట్టకూడదు. సర్వాంతర్యామియైన దేవుడి గుడికి, అంటరానివారు పోరాదని శాసించిన మతాచార్యులు లేకపోలేదు. కొందరు కృషిచేసేవారు. కొందరు ఫలితము అనుభవించేవారు. కొందరు పల్లకీ ఎక్కేవారు, కొందరు బోయీలు. హిందూ మతంలో కులంపేరిట వంశపారంపర్యంగా జరుగుతున్న, అన్యాయాల్ని. మహామేధావియైన డా॥ అంబేద్కర్ వంటివారు, అనుభవించిన కష్టాలు ఇవి. ఇతరుల విషయం చెప్పనక్కరలేదు. కులవ్యవస్థకు దారితీసిన వర్ణాశ్రమ ధర్మం, దక్షిణాఫ్రికా లోని, జాతివిచక్షణ సిద్ధాంతానికి, పెద్దన్నగారు. అనూచానంగా, మనదేశంలో పండిత కుటుంబాలు వంశపారంపర్యంగా, పండిత కుటుంబాలుగా గుర్తింపబడుతున్నాయి. విస్పన్న చెప్పిందే వేదం మనందరకూను. పరలోక చింతతో, హేతువాద దృక్పథాన్ని పెంపొందించకుండా, స్వాతంత్ర్యం లేకుండా, మనదేశం కొన్ని వందల సంవత్సరాలు గడిపింది. కూపస్థమండూకాల బెకబెకలవల్ల, దేశంలో స్వతంత్ర ఆలోచనకు, చెవిటితనం వచ్చింది. నిజంగా మనకు, జాతీయ శ్రేయస్సు కావాలన్నా, మన జాతిపిత మహాత్మాగాంధీ, సవభారత నిర్మాత జవహరులాల్ నెహూ్రి, మన దేశ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ గార్లు

కలలుగన్న, ఆశించుచున్న, అహర్నిశలు పాటుపడుచున్న మనరాజ్యంగ లక్ష్యమైన, శ్రేయోరాజ్యము ఒకే ప్రపంచము, ఒకే మానవ జాతికావాల్నా, మానవత్వం పెంపొందాలి. ప్రతివారు, మనరాజ్యాంగ ధ్యేయమైన సమసమాజస్థాపనకు తోడ్పడాలి. కుల వ్యత్యాసాలు, మత వ్యత్యాసాలు మతపరమైన మూఢఆచారాలు, ఔర్థములేని కర్మకాండ పోవాలి. వ్యక్తి ఆసక్తినిబట్టి, వృత్తులు అవలంభించాలి. వైద్యుని కొడుకు వైద్యుడు కానక్కరలేదు. దర్జీ కొడుకు దర్జీ కానక్కరలేదు. దేశ పురోభివృద్ధికి ఇచ్ఛ, స్వేచ్ఛ ముఖ్యం. కులాలవారిమధ్య, మతాలవారి మధ్య విరివిగా వివాహాలు జరగాలి. పరస్పరాను రాగం ఉన్నప్పుడు, యువతీయువకుల వివాహాలకు, కులం, మతం అడ్డు రాకూడదు. అంతర్వ్యత్యాసాలు తొలగించుకొన్న సమాజం, హేతువాద ధృక్పథాన్ని అలవరుచుకొన్న సమాజం, శాస్త్రీయ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసికొన్న సమాజం, మానవత్వాన్ని పెంపొందించుకొన్న సమాజం, బలం పుంజుకొని, ప్రగతి పథంలో పయనించగలుగుతుంది. సమాజంలో పాతుకుపోయిన అన్యాయాలను ఆరికట్టడానికి బలహీన వర్గాల అభివృద్ధికి నేడు ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలించినప్పుడు ఆర్థిక రంగంలోనే, సాంఘిక రంగంలోనే, బడుగు ప్రజలకు న్యాయం చేకూరి తరతరాలుగా అణగారిపోయిన ప్రజానీకం వెలుగులోనికి వచ్చి సమాజ వికాసం పొందగలదని ఆశిద్దాం.

సమ సమాజము --

వర్ణాంతర వివాహాలు

వర్ణము అనే శబ్దానికి రంగు అని సామాన్యముగా మనము చెప్పుకొనే అర్థం. ఈ రంగుకారణంగా అమెరికా, తదితర పాశ్చాత్యదేశాలలో వర్ణవ్యవస్థ కన్పిస్తుంది. అక్కడ తెల్లజాతీయులు, తెల్లజాతీయులు కానివారు, అని రెండే తేడాలున్నాయి. అవి కేవలం శారీరికరంగును బట్టి మాత్రమే ఏర్పడినట్టివని, తెలుస్తూనే వుంది.

కాని భారతదేశములోని వర్ణవ్యవస్థ రంగునుబట్టి ఏర్పడలేదు. గుణాన్నిబట్టి వృత్తుల్నిబట్టి ఏర్పడిందని కొందరి భావన. అందుకు తార్కాణంగా గీతలో చెప్పబడ్డ–

"చాతుర్వర్ణ్యం మయా సృష్టం
గుణ కర్మ విభాగ శః అనే

శ్లోకాన్ని పేర్కొనడం జరుగుతుంది. ఏమైనా ఈ వర్ణవ్యవస్థ, మన దేశంలో వేదకాలం నుండి అమలులో వున్నట్లు కన్పిస్తుంది. ఇందులో పేర్కొనబడ్డ చాతుర్వర్ణ్యాలు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు చెందినట్టివి.

"జన్మనా జాయతే శూద్రః
కర్మణాజాయతే ద్విజః
వేదపాఠంతు విప్రాణాం
బ్రహ్మ జ్ఞానంతు బ్రాహ్మణః"

జన్మచేత అందరూశూద్రులే. కర్మచేత వర్ణాలుఏర్పడుతున్నై. బ్రహ్మజ్ఞానాన్ని ఆర్జించిన ప్రతివాడూ, బ్రాహ్మణుడే అవుతాడు. వేదకాలంలో అలాగే క్షత్రియుడైన విశ్వామిత్రుడు, తన మేధా, ప్రావీణ్యతలవల్ల బ్రాహ్మణుడు, ప్రపంచ ఋషిఅయినాడు.

తల్లి ఊర్వశి, లంజ
తన ఆలు మాదిగ ;
తాను బ్రాహ్మడయ్యె, తగ వశిష్ఠు
డిలను, గుణమెగాని, కులమేమి ముఖ్యము ?
విశ్వదాభిరామ వినురవేమ ;

అన్నాడు వేమన్న, వశిష్ఠుని గురించి.

వేదకాలంలోని, గుణ ప్రధానమైన యీ సిద్ధాంతాన్ని ఆణచివేసి, స్మృతుల కాలంలో, కులం పుట్టుకతోనే వస్తుందని, కృత్రిమ శాసనాలను చేసి, ఏ శూద్రుడైన వేదాలు చదివితే, అతని నాలుక నరికివేయాలని, వింటే వాని చెవుల్లో సీసంకరిగించి పోయాలని, ఇటువంటి కఠినమైన శిక్షలు విధించారు.

ఆదిలో వృత్తినిబట్టి, ఏర్పడ్డ ఈ కులవ్యవస్థ, రానురాను పుట్టుకకు ముడిబెట్ట బడింది. ప్రారంభంలో, ఆయా కులాలమధ్య, సౌహార్ద్రపూరిత సంబంధాలున్నా, తర్వాత వాటి మధ్య, అడ్డుగోడ లేర్పడ్డాయి. కాలక్రమేణా, ప్రతివర్ణం అనేక శాఖోప శాఖలుగా చీలి, కొన్నివేల కులాలుగా రూపొందాయి. ఒక వ్యక్తియొక్కకులం, అత డవలంభించే వృత్తినిబట్టిగాక, పుట్టుకనుబట్టి, నిర్ణయించడం అమలులోనికి వచ్చింది. దానితో, భారతదేశంలోని వర్ణవ్యవస్థ రూపమే మారిపోయింది.

"కులాలకు ఏమీ ప్రాధాన్యతలేదు, యీనాడు, అంతా కలిసిపోతున్నారు" అనే వాదన, కొంతవరకు పట్టణాలకు వర్తించవచ్చునేమోగాని, పల్లెటూళ్ళల్లో, మాత్రం ఆవ్యక్తి ఏకులానికి చెందినాడో, చెప్పేవరకు వదలరు. ఇదినిత్యానుభవమైన విషయం.

తక్కిన మతాల్లోనూ, జాతుల్లోనూలేని హిందూమతంలోని ప్రత్యేకత 'కుల వ్యవస్థ'. దానిలో ఒకభాగం "వెలివెయ్యడం". ఒకవ్యక్తి మరొక కులానికి చెందిన స్త్రీనో, పురుషుణ్ణో వివాహమాడితే, ఆ కులజులు ఆవ్యక్తిని సాంఘికంగా వెలివేస్తారు. అంటేఆరోజునుండిఅతనికి, వారిసహాయ – సహకారాలు లభించవు. 'వర్ణసంకరుడ'ని నిర సిస్తారు.ఆ మాటకొస్తే, మానవశాస్త్రపరిశీలకులు స్వచ్ఛమైన జాతంటూ, ఏ వొక్కటీ లేదనీ, ప్రపంచంలోని అన్నిజాతులు సంకరమైనవేనని భావిస్తున్నారు. ఇక ప్రత్యేకించి భారత దేశంలో, యీ వర్ణసమ్మిశితం విపరీతంగా జరిగినట్లు వీరు అభిప్రాయపడు

తున్నారు. అసలు మనదేశంలో వివిధ జాతుల రుధిర, సంస్కృతుల సమ్మిశితం జరిగి పోయిన ఎన్నో ఏళ్ల తర్వాతనోగాని, యీ కులవ్యవస్థ ఏర్పడలేదు. అందుచే కుల వ్యవస్థ ఉత్తమ సంతతికి దోహదకారి అనుట సరికాదు.

పట్టణాలకు చెందిన ఏ కొద్ది మందో విద్యావంతుల్ని, సంస్కార వాదుల్నో మినహాయిస్తే, కులభావన, కులాభిమానం అందరిలోనూ ఏదో ఒకరూపంలో గోచరిస్తూనే ఉంది. "ఈ కులం నాది." "వాడు నాకులస్తుడు" అనేభావం వ్యక్తిప్రవర్తనను, ప్రభావితం చేస్తూంది. వ్యక్తిగత సామర్థ్యానికే ప్రాముఖ్యత ఇవ్వాలనే విద్యావంతులలో గూడ, ఆయా సందర్భాలలో 'అతడునాకులంవాడు' ఆనే భావం అంతరాంతరాళ్లలో మెదుల్తూనే వుంటుంది.

ఈ కులాభిమానం, మనఆర్థిక, రాజకీయరంగాల్లో ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తుంచని పరిశీలిస్తే, "కుల, మత, వర్ణ, వర్గ రహితమైనఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యానికి గొడ్డలి పెట్టుగా వుంది. జాతి అభివృద్ధికిది యేవిధంగాను దోహదకారిగాదు, సరిగదా, ఆర్థికరంగంలో అభివృద్ధినిసాధించేందుకు సైతం, యీ కుల వ్యవస్థ ప్రతిబంధకముగా ఉంది.

ఇక ఉద్యోగాల విషయంచూస్తే, ప్రైవేట్‌రంగంలో, ఉద్యోగాలు కులాభిమానంతో పంచబడుతున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాల్లో గూడా కులపక్షపాతం ఉంటూ ఉండని శాసనసభలోను. పత్రికల్లోనూ వస్తూన్న విమర్శలు, మనకందరికి తెలిసినట్టివే.

ప్రజాస్వామ్యంలో, నేటి రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో తమ అభ్యర్థుల్ని నిర్ణయించేముందు ఆయా నియోజక వర్గాల్లో ఏ కులంవాళ్లు అధిక సంఖ్యాకులో తెలిసికొని, ఆకులంవాణ్ణే అభ్యర్థిగా నిలిపేస్థితి మనకి తెలియనిదికాదు. 'మానవ సమత, ప్రజాస్వామ్య వ్యవస్థకు, ప్రాతిపదిక కాగా, మానవ అసమత, కులవ్యవస్థకు ప్రాతిపదిక. అందుచేత కులవ్యవస్థ వున్న దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లలేదు. ఆదర్శ సమాజానికి, స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వమనేవి, మౌలిక సూత్రాలు. స్వేచ్ఛా సమాజంలో, పరస్పరాభిమానాలు, ధారాళంగా వుండాలి. ఆదర్శ సమాజంలో ఒకరి బాగోగుల్లో మరొకరు పాలుపంచుకొంటూ, యథేచ్ఛగా మనగలగాలి. అంతా ఒక్కటై పోవాలి. ఆదే ప్రజాస్వామ్యానికి ప్రథమ సోపానం. వివిధ కులాల మధ్య "జీవనాడుల" వలెవేర్పడిన, సన్నిహిత సంబంధాలపైనే, సమాజ బలం ఆధారపడి ఉంటుంది.

నాడూ, నేడూ కూడ కులవ్యవస్థవల్ల దేశానికి అపారమైన నష్టం వాటిల్లించని స్పష్టమౌతున్నది. ఇది కాదనలేని సత్యం. హైందవ సమాజంలో ఇన్ని వైరుధ్యాలు పుట్టుకు రావడానికి, హింసామతం హిందువులకే దుస్సహం కావడానికీ, అనేక మంది పరమతాలలోనికి పారిపోవడానికి, మనస్పర్ధలు, విభేదాలు, కుట్రలు, అసమైక్యతలో నిర్వీర్యమై పరదేశ మతస్థులకు హైందవ సమాజం, పాదాక్రాంతమై ఎంతోకాలం పడిపుండడానికి ఈ కులవ్యవస్థే కారణం.

భారతదేశంలోని ప్రతిస్వ్యక్తి తన్నుతాను భారతీయుడుగా భావించాలి. ఇతరుల్ని కూడా భారతీయులుగా గుర్తించాలి. పుట్టే పిల్లలందరూ, ఒకే జాతిగా, భారతీయులుగా పిలువబడాలి. బర్మాలోని స్త్రీ, హిందువునుగాని, ముస్లిమునుగాని, క్రైస్తవునిగాని, బౌద్ధునిగాని వివాహ మాడవచ్చునుగాని, వారి పిల్లలందరు బౌద్ధబర్మా జాతీయులే అవుతారు.

కులవ్యవస్థవలన ఏర్పడిన సాంఘిక అసమానతల్ని పోగొట్టడానికి ప్రభుత్వం ఎన్నో చట్టాలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి ప్రాథమిక హక్కులను ప్రసాదించింది. హిందూ శాస్త్రములలోని విచక్షణా సూత్రములను తొలిగించి, నాల్గు వర్ణములను సమానముజేసి, అందరికీ సమాజములో, సమాన స్థాయి చేకూర్చింది. కేవలం చట్టాలవల్ల, కులవ్యవస్థ కూలిపోదు గదా!

మానవత్వాన్ని మంట గలుపుతుందీ కులవ్యవస్థ. కాకపోతే, కొందరు మానవులు అంటరానివారని ఎలా కట్టుబడిచేసింది? సాంఘిక సంబంధమైన అరమరికలులేని సహ జీవనం ఏర్పడ్డప్పుడే, మానవ పురోగమనం అభివృద్ధి చెందుతుంది. అలాంటి సహ జీవనం ఏర్పడాలంటే ఒండొరులలో ఇచ్చిపుచ్చుకోవడం వంటి అలవాట్లు వుండాలి. పర్ణాంతర వివాహాలే కులవ్యవస్థ నిర్మూలనకు ఉత్తమ మార్గం. రక్త సంబంధం ద్వారానే, పరస్పర సన్నిహిత భావమేర్పడి. విభేద భావాలు, అంతర్ధానమై, వారిలో ఏర్పడే బంధుత్వం కులవిభేదాలను తొలగిస్తుంది.

పేద, ధనిక వర్గాలు అనే విభజనను మాత్రమే గుర్తిస్తూ, ఆర్థిక అభివృద్ధి ద్వారా, కులాలు వాటంతట అవే నశిస్తాయని కొందరి సిద్ధాంతం. ఆదే నిజమైతే, ఒకే ఆర్థిక స్థాయిలోనున్న రెండు కులాలవారు, భాగ్యవంతులుగానీ పేదవారు గానీ అంత ర్వివాహములు ఎందుకు చేసుకోరు ? ధనవంతులు, బీదవారు తమకులము వారినే అన్ని

రంగాలలో ఎందుకు బలపరుస్తున్నారు ? సాంఘిక జాడ్యమును, ఆర్థిక పరిచర్యవల్లే, నివారించవచ్చు ననటం హాస్యాస్పదము కాదా ? అందుచేత సాంఘిక అండలద్వారా ఉత్పన్నమైన సమస్యలు, సాంఘిక సంస్కరణల ద్వారానే పరిష్కరింపబడాలి.

సమైక్యతకు అంతర్వివాహాలే గీటురాయి. నేటి కులవ్యవస్థలోని కీలకసూత్రాన్ని కూకటి వ్రేళ్లతో త్రుంచివేసేవి కులాంతర వివాహాలే. ఇప్పటికే, ఆహారం, వృత్తి మొదలగు వ్యవహారములకు సంబంధించిన కులనియమాలు చాలవరకు విస్మరింప బడ్డాయి. ఆ ఒక్క వివాహ పట్టింపు, అంటే ''అదేకులంలోవివాహం చేసుకోవాలి'' అనే నియమంగూడ త్రోసిరాజంటే, క్రమేణా 'కులం అనే పదం అర్థరహితం, అసందర్భం అయిపోయి కొంతకాలానికి వాడుకలో వుండకుండ పోతుంది. దానిని ప్రజలు గూడా మరచిపోతారు. ఈ విధంగా కులరహిత సమాజ నిర్మాణానికి కులాంతర వివాహాలు ముఖ్యసాధనాలవుతాయి.

కులాంతర, వర్ణాంతర వివాహాలవల్ల మూడు ప్రయోజనాలు ముఖ్యంగా మనకు కన్పడుతున్నాయి. ఒకటి పెద్దల ప్రోచ్ఛలంతోగాక, తనకు నచ్చిన వాళ్ళను ఎన్ను కున్నందువల్ల తమకున్న పరిమితమైన పరిధిలోనుంచి యువతీ, యువకులు బయటికి రావచ్చు. అంటే గిరిగీసినట్లున్న తమకులంలో తమకు సరియైనవాళ్లు దొరక్కపోతే, దొరికిన వాళ్ళతోనే రాజీపడి, జీవితాంతం ఏదో వెలితిని అనుభవించటంకన్న, తనకు సరిపడే స్థాయిలో, తను మెచ్చిన వ్యక్తిని ఎన్నుకున్నందువల్ల, ఎవరి స్థాయిమేరకు వాళ్లు పూర్తిగా సుఖపడే అవకాశంవుంది. అలాంటి జంటలు ''ఒకరికోసరం ఒకరు సృష్టించబడ్డట్లుగా'' ఇంగ్లీషులో చెప్పాలంటే'' **Made for each other**లాగా, మనకు కనబడతారు.

ఈ వర్ణాంతర వివాహాలు పరిష్కరించే రెండోసమస్య వరకట్నం. ఈ కట్నాలు నేటి సమాజంలో ఒక విషవలయంలా తయారయినై. తన కూతురుకి కట్నం ఇవ్వాలి గనుక, కొడుక్కి కట్నం తీసుకోవాలనే తాపత్రయంలో, పడిపోతున్నారు చాలమంది. సంబంధాలు చూచేటప్పుడు, ముందు కట్నాల స్థోమతను చూసుకొని, తర్వాత మిగిలిన యోగ్యతలను ఏంచుకొంటున్నారు. కులాంతర వివాహాలు విరివిగా జరిగి, యీ కులాల సంకెళ్ళను ఛేదించుకోగలిగినట్లయితే ఎన్నో మధ్యతరగతి కుటుంబాల్లోని ఈ దయనీయమైన పరిస్థితి, చాలవరకు తొలగి పోతుంది.

ఇక వర్ణాంతర వివాహాలు పరిష్కరించే ముఖ్యమైన మూడో సమస్య కుల తత్వం. అంతర్వివాహాలు విరివిగా జరిగితే కులాలమధ్య నిర్మింపబడ్డ అడ్డు గోడలు క్రమంగా కూలిపోతాయి. చాల తొందరగా కులరహిత సంఘ నిర్మాణం జరుగుతుంది. ఆ నవసమాజంలో, కుల, వర్గ ఔన్నత్యాలకు ప్రాముఖ్యం తగ్గి, వ్యక్తి ప్రతిభా విశేషాలకు సరియైన గుర్తింపు వస్తుంది. సరైన వ్యక్తి సరైన స్థానంలో వుంటాడు. తద్వారా దేశానికి ఎంతో మేలు జరుగుతుంది.

ఇక, మార్పును కోరేవారు, మార్పును వ్యతిరేకించేవారు. అన్ని కాలాల్లోనూ వుంటూనే వుంటారు. వర్ణాంతర వివాహాలు చేసుకొనేవారిని జడిపించడానికి, వారిని వెలివేస్తామనో, వారి సంతానానికి పెళ్ళిళ్ళు కావనో, వారి వివాహాలు విఫలమౌతాయనో, ఏవేవో బెదిరింపులు, సాకులు చెప్పి నిరోధింపచూస్తారు అదే కులములో చేసికున్న వివాహాలు మాత్రం విఫలమవటం లేదా? వివాహ సఫలత, విఫలత–భార్యా భర్తల ప్రగాఢ ప్రేమ, శీలము, భావ పరిణామం, సర్దుబాటు శక్తి, సదవగాహనపై, ఆధార పడివుంటుంది. అంతేగాని వారి కులాలపైన ఆధారపడదు.

అందుచే సామాజికాభ్యుదయాన్ని కాంక్షించే వారందరూ వర్ణాంతర వివాహాలు చేసుకొనుటకు యువతీయువకులను ప్రోత్సహించాలి.

నవసమాజాన్ని నెలకొల్పడంలో, అభ్యుదయ కాముకులంపరూ, చొరవతీసికొని, ఎంతగా అటువంటి ఆదర్శవివాహాలకు తోడ్పడితే, భారతదేశంలో వర్ణరహిత సమ సమాజం అంత త్వరగా నిర్మించుకోవచ్చు.

ఆంధ్రలో కుల నిర్మూలనోద్యమం

తరతరాలుగా భారతజాతిని బలహీన పరిచిన కులవ్యవస్థ, ఈనాటికీ జాతీయ సమైక్యతకు, సాంఘిక సౌష్టవానికీ భంగం వాటిల్లజేస్తూనేవుంది. యుగాల తరబడి, అంచెలవారి హెచ్చు తగ్గులు సృష్టించిన కులవ్యవస్థ, హిందూ సమాజాన్ని కొన్ని, వేల కులాలుగా విభజించి జాతిలో ఐకమత్యము, సంఘీభావము, పరస్పర ప్రేమాభిమానములు లేకుండా చేసిన కారణంగా భారత దేశంపై దాడిచేసిన దురాక్రమణదారులందరూ సులభంగా విజయం సాధించగలిగారు. దేశము విదేశీయులపాలనకు లోనైనది. "అందరమూ మానవులం, అందరమూ సోదరులం" అనే భావంపోయి, ఏ కులానికాకులం సంకుచితంగా స్వార్థంతో వ్యవహరించడం జరిగింది. పంచములన బడే కులాలవారు అంటరాని కులాలుగా పరిగణింపబడి, వారి ఆత్మ గౌరవానికే, వ్యక్తి స్వేచ్ఛకే భంగం వాటిల్లింది. కుల స్వామ్యం ప్రజ్వరిల్లింది.

ఎందరో మహానుభావులు, యుగ పురుషులు, జాతీయ నాయకులు, పీఠాధిపతులు, సాంఘిక సంస్కరణ సంస్థలు, మానవతా వాదులు ఈ హిందూ సమాజాన్ని సంస్కరించడానికి, కులతత్వ దురాచారాన్ని మూఢ విశ్వాసాలను, అమానుషమైన అంటరాని తనాన్ని రూపుమాపడానికి, వివిధ కాలాల్లో అంకితమై అపారమైన కృషిజేశారు. వీరు వెదజల్లిన సంస్కరణ బీజాలుదేశమంతటితో పాటు, ఆంధ్రలో గూడ వ్యాపించి తెలుగువారిని ప్రభావితం జేశాయి.

కులవ్యవస్థను నిశితంగా ఖండించిన వారిలో ప్రథముడు గౌతమ బుద్ధుడు. శతాబ్దాల పర్యంతం, ఉధృతంగా సాగిన బౌద్ధమత ప్రచారంలో భాగంగా, ఆంధ్ర దేశంలో ప్రసిద్ధ బౌద్ధ కేంద్రాలైన అమరావతి, నాగార్జున పీఠములనుండి ఆనాడే కులనిర్మూలన ప్రచారం సాగి, మానవతావాదం పెంపొందినట్లు మనకు ఆధారాలు

కనబడుతున్నాయి. బౌద్ధమతము జాతి, కుల భేదములను పాటింపలేదు. బ్రాహ్మణుడు మొదలు పంచమునిపరకు అందరూ బౌద్ధమును పొందుటకుగాని, అర్చనాదులందు పాల్గొనుటకుగాని సహనమైన, అధికారముగలవారని ధాన్య కటక స్థూపమునందలి శాసనమునుబట్టి బుజువైనది.

విశిష్టాద్వైత సిద్ధాంతకర్తయైన రామానుజుడు కులభేదములను తిరస్కరించాడు. సాంప్రదాయమును ధిక్కరించి, పంచములకు గూడ సమాజములో సమాన స్థానము నిచ్చి, అందరికీ మోక్షమార్గాన్ని బోధించాడు. రామానుజ మత ప్రభావంవల్ల ఆంధ్ర ప్రాంతంలోగూడ కులవ్యవస్థ కట్టుబాట్లు కొంతవరకు సడలినవి.

వీరశైవాన్ని వ్యాపింపజేసిన బసవేశ్వరుడు, దాదాపు ఎనిమిది శతాబ్దాల క్రితమే, కులవ్యవస్థ నిర్మూలనకు తిరుగులేని పద్ధతిని సూచించాడు. అదే కులాంతర వివాహాల పద్ధతి. కులాంతర వివాహాలు జరిపించి ప్రోత్సహించాడు. వీరశైవ వ్యాప్తి వల్ల ఆంధ్ర, కర్నాటక తదితర దక్షిణ భారత ప్రాంతాల్లో కులభేద నిర్మూలన ప్రచారం కొంతసాగింది.

పల్నాడు సీమలో, మంత్రి బ్రహ్మనాయుడు కులభేదాలను నిర్మూలించటానికి నడుంకట్టాడు. వివిధ కులాలకు చెందిన బిడ్డలను తెచ్చి తన పుత్రులతో సమంగా పెంచాడు. కన్నమ దాసు అను హరిజన బాలునితాను దత్తతీసికొని, విద్యాబుద్ధులు నేర్పి, తన కుటుంబములో ఒకరుగ పెద్దవాణ్ణి జేశాడు. సహపంక్తి భోజనాలు (చాపకూడు)నిర్వహించాడు. వేమన్న కవీంద్రులు కూడ కులవ్యవస్థను గర్హిస్తూ, ఎన్నో పద్యాలు వ్రాశారు.

ఆధునిక భారత దేశంలో, సంఘ సంస్కరణోద్యమానికి, మూలపురుషుడు రాజారామమోహనరాయలు. క్రిందటి శతాబ్దపు ప్రథమ పాదంతో, ఆయన సాంఘిక దురాచారాలతో గణనీయమైన పోరాటాన్ని సాగించారు. వారికృషితోనే సంఘసంస్కరణోద్యమం ప్రారంభమయిందని చెప్పవచ్చు. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, దయానంద మొదలగు మహనీయులు సాగించిన ఆధ్యాత్మికోద్యమాలు, ప్రబోధాలు కులభేద నిర్మూలనకు, అస్పృశ్యతా నివారణకు ఎంతో దోహదం జేశాయి. రాజారామమోహనరాయలు బ్రహ్మసమాజ వ్యవస్థాపకుడు. బ్రహ్మసమాజం అన్ని మతాలలోఉన్న సత్యాలను సమన్వయంచేసికొన్నది. కుల–పర్గ–మత–ఆర్థిక ఇత్యాది

భేదాలుపాటించదు. తెలుగుదేశంలో బ్రహ్మసమాజం, ఆర్యసమాజం, దివ్యజ్ఞానసమాజం, రామకృష్ణమిషన్, థియోసాఫికల్ సొసైటి, మొదలగు సంఘ సంస్కరణ, సంఘ సేవా సంస్థలు కులభేదాలను విస్మరించి, సర్వమానవ సౌభ్రాతృత్వ విధానాన్ని అవలంభించి, సమాజాన్ని సంస్కరించడానికి విశేషమైన కృషి జేశాయి. భక్తి మార్గ ప్రబోధకుడైన రామానందుడు, రామానందుని శిష్యులైన కబీరుదాసు, రామదాసు, దాదూ మున్నగు వారందరూ కులభేదాలను అస్పృశ్యతను గట్టిగా విమర్శించి, సన్మార్గమును ప్రబోధించారు. గురుదేవులు రవీంద్ర కవీంద్రులు జాతీయసమైక్యతను గురించి ఒక సందర్భములో ఏమన్నారంటే "తాత్కాలికమైన ఆవేశం ఆపహించి నప్పుడు, మనమంతా ఐక్యతా సూత్రంతో బంధితులమయ్యామని భావిస్తాం. కాని మన సాంఘిక జీవితం వాస్తవానికి భిన్నంగా ఉంటుంది. అందులో ఎన్నో పగుళ్లు చీలికలు, రంధ్రాలు ఉన్నాయి. కాని, అవేవి పైకి కనుపించవు. రహస్యంగా తమ పనిని తాము చేస్తూ ఉంటాయి. ఈ చీలికలవల్ల. ఐక్యతా సూత్రం ఎక్కువ కాలం నిలబడదు. ఈ ఉన్నతాదర్శాన్ని మనం కాపాడుకోలేము."

మేధావులు, జాతీయ నాయకులు అయిన అరవింద ఘోష్, వీరసావర్కర్, లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్, ఎం. ఎన్. రాయ్, రామమనోహర్ లోహియా, పెరియార్ (ఇవి. రామస్వామి నాయకర్,) అన్నామలై ప్రభృతులు కుల దౌష్ట్యమును రూపుమాపుటకు కృషిజేశారు. సరోవయ నాయకుడు శ్రీమన్నారాయణ్, తనపేరు చివరినుండి కులసంకేతమైన "అగర్వాల్" అను పదాన్ని తొలగించి. కులాన్ని అన్ని రూపాల్లో నిమ్మూలించాలని దేశానికొక మార్గము చూపారు.

జాతిపిత మహాత్మాగాంధి, తను రూపొందించి జీవితాంతం నిర్వహించిన నిర్మాణ కార్యక్రమములో హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ కార్యక్రమమును ప్రధాన కార్యక్రమముగా చేపట్టి, హరిజన దేవాలయ ప్రవేశాలు, వర్ణాంతర వివాహాలు, సహపంక్తి భోజనాలు మొదలగు కార్యక్రమాలు దేశమంతా నిర్వహించారు. తన మిత్రుడైన దేవదాసు గాంధీకి రాజాజీకుమార్తెకు వర్ణాంతర వివాహం జరిపించారు.

బాబాసాహెబ్, డా॥ అంబేద్కర్ దళిత వర్గములను ఉద్ధరించుటకు కుల నిర్మూలనే ఏకైక మార్గమని ఎత్తిచెత్తి చాటాడు. అస్పృశ్యులైన కులాలవారి ప్రాథమిక హక్కుల కొరకు నిర్విరామంగా పోరాడి అమోఘమైన ఉద్యమాలు నడిపారు.

వీరందరి కృషి ప్రభావం అమితంగా ఆంధ్ర ప్రజానీకాన్ని చైతన్యవంతం జేసింది. ఆ ఉద్యమాల్లో తెలుగువారు ముందుండి పాల్గొనేవారు.

ఆంధ్రదేశంలో ప్రథమ సంఘ సంస్కర్తగా ప్రసిద్ధికెక్కినది, కందుకూరి వీరేశలింగం గారు. వీరికి ఆంధ్ర రాజారామమోహనరాయలని గూడా నామకరణం చేశారు. స్త్రీ జనాభ్యుదయం అస్పృశ్యతా నివారణ సాంఘిక దురాచార నిర్మూలన ధ్యేయంగాపెట్టుకొని బృహత్తర కృషి జేశారు. వితంతు వివాహాలతోపాటు, కులాంతర వివాహాలు, సహపంక్తి భోజనాలు నిర్వహిస్తూ, తాను చేపట్టిన సంస్కరణోద్యమానికి సాహిత్యాన్నొక ఆయుధంగా ఉపయోగించారు. పత్రికలద్వారా, నాటకములు, ప్రహసనములద్వారా సాంఘిక దురాచారములను బట్టబయలుచేసి చెడుగులను దిద్దే ప్రయత్నం నిర్విరామంగా కొనసాగించారు. కుల చిహ్నమైన జంధ్యం విసర్జించి, సర్వమానవ సమానత్వాన్ని చాటి చెప్పారు. తన యావదాస్తిని హితకారిణి అనే సంస్థను స్థాపించి ప్రయోజనకరమైన పనులు చేపట్టటానికిగాను దానికి ఇచ్చివేశారు. వీరేశలింగం గారితో పాటు బ్రహ్మసమాజానికే చెందిన రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు అంటరాని తనం నివారణకు, విద్యాభివృద్ధికి మహోన్నత కృషిజేశారు. వేంకటరత్నం నాయుడు గారు హరిజన బాలికలను పెంచి, పెద్దవారిని చేసి, విద్యావంతులను గావించి వారికి పెండ్లిండ్లుచేశారు, సచ్ఛీలము, సౌజన్యము మూర్తీభవించినవాడు. ఆంధ్రదేశం, రఘుపతిని బ్రహ్మర్షి అని కీర్తించింది. బ్రహ్మసమాజ ప్రభావితులైన అగ్రవర్ణస్తులనేకులు పెక్కు సంఖ్యలో కుల చిహ్నమైన జంధ్యములను పరిత్యజించడం, కులాంతర వివాహాలు గావించటం, ఆంధ్రదేశంలో గొప్ప సంచలనాన్ని కలుగజేసింది. ఈ గొప్ప పరిణామం యువతరాన్నెంతగానో ప్రభావితం జేసింది. జంధ్యం తీసివేసి అస్పృశ్యోద్ధరణకు బ్రహ్మసమాజికుడు కావడానికి, వీరేశలింగం గారికి మార్గదర్శకుడైనాడు. చేకూరి పెద బాపయ్య ప్రముఖ బ్రహ్మ సమాజికులు, శ్రీ తల్లా ప్రగడ ప్రకాశరాయుడు, శ్రీ తారకం, మరి ఎందరో యీ కృషిని ఇంకనూ కొనసాగిస్తూనేపున్నారు. శ్రీ తారకం హరిజన యువతిని పెండ్లాడి మార్గదర్శకులయ్యారు, హరిజనోద్ధరణకు బాపూజీ కార్యక్రమాలను శ్రీ తారకం అమలు పరచారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం బాపూజీ హరిజనోద్యమాన్ని చేపట్టటానికి ముందే, రాజారామ్మోహన రాయల వారి పేరిట, రాత్రి పాఠశాలలను స్థాపించి పంచములనబడే వారికి, విద్యాప్రదానం చేయటానికి పాటుపడ్డారు.

పిఠాపురం మహారాజా కష్టనష్టాలను లెక్కజేయక హరిజనులలో విద్యాభివృద్ధికి విద్యాసంస్థలు స్థాపించి, వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించిన త్యాగశీలి. కుల, మత జాతి వివక్షతను కూల గొట్టుటకు కృషిజేస్తూ కులవ్యవస్థ ఆధారంగా ఔన్నత్యాన్ని ఆపాదించుకున్న వారిపై తిరుగుబాటు జేశారు. "కవిరాజు" త్రిపుర నేని రామస్వామి చౌదరి భావ విశాసోచ్యమూనికి మూఢవిశ్వాసములపై దాడిచేసి, కుల మత వివక్షతలను నేలమట్టము గావించుటకు ఎన్నో రచనలు చేశారు. తెలుగునాట ఎన్నో వర్ణాంతర వివాహాలను ప్రజలకు తెలిసిన భాషలో త్రిపురనేని చేయించారు. మానవతావాది ఆవుల గోపాలకృష్ణమూర్తిగారు వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించాడు. తన పెండ్లినాడే సహపంక్తి భోజనము చేయించారు

ప్రముఖ నాస్తికుడు, సర్వోదయ నాయకుడు అయిన 'గోరా' (గోపరాజు రామచంద్రరావు) గారు కుల, మత విభజనకు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం సాగించారు. వారి కుటుంబంలోనే హరిజనులతో వర్ణాంతర వివాహాలు చేయించారు. కులంకారణంగా నానా ఇబ్బందులకు గురియై, కుల సంకెళ్లను త్రెంపుకొని స్వేచ్ఛగా కవితా మాధురిని వశపరచుకొని చాతుర్వర్ణ వ్యవస్థ అను నాగుపాముపై పగసాధించాను, జాషువాకవి. తెలంగాణా ప్రాంతంలో హరిజనోద్ధరణకు పాటుపడిన మహావ్యక్తి శ్రీ భాగ్యరెడ్డివర్మ. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ మంత్రిగా పనిజేసిన అరిగె రామస్వామిగారు కొన్నివందల వర్ణాంతర వివాహాలు చేయించారు. వారి కుటుంబ సభ్యులు చాలామంది వర్ణాంతర వివాహాలు చేసికొన్నారు. సుప్రసిద్ధ సౌభ్రాతృత్వాన్ని చాటుతూ, మూడు మతములను మేళవించి, తనపేరు పెట్టుకున్నారు, శ్రీ ఫ్రాంక్లిన్‌రాం మహమ్మద్.

కులపు గోడలను బ్రద్దలుజేస్తూ సువిశాల ప్రపంచంలో స్వేచ్ఛగా జీవించుటకు అనువుగా దేశనాయకులు కొన్ని శాసనములు గావించారు. భారత రాజ్యాంగంద్వారా అస్పృశ్యత నిషేధింపబడింది. కులరీత్యా ఏ ప్రాధాన్యత ఉండగూడదని రాజ్యాంగము శాసించింది. షెడ్యూల్డు కులాలకు, బడుగు వర్గాలకు కొంతకాలం ప్రత్యేకత సదుపాయాలు ఇవ్వబడ్డాయి. ప్రత్యేక వివాహముల చట్టము, హిందూ వివాహముల చట్టము వంటి శాసనాల ద్వారా మతాంతర, కులాంతర వివాహాలకు చట్టముయొక్క ఆమోదముద్ర లభించినది.

సాహిత్యపరంగా సాంఘిక దురాచారాలను తొలగించడానికి, ప్రజలలో సంస్కరణాభిలాషను పెంపొందించటానికి ''మలిన దేహుల మాలలనుచును, మలిన చిత్తుల కధిక కులములు నెలవొసంగిన వర్ణ ధర్మము ధర్మంబె'' అని గురజాడ అప్పారావు వర్ణాశ్రమ ధర్మాలలోని దురాచారాలను నిరసించాడు. బసవరాజు అప్పారావు, హరిజనుల పట్ల అత్యాచారాలను నిరసిస్తూ పాటలు వ్రాసాడు. ముట్నూరి కృష్ణారావుగారు తన ''కృష్ణా పత్రిక ద్వారా విస్తృతసేవ జేశారు. ప్రముఖ పాత్రికేయుడు శ్రీ వి. ఆర్. నార్ల తన పత్రికలద్వారా సంఘ సంస్కరణ బీజాలను సమాజంలో విస్తారంగా నాటుతున్నారు. కామరాజు హనుమంతరావు, తాపీ ధర్మారావు ప్రభృతులు మూఢనమ్మకాలను, అస్పృశ్యతా దురాచారాన్ని తొలగించటానికి సాహిత్యరంగంలో గణనీయమైన కృషిచేశారు. వేమూరి రాంజీరావు, మంగిపూడివేంకటశర్మ, ఆదిపూడి సోమనాధరావు, బండారు అచ్చమాంబ తదితరులు ఆంధ్రదేశంలో అస్పృశ్యతా నివారణకు చేసిన కృషి ప్రశంసనీయము. ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లె' సాంఘికనవల తెలుగుదేశంలో గొప్ప సంచలనాన్ని కల్గించింది. ఆ నవల ప్రధానాశయం. సంఘ సంస్కరణ ప్రబోధమే. హెచ్చు తగ్గులు ఏ రంగంలో ఉన్నా ఆ దేశం బాగుపడదని స్పష్టం చేసింది. గుణం శీలం ప్రధానంకాని కులాన్ని బట్టి మానవులను వేరు సరచరాదని 'మాలపల్లి' మహోదాత్తంగా ప్రబోధిస్తుంది. గూడవల్లి రామబ్రహ్మంగారు 'మాలపిల్ల' సినిమా తీశారు. పద్మశ్రీ బోయి భీమన్న గారు తన ''కలిరాజు'' నాటకంలో నిష్కలంకవీర్ పాత్రను సృష్టించి. కులరహితసమాజాశయాన్ని వెలిబుచ్చి, 'ధర్మంకోసం పోరాటం' లో దళిత వర్గాలను మేల్కొల్పారు. కొన్నిరాజకీయ పార్టీలు, నాటక సంఘాలు సాంస్కృతిక రంగంలో కల్గించిన సంచలనం ఫలితంగా కులాంతర వివాహాలు, హరిజన పెండ్లిండ్లు కొంత కాలం జరిగాయి.

కొద్దినుండి యువకులు, కులరహిత సమాజనిర్మాణధ్యేయంతో వర్ణాంతర వివాహాలే చేసుకోవలెనని దీక్షబూని అట్టి వివాహాలు చేసుకొన్నారు.

ఈ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పురోగమిస్తున్న సంఘ సంస్కరణోద్యమం 1971లో "ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘం" స్థాపనతో ఒక నూతన రూపాన్ని ధరించింది. ఇంతవరకూ కులనిర్మూలనకు జరిగిన కృషి ఒక ఎత్తూ, కులనిర్మూలన సంఘ స్థాపనానంతరం నడుస్తున్న ఉద్యమం ఇంకొక ఎత్తూ. ఇంతవరకూ వ్యక్తిగతంగాను, సంఘబద్ధంగాను కులాల వ్యత్యాసాలను తొలగించటానికి, అస్పృశ్యతను

రూపుమాపటానికి ఎంత కృషి జరిగినప్పటికీ, "కులనిర్మూలన" అనే పేరుతో ఉద్యమం నడవలేదు. తటస్థంగావున్న ప్రజలలో సంచలనం వచ్చి సంస్కరణ కృషి చురుకుగా సాగించటానికి ఒక సంఘం అవసరమని భావించి సంఘ సంస్కరణాభిలాషి శ్రీ సురమౌళి పూనికతో 1971 నవంబరు 19, 20 తేదీలలో హైదరాబాదులో చరిత్రాత్మకమైన "కులనిర్మూలన సదస్సు" నిర్వహింపబడింది. ఆ సదస్సు తీర్మానానుసారం, ఈ రచయిత అధ్యక్షతతో ఆంధ్రప్రదేశ్ కులనిర్మూలన సంఘం అవతరించింది. 1972 రిపబ్లిక్ దినోత్సవం నాటికి పబ్లిక్ సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం క్రింద సంఘం రిజిష్టరు గావింపబడింది. రాజధానిలో ఇన్నాళ్లూ కుల సంఘాల బోర్డులను మాత్రమే చూచుటకు అలవాటు పడిన పురజనులకు సంఘ కార్యాలయంవద్ద పెట్టిన కులనిర్మూలన సంఘం బోర్డు విచిత్రంగా కన్పించింది. ఆశ్చర్యంతోపాటు ఆలోచనల్నిగూడ రేకెత్తించింది. అభ్యుదయ భావాలుకల వారెందరో ఆకర్షితులయ్యారు. ఈ రకంగా కులనిర్మూలన ఉద్యమం ఒక ప్రత్యేకతను సంతరించుకొంది.

కులాంతర వివాహాలు జరిపించుట, ప్రోత్సహించుట, అట్టి వివాహములు చేసుకొన్నవారికి, చేసుకొనదలచిన ప్రోత్సాహకులకు అండదండలుగా నుండుట ముఖ్య కార్యక్రమంగా చేపట్టింది కులనిర్మూలన సంఘం. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో సభలు, గోష్ఠులు నిర్వహించడం, దిన, వార, మాస పత్రికలలో వ్యాసాలు, రేడియో ప్రసంగాలద్వారా విశేషమైన కృషి జరిగింది. సంఘాధ్యక్షుని వ్యాసాలపై వార్తాపత్రికలలో తర్జన భర్జనలు జరిగి,నూతనోత్సాహాన్ని పురికొల్పినవి. కేవలం ప్రసంగాలతో సరిపెట్టకుండా, కులనిర్మూలన సంఘం ఆచరణలో వర్ణాంతర వివాహాలు ప్రత్యక్షంగా జరుపుతూ ఆ వివాహ వేదికలద్వారా కులనిర్మూలన ప్రచారం సాగిస్తున్నది. రాష్ట్రంలో సంఘనాయకులు వివిధ జిల్లాలలో పర్యటించి సభలు జరిపారు. ఆ సభలలో, కులాంతర వివాహాలు చేసుకున్నవారికి సన్మానాలు జరపటం తప్పనిసరి కార్యక్రమం. రాష్ట్రసం తి వర్యులుగూడా ఆ వివాహ కార్యక్రమాలకు హాజరవుతూ, చేయూతను సహకారాన్ని, అందిస్తూ ఉన్నారు. ఇంతవరకు కులాంతర వివాహాలకు వున్న అల్పభావం పోయి, వాటికి ఒక వేదిక ఏర్పడి గర్వించదగిన గౌరవసానం లభించింది. రాజధానిలో ప్రారంభమైన యీ ఉద్యమం క్రమేణ జిల్లాలకు వ్యాపించి, జిల్లా కులనిర్మూలన సంఘాలేర్పడినవి.

కులనిర్మూలన సంఘం సభ్యుల తోడ్పాటుతో, అప్పటి సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు శ్రీ మండలి వెంకట కృష్ణారావు కృషితో భారత దేశంలోనే ప్రప్రథమంగా జరిగిన "సాంఘిక సంస్కరణల సదస్సు"ను ప్రభుత్వం 72 సెప్టెంబరులో నిర్వహించింది. ఈ సదస్సులో కులాంతర వివాహాల విశిష్టత వివరించడమే కాకుండా, కులాంతర వివాహాల ప్రోత్సాహానికి అనేక ఆచరణ సాధ్యమైన, యోగ్యమైన సూచనలు కూడ చేయబడినవి. కందుకూరి వీరేశలింగం గారి 125వ జన్మదిన ఉత్సవాల సమయంలో గత సంవత్సరం విజయవాడలో జరిగిన రెండవ సాంఘిక సంస్కరణల సదస్సు కార్యక్రమంలో ఇటీవల జరిగిన రాష్ట్ర హరిజన మహాసభల సందర్భములో జరిగిన కులాంతర వివాహాలు, కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు సన్మానాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో కుల నిర్మూలన సంఘం జరిపించింది. ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ప్రోత్సాహంతో, సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి పూనికతో రాష్ట్రప్రభుత్వం వర్ణాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నవారికి నగదు బహుమానాలను ప్రకటించింది. దంపతులలో ఒకరు హరిజనులైతే వెయ్యి రూపాయలు, దంపతులలో ఒకరు వెనుకబడిన వర్గానికి చెందిన వారైతే ఐదు పందల రూపాయల బహుమతి ప్రకటించింది. 1976–77వ సంవత్సరానికి, 8 లక్షల రూపాయలు వివాహ బహుమతులకు కేటాయించింది. వర్ణాంతర వివాహాలను స్వయంగా ఆహ్వానించినచో విధిగా హాజరు కావలసినదిగా ప్రభుత్వాధికారులకు ఆదేశాలిచ్చారు. తమ పేర్లనుండి కుల సంకేతాలను తొలగించుకునేవారికి ప్రభుత్వ గజిటులో పేరు మార్పు ప్రకటన ఉచితంగా ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వర్ణాంతర వివాహం చేసుకొన్నవారికి, వారిపిల్లలకు విద్యార్థివేతనములు, మొదలగు ప్రోత్సాహాలు కలుగ జేశారు. రిజిష్టరు వివాహాల విధానం అందరికీ అందుబాటుగా నుండుటకు సబ్ రిజిస్ట్రార్లను కూడ వివాహ రిజిస్ట్రారులుగ చేశారు. వర్ణాంతర, మతాంతర వివాహములకు ప్రత్యేక వివాహముల చట్టము క్రింద రిజిస్ట్రేషను రుసుమును రద్దుచేశారు. సంస్కరణ వివాహాలు నిర్వహించటానికి రాష్ట్రంలో హైదరాబాదు, విశాఖపట్నం, కర్నూలు నగరాలలో వీరేశలింగం హాలులను కట్టుటకు ప్రభుత్వం అంగీకరించింది.

శాసన సభ్యులు, కుల నిర్మూలన సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిన ప్రొ॥ వి. సుబ్బారెడ్డి సంఘ కార్యక్రమానుసారం తమ పేరునుండి "రెడ్డి"

'అనే కులసంకేతాన్ని తొలగిస్తూ, తమ పేరును మహాత్ములు ''గాంధి మార్క్స్ గోరా'' గార్లను స్ఫురింపజేస్తూ, ''గాడ్గో'' అని మార్చుకున్నారు.

రాష్ట్రంలో కులనిర్మూలన సంఘ స్థాపనాంతరం వర్ణాంతర వివాహాలు ఐదు పందలకు పైగా జరిగాయి. వీటిలో హరిజనులతో జరిగిన వివాహాలు ప్రధానంగా విప్లవి. అనేక క్లిష్ట పరిస్థితులలో ధైర్యంగా నిలబడి, లక్ష్యసాధనయే దృష్టితో వుంచుకొని, పెక్కు వర్ణాంతర వివాహాలు నిర్వహించింది, కులనిర్మూలన సంఘం. సంవత్సరాలు గడచిన కొద్ది వర్ణాంతర వివాహాల సంఖ్య రాను, రాను పెరుగుతూనే వున్నది. గాని, తరగటం లేదు. కుల నిర్మూలనోద్యమం ద్వారా సమాజంలో గత నాలుగైదేండ్లలో గొప్ప మార్పు గోచరిస్తూంది. కులాంతర వివాహాల యెడల వృద్ధ తరంవారికి సానుభూతి, యువతరానికి ఉత్సాహం పెరిగింది. ఇదే కుల నిర్మూలన సంఘం ఆశించిన పరిణామం. ఇదే వేగంతో ఉద్యమం నడిస్తే, కొన్ని సంవత్సరాలలో కులాంతర వివాహాలు సర్వసామాన్యం గాకపోవు!

ఇంతవరకు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని అర్థించకనే సభ్యుల ఇతోధిక విరాళాలతో సంఘ కార్యక్రమాలు నిర్వహింప బడుతున్నవి. కులనిర్మూలన సంఘ కార్యవర్గ సభ్యులలో ఎక్కువ మంది వర్ణాంతర వివాహాలు చేసికొన్నవారే. అందువల్ల అకుంఠిత దీక్షతో, స్వలాభాపేక్షలేని నిస్వార్థ సాంఘిక సేవజేయ కల్గుతున్నారు. వారిలో ముఖ్యంగా పేర్కొనదగినవారు శ్రీయుతులు జి. సురమౌళి సంఘపోషకులు శ్రీ డి. జి. రామారావు, జంటనగరాల సహాధ్యక్షులు శ్రీ వి. నాగేశ్వర్, జనరల్ సెక్రటరీ కీర్తిశేషులు గోరాగారి కుమారుడు శ్రీ లవణం; కోడలు శ్రీమతి హేమలతాలవణం కూడా పేర్కొనదగినసంఘ కార్యకర్తలే. 16-7-76న హరిజన యువకునకు మరియొకకులమునకు చెందినయువతికి జరిగిన వివాహమునకు మనరాష్ట్రముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ జలగం వెంగళరావు విచ్చేసి సంఘ కార్యకలాపాలను శ్లాఘిస్తూ, తగు ధనసహాయము సంఘమునకు చేయు సూచన పరిశీలిస్తామని మాటిచ్చారు.

సంప్రదాయ సమాజంలో కులాంతర వివాహాలు చేసికొన్న వారిపై జరుగుతున్న అత్యాచారాలను నివారించటానికి కుల నిర్మూలన సంఘం ప్రయత్నిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక ఉన్నతస్థాయి సంఘంయొక్క సహకారాన్ని కూడా ఉపయోగించు కుంటున్నది. ప్రభుత్వ సహాయ, సహకారములవలన నేడు ఐచ్ఛికముగా యువతీయువకులు కులాంతర వివాహాలకు పూనుకుంటున్నారు. తల్లిదండ్రులు

గూడా సర్దకొని పోతున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర హరిజన మహా సభల సంద ర్భంగా ఏర్పాటైన ఎగ్జిబిషన్‌లో కులనిర్మూలన ప్రచార సాధనంగా, కులాంతర వివాహాలు చేసికొన్నవారి ఛాయాచిత్ర పటములతో ఏర్పాటుజేయబడిన స్టాలు వేలాది ప్రజల నాకర్షించింది. ఈ స్టాలు స్వచ్ఛంద సంస్థల స్టాలులో ప్రథమ బహుమతి నందుకున్నది.

ఇటీవల రాజ్యాంగసవరణకు సంబంధించి ఏర్పాటైన స్వరణ్‌సింగు కమిటి వారికి ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘం, కులవ్యవస్థను రద్దుజేస్తూ రాజ్యాంగ సవరణను తీసుకొని రావలసినదిగా సూచిస్తూ ఒక విజ్ఞప్తిని సమర్పించింది. ఈ సూచ నను కమిటీ దృష్టికి తెచ్చినట్లు, ఆలోచనలో వున్నట్లు, కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి తెలియజేశారు. వెంటనే నిర్ణయము తీసుకొనలేకపోయినచో, ప్రజాభిప్రాయ మును సేకరించుటకు యీ ప్రతిపాదనను ప్రజలకు వెల్లడి చేయవలసినదిగా కుల నిర్మూలన సంఘం, వారికి విజ్ఞప్తిచేసింది.

ఇంతలో యువజన కాంగ్రెసు తమ కార్యక్రమంలో కులనిర్మూలనను జేర్చి, యీ కార్యక్రమమును పట్టుదలతో నిర్వహించవలసినదిగా భారత యువతను పిలుపు నిచ్చుట ముదావహము. తత్ఫలితంగా, ఆంధ్రప్రదేశ్‌లో గూడా పెద్దపెట్టున వర్ణాంతర వివాహాలు నిర్వహించే అనుకూల వాతావరణం ఏర్పడినది.

ఆంధ్రప్రదేశ్‌లో కులనిర్మూలనోద్యమం గట్టిపుంజులు వేసుకున్నదనటంలో సందేహంలేదు. - భారత యువత తొలినుంచి త్యాగానికి పేరుమోసింది. వంగరాష్ట్రము తెలుగు ప్రాంతం, అన్నిజాతీయ ఉద్యమాలలో సంఘ సంస్కరణ ఉద్యమాలలో, ముందంజవేసి ఖ్యాతిని తెచ్చుకున్నాయి. కులనిర్మూలన ఉద్యమంలో గూడాతెలుగువారు ప్రథమ శ్రేణిలో ఉంటే ఆశ్చర్యంలేదు. ప్రభుత్వ సహాయ సహకారములతో కార్య దీక్షతో క్రమేపి ఈ ఉద్యమం బలాన్ని పుంజుకొని, భవిష్యత్తులో యీపద్ధతిలో కుల రహిత సమాజం ఏర్పడగలదని ఆశింపవచ్చు.



జాతీయ సమైక్యత -

కులాంతర వివాహాలు

గురుదేవులు రవీంద్ర కవిచంద్రుల జాతీయ సమైక్యతను గురించి ఒక సందర్భంలో ఏమన్నారంటే – "తాత్కాలికమైన ఆవేశం దేశాన్ని ఆవహించినప్పుడు, మనమంతా, ఐక్యతా సూత్రంతో బంధితుల మయ్యామని భావిస్తాం. కాని మన సామాజిక జీవితం వాస్తవానికి, భిన్నంగా ఉంటుంది. అందులో ఎన్నో పగుళ్లు, చీలికలు, రంధ్రాలు వుంటాయి. కాని అవేవి పైకి కనిపించవు. రహస్యంగా తమ పనితాము చేస్తూ వుంటాయి. ఐక్యతా సూత్రం అక్షరాలా గొప్పదే. అయితే ఈ చీలికలవల్ల మహోన్న తమైన ఈ ఉన్నతా దర్శాన్ని మనం కాపాడుకోలేము."

'హరిజన్' పత్రికలో బాపూజీ, ఇదే భావాన్ని మరికొంత విపులంగా చిత్రించారు. "మనం మారాలి. మన దృక్పథాన్ని విధిగా మార్చుకోవలసిన తరుణం ఆసన్నమయింది. ఈ మార్పులకు దూరమయివున్నంతకాలం, హిందూమతం ఘనీభవించి పోతుందేతప్ప, చైతన్యవిలసితం కాదు. ఇప్పటికే. హిందూమతంలో శిథిల లక్షణాలు పూర్తిగా జీర్ణించుకుపోయాయి. పౌరాణికమైన మత సూత్రాలు వక్రభాష్యకారుల చేతుల్లో పడి, అపభ్రంశమయ్యాయి. అవి మరింత ధ్వంసంకాకుండా ఉండాలంటే, కాలానికి అనుకూలమైన మార్పులకు హైందవ సమాజం అంగీకరించాలి" అంటూ బాపూజీ జాతిని హెచ్చరించారు.

మరో సందర్భంలో "బాధ్యత గల భారతీయునిగా, హిందువుగా, నేనొక విషయాన్ని స్పష్టం చేయగోరుతున్నాను. దేశంలో కోట్లాదిగా ఉన్న మానవుల్ని, కులాల క్రింద చీల్చివేస్తున్న ఈ అమానుష విధానాన్ని నేనుపూర్తిగా వ్యతిరేకిస్తున్నాను. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అన్న దృష్టి మనలోఉన్నంత కాలం మనకీ బానిస బంధనాలు తప్పవు. ఈ ఎక్కువ తక్కువలతో

మనలో మనం కీచులాడుకోవడం మన బలహీనతకు నిదర్శనం, అసలు సమస్యను విడిచి, మనం నీడతో యుద్ధం చేయడం లాంటిదే ఇది. మన ముఖ్య సమస్య దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించడం. ఈ స్వరాజ్యం, ఏ ఒక్క కులమో సాధించేదికాదు. ఈ మహా యజ్ఞంలో భారతీయులందరూ భాగస్థులే. హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు, సిక్కులు, పార్శీలు ఇందరూ సమైక్యంగా కృషిచేసినప్పుడే మనకు స్వరాజ్యము సిద్ధిస్తుంది. అప్పుడే మనం స్వరాజ్యానికి కావలసిన అర్హతలను సంపాదించుకొన గలుగుతాం. అన్నారు బాపూజీ.

హరిజన సమస్యను ప్రధానంగా వారు జాతీయోద్యమంలో పొందుపరిచారు. సమాజంలోని ఒక భాగాన్ని, శాశ్వతంగా దూరంగా ఉంచటం ద్వారా, హిందూ సమాజం తనను కించపరచుకొంటున్నదని బాపూజీ పదేపదే ప్రబోధించారు. మానవులందరూ సమానులేననీ, సృష్టిలో లేని ఈ భేదాన్ని స్వార్థపర వర్గాలు మధ్యలో ప్రవేశపెట్టాయనీ, గాంధీజీ ప్రచారం చేశారు. ఒకానొక సందర్భంలో, అవసరమైతే జాతీయోద్యమం నుండి, తాను విరమించుకుంటానని, పూర్తిగా హరిజన సేవకే, తన రంగాన్ని పరిమితం చేసుకుంటానని, బాపూజీ హెచ్చరించారు. తనది సత్య సమ్మతమైన ఉద్యమ మన్నారాయన. ఇంకొకరి కోసం వారి మెప్పుకోసం, తను ఏ పనినీ చేయజాలననీ, స్పష్టం చేశారు. మన సమాజంలోని కుల, మత, వర్గవిభేదాలను చూసి, బాపూజీ సంక్షోభపడిన సందర్భాలు అనేకములున్నాయి. జాతి సమైక్యంగా ఉంటే తప్ప ఏదీ సాధించలేవని, వారికి తెలుసు.

మనగత చరిత్రను చూసుకొంటే, మనలోని అనైక్యత, ఎన్ని అనర్థాలు దారితీసిందో సులభంగా అవగాహన అవుతుంది. ఇతర దేశీయులు, మన దేశంమీదు దండెత్తి రావడానికి, మనల్ని దోచుకోవడానికి ఈ అనైక్యతే కారణం. దేవాలయాలను, దోచుకుపోయిన విదేశీయులెందరో ఉన్నారు. పీనలవ్వంలోనూ పరాక్రమంలోనూ, వ్యక్తిగతంగా, చూసుకుంటే ఏ భారతీయుడూ, ఏ విదేశీ వీరునికి తీసిపోడు. కాని మనవారిలో సమిష్టికృషి లోపించింది. అందరినీ ఏకం చేయగలిగిన మతం, అందరినీ కొన్ని కులాల క్రింద విభజించింది. ఈ కులాలలో కొన్నిటిని, ఎప్పుడూ కులాలుగానూ, మరి కొన్నిటిని, తప్పుడు కులాలుగానూ చిత్రించడంవల్ల—తాత్కాలికంగా కొందరు లాభపడినా. మొత్తంమీద సమాజం [illegible]

మారిపోయింది. ఆ ముడికి గుంట ప్రమాదకరమైన క్రిములను ఉత్పత్తి చేస్తున్న తరుణంలో గాంధీజీ మహా భాస్కరునిగా అవతరించారు. జాతిని ఆదుకొన్నారు.

మనలో ఎక్కువ మందికి చరిత్రను, 'కల్పనా సాహిత్యం' లాగ చదవడమే తెలుసునన్నారు. జవహర్ పండితుడు, తన కుమార్తె ఇందిరకు వ్రాసిన లేఖల్లో చరిత్ర నుండి గుణపాఠాలు నేర్చుకోవడం, మనకింకా చేతకావడంలేదని నెహ్రూజీ ఆవేదన పడ్డారు. ఒక ఉత్తరంలో నెహ్రూజీ ఇలా అన్నారు ...

"సుదీర్ఘమైన మహాయాత్రలో, మానవజాతులు, కొన్ని తప్పిదాలను చేసి ఉండవచ్చు. అయితే ఆ పొరపాట్లనుండి గుణపాఠాలను నేర్చుకోవాలి. అలా నేర్చుకోని జాతికి విముక్తిలేదు. మనముందు తక్షణం పరిష్కరించుకోవలసిన సమస్యలు అనేకమున్నాయి. వాటిని మనం విస్మరిస్తున్నాం. అదే సమయాన శుష్కమైన కుల సమస్యలను గురించి, మన అమూల్యమైన సమయాన్ని వ్యయం చేస్తున్నాము."

గత చరిత్రలో మనజాతి, సమైక్యంగా లేకపోవడము కారణంగా ఎన్నిటినో మనం కోల్పోవలసివచ్చింది. ఈ అనైక్యత – మొత్తం దేశాన్ని పరాయివారి పాలనకు అప్పగించే స్థితికి దారితీసింది. ఆ దుస్థితినుండి దేశాన్ని మళ్లించేందుకు, ఉద్ధరించేందుకూ, బాపూజీ చేసిన కృషిలోని భాగమే, హరిజనోద్యమం, కులాంతర వివాహాలు.

ఆలోచనకూ, ఆచరణకూ, ఎక్కడా పొరపొచ్చం రానివ్వని స్వచ్ఛ హృదయుడు బాపూజీ. మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఈ అనైక్యతకు కారణం మనలో ఉన్న కులమత భేదాలేనని, బాపూజీకి స్పష్టంగా తెలుసు. వ్యాధి తాలూకు మూల కారణం తెలిసిన వైద్యుడు, రోగ నిర్మూలనకు, శక్తివంతమైన ఔషధం వాడతాడు. అలాగే మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న సాంఘిక రుగ్మతకు సరైన మందును మహాత్ముడు కనుగొన్నాడు. ఆ మందు పేరు 'కులాంతర వివాహం'.

కులాంతర వివాహాలు, మతాంతర వివాహాలు, భారతీయులకు మరేం కొత్తకాదు. హైందవ రాజుల కాలంలోనూ, ఆ తరువాత వచ్చిన మహమ్మదీయ ప్రభువుల కాలంలోనూ, కులాంతర మతాంతర వివాహాలు ముమ్మరంగా జరిగాయి. ముఖ్యంగా రాజ వంశీయులు, రాజబంధువులు, ఈ వివాహాలను జరిపించారు. ప్రభువులకు సన్నిహిత

వర్ణాలవారు, ఆయా పాలకుల మెప్పుదలకోసమే కావచ్చు; మతాంతర వివాహాలు చేసుకున్న దృష్టాంతాలు చాలా ఉన్నాయి.

రాజారాం మోహనరాయ్‌ల వంటి సంస్కార ప్రియుల నిరంతర కృషివలన, సమాజంలో నూతన దృక్పథంతో, సమస్యలను అవగాహన చేసుకోవడానికి ప్రయత్నం జరిగింది. ఈ ప్రయత్నంవలన, కులాంతర వివాహాలు, మరికొంత సులభంగా జరుగడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. ఆంగ్ల విద్యాభ్యాసం ద్వారా, బాహ్య ప్రపంచంతో, మనకున్న సంబంధాలు విస్తృతమయినాయి. పుస్తకాల ద్వారా అవగాహన చేసుకోగలిగాం. ఇది మన దృష్టి, విశాలం కావడానికి ఎంతో ఉపకరించింది.

ఒకజాతి పటిష్టంగా ఉండడానికి, సమైక్యత అవసరం, ఈ సమైక్యత, చీలిపోయిన సమాజంవల్ల సాధ్యంకాదు. ఈ చీలికలు, కులాలకు, మతాలకు సంబంధించినవే. వీటిని పూర్తిగా నిషేధించడం రాజ్యాంగరీత్యా సాధ్యంకాదు. కాని, చైతన్యవంతమైన కృషిద్వారా, వీటి పరిధినుండి జాతి బయటపడవచ్చు. ఆ కృషి, కులాంతర వివాహం, ఈ విషయం తెలిసిన బాపూజీ, ఈ కులాంతర, మతాంతర వివాహ సిద్ధాంతాన్ని బాగా ప్రచారం చేయడమేగాదు, ముందుగా తాము ఆచరించారు. ఆ తరువాత, తమ అనుయాయుల చేత ఆచరింపజేశారు.

తమ కుమారుడైన దేవదాస్‌గాంధికి, రాజగోపాలాచారి పుత్రికకు వివాహం జరిపించారు. సరోజినీదేవి వంగసోదరి, గోవిందరాజుల నాయుడుగారు తెలుగువాడు. అలాగే మహమ్మదీయులైన అసఫలీని, అరుణ వివాహం చేసుకొంది. రవీంద్రనాథ చంద్రుడు, తమ శాంతినికేతనంలో, కులాంతర వివాహాలను జరిపించారు. దీన్నొక ప్రతేకి ఉద్యమంగా భావించి, అందుకోసమే తమ సర్వస్వాన్నీ ధారపోసినవారు ఉన్నారు. అలాంటివారిలో, కీర్తిశేషులు గోపరాజు రామచంద్రరావుగారు 'గోరాగారు' ప్రముఖంగా పేర్కొనదగినవారు.

తమ సంస్కారోద్యమంలోనూ, జాతీయోద్యమంలోనూ, విద్యా ప్రచారోద్యమంలోనూ, భాగంగా, మతాంతర, కులాంతర వివాహాలను కూడా ఒక భాగంగా చేసుకున్న సంస్కర్తలెందరో ఉన్నారు.

కందుకూరి వీరేశలింగంగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు, రఘుపతి

వెంకటరత్నం నాయుడుగారు, ఉన్నవ లక్ష్మీనారాయణగారు, త్రిపురనేని రామస్వామి చౌదరిగారు, దరిశి చెంచయ్యగారు, వారి సతీమణి దరిశి సుభద్రమ్మగారు తమ కాలాన్ని ఈ సంస్కరణోద్యమాలకే వినియోగించారు.

ఎంతప్రచారం జరిగినా, ఎంత హేతు బద్ధంగా వాదించినా, యుగయుగాలుగా మనలో జీర్ణించుకుపోయిన ఈ కులతత్వం ఒకటి రెండు సంవత్సరాలలో పోయేదీ, పోగొట్టగలిగేదీ, కాదు. ప్రచారం జరగవలసిందే, ఇందుకు సంబంధించిన సాహిత్యం విరివిగా రావలసిందే. పంద ఉపన్యాసాలకన్నా ఒక ఆచరణ ముఖ్యం అన్నారు బాపూజీ.

కులాంతర వివాహాలను గురించి వందలోట్ల ఉపన్యాసాలివ్వటం కన్నా, ఒక వివాహాన్ని జరిపించడం వల్ల ఎక్కువ ప్రయోజనముంటుంది.

కులాంతర వివాహం చేసుకొన్న దంపతులను తేడాగా చూస్తున్న మాటనిజమే. బాలా సందర్భాలలో, దంపతులు ఇద్దరూగాని లేక ఏ ఒక్కరోగాని, తమకున్న ఆస్తి పాస్తులను వదులుకోవలసి వస్తున్నది. బంధువుల్ని కోల్పోవలసివస్తున్నది. ఆర్థికంగా ఆపస్థలు పడవలసి వస్తున్నది. ఈ ఇబ్బందులన్నీ నెమ్మది మీద సర్దుకోవచ్చు. అలా సర్దుబాటయిన సందర్భాలు చాలా ఉన్నాయి.

ఒకప్పుడు వీరేశలింగంగారు, కులాంతర వివాహాలను ప్రారంభించినప్పుడున్నంతగా ఈనాడు వ్యతిరేకతలేదు. కాని ఇప్పటి వ్యతిరేకత తాలూకు స్వభావం మరొక రూపంలో ఉన్నది.

ఆధునిక యుగం, వేగవంతమైంది. రాష్ట్రాలమధ్య, దేశాల మధ్య, ఖండాల మధ్య, దూరాలు తరిగిపోతున్నాయి. వివిధ కూటాల క్రింద విడిపోయిన ప్రపంచ దేశాలు, క్రమంగా కలిసిమెలిసి సహజీవనం నెరపడానికి అలవాటు పడుతున్నాయి. పెరుద్ధరాజకీయ విశ్వాసాలున్న రెండు దేశాల ప్రభుత్వాలు, తమలోతాము సంఘర్షించవలసి ప్రయోజనం కనబడుతుంది, అనుభవపూర్వకంగా గ్రహిస్తున్నాయి. ఈ దేశాలను సన్నిహితం చేస్తున్న సూత్రాలే, దేశంలోని విభిన్నపథ్ధాల వారినీ, సమైక్య పరచవానికి ఎంతో దోహదపడుతున్నాయి. పాత విశ్వాసాలు పగుళ్ళిచ్చి, కూలిపోతున్నాయి. పాతరాజకీయ విధానం, మారిపోతున్నది. గతంలో పెత్తనంచలాయించిన వారంతా

తప్పుడు పక్కకు తప్పుకొంటున్నారు. ఒకప్పుడు, ఆర్థికంగా, సాంఘికంగా రాజకీయంగా పెత్తనం చెలాయించిన వారి కాలం చెల్లిపోతున్నది. ఈనాడు సామాన్యుడే మానవుడు. సామాన్యుడే మాన్యుడు.

ఈ సామాన్య మానవుల సంఖ్య—నేటి మనసమాజంలో అత్యధికం, వీరందరు, రాజకీయంగా ముందుకురావడం ముదావహం. ఉన్నత పదవులలోకి రావడం, ఆనందించ దగిన విషయం. వీటితోబాటుగా సాంఘికంగా ముందుకురావాలి, 'మీరు ఫలానా కులం—నేను ఫలానా కులం' అన్న భేద దృష్టిపోవాలి. నిజమే, కాని ఎలాపోతుంది? కులాంతర వివాహాలను బాగా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా కృషి చేస్తున్నది. గడిచిన రెండు సంవత్సరాలుగా, రకరకాల ప్రోత్సాహక పథకాలను, ప్రభుత్వం అమలు జరుపుతున్నది. 1974వ సంవత్సరం జులై మాసంలో, మంజూరైన పథకం ప్రకారం, వర్ణాంతరవివాహ చేసుకున్న దంపతుల్లో, ఏ ఒక్కరైనా, షెడ్యూల్డు కులాలకుగానీ, షెడ్యూల్డు తరగతులకుగానీ, చెందిన వారయితే, ఒక వేయి రూపాయలు బహుమతిగా ఇవ్వబడుతున్నది. అదే వెనుకబడిన తరగతుల వారైతే, అయిదువందిల రూపాయల బహుమతిని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యా విషయకంగానూ, ఇళ్ల స్థలాల కేటాయింపులోనూ ఉద్యోగాల విషయంలోనూ కొంత ప్రాముఖ్యత నివ్వాలన్న సూచనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నవి. employment శాఖద్వారా కొంతప్రాముఖ్యత ఉద్యోగాలలో నిరుద్యోగులైన కులాంతర దంపతులకు ఇవ్వాలని, ఇటీవలే, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము, ఆర్డర్లు జారీచేసింది.

1974—75 ఎ సంవత్సరంలో వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించడానికి, రాష్ట్ర ప్రభుత్వం, 5 లక్షల రూపాయలను కేటాయించింది. 1975—77వ సంవత్సరంలో 8 లక్షల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది. కులాంతర వివాహాలు చేసుకొన్న వారు ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కొవలసి వస్తున్నది. వీటిన్నింటిని పరిష్కరించడం కోసం, ఇద్దరు ఉన్నతాధికారులను ప్రభుత్వం నామినేట్ చేసింది. కమ్యూనిటి హాల్స్ నిర్మాణాన్ని కూడా ప్రారంభించింది.

గత అనుభవం మనకు చెబుతున్న పాఠం ఏమిటి? మతం ఒక జీవన విధానం మాత్రమే, అన్నసత్యాన్ని మనంమరచిపోయాం. కులంవొక పనికి చిహ్నం మాత్రమే అన్న మరొక సత్యాన్ని కూడా మనం మరిచిపోయాం. సత్యాలను మరిచిపోయి, అసత్యాలను ఆసరాచేసుకొన్నాం, ఈ అబద్ధాలను నమ్ముతూ బ్రతుకుతున్నాం. మనం

స్వార్థంతో సృష్టించుకొన్న ఈ అబద్ధాలే, ఈ అంధవిశ్వాసాలే మన ప్రజాస్వామిక విధానాన్ని కూలద్రోయడానికి కుట్రపన్నాయి. ఈ కులమన్నదే లేకపోతే, అప్పుడు ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అన్న ఆలోచనకే ఆస్కారం ఉండదే!

'అంచరు మానవులు ఒకటే' అన్న, మన ప్రాచీన మహర్షుల వాక్కు నిజం కావడానికి, కుల మత వర్గరహిత సమాజం కావాలి. అందుకుతోడుపడేది కులాంతర వివాహాలేననడంలో సందేహం లేదు.

గత చరిత్రనుండి గుణపాఠం నేర్చుకుందాం. భారతజాతి—రకరకాల విభేదాలతో; గత కాలంలో చాలా బాధలు అనుభవించింది. అవి పునరావృతం కారూడదు.

కుల, మత, వర్గ, ప్రసక్తిలేని సమాజనిర్మాణ బాధ్యత యువతరం మీద వున్నది. ఈనాడు మనం నిర్మించుకొంటున్న సామ్యవాద సమాజంలో జీవించబోతున్న వారు, ఆ సమాజాన్ని మరింత పరిపుష్టం చేయబలసిన వారు యువకులే.

భారత యువత తొలినుండి త్యాగానికి పేరుమోసింది. ఈ విషయంలోను వారు ముందడుగు వేయగలరని, మనం పూర్తిగా విశ్వసించవచ్చు.

కులచిహ్నాలతో లగింపు

ఇటీవల కొద్దికాలంగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములు కులవ్యవస్థ వల్ల కలుగు తున్న అనర్థాలపై తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి. అంతేకాదు, కులనిర్మూలనపై, తమ ఆసక్తిని కూడ కనబరుస్తున్నాయి. ఇది ఎంతో సంతోషించవలసిన విషయం. తమ ఈ పైఖరులకు అనుగుణంగా ఇటీవల ప్రధానమంత్రి ఢిల్లీలో కుల నిర్మూలనపై జరిగిన ఒక సదస్సులో మాట్లాడుతూ, పేర్లకుగల, కుల సంకేతాలను విడచి వెయ్యాలని ఉద్బోధించారు. మన రాష్ట్ర ప్రభుత్వం, కులాంతర వివాహం చేసికొన్న వధూవరులలో, ఒకరు షెడ్యూల్డు కులస్థులుగాని, షెడ్యూల్డు జాతివారుగాను ఐతే, వారిద్ద రికి ఉపాధి లేకుండా ఉంటే వారిలో ఒక్కరికి ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజీ, ఉద్యోగాల నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఒకఉత్తరువు జారీచేసింది. వీటిద్వారా ప్రభుత్వ దృష్టిలో కుల నిర్మూలన ఎంత ప్రధానస్థానాన్ని పొందిందో బోధపడుతుంది.

అయితే ఇప్పుడు మనం ప్రభుత్వం సూచిస్తున్న ఈ సంస్కరణలు కుల నిర్మూలనకు ఎంతవరకు తోడ్పడగలవనేది ఆలోచించవలసి ఉంది.

ఈనాడు, భారతీయసమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలు రెండు. ఒకటి ఆర్థిక సమస్య. రెండు సాంఘిక సమస్య. ఆర్థికసమస్య, ఆర్థిక అసమానతకు సంబంధించినదైతే, సాంఘిక సమస్య. సాంఘిక అసమానతలకు సంబంధించినది. ఆర్థిక అసమానత, తొలగించగల అధికారము, శక్తి, ప్రభుత్వానికి సంబంధించినట్టిది. అయితే సాంఘిక అసమానత, అలాంటిది కాదు. అది కులాలకు సంబంధించింది. ప్రభుత్వ శాసనాలతో మాత్రమే పోయేది కాదు. ప్రభుత్వ శాసనాలతోపాటు, ప్రజా ఉద్యమాలు. చైతన్యం అవసరం. శాసనానికి భయపడి, ఒక కులస్థుడు, మరొక కులస్థునియెడ బహిరంగంగా విచక్షణ చూపించకపోయినా, వ్యక్తిగత జీవితంలో చూపించే విచక్షణను, ఏ ప్రభుత్వ శాసనం అడ్డలేదు. అట్టి స్థితిలో, సాంఘిక అస

మానత యధాతథంగా ఉండి పోతుంది. అందువల్ల ప్రభుత్వ నిబంధనలతోబాటు, కుల నిర్మూలనకు కృషి చేసే సాంఘిక ఉద్యమాల అవసరం ఎంతైనా ఉంది. వాటికి ప్రభుత్వ సహాయము లభించాలి. ఇట్టి ఉద్యమాలు కృషి, ప్రభుత్వ శాసనాలు, నిబంధనలు, సాంఘిక అవమానతల నిర్మూలను త్వరితం చేస్తాయి.

కుల నిర్మూలనకు జరిగే కృషిలో. ఒక భాగమే, కుల చిహ్నాల తొలగింపు, కేవలం, కుల చిహ్నాల తొలగింపువల్లనే కులతత్వం నిర్మూలింపబడదు. తరనరాలలో జీర్ణించుకు పోయిన కులతత్వం, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, వృద్ధిచెందినదేగాని తగ్గు ముఖం పట్టలేదు. అన్ని రంగాలలో కులతత్వం కొట్టవచ్చినట్లు కనబడుతుంది. భారతదేశంలో కులాల ప్రభావం, ఉపేక్షించడానికి వీలులేనట్టిది. గతంలో బానిసత్వానికి దారితీసింది. ఒక వ్యక్తి పుట్టినప్పటినుండి, చనిపోయేపరకూ, అతని జీవితాన్ని అంటిపెట్టుకొని ఉన్నది. ఈకులవ్యవస్థ, ఇందులో, నామకరణం, వివాహం, చనిపోయినప్పుడు చేసే కర్మకాండలు, అన్నీ కుల సంప్రదాయాలతో, మిళితమైనట్టివే, పిల్లవానికి పెట్టే పేరులోనే, అతనికులాన్నికూడా సూచించే పదం చేర్చడంజరుగుతూంది. అలాంటివే, శర్మ, శాస్త్రి, రెడ్డి, చౌదరి, యాదవ్, గౌడ్, చారి, నాయుడు మొదలైనవి. ఇట్టి పేర్లవల్ల, సంకుచిత కులపరిధులతో, ఏ మాత్రం సంబంధం, పరిచయం లేని, బాలుర మనస్సులో, కులం అనే, విషబీజాలు నాటడం జరుగుతూంది. ఈ ప్రథమ ప్రభావం బాలుర మనస్సులపై అమితమైన, ప్రభావాన్ని వేస్తుంది. ఆ లేత వయస్సులోనే, కొందరు పెద్ద కులస్థులని, మరికొందరు తక్కువ కులస్థులని అనే భావాలు నాటుకొనడం వల్ల, వారిలో కొందరిలో తాము అధికులమనే భావాన్ని, మరి కొందరిలో తక్కువవారమనే భావాన్ని కల్గిస్తాయి. అధికులమనే వారిలో, సాహసం, గర్వం, దర్పం పెరిగితే, తక్కువవాకమనేవారిలో భయం, పిరికితనం, స్వాభిమానం లోపించడం జరుగుతుంది. ఇంచుమించు స్కూళ్లలో, కాలేజీల్లో ప్రవేశపెట్టే పాఠ్యపుస్తకాలు కూడ, దోహదం చేస్తున్నాయి. కొన్ని పుస్తకాల్లో, కొందరు కులస్థుల ఔన్నత్యాన్ని పొగడడం, మరికొందరు కులస్థుల నిమ్నత్వాన్ని తెగడడం చేస్తున్న, పాఠాలు బోధింపబడుతున్నాయి. ఉదాహరణకు శాస్త్రిలుగారు, ఎరుకల వాడు అనే పదాలు. అంతేకాదు, కొందరు కులస్థుల్ని అవహేళన చేస్తున్న సామెతలు కూడ విరివిగా వాడబడుతున్నాయి. ఉదాహరణకు– ''మాలకూటికి వెళ్లినా, నిక్కపప్పే'' ''చచ్చువుకొన్న వాడికంటే చాకలాడు నయం'' గొల్లని సాహిత్య విద్య ''వైశ్యులమనియెది వార్త మాత్రమే కాని, దొంగ అంతకన్న దొరకబోడు'' మొదలైన పద్యాలు ప్రాథమిక

పాఠశాలలోని, బాలురచే కంఠస్థం చేయిస్తున్నారంటే, బాలుర నరనరాల్లోకి, కులం అనే విషపు ఇంజెక్షన్లు ఎక్కిస్తున్నారనేగదా! మరి ఇలా బాల్యం నుండే మూరి పోయబడే, కుల ప్రభావం నుండి, తప్పించుకోవడం, అంటే మాటలతో జరిగే పనేనా? కనుక, ప్రభుత్వం మొట్టమొదటగా చేయవలసినపని పాఠ్య పుస్తకాల నుండి. కులాలకు సంబంధించిన పాఠ్యభాగాల్ని, పద్యభాగాల్ని, వెంటనే తీసివేయడం ఇక కుల నామ సంకేతాలు పెట్టుకొన్న విద్యార్థులను, విద్యాలయాల్లో చేర్చుకోమని, ప్రకటించడం చెయ్యాలి. ఆ ఉత్తరువుల్ని ఖచ్చితంగా అమలు పరచాలి. దీనివల్ల బాల్యంలోనే బాలుర మనస్సులు కులాలతో, కలుషితం కాకుండా అరికట్టవచ్చు.

ఇక వ్యక్తి జీవితంలో, మరొక మైలురాయి వివాహం. ఇది వ్యక్తిని కుల సంకెళ్లల్లో, మరింతగా బంధించడంగాని, కులసంకెళ్లను విచ్చేదం చేయడంగాని చేస్తుంది. కాని పెళ్లివరకు వచ్చేటప్పటికి, తమ ఆచర్యాలకు, అభ్యుదయ భావాలకు స్వస్తి చెప్పి, తమ కులపు పిల్లనే, వివాహం చేసేసుకుంటున్నారు. ఆ వివాహానికి, బాధ్యత, తల్లిదండ్రుల మీదకు నెట్టివేస్తూంటారు, మరికొందరు బుద్ధిమంతులు. వాస్తవానికి గండికొట్టవలసింది, ఇక్కడే. కులవ్యవస్థ నిర్మూలింపబడటానికి, ఏకైకమార్గం కులాంతర వివాహమే. అందువల్లనే ఏకకులంలో జరిగే వివాహాలను ప్రభుత్వం నిరుత్సాహ పరచాలి. ఇది వ్యక్తి స్వాంతంత్ర్యాన్ని, పోగొట్టుతుందనపచ్చు. సంఘ శ్రేయస్సుకు, కొన్ని స్వాతంత్ర్యాలను వదలు కొనడం, చేస్తునే ఉన్నాము గదా. ఈ సందర్భంలో, రాష్ట్రప్రభుత్వాలు కులాంతర వివాహాల్ని ప్రోత్సహిస్తూ చేసిన నిబంధనలను కూడ ఒక్కసారి పరిశీలించడం, అప్రస్తుతం కాబోదు. గుజరాత్, పాండిచేరి ప్రభుత్వాలు కులాంతర వివాహితులకు, ఐదు వేల రూపాయలు పారితోషికంగా ఇస్తూన్నాయి. మరికొన్ని ప్రభుత్వాలు కులాంతర వివాహితులకు సర్టిఫికెట్లు, బంగారు పతకాలు ఇస్తున్నాయి. మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కులాంతర వివాహాల్ని ప్రోత్సహిస్తూ 1974లో ఒక నిబంధన చేసింది. అందులో వధూవరులలో ఒకరు షెడ్యూల్డు కులానికి చెందిన వారైతే, వెయ్యి రూపాయలు, వెనుక బడిన తరగతికి చెందినవారైతే ఐదు వందల రూపాయలు, వధూవరులకు వివాహ సమయంలోగాని, బహూకరిస్తూంది. అయితే ఈ నిబంధన కులాంతర వివాహాల్ని ప్రోత్సహించడానికి తగినంతగా తోడ్పడడం లేదు. ఒక ప్రక్క కులాంతర వివాహాల్ని ప్రోత్సహిస్తున్నామంటూ, కొందరికే చెండేటట్లు షరతులు విధించడం సమంజసం కాదు. కావాలనుకొంటే, హెచ్చు మార్పును ఆశిస్తున్న ప్రభుత్వం, అట్టి వివాహాలకు హెచ్చు ప్రోత్సాహం ఇవ్వవచ్చు. వాస్త

వానికి ఏ రెండు కులాల మధ్య జరిగే వివాహమైనా, కులాంతర వివాహమే. అన్నింటికీ తగినంత ప్రోత్సాహం లభించాలి ఇప్పుడున్న విధానంలో, ప్రభుత్వం కొన్ని మార్పులు చేయవచ్చు. వధూవరుల్లో ఒకరు షెడ్యూల్డు కులస్థులైతే ఇప్పుడు ఇస్తున్నట్లు వేయి రూపాయలు కాక రెండు వేల రూపాయలు, వెనుకబడిన తరగతులవారైతే ఐదు వందలకు బదులు వెయ్యి రూపాయలు, ఏ కులాంతర వివాహానికైనా ఐదువందల రూపాయిలు ఇచ్చి ప్రోత్సహించాలి. వధూవరులు ధనవంతుల కుటుంబాలకు చెంద కుంటే, ఈ నగదు బహుమతి ఇవ్వడం అవసరమే గదా!

ఈ సందర్భంలోనే. మన రాష్ట్ర ప్రభుత్వం కులాంతర వివాహితులను ప్రోత్స హిస్తూ జారీచేసిన మరొక నిబంధన చూద్దాం. దీని ప్రకారం, వధూవరుల్లో ఒకరు షెడ్యూల్డు కులానికిగాని షెడ్యూలు జాతికి గాని చెందియుండి, ఇద్దరూ నిరుద్యోగులైతే, వారిలో ఒకరికి ఎంప్లాయిమెంటుశాఖ ద్వారా ఇచ్చే ప్రభుత్వోద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వబడాలి. అయితే, ఈ ఆర్డరు కూడ సమగ్రంగాలేదు. ఇప్పటికే, షెడ్యూలు కులాల వారికి రాజ్యాంగరీత్యా, రిజర్వేషన్లు ఏర్పరచబడ్డాయి. కనుక వధూవరుల్లో ఒకరు షెడ్యూలు కులానికిగాని, షెడ్యూలు జాతికిగాని చెందినవారైతేనే, ఉద్యోగంలో ప్రాధాన్యత లభించేటట్లు చేయడం అంత సమంజసంగా లేదు. ఇందుకు బదులుగా షెడ్యూలు కులస్థులతో కులాంతర వివాహాలు చేసికొన్నవారికి ప్రభుత్వ రిజర్వేషన్లలో ప్రాధాన్యత ఇవ్వబడేటట్లు చెయ్యాలి. అప్పుడు షెడ్యూలు కులాలలోగల శాఖోపశాఖల మధ్య వియ్యమొందిన తదితర కులస్థుల మధ్య ఐకమత్యం ఏర్పడుతుంది. ఇలాంటి, నిబంధనే వెనుకబడిన తరగతులకు వర్తింపచేయవచ్చు. ప్రథమ చర్యగా పరిమితంగానైనా, సాంఘిక సమానత్వానికి ఈ మార్గం సుకరమౌతుంది.

ఇకపోతే, ప్రతి కులాంతరవివాహం కుల నిర్మూలనకు తోడ్పడేదే. తారతమ్య భేదాలుతొలగించునట్టిదే. కనుక, ఉద్యోగ, ఉపాధికల్పనలో, మరల అగ్ర నిమ్న కులా లనేవిచక్షణలకు పోక, కులాంతర వివాహితులందరకూ తప్పని సరిగా ఉద్యోగనియా మకాలో వారి ఆర్థిక పరిస్థితిని బట్టి కొంత ప్రాధాన్యత ఇవ్వాలి.

ఈనాడు, ఎంతోమంది యువకులు ఆర్థిక అశక్తతవల్ల తమ తల్లిదండ్రులను ఎదిరించలేక, వారు సూచించిన తమ కులస్థుల పిల్లల్నే వివాహం చేసికొంటున్నారు. ప్రభుత్వం గనుక, కులాంతర వివాహం చేసి కొన్నవారికి ఆర్థిక పరిస్థితిని బట్టి, సామర్థ్యమును బట్టి తప్పనిసరిగా ఉద్యోగావకాశం కల్పిస్తూ నిబంధన చేస్తే, అట్టి

వారందరూ కులాంతర వివాహాలు చేసికోవడానికి ముందుకు వస్తారు. అప్పుడు సమస్య పరిష్కారం అనుకున్నదానికంటే, తక్కువ సమయంలోనే జరుగుతుంది. అంతేకాదు, కులాంతర వివాహం చేసికొన్న వారిఆర్థిక వనరును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వరంగ సంస్థల్లోను ప్రభుత్వాధీన సంస్థలోను లోకలుబాడీ సంస్థలలోను వారికికొంత శాతం ఉద్యోగాలు కేటాయించేటట్లు చేయాలి. స్వయం ఉపాధిపథకాలలో ఋణాలు ఇవ్వడం లోను ఇళ్ల స్థలాల కేటాయింపులో, వివిధ రాజకీయ సంస్థల నియామకాల్లో, కులాంతర వివాహితులకు ప్రాధాన్యత ఇవ్వబడాలి. కులాలవాడలు పోవాలి. మిశ్రమ కాలనీలురావాలి.

మనది సెక్యులర్ వ్యవస్థ. అయినప్పటికీ విద్యాలయాల్లో, ఉద్యోగాల్లో, కుల మతాలు పేరొకానవలసివస్తూంది. ఇది మన రాజ్యాంగ లక్ష్యానికి విరుద్ధమైన చర్య. వాస్తవానికీ ఒక వ్యక్తి కులమతాలు వ్యక్తి వరకే పరిమితమైనట్టివిగాని సంఘంతో, వానికెట్టి సంబంధమూ లేదు. ప్రయోజనమూ లేదు. పైగా సాంఘికంగా అపారమైన నష్టమే జరుగుతుంది. ఆర్థిక అసమానతలు తొలగగానే కాలక్రమేపి కులరీత్యా ఉన్న రిజర్వేషన్లు రద్దయి పోవాలి. తొలిమెట్టుగా రిజర్వేషన్లు ఇస్తున్న కులాలలో వెనుకబడిన జాతులలో, కులాంతర వివాహితులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడాలి.

వ్యక్తి జీవితంలో మరొక ప్రధాన ఘట్టం సంతానం కులాంతర వివాహం చేసికొన్న వారికి ప్రధముంగా ఎదురొకానే సమస్య, పిల్లలచదువు సమస్య. ఈ విషయమై, ప్రభుత్వం లోగడ ఒక నిబంధన చేసింది. అందులో కులాంతర వివాహితులలో ఒకరికి చట్ట రీత్యా లభించే సౌకర్యాలు, అంటే, ఇరువురిలో ఒకరు షెడ్యూలు కులానికి చెందినా, లేక వెనుకబడిన తరగతికి చెందినా, లభించే సౌకర్యాలు వారి పిల్లలకు కూడ వర్తింపచేయడం. ఈ చర్య సదుద్దేశ్యంతో కూడుకొన్నట్టిదే అయినా, ఆశించిన సత్ఫలితాలు మాత్రంరావు. కారణమేమంటే, ప్రభుత్వం కుల రహితులైన పిల్లలకు (అంటే, కులాంతర వివాహితుల బిడ్డలను) ఒక కులానికి చెందిన వారుగా ముద్రవేసి, విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. దీనివల్ల పరోక్షంగా, కుల వ్యవస్థ స్థిరపడుతుందేగాని, నిర్మూలింపబడదు. కనుక ప్రభుత్వం కులరహితులైన పిల్లల ప్రత్యేక స్థితిని, స్థాయిని పరిగణనలోనికి తీసికొని, అందు కనుగుణమైన నిబంధన చేయాలికాని వారికీ నిమ్నజాతి కులము ఆపాదించి సహాయము చేయడం కులనిర్మూలనకు దోహదకారికాదు.

ఒక వ్యక్తి జీవితంలో చివరి ఘట్టం మరణం. చనిపోయినప్పుడు తన కులస్థుల రాడేమోనని కొందరు అనుమానం, భయం వ్యక్తం చేస్తూంటారు. వాస్తవానికి ఈ కుటుంబీకులు బ్రతికివున్నవారికే కాని, శవానికి కులంతో సంబంధం ఏముంది? చని పోయాక శరీరాన్ని కాల్చినా ఒకటే, పాతిపెట్టినా ఒకటే. అంతకంటే ఏ మెడికల్ కాలేజీకో ఇస్తే విద్యార్థుల జ్ఞాన సముపార్జనకు తోడ్పడుతుంది. కాని కులవ్యవస్థతో లుకలుకలైన, ఈ సాంఘిక వ్యవస్థలో తమ కులకట్టుబాట్లకు విభిన్నంగా శవాన్ని అంతం చేస్తే అదేదో మహాపరాధంగా భావిస్తారు. ఇది మౌఢ్యంకాక మరేమిటి? ఒక్కొక్క కులస్థులు తమ కుల కట్టుబాట్ల పేరున, పెద్దకంచె వైభవంగా శవాన్ని ఊరేగిస్తారు. మద్యాన్ని గూడా సేవిస్తూ ఉంటారు. తర్వాత, క్రతువు పేరిట ఎంతో ధనాన్ని వెచ్చిస్తారు. దానితో ఆర్థికంగా అంతంత మాత్రంగా వున్నకుంటుంబాలెన్నో మరింతగా ఆర్థిక దుస్థితికి లోనవుతాయి. అయితే అప్పుడు వారిని ఆర్థికంగా ఆదుకొనే వారెవరూ ఉండరు. ఆలా అని వారు ఆట్టి క్రతువులు జరుపకపోతే వారిని అపరాధం చేసినవారుగా భావిస్తారు. ఒక్కొక్కప్పుడు సాంఘికంగా వెలికూడ వేస్తారు. ఈ రకంగా కులవ్యవస్థ తన ఇనుప సంకెళ్లతో ఒక వ్యక్తి జీవితం మొత్తాన్నే కీలు బొమ్మలుగా మార్చి వేస్తూంది.

ఇకపోతే కొందరు కులవ్యవస్థ కూడదంటారు. అది పోవాలంటారు. అయితే అందులకుగాను తమ పిల్లలకు కులాంతర వివాహాలు చేయడానికి అంగీకరించరు. అదేదో గొప్ప సైద్ధాంతిక విభేధం వున్నట్లు సోషలిజం వస్తేగాని, కుల వ్యవస్థ పోదు అంటారు. సోషలిజం వస్తే కులవ్యవస్థ దానంతటదే పోతుందంటారు. సమాజంలో ప్రజలు సుఖశాంతులతో జీవించాలంటే ఆర్థిక సమానత్వం అవసరమనే విషయంలో ఎవరికీ భేదాభిప్రాయం ఉండనక్కరలేదు. అయితే ఇక్కడ ఒక్క విషయం ఆలోచించవలసియుంది. "సంఘ సర్వతోముఖాభివృద్ధి" అంటే అర్థం, ఒక్క ఆర్థిక రంగంలో అభివృద్ధిచెందటమే కాదు కదా! సాంఘికంగా కూడ అభివృద్ధి చెందాలి. అందులకుగాను కృషి ద్విముఖంగా జరగాలి. కొందరు ఒక ప్రక్క ఆర్థిక సమానత్వం కొరకు కృషిచేస్తుంటే మరికొందరు సాంఘిక సమానత్వం కొరకు కృషి జరపాలి. సాంఘిక చైతన్యం లేని వ్యక్తి, ఆర్థిక అవకాశం పొందినా, స్వార్థపరుడవు తాడు. సంఘ దృష్టి ఉండదు. ఈనాడు ఆర్థికంగా బాగావున్న విభిన్న కులస్థుల మధ్య వివాహాలు ఎందువల్ల జరగటంలేదు. ఇరువురు ఎంతో ఖర్చుపెట్టి తమ పిల్లలకు తమ కులస్థులనే ఎందుకు వివాహం చేస్తున్నారు? కూలినాలి చేసుకొనేవారు, ఆర్థికదుస్థితిలో

ఉన్నవారు తమలో తాము కులాంతర వివాహాలు ఎందుకు చేసికోరు ? ఆర్థిక సమానత్వం వారితో ఏ మార్పు తెచ్చింది ? అంటే వారిలో సాంఘిక చైతన్యం, సంఘ దృష్టి లేదనేగదా అర్థం ? కనుక అన్ని అసమానతలు ఆర్థిక సమానత్వంతో పోతాయని భావించడం, కులాంతర వివాహాల్ని ఉపేక్షించడం సమాజాభివృద్ధి కృషిని కుంటు పరస్తూందనడం, నిర్వివాదాంశము.

ఒక వ్యక్తిగాని సంస్థగాని, ప్రభుత్వంగాని తన లక్ష్యం "సర్వే జనాః సుఖినోభవన్తు" అని ప్రకటించినంత మాత్రాన చాలదు. ఏ ఒక్కరూ ఇతరుల్ని బాధించడమో, లేక సంహరించడమో తన లక్ష్యం అని ప్రకటించరు. వారి అచరణలోనే వారి నిజమైన ఉద్దేశ్యాలు బహిర్గతమౌతాయి. కనుక ప్రజాక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వం తన మతాతీత వైఖరిని, సాంఘిక శ్రేయస్సును కోరుతున్న దానికి నిదర్శనగా కొన్ని ఆచరణయోగ్యమైన సూచనలు స్వీకరించి అమలు జరుపాలి. అవేమిటంటే:-

1. రాజ్యాంగంలో అంటరానితనాన్ని రద్దుపరచినట్లుగా కులాల్ని రద్దుపరచుటకు రాజ్యాంగం సవరించాలి. కులప్రాతిపదికపైగా జరుగు రిజర్వేషన్లు, కొంత కాలపరిమితిలో రద్దు చేయాలి.

2. జాతీయమైన బ్యాంకులు, ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ప్రారిశ్రామికాభివృద్ధిచెందే సంస్థలు అందచేసే గ్రాంట్లు, అప్పులు మొదలగు వాటిని మంజూరు చేయడంలో కులాంతర వివాహాలు చేసికొన్న వారికి ప్రాధాన్యత ఇచ్చునట్లుగా ఉత్తర్వులు జారీచెయ్యాలి. అలాంటి ప్రాధాన్యతే ఇళ్లస్థలాలు కేటాయింపులో, స్వయం ఉపాధి పథకాలలో, రాజకీయసంస్థలలో ఇవ్వాలి.

3. ప్రభుత్వ, ప్రభుత్వ సహాయక సంస్థలలోని ఉద్యోగాలు, వివిధ స్థానిక సంస్థలలోని, ఉద్యోగాలలో కులాంతర వివాహాలు చేసికొన్న వారికి కొంత ప్రాధాన్యత ఇచ్చుటకుగాను అనువైన విధంగా రాజ్యాంగాన్ని సవరించాలి.

4. కుల ప్రసక్తి తెచ్చే, పాఠ్యగ్రంథాలు, పాఠాలు, పదాలు, సామెతలు పేర్లు తొలగించాలి.

5 కులాల వారిగా కాలనీలను, వాడలను, బావులను నిర్మించడాన్ని మానుకోవాలి. అన్ని కులాలవారు కలిసి నివసించే మార్గాలను ప్రోత్సహించాలి.

6. కులాన్ని సూచించే, పేర్లు ఇక పుట్టబోయేవారికి పెట్టడం, ఒక నేరంగా చేయాలి.

7. కులాంతర వివాహాలు చేసికొన్న కుటుంబాల సంక్షేమానికి, వారి సంతానానికి విద్యావకాశాల కోసం బడ్జెటులో ప్రత్యేకంగా నిధిని కేటాంచాలి.

8. దేశంలో కులర్మూలన లక్ష్యంతో కృషిచేసే సంస్థలకు ప్రభుత్వం సహాయాన్ని అందించాలి.

9. కుల నిర్మూలనకై జీవితాలను అంకితంచేసిన, త్యాగంచేసిన, సేవచేసిన వ్యక్తులను సన్మానించాలి. వారి సంస్మరణోత్సవాలు జరిపించాలి.

10. తల్లిదండ్రుల ఆస్తిలో–పుట్టుకతోనే– స్త్రీకి, పురుషుడికి సమాన వాటా వుండే విధంగా సమగ్ర సివిల్ కోడ్‌ను రూపొందించాలి.

11. కులాంతర వివాహాలు సాంప్రదాయ పద్ధతులలో జరుగకపోయినప్పటికి, దండల మార్పిడి మొదలైన పద్ధతులలో జరిపిన వివాహాలు కూడ రిజిష్టరు చేయు విధంగా చట్టాన్ని సవరించాలి.

12. కులాంతర వివాహం చేసికొన్న వారికి ప్రభుత్వం తనవద్ద గల ఇళ్ల స్థలాలను కేటాయించాలి. హౌసింగు బోర్డు ఇళ్ల కేటాయింపులో గూడా, వారికి ప్రాధాన్యత ఇవ్వాలి.

13. 18 సంవత్సరాలకు లోబడిన యువతులు తల్లిదండ్రుల ప్రమేయం లేకుండా వివాహం చేసికోవడానికి స్వాతంత్ర్యం లేదు. కాబట్టి స్త్రీ వివాహ పరిమితి 18 సంవత్సరాలకు పెంచుతూ, అంతకు తక్కువ వయస్సు గల బాలికలకు వివాహాలు చేయరాదని చట్టాన్ని చేయాలి.

14. వేదాలు, అన్ని కులాల వారు పఠించి, పూజారులుగా, అర్చకులుగా,

వ్యవహరించడానికి, అవకాశాలు కల్పించాలి. ఈ విషయంలో ఏ కులానికి చెందిన వారికి వంశ పారంపర్య హక్కు ఉండరాదు.

15. అంతర్వివాహాలు చేసికొన్న వారిపై జరిగే హింసలు, అత్యాచారాలు అరికట్టడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వాలు దర్యాప్తు సంఘాన్ని నియమించి అత్యాచారాలు జరిపినట్లు ఋజువైన వారిపై తక్షణ చర్యలు తీసికోవాలి. అప్పుడే కుల రహిత సమసమాజస్థాపన వీలౌతుంది.

హిందూ కోడ్ బిల్లు

డాక్టరు అంబేద్కర్

డాక్టరు బాబాసాహెబ్ అంబేద్కర్ భారతదేశ చరిత్రలో మహోన్నతమయిన వ్యక్తి. అంటరానివారుగను, బానిసలుగను నికృష్టమైన జీవనము సాగించుచున్న దళిత వర్గాల అభివృద్ధికి వారుచేసిన సేవ, సువర్ణాక్షరాలతోలిఖించవలసిఉంది. అరమరికలులేని, సమసమాజ ధ్యేయముగల, రాజ్యాంగాన్నిరూపొందించినందులకు, హరిని 'అభినవమను' గా అంటూ ఉంటారు. మను, మనిషికి మనిషికి భేధాన్ని సృష్టించి, మానవత్వాన్ని మంటగలిపి, ఐకమత్యాన్ని పోగొట్టి దేశానికి బానిసత్వం ప్రసాదించడానికి తోడ్పడితే, డాక్టరు అంబేద్కరు, మానవత్వపు విలువలకు, ప్రాధాన్యత నిచ్చి, సమసమాజనిర్మాణానికి తోడ్పడే రాజ్యాంగాన్ని, మనకు ప్రసాదించారు. "మనువు"తో డాక్టరు అంబేద్కరును పోల్చటం, న్యాయముకాదు అని, వేరే చెప్పనక్కరలెదు. మనదేశ సాంఘిక వ్యవస్థ. వర్ణవ్యవస్థపై, ఆధారపడి ఉన్నది కాబట్టి, ఆయన ఔన్నత్యానికి, తగిన గౌరవ మర్యాదలు మనం యివ్వలేక పోయామని అనిపిస్తుంది. కాని రాజకీయవేత్తలకు. న్యాయస్త్రవేత్తలకుసాంఘికసంస్కర్తలకు, ఒకటేమిటి, పురోగతినిఆశించేవారందరకూ, డా॥ అంబేద్కర్ శక్తిసామర్థ్యాలు రూఢిగా తెలుసు. ఇందుకు ఎంతమాత్రమూసందేహము లేదు. అయితే ఆయన, ఏవిలువలకొరకు తనయావజ్జీవితాన్ని ధారపోసి, అవిరళ కృషి చేశారో, ఆ సిద్ధాంతాలకు ఇప్పడు తగిన ప్రాధాన్యత, మనము ఇవ్వటం లేదు. ఆయనను ఎరిగినవారు, ఎరుగనివారు కూడ, రాజ్యాంగ ముఖ్యనిర్మాతగా. హిందూ కోడ్‌బిల్లు పర్యవేక్షకునిగా పూర్తిగా ఎరుగుదురు. రాజ్యాంగ ముసాయిదా అధ్యక్షుడిగాను, రాజ్యాంగ నిర్మాణసభలో రాజ్యాంగముయొక్క లోతు పాతులు, సభ్యులకు వివరణకర్తగాను, డా॥ అంబేద్కర్, అద్వితీయమైన పేరు ప్రతిష్టలు, సంపాదించుకొన్నారు. ఇకపోతే, సాంఘిక విప్లవకారుడుగా కూడా, ఆయన అద్వితీయుడే. భారత సమాజాన్ని, హిందూ సంఘాన్ని, శల్య పరీక్షచేసి, దోషాలను దురలవాట్లను, మూఢ

నమ్మకాలను, నిశితంగా విమర్శించి, జాతిపిత గాంధీమహాత్మునితో కూడ, పోటీపడి తనవాచపటిమవల్ల. మహాత్ముని మన్ననలను గూడాపొందారు. పూజ్య బాపూజీ ఎదుట, డా॥ అంబేద్కరును, అగ్రజాతివర్ణస్తులు, దేశద్రోహిగా వర్ణించినప్పుడు, ఆయన డాక్టరు అంబేద్కరు, శతాబ్దాలుగా, ఋణగ్రస్తులుగా, అణగద్రొక్కబడిన దళితవర్గాల అభివృద్ధికి చేసిన సేవను కొనియాడి, కొన్ని వేల అంబేద్కరులు, హిందూ సమాజ ఉద్ధరణకు కావాలని చెప్పారు. వర్ణవ్యవస్థలోని. లోటుపాట్లను, వితంతు వివాహము, సతీసహగమనము, మతాంతరీకరణ, వారసత్వపు హక్కులు, హిందూ సంఘములో, స్త్రీల స్థానము, మొదలైన సమస్యలను కూలంకషముగా, పరిశీలించి, ఎప్పటికప్పుడు, జాతిని మేల్కొలుపుతూ, అమూల్యమయిన, ఆచరణీయమయిన, పద్ధతులను సృష్టించారు. ఆయనవైదుష్యమూ వాద పటిమ. సమాధాన నిపుణత, సాంఘిక సంస్కరణాభిలాష మొదలయిన గుణాలను, ఒక్కచోట ప్రోగుచేసినది, హిందూ కోడ్‌బిల్లు పర్యవేక్షణలోనే, భారతదేశంలో కాశ్మీరమునుండికన్యాకుమారివరకు, హిందూమతస్థుల వారసత్వపు హక్కులూ, దత్తత స్వీకారపు హక్కులు, మనోవృత్తి హక్కులు, వైవాహిక సంబంధాలు, స్త్రీల ఆస్తి హక్కులు, స్వార్జితము, పిత్రార్జితము అయిన ఆస్తులలో, సమిష్టి కుటుంబ సభ్యుల హక్కులు, మతాంతరీకరణ పద్ధతులూ ఒక తీరుగా లేవు. మితాక్షర, దయాభాగ విభాగాలుగా,హిందూ సంఘము విభజింపబడింది. అందుచేత, హిందువులంతా, ఒకే సంఘము వారమని భావించడానికితగిన ఐక్యతాసూచనలు మతరీత్యాలేవు. .హిందూమతం, కొన్ని కులాల సమ్మేళనం మాత్రముగానే ఉంటూవచ్చింది. ఒకరికంటె మరొకరు, అధికులు అనేభావన, కూడు–గుడ్డలకంటె ఎక్కువగా హిందూ మతస్థులు పరిగణిస్తూ, తృప్తి పడుతూవచ్చారు. ఈవ్యత్యాసాలేహిందూసంఘ బలహీనతకు, పరరాజ్యాలవారుచండెత్తడానికి, మనబానిసత్వానికి, ముఖ్యకారణాలు అయినాయి. డా।। అంబేద్కర్, ఈ విషయాన్ని గ్రహించారుకాబట్టి, భారతీయులకు రాజకీయ స్వాతంత్ర్యమువస్తే సరిపోదు. ఆర్థిక సమానత్వాన్ని, సాంఘిక స్వాతంత్ర్యాన్ని స్థాపించుకోవాలి అన్నారు. అట్లాకాని నాడు, సాంఘిక రంగంలోను, ఆర్థిక రంగంలోను, అణగద్రొక్కబడుచున్న ప్రజలు తిరుగుబాటుచేసి, ప్రజాస్వామ్యప్రభుత్వవిధానాన్నే, మార్చివేయగలరని అయనహెచ్చరించారు. అలాంటి ప్రమాదం, స్వతంత్ర భారతదేశానికి సంప్రాప్తించకుండా, వుండటానికే హిందూకోడ్ బిల్లుద్వారా, హిందూసమాజాన్నంతా, ఒక్కతాటిక్రిందతేవటానికి, ఆయన కృషిచేశారు. ఈ సందర్భములో, హిందూకోడ్ బిల్లు పుట్టుపూర్వోత్తరాలు స్థూలంగా తెలుసుకోవడం అవసరం.

సనాతన హిందూ సంఘంలో, చట్టబద్ధమయిన సిద్ధాంతములంటూ ఏమీలేవు. కొన్ని సాంఘిక పద్ధతులు, శతాబ్దాలతరబడి, ఆచరింపబడి, సాంఘిక కట్టుబాట్లుగా, స్థిరపడి పోయాయి. ఈ కట్టుబాట్ల వెనుక, సంఘబలం, ఒత్తిడి, ఉండటంచేత, చట్ట బద్ధమయిన నిబంధనలులాగే, ప్రజా బాహుళ్యముచేత, అనుసరింప బడుతూ వచ్చాయి. కాలక్రమంగా, కొందరు పెద్దలు, హిందూ ధర్మాలను క్రోడీకరించారు. వారిలో గౌతముడు, ఆపస్తంభుడు, వశిష్టుడు, నారదుడు, బృహస్పతి, యాజ్ఞవల్క్యుడు, మనువు, ప్రధానమయిన వారు. యాజ్ఞవల్క్యస్మృతి, మనుస్మృతి, బహుళ ప్రజాదరణ పొందిన హిందూ ధర్మశాస్త్రాలు.

హిందూ ధర్మశాస్త్రాలకు, వివరణలుప్రాసిన వారిలో విజ్ఞానేశ్వరుడు, జీమూత వాహనుడు, ముఖ్యులు. మితాక్షర వివరణ, విజ్ఞానేశ్వరుడు 11వ శతాబ్దములో రచించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నవి. దయాభాగ వివరణ 14, 15వ శతాబ్దములలో, జీమూత వాహనుడు రచించినట్లు తెలియుచున్నది. మితాక్షర, దయాభాగ పద్ధతులు రెండూకూడ, చాలా వరకు, సారూప్యముగలవే. దాయాదులకు, భాగము ఇవ్వటము తోను, వారసత్వపు హక్కులు సంక్రమించుటలోను, దయాభాగ విధానము, మితాక్షర కంటె, భిన్నముగా వుంది. ఈ విభిన్న పద్ధతులను, సమన్వయపరచి, ఒకే చట్టాన్ని రూపొందించడానికి, లోగడ అనేక ప్రయత్నాలు జరిగాయి. బ్రిటిష్ ప్రభుత్వమువారు 1941లో "హిందూ లా కమిటీ" అనే సంఘాన్ని, శ్రీ బి.యన్. రావు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కమిటి కొంతకాలం, పనిజేసిన తర్వాత కారణాంతరాలవల్ల, పని నిలిచిపోయింది. అందుచేత, 1944లో, తిరిగి రావు కమిటీని పునరుద్ధరించారు. ఈ కమిటీవారు. దేశంలో పర్యటించి, న్యాయవాదులవద్దనుంచి, న్యాయమూర్తులనుండి. యితర పెద్దలనుండి, సమాచారము, సాక్ష్యము సంగ్రహించి, 1947 పూర్వార్ధములో, కేంద్రశాసన సభకు, తమ నివేదికను సమర్పించారు. ఆధునిక కాలంలో, పచ్చిన మార్పులను బట్టి, క్రొత్త క్రొత్త విధానాలను ప్రవేశపెడ్తూ, వారు సమర్పించిన నివేదికతో హిందూకోడ్ బిల్లు, చిత్తు ప్రతిని కూడా జతపర్చారు. కాని ఆ నివేదిక సెలక్టు కమిటికి పోయి, వారుసూచించిన మార్పులతో, 1948లో తాత్కాలిక కేంద్రపార్లమెంటులో ప్రవేశపెట్టారు. అందుచేత, 1951లో హిందూకోడ్‌బిల్లును అప్పటి కేంద్ర న్యాయశాఖమంత్రిగా ఉన్న డా॥ అంబేద్కర్ పర్యవేక్షణలో నడిచింది.

తాత్కాలిక కేంద్ర పార్లమెంటులో ప్రవేశపెట్టిన "హిందూకోడ్ బిల్లు" యొక్క, ఆశయాలు పరిశీలిస్తే, మనకు ప్రభుత్వ ధ్యేయంఅవగాహన అవుతుంది. హిందూ ధర్మశాస్త్రాలలోని, అనేకఅంశాలను చట్టబద్ధం చేసే, ప్రయత్నాలు, కేంద్రం లోను వివిధ రాష్ట్రాలలోను, జరిగాయి. దేశం మొత్తంమీద, హిందువులందరకు ఒకే మాదిరి సివిలుకోడు ఉండడం మంచిదనే భావము, ప్రజలందరిలోనూ దేశవ్యాప్తంగా ఉంది. ఆ సూత్రాన్ని, భారత రాజ్యాంగములోకి, 44వ అనుచ్ఛేదముతో రూపొందించారు. ఆధునిక కాలంలో హిందూ సంఘం పొందుతూఉన్న మార్పులను, దృష్టిలో ఉంచుకొని, దేశంలో హిందువులందరకు సరిసమానంగా వర్తించే, సివిలు కోడు ఉండాలనేది, నిర్వివాదాంశం. దేశంలో, పరిస్థితులను పరిశీలించినవారు ఎవరైనా, దానిని ఆమోదిస్తారు. పాతకాలంలోఉన్న, క్లిష్టతరమైన వారసత్వపు విధానముమొదలైన అన్ని అంశాలను సడలించి, అనుసరణీయమైన మార్పులతో, రావు కమిటీవారు, ముసాయిదా బిల్లు తయారు చేశారు. అయితే, ఈ బిల్లులో ముఖ్యమైన అంశం ఏమిటంటే క్రొత్తగా తెచ్చిన మార్పులు ఎవరిపైన బలవంతంగా రుద్దే ఉద్దేశం లేదు. కొత్తచట్టం పరిధిలోనికి హృదయ పూర్వకంగా, ఐచ్ఛికంగా, రాదలచినవారే రావచ్చు లేనివారు తమ తమ పూర్వపు విధానాలనే, అనుసరింపవచ్చు. ఆధునాతనులూ, సనాతనులూ కూడా, కలిసి మెలిసి సహజీవనం చేయడానికి రావు కమిటీవారు తయారుజేసిన హిందూకోడ్ బిల్లు, అవకాశం కలిగించింది కాని, ఇందులో ఒక పెద్ద చిక్కు ఉంది. పూర్వకాలం నుండీ కూడా, హిందూ సంఘంలో ఆస్తిహక్కులు, దత్తత, స్త్రీలహక్కులు, మొదలైనవి ఒక్కతీరుగా లేవు. నేరువేరుగా ఉన్నాయి. హిందూ ధర్మశాస్త్రకారులు కూడా, దేశానికంతకూ ఒకేతీరైన ధర్మశాస్త్రాన్ని రూపొందించలేదు. మితాక్షర, దయాభాగ విధానాలేకాక, మితాక్షరతో కూడా పదలింపులు, ప్రాంతాన్నిబట్టి, అవసరాన్నిబట్టి, వైవిధ్యం కలిగి ఉన్నాయి. ఇదిగాక, బ్రిటిష ప్రభుత్వ పరిపాలనలో, ప్రీవితోన్సిలు, ఫెడరల్ కోర్టు, సుప్రీంకోర్టులు, ఇచ్చిన తీర్పులలో కూడా, హిందూలా సిద్ధాంతాలు నిర్దేశింపబడ్డాయి. బ్రిటిష హయాములో, కేంద్ర శాసనసభ వారు, హిందూ స్త్రీల ఆస్తి హక్కుల చట్టం. 1937, మొదలైన కొన్ని చట్టాలను, రూపొందించారు. మూడు తరగతులుగా ఉన్న 'లా' అంతనూ, క్రోడీకరించినప్పుడు వ్యక్తి యిష్టాఅయిష్టాలకు, విడిచిపెట్టకూడదని, చట్టం సర్వవ్యాప్తంగా అందరకూ వర్తించేదిగానూ, ఉండాలని, డా॥ అంబేద్కర్నిశ్చితాభిప్రాయం. డా॥ అంబేద్కర్కు, హిందూ సమాజముపైన, వర్ణవ్యవస్థపైన నిర్దిష్టమయిన అభిప్రాయాలు ఉండేవి. తన పెద్దబ్బ పోలీసు, బరోడా సంస్థానములో ఎద్దోగిగా సుప్రసిద్ధంగా పొందిన

అనుభూతులు, అనుభవాలు, ఆయన మస్తిష్కంపై చెరగనిముద్రలు వేశాయి. అందు చేత, హిందూ తత్వం తెలుసుకోవటానికి, మతగ్రంధాలను, వేదశాస్త్రాలను, ఆమూలాగ్రంగా చదివి, హిందూ సంఘంలో, ప్రత్యాసాలను, అవిద్యను మత మౌఢ్యాన్ని, రూపుమాపడానికి, అహర్నిశలు కృషిచేశారు. ఆయన వ్యక్తిత్వములోని లోతుపాతులు, మత గ్రంథాలపై ఆధిపత్యం, మనకు ప్రస్ఫుటంగా తెలియజేసేవి, హిందూకోడ్ బిల్లు కేంద్రశాసనసభలో, నడిపిన తీరుతెన్నులే. యావద్భారత దేశంలోనూ, పౌరులందరకు సమానంగా అన్వయించే సివిలుకోడ్‌ను, రూపొంది చవలసినబాధ్యత, రాజ్యాంగంలోని 44వ అనుచ్ఛేదం. ప్రభుత్వంపైపెట్టింది. హిందూకోడ్‌బిల్లు, భారత రాజ్యాంగం అమలులోనికిరాకపూర్వమే, ప్రభుత్వపరిశీలనలో ఉన్నప్పటికీ, 1951లో రాజ్యాంగం అమలులోనికివచ్చిన తర్వాత, కేంద్రశాసనసభలో చర్చకు రావడంచేత హిందూకోడ్ బిల్లులోని అంశాలు, రాజ్యాంగ బద్ధమైనవా? కాదా? అని పరిశీలించవలసిన గురుతర బాధ్యత, డా॥ అంబేద్కర్‌పై పడింది. పరిశీలనానంతరం ప్రభుత్వ పక్షంగా, కొన్ని అధికారసవరణలు, తీసుకొనిరాబడ్డాయి సెలెక్టు కమిటీ నివేదిక, అందిన తర్వాత కూడా, అధికార సవరణలు ప్రతిపాదించడంచేత సభ్యులు అభ్యంతరాలు చెప్పడం, వాటికి తగిన సమాధానాలు చెప్పి, ప్రభుత్వ లక్ష్యాన్ని ఎరుక పరచి, బిల్లులోని క్లాజులు ఒకటొకటే ఆమోదింపజేసుకోవడం, డా॥ అంబేద్కర్‌కు గడ్డుసమస్యగా తయారయింది. సభ్యులలో, చాలామంది హిందూ సాంప్రదాయాలపైన గట్టి నమ్మకం కలిగిన వాళ్లు. న్యాయబద్ధంగా ఉన్నా లేకపోయినా, అనాదిగా వస్తూవున్న, హిందూ ధర్మశాస్త్రసిద్ధాంతాలకు, ఎట్టి మార్పులు చేయరాదని కొందరు పట్టుబట్టారు. బహుభార్యత్వం, దత్తత స్వీకారం, హిందూ స్త్రీలకు ఆస్తి హక్కులు, మొదలైన ముఖ్య సిద్ధాంతాలలో, దేశవ్యాప్తంగా మార్పుతీసుకొని రావడానికి, హిందూ కోడ్ బిల్లులో ప్రయత్నం చేయడంవల్ల, ఎక్కువ మంది సభ్యులు ప్రతిఘటిస్తూ వచ్చారు. అయినా డా॥ అంబేద్కర్, తన హిందూ ధర్మశాస్త్ర పరిజ్ఞానమువల్ల, వేదగ్రంథ పఠనము వల్ల తనవాక్చాతుర్యంచేత, స్వార్థరహితమైన కృషిచేత, ప్రత్యర్థులను నిరుత్తరులను చేసి, ప్రభుత్వ సవరణలను, ఆమోదింపజేసుకొంటూ వచ్చారు.

డా॥ అంబేద్కర్ కేంద్ర న్యాయశాఖమంత్రిగాఉన్న రోజుల్లో, ఉద్దండులైన సభ్యులు. తాత్కాలిక పార్లమెంటులో ఉండేవారు. వారిలో చాలామంది, రాజ్యాంగ నిర్మాణ సభలో సభ్యత్వం కలిగినవారు. న్యాయశాస్త్ర నిష్ణాతులు. సర్వశ్రీ,

కె.యం.మున్షీ, మహావీర్‌త్యాగి, జె.ఆర్. కపూర్, కామత్, గాడ్గిల్, ఫ్రాంక్ అంథోని సుఁతానం, ఇంద్రవిద్యా వాచస్పతి, పండిత టాకూర్‌దాస్ భార్గవ, సర్దార్ హుకుంసింగు, ఆచార్య రంగా, శ్రీమతిదుర్గాబాయమ్మ, మొదలైన మహామహులు, తాత్కాలిక పార్లమెంటు సభ్యులుగా ఉండేవారు. వారినందరునూ మెప్పించి, వివాచగ్రస్తమైన, హిందూకోడ్ బిల్లును, పార్లమెంటులో పర్యవేక్షించిడం, అంటే మాటలు కాదు. కాని. డా॥ అంబేద్కర్ తన మేధాసంపత్తితో, ప్రత్యర్థులను సైతముమెప్పించి అఖండ ఆత్మ విశ్వాసంతో నెగ్గుకు రాగలిగారు.

హిందూకోడ్‌బిల్లు, హిందూ సంఘానికి కావఁసిన ఆన్నిఅంశాలను, ఒకచోట క్రోడీకరించిస బిల్లు, వివాహము, విడాకులు, దత్తత, మైనకు–సంరక్షుడు, సమిష్టి కుటుంబఆస్తి, స్త్రీలఆస్తి, వారసత్వము, పోషణబాధ్యత, తడితరవిషయాలపై విపుల మైన క్రోడీకరణ హిందూ కోడుబిల్లులో చేయబడింది. సిక్కులు, జైనులు, మహమ్మదీ యులు, క్రైస్తవులు, బౌరాష్ట్రియనులు, సనాతన హిందువులు, వీరందరకు హిందూ కోడు బిల్లును చూస్తే గగుర్పాటు, భయం, ఏదోవిధంగా, బిల్లును వాయిదా వేయాలనే తాపత్రయం, పార్లమెంటు చర్చలలో కనుపిస్తుంది. డా. అంబేద్కరు మాత్రంసాంఘిక సమానత్వం, సాంఘిక స్వాతంత్ర్యంలేని జాతికి, వట్టిరాజకీయ స్వాతంత్ర్యంవల్ల ఉపయోగంలేదని, గట్టిగా నమ్మినవారు కాబట్టి, ఎదురు దెబ్బలను తట్టుకొని, బిల్లును పర్యవేక్షించారు. చర్చా వివరాలకు పోయినట్లయితే, చాలా ఉద్గ్రంధం ఔతుంది కాబట్టి, బిల్లుచర్చకు ప్రవేశపెట్టేటప్పుడు మొదటి 1,2 క్లాజులు చర్చకు వచ్చినప్పుడు, సభ్యులు వెలిబుచ్చిన అభిప్రాయాలు. వాటికి డా. అంబేద్కర్ చెప్పిన సమాధానాలు మాత్రం పరిశీలిస్తే, డా॥ అంబేద్కర్ వైదుష్యం, దక్షత, పట్టుచల, నిపుణత మనకు పూర్తిగా అవగాహన ఔతాయి.

పార్లమెంటులో హిందూ కోడు బిల్లు చర్చకు ప్రవేశపెట్టినప్పుడు, కొందరు సభ్యులు అభ్యంతరాలు తెలియజేశారు. పశ్చిమ బెంగాలు సభ్యులు, శ్రీనజీరుద్దీన్ అహమ్మదు రాజ్యాంగారీత్యా బిల్లును సవాలు జేశాడు. కొత్తరాజ్యాంగంలోని 15(1), 25 (1) అనుచ్ఛేదాలపై ఆధారపడి ఆయన అభ్యంతరం తెలియజేశాడు. 15 (1) అనుచ్ఛేదంప్రకారం ప్రభుత్వం, పౌరులయెడల మతం, జాతి, కులం, లింగం, జన్మస్థానం ప్రాతిపదికగా, వివక్షత చూపకూడదు. 25 (1) అనుచ్ఛేదం ప్రకారం, ప్రజాశాంతి, ఆరోగ్యం. నీతి, ఇతర ప్రాధమిక హక్కులకు లోబడి, ప్రజలందరు తమకు ఇష్ట

మైన మతాన్ని అనుసరించవచ్చు, తమ నమ్మిక కలిగియుండవచ్చు. వారివారి మతా లను, ఆచరిస్తూ. ప్రచారం చేసుకోవచ్చును. హిందూ కోడు బిల్లు, హిందువులకు మాత్రమే వర్తిస్తుంది కాబట్టి, ప్రభుత్వం మతాధారంపై, వివక్షత చూపుతున్నట్లు శ్రీ నజీరుద్దీన్‌భావన. అలాగే, హిందువులకు పుత్రులు కలగనియెడల, పున్నామ నరకం నుండి తప్పించుకొనడం, వీలుపడదని గట్టి నమ్మకం ఉంది. ఈ నమ్మిక, సర్వ వ్యాప్తంగా ఉంది. ఒక భార్యకు, పుత్రులు కలగని పక్షంలో, రెండవభార్య, మూడవ భార్య, ఇలా ఎందరినైనా వివాహం చేపికోవడానికి, హిందూ భర్తలు పూర్వంనుచీ హక్కు కలిగియున్నారు. హిందూ కోడ్ బిల్లు ప్రకారం, బహుభార్యాత్వం నిషేధింప బడింది. కాబట్టి, హిందువుల మత నమ్మికను, బిల్లు విచ్ఛిన్నం చేస్తూన్నదని కూడా, శ్రీ నజీరుద్దీన్ అభిప్రాయపడ్డారు. ఆయన బిల్లు పార్లమెంటులో చర్చించడానికి, అను మతి ఇవ్వకూడదని, స్పీకరును కోరడం జరిగింది. పైగా, బొంబాయి హైకోర్టువారు, బహు భార్యత్వంపై, తన వాదానికి అను కూలంగా తీర్పునిచ్చినట్లు కూడా శ్రీ నజీరు ద్దీన్ పేర్కొన్నారు. వెంటనే, చర్చను పర్యవేక్షణ చేస్తూ ఉన్న డా॥ అంబేద్కర్, ఆలాంటి తీర్పు బొంబాయి హైకోర్టు ఇవ్వలేదని, సభవారికి నచ్చజెప్పారు. డా॥ అంబేద్కర్, ఒక ప్రక్క బిల్లును పార్లమెంటులో పర్యవేక్షిస్తూ, భారతీయ హైకోర్టు లలో, హిందూకోడుకు సంబంధించినంతవరకు తీర్పులను ఎప్పటికప్పుడు తెలుసు కొంటూ, ఏదో మిషపై సభ్యులు బిల్లుపై చర్చ నిలుపు చేద్దామని చేసే కుయుక్తులు సాగకుండా చేస్తూ వుండేవారు. ఇది, ఆయన దక్షతకు, పట్టుదలకు, నిజాయితీకి తార్కాణం. స్పీకరు తుదకు అభ్యంతరాలను ప్రోసిపుచ్చారు. బిల్లులో ఏదైనా అంశం, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నట్లు భావించిన పక్షంతో, క్లాజువారీ చర్చతో, సవరణలు ప్రతిపాదించవచ్చునని బిల్లు అసలు చర్చించడానికి వీలులేదని చెప్పడం, చెల్లనేరదని స్పీకరు, నిర్ణయించారు. దానిపై సభ్యులు, లెక్కలేనన్ని, సవరణలు సభవారి పరిశీలన నిమిత్తం సమర్పించారు. డా॥ అంబేద్కరు అనధికార సవరణలను నిశితంగా పరిశీలించి, చాలవరకు సవరణల తీరుతెన్నులు, ధ్యేయం ఒకటిగా ఉండటం గమనించి, సభాకాలం వృధా కావడానికి ఇష్టపడక, ఒకే ఉద్దేశంతో ప్రతిపాదించిన, సవరణలనన్నింటిని, ఒకే సవరణగా తీసుకొనేటట్లు స్పీకరును ఒప్పించగలిగారు.

దీనివల్ల, కాలం వ్యర్థాకాకపోవడమే కాకుండా, ఒక విషయంపై ఒక సభ్యుడు, సవరణ ఇచ్చిన తర్వాత, అదే విషయం మీద ఇతర సభ్యులు సవరణలు ఇవ్వవలసిన అగత్యం లేకుండా చేయగలిగారు. మొదటినుండి, డా॥ అంబేద్కర్ హిందూ కోడు బిల్లు చట్ట రూపం దాల్చడంలో, జాప్యం జరుగుతున్నందుకు చాలాబాధపడుతూ, తన శక్తివంచన లేకుండా బిల్లు త్వరితగతిని చట్టంగా రూపొందడానికి కృషిచేశారు.

శ్రీ ఇంద్రవిద్యావాచస్పతి, (ఉత్తరప్రదేశ్ సభ్యుడు) శ్రీ సర్వాతి (మధ్య భారత్ సభ్యుడు) మొదలైన వారు, భారతీయులైన పౌరులందరకు. ఒకే సివిలు కోడ్ ఉండాలని వాదించారు. వారివాదంలో, రాజ్యాంగం 44వ అధిచ్ఛేదంలో ఉన్న అంశం కూడా, ప్రస్తావనకు తెచ్చారు. హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, పార్సీలు, అనే వివక్షత లేకుండా అందరకు సమానంగా వర్తించే సివిలు కోడును, తీసుకొని రమ్మని కోరారు. నిజంగా, అలాంటి సార్వత్రిక బిల్లు ప్రవేశపెట్టడానికి, సమతావాది, మానవతాది అయిన డా॥ అంబేద్కర్‌కు వ్యక్తిగతంగా ఎలాంటి అభ్యంతరంలేదు. కాని, హిందువులలో చాలమంది, మత మౌఢ్యం కలిగియున్నారు. ఒకేసారి, ఆమూలాగ్రమైన మార్పులు తీసుకొని వచ్చినట్లయితే, ప్రతిఘటన ఎక్కువవుతుంది. మార్పు నేది, ప్రజాహితమైనప్పటికి, క్రమక్రమంగా రావాలని, డా॥ అంబేద్కర్ భావించారు. చర్చలో కలుగజేసుకొని, తనవ్యక్తిగత అభిప్రాయాన్ని ఈ క్రింది విధంగా చెప్పారు.

"గౌరవసభ్యుల అభిప్రాయంలో వారసత్వపు హక్కు, వివాహ నిబంధనల విషయంలో జాతిపరంగా ప్రత్యేక చట్టాలు ఉండకూడదు. అన్ని తరగతులవారికి మత వివక్షత, జాతివివక్షత, కులవివక్షత లేకుండా, సమానంగా వర్తించే సివిలు కోడు ఉండాలని భావిస్తే, నేను వారితో ఒకడిని"

దీనిని బట్టి, డా॥ అంబేద్కర్ అంతిమధ్యేయం ఉదాత్తమైనదని. మత విషయాలలో, మార్పుక్రమంగా తీసికొనివచ్చి, ప్రజల హృదయాలలో వెలుగు తీసుకొని రావాలి, కాబట్టి ఆలోచించి అడుగు వేయాలని ఆయన తలపోసినట్లు మనకుతెలుస్తుంది. ఉత్తరప్రదేశ్ సభ్యుడు శ్రీ జె.ఆర్. కపూర్, అస్సాం సభ్యుడు శ్రీ రోహిణీ కుమార్ చౌదరి, హిందూ కోడు బిల్లుకు, అభ్యంతరం తెలుపుతూ, కోడులోని అంశాలను, బలాత్కారంగా, హిందువులందరిపై రుద్దకూడదని, భారతీయ పౌరులలో హిందువు లైనవారు, హిందూ కోడుబిల్లు తమకు వర్తింపజేసుకోవాలా, లేదా అనేది, వ్యక్తులు, ఐచ్ఛికంగా నిర్ణయించుకొనేలా ఉండాలని, దానికి అవసరమైన మార్పులు బిల్లులో

ప్రవేశపెట్టే బాధ్యత, న్యాయశాస్త్రపండితులైన డా॥ అంబేద్కర్ పైననే ఉన్నదనే వాదన లేవదీశారు. సర్దార్ హుకుంసింగు, పండిట్ ఠాకూర్‌దాస్ భార్గవ గార్లు, సిక్కులపై, హిందూ కోడు బిల్లును రుద్దవద్దని, పంజాబు రాష్ట్రాన్ని బిల్లు పరిధిలోనుండి, మినహాయించవలసిందని, వాదన లేవదీశారు. పార్లమెంటు, దాదాపు రెండు భాగాలుగా విడిపోయింది. హిందూకోడు బిల్లును బలపరిచేవారు, వ్యతిరేకించే వారు, తమ తమ అభిప్రాయాలను బాహాటంగా వెలుబుచ్చుతూ వచ్చారు. పార్లమెంటు హిందూకోడు బిల్లును, ఆమోదించని పక్షంలో, ప్రభుత్వం రాజీనామా చేయగలదని, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, స్పష్టంగా తెలియపరచారు. నెహ్రూ తన శక్తిసామర్థ్యాలను, హిందూ కోడు బిల్లుకు అనుకూలంగా సమీకరించారు. శ్రీ యన్.వి. గాడ్గిల్, పండిట్ కుంజ్రూ, దక్షిణ భారతదేశానికి చెందిన, అనేకమంది పార్లమెంటు సభ్యులు, బిల్లును గట్టిగా బలపరుస్తూ, చరిత్రాత్మకమైన ప్రసంగాలు, పార్లమెంటులో చేస్తూ వచ్చారు. సర్దార్ వల్లభభాయి పటేలు, డా॥ రాజేంద్రప్రసాద్, డా॥ ముఖర్జీ, వీర సావర్కారు మొదలైన ప్రముఖులు, బిల్లును వ్యతిరేకించారు. ఒక్కొక్క క్లాజు, ఆమోదం పొందడానికి రోజులు తరబడి చర్చ జరుగుతూ వచ్చింది. న్యాయశాఖా మంత్రి డాక్టరు అంబేద్కరుచే 5–2–1951నాడు, తిరిగి ప్రవేశ పెట్టబడిన హిందూ కోడు బిల్లులో 25–9–1951 నాటికి, నాలుగుక్లాజులను మాత్రం పూర్తిచేయగలిగారు. బిల్లు చర్చాసంచలనంలో, ఎంత జాప్యం జరుగుతూ వచ్చిందో దీనినిబట్టి మనకు పూర్తిగా అవగాహన కొతుంది.

ప్రతి అభ్యంతరానికి, విమర్శకూ డా॥ అంబేద్కర్ అత్యంత నిపుణతతో, సమాధానాలు ఇస్తూ వచ్చారు. రావు కమిటీవారు తయారు చేసిన, ముసాయిదా హిందూ కోడు బిల్లులో, తాను న్యాయశాఖ సహాయంతో తీసుకొనివచ్చిన మార్పులను, విశదీకరిస్తూ, బలపరుస్తూ, 39 పేజీల వివరణను తయారుజేసి, డా॥ అంబేద్కరు పార్లమెంటు సభ్యులకు, పత్రికలవారికి, ఇతర పెద్దలకు అందజేశారు. అయినా, విమర్శలు, వ్యతిరేకతలు తగ్గలేదు. తన పట్టుదల సడలించకుండా డా. అంబేద్కర్ వీరసైనికుడా పోరాటం సాగిస్తూనే వచ్చారు.

స్వాతంత్ర హిందూ ధర్మాన్ని తూచా తప్పకుండా పాటి చాలని తలపోసే పార్లమెంటు సభ్యులు పెక్కుమంది, యావద్భారత దేశానికి ఒకే సివిలుకోడు ఉండాలని వాదించడం, బిల్లును, ముందుకు సాగకుండా కాలయాపన చేయడానికికేనని, చిరుతపులి

తనచుక్కలను పోగొట్టుకోలేనట్లే సనాతన హిందూ సాంప్రదాయవాదులు, ప్రగతి పరమైన మార్పులను జీర్ణించుకోలేరని విమర్శకులకు సమాధానం చెప్పారు. డా॥ అంబేద్కర్. పార్లమెంటు సభ్యులందరూ హృదయపూర్వకంగా భారతదేశానికంతకూ, ఒకే సివిలుకోడు కావాలని వాంఛించినట్లయితే, అది చాలా సులువైనపని. భారతీయ వారసత్వ చట్టం 1925ను దేశానికంతకు వర్తింప చేయవచ్చు. రెండు రోజులవ్యవధి లోనే కొత్త బిల్లు తయారుచేసి, పార్లమెంటు ఎదుట ఉంచవచ్చు. అలాగే ప్రత్యేక వివాహ చట్టం, 1872, భారతదేశానికంతకూ, ఎట్టి జాప్యం లేకుండా. విస్తరింపజేయ వచ్చును. హిందూ కోడు బిల్లుపై విమర్శించేవారు, భారతదేశానికంతకూ ఒకే సివిలు కోడు ఉండాలని హృదయపూర్వకంగా భావించడంలేదు. కాలయాపనచేయాలని, తద్వారా, మొత్తం బిల్లును బుట్టదాఖలా చేయించాలనే, దురుద్దేశం లేకపోలేదు. 1941లో ప్రారంభమైన హిందూ లా కమిటీ కృషి, కార్యరూపందాల్చడానికి 10 సంవత్సరాల తర్వాత కూడా, అడ్డు తగలడం మన అలసతకు, చేతకాని తనానికి నిదర్శనం. కాబట్టి, బిల్లును వెనుక ముఖం పట్టించడానికి ఎలాంటి ప్రయత్నం జరిగినా, ప్రభుత్వం సమ్మతించదని డా. అంబేద్కర్ అభిప్రాయం వెలుబుచ్చారు. అంతే కాకుండా, సిక్కులను హిందూకోడు బిల్లునుండి, మినహాయించడానికి వీలులేదు. బౌద్ధులు, జైనులు, సిక్కులు, బ్రహ్మసమాజంవారు, ఆర్యసమాజికులు, లింగాయతులు, వైష్ణవులు, హిందూ మతాన్ని సంస్కరించడానికి ప్రయత్నం చేశారు. కాని, హిందూ వారసత్వపు హక్కులనుగాని, వివాహపద్ధతులనుగాని, దత్తత స్వీకార విధానాన్ని గాని, విడాకులు మరియు వితంతు వివాహ నిషేధ కట్టుబాట్లనుగాని, మార్చలేదు. 1830వ సంవత్సరంనుండి, బ్రిటీ కొన్నిలు తీర్పులు పరిశీలిస్తే, సిక్కులకు, హిందూ వారసత్వ పద్ధతినే అనువర్తింప జేసినట్లు తెలుస్తుంది ఆలాగే, హిందూ సంఘంలో ఉపభాగాలుగాఉన్న, ఇతర మత సంప్రదాయ శాఖలన్నింటికి, హిందూ వారసత్వ విధానమే వర్తిస్తుంది. కాబట్టి, సిక్కులపైన, ఇతర హిందూ సంఘ ఉప శాఖలపైన కొత్త పద్ధతులు ఏవీ బలవంతంగా రుద్దడంలేదు. చేస్తున్నదల్లా, మితాక్షరా, దయా భాగా విధానాలలో ఉన్న, కొద్దిపాటి వ్యత్యాసాలను సవరించి, ఒక సమైక్య పద్ధతిని, దేశంలోని హిందువులందరకు అనువర్తించడం హిందూకోడు బిల్లు ముఖ్యోద్దేశం. మత పరమైన సాంప్రదాయాలు ప్రజాహృదయంలో గాఢంగా నాటుకొని ఉంటాయి. ఎంత సంస్కరణ భావంగలవారైనా, ప్రజాహృదయాన్ని విస్మరించడానికి వీలులేదు. మత సాంప్రదాయ విషయంలో దేశంలోని హిందువులకందరకు, ఒకే పద్ధతిని రూపొందించడమే, హిందూకోడు బిల్లుయొక్క ముఖ్యోద్దేశం. చట్టం ఎప్పుడు, అది

ఎవరికి, వర్తించాలి, అనే విషయంలో పౌరుల అభీష్టానికి విడిచిపెట్టదు. ప్రజాప్రతినిధులు, చట్టం చేస్తున్నప్పుడు ప్రజలందరకు అది వర్తిస్తుంది. ప్రపంచంలో, ప్రజాప్రభుత్వాల నడచే విధానమే ఇది. భారతీయ పార్లమెంటు కొత్త పద్ధతిని ప్రవేశపెట్టవలసిన అవసరం లేదు. చట్టం ఎవరెవరికి వర్తించాలని, పార్లమెంటు భావిస్తుందో, వారందరకు, ఆ చట్టం విధిగా వర్తించాలి. పౌరుల ఇష్టా అయిష్టాలకు చట్టాన్ని విడిచిపెట్టే ప్రసక్తి లేదు, రాకూడదని డా॥ అంబేద్కరు సభవారిని, తమ గంభీరోపన్యాసముతో సమాధానపరచారు.

కాని, ఎంత దక్షతతో హిందూకోడు బిల్లును, డా॥ అంబేద్కరు పర్యవేక్షిస్తున్నప్పటికి, దేశంలో అభివృద్ధి నిరోధకులు కొందరు తమ వ్యతిరేకతను చూపుతూ, పార్లమెంటు సభ్యులపై గట్టి ఒత్తిడి తేసుకురావడంచేత, "విడాకులు వివాహం" అనే భాగం, ప్రస్తుతానికి వాయిదా వేసి, మిగిలిన "హిందూ కోడు–బిల్లు"ను, చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయం చేసింది. ఈ విషయంలో: శ్రీ నెహ్రూ, డా॥ అంబేద్కరు రాజీ పడ్డారు. వ్యక్తిగతంగా డా॥ అంబేద్కరుకు ఒక భాగాన్ని, తీసివేయడం ఇష్టంలేకపోయినప్పటికి, బిల్లుపై వస్తూవున్న వ్యతిరేకతను, అదుపులో పెట్టి తొందరగా బిల్లును చట్టంగా రూపొందించాలనే ఉత్సాహంతో, అయన రాజీకి ఒప్పుకొన్నారు. పార్లమెంటు వారు సమావేశం జరిగే సమయానికి నాలుగు క్లాజులు మాత్రమే, ఆమోదింపబడ్డాయి. 17–9–1951 నాటికి, పరిస్థితులు విషమించాయి. పార్లమెంటుకు నలువైపులా సాయుధ పోలీసులు కాపలా ఉంచవలసివచ్చింది. స్త్రీలు హిందూ, బిల్లును వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిపారు. కాని, పార్లమెంటు సభ్యులుగా వున్న, మహిళా సభ్యులు మాత్రం బిల్లును బలపరచారు. 25–9–1951 నాటికి, పార్లమెంటు సభ్యులలో, చాలామంది హాజరుకావడం, మానివేశారు. నిరుత్సాహంగా చర్చకొనసాగింది. పార్లమెంటు వాయిదా పడుతుంది కాబట్టి, బిల్లు కాలదోషం పట్టిపోతుందని, బిల్లు చట్టరూపందాల్చదని గ్రహించిన సభ్యులు చర్చలో పాల్గొనడం మానివేశారు. డా॥ అంబేద్కరు, జరుగుతున్న పరిస్థితులను పూర్తిగా అవగాహన చేసుకొని హృదయ భారంతో 27–9–1951 న, కేంద్ర మంత్రిపదవినుండి, నిష్క్రమించడానికి నిశ్చయించుకొని. రాజీనామా పత్రాన్ని ప్రధాని శ్రీ నెహ్రూకు అందజేశారు.

రాజీనామా పత్రం చదివితే హృదయ విదారకంగా ఉంటుంది. "మంత్రి వర్గంనుండి రాజీనామా చేయాలని చాలకాలంనుండీ నేను భావిస్తున్నాను. కాని, పార్లమెంటు ముగియకముందే, హిందూకోడు బిల్లు, పూర్తి చేయాలనే ఆశనన్ను పట్టి ఉంచింది. మన కృషి ఫలిస్తుందనే, అత్యాశతో, నేను బిల్లులోని భాగాలను, విడకొట్ట డానికి కూడా, అమోదించాను. బిల్లులోని మిగిలిన భాగాన్ని కూడా, హతమార్చారు. మంత్రి వర్గసభ్యునిగా, కొనసాగచలసిన అవసరం నాకు కనబడడంలేదు." అని స్పష్టంగా, తన రాజీనామా కారణాలను, శ్రీ నెహూర్కి కు వివరించారు. డా॥ అంబేద్కరు. మరోచోట, ఈ అధ్యాయిత్యాన్ని వివరిస్తూ, నాలుగు క్లాజులు ఆమో దించిన తర్వాత, ఏడ్చేవాడు, పరామర్శించేవాడు లేకుండా, బిల్లును హతమార్చి పాతి పెట్టారు" అని డా॥ అంబేద్కరు వాపోయారు. 11–10–1951 వరకూ, అయన రాజీనామాను అమోదింపలేదు. ఆమోదించిన వెంటనే, పత్రికలవారికి ప్రకటన విడుదల చేశారు. అందులో, హతాశుడై ఆయన నిస్పృహతో, ఆశాభంగమొందిన వ్యక్తిగా, మంత్రి వర్గంనుండి నిష్క్రమించానని, అనారోగ్యం పేరుతో, బాధ్యతను విస్మ రించేటంతటి, భీరువును కానని, స్పష్టంగా పేర్కొన్నారు.

డా. అంబేద్కరు, రాజీనామాచేసిన తర్వాత, పార్లమెంటులో ప్రతిపక్షనాయ కుడుగా వ్యవహరించారు. ఆయనదేశంలో, పర్యటిస్తూ అనేకప్రదేశాలలో చేసిన ప్రసం గాలు. పరిశీలిస్తే, హిందూకోడుబిల్లు చట్టరూపంధరించకుండా చేసిన, మూతుకచర్యవల్ల, మొత్తం సమస్త హిందుపులపైన, హిందూ మతంపైన ఆయనకు ఏహ్యభావం కలిగి నట్లు, హిందూపులను సంస్కరించడమనేది అసాధ్యమైనదని డా. అంబేద్కరు తలంచినట్లు మనకు అవగాహన కొస్తుంది. బహుశా, అందుచేతనే, అవసానదశలో డా. అంబేద్కరు, సత్యం, అహింస, మానవత కలిగి, వర్ణవ్యవస్థను, మూఢనమ్మ కాలను, విగ్రహారాధనను, యజ్ఞ యాగాదులను నిరసించే, బౌద్ధమతాన్ని స్వీకరించా రనే భావము మనకు కల్గుతుంది.

డా. అంబేద్కరు కృషి వ్యర్థంగాపోలేదు. పార్లమెంటులోను. బయటా, హిందూ కోడు బిల్లును సవాతరు హిందువులు విమర్శించినా, నిరసించినా, క్రమంగా ఆయన చావనలోని బలాన్ని. మారుతున్న కాలప్రభావాన్ని, గమనించి, పార్లమెంటు సభ్యులు, హిందూకోడు బిల్లును చిన్నచిన్న భాగాలుగా, విభజించి, వేరువేరు చట్టాలుగా ఆమో

దించారు. తత్ఫలితంగా, హిందూ వివాహచట్టం, 1955. హిందూవారసత్వ చట్టం, 1956, హిందూ మైనారిటీ మరియుసంరక్షణ చట్టం, 1956, హిందూ దత్తత పోషణల చట్టం, 1956, పార్లమెంటుచే రూపొందించబడ్డాయి.

డా. అంబేద్కరు వేగుచుక్కలాంటివారు. మహావేధావి కావడంచేత, సాంఘిక విప్లవము, అవసరం అనుకున్నారు. కాబట్టి, ప్రగతి పధంలో, ఆలోచన సాగించి, హిందూ సంఘాన్ని సంస్కరింప పూనుకొన్నారు. ఆయన పరిగతిశీలతను, ముందు ఆలోచనను అవగాహన చేసుకోలేని, సనాతనులు కొందరు, వారి మార్గానికి తాత్కాలికంగా అడ్డుతగిలినా, కాలమే సనాతనుల వాదంతో బలంలేనట్లు నిరూపించింది. హిందూ కోడు బిల్లు, డా. అంబేద్కరు ఆశించిన, రూపంలోనే నాలుగు చట్టాలుగా, రూపు దాల్చింది. 1956 డిశంబరు 6 వ తేదీన, డా. అంబేద్కరు మహా నిర్యాణం పొందే సమయానికి, హిందూ వివాహాలకు, వారసత్వాలకు సంబంధించిన చట్టాలు, పార్లమెంటు ఆమోదం పొందాయి. మిగిలిన రెండు చట్టాలు, 1956 సంవత్సరాంతం నాటికి, రూపొందింపబడ్డాయి. కాబట్టి, హిందువులకు వరిస్తూ ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలకు, జీవం పోసినవారు డా. అంబేద్కరే. ఆయన పేరు సంఘ సంస్కర్తగా సాంఘిక రంగంలో విప్లవానికి నాందీవేసిన వారుగా నవభారత రాజ్యాంగ ముఖ్య నిర్మాతగా, భారతదేశంలో కలకాలం నిలిచి పోగలదు.

యుగపురుషుడు -
కందుకూరి వీరేశలింగం

కందుకూరి వీరేశలింగంగారు యుగపురుషుడు. ఆయన భావాలు, సంఘ సంస్కరణాభిలాష దానికై ఆయన సలిపిన కృషి మహోన్నతమైనది. 1848లో ఆయన పుట్టేనాటికి ఆంధ్ర దేశంలో సాంఘిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. మూఢాచారాలు, మూఢ విశ్వాసాలు విచ్చలవిడిగా సంఘంలో స్థానం ఏర్పరచుకొని అమాయకులైన వ్యక్తులను పట్టి ఆడించేవి. ఎవరికి ఏ రుగ్మతవచ్చినా ముందు వైద్యుల సలహాకు వెళ్ళకుండా భూత వైద్యం చేయించుకోవడం, రక్షరేకులు కట్టించుకోవడం పరిపాటిగా ఉండేది. ప్రతి సామాన్య విషయానికి మంచిచెడ్డలు పంచాంగరీత్యా చూచుకొని, శకునాలు చూచుకొని, దిక్కులుచూచుకొని కార్యక్రమం ప్రారంభించేవారట. అప్పటివారికి కార్యనిర్వహణమీద మమకారం, ఏకాగ్రతల కంటె తిథుల మీద శకునాల మీద తమ శక్తిని, విలువైన కాలాన్ని అనవసరంగా వ్యయపరచేవారు. పరిసరాల శుభ్రత ఎలాగున్నా మడి, తడి, పూర్వాచారం ఉంటే భగవంతుని దగ్గరగా వెడుతున్నట్లు భావించే పద్ధతి సాంఘిక కట్టుబాటుగా చెలామణీ ఔతుండేది. పీటి కన్నిటికి తలమానికంగా స్త్రీ పునర్వివాహ నిషేధం ఉండేది. బాల్యవివాహాలు అప్పటికి ఎక్కువగా ఆచరింపబడేవి.

బాలికలు వ్యక్తురాండ్రు అయిన తర్వాత వివాహాలుచేస్తే తప్పుగా భావించడం. ఆలాంటి వివాహాలు చేసిన కుటుంబాలవారిని 'వెలివేయడం. న్యూనతగా చూడడం కద్దు.' పాపపరిహారం కొరకు ప్రాయశ్చిత్తం చేయించుకోవడం అనేపద్ధతి అమలులో ఉండేది. ఎవరు ఎంత పెద్దతప్పుచేసినా ప్రాయశ్చిత్తం చేసుకొండే హిందూసంఘంలో, వారు గౌరవ స్థానం తిరిగి సంపాదించుకోవచ్చును. ప్రాయశ్చిత్తం అంటే బుర్రగొరిగించుకొని, నదులలో స్నానం చెయ్యడం, నాలుకపై చురక వేయించుకోవడం. పురోహితులకు సంతర్పణ చెయ్యడం, తాంబూలము డబ్బు పురోహితులకు దానం

చెయ్యడం, ఆవుపేడ, ఆవు పంచకాలతో అంటరానివారుగా చూడబడేవారు ముట్టిన చెరువు నీటిని శుద్ధి చెయ్యడం, వగైరా పద్ధతులే ప్రాయశ్చిత్తంగా పరిగణింపబడేవి. కొత్త పద్ధతులు అవలంభిస్తుండే వారిపై సంఘ బహిష్కారం అనే మహా ఆయుధాన్ని ప్రయోగించి భయపెట్టి ప్రాయశ్చిత్తం చేయించిసంఘంలో పునఃప్రవేశం చేయించడం అప్పటివారికి నల్లేరుపై బండినడక లాంటిది, పదిమంది ఒక చోట గుమిగూడి సాంఘిక విషయాలు చర్చించుకోవడం తప్పు. శంకరాచార్యులవంటి గురువులు తరచు దేశాటనం చేస్తూ ధర్మ ప్రచారం చేస్తున్నట్లు కనిపిస్తూ-వినం ప్రోగుచేసుకోవడం, సంఘంలో దురాచారాలపై ధ్వజమెత్తినవారిని సంఘ బహిష్కృతులను చేయడం, సోమరి పోతుబ్బుందం పొట్టపోసుకోవడం, వారి వెంటవచ్చిన శిష్యబృందం, పరివారంలో ఇతర సభ్యులు కాని పనులు చేసినా భరించి ఊరుకోవలసిన దౌర్భాగ్యం ప్రజలకు పట్టడం చాలా సామాన్యంగా ఆనాడు జరిగే విషయాలు.

రాజమహేంద్రవరం అక్కడి పరిస్థితులు మొదటి నుండి శ్రీ వీరేశలింగం పంతులుగారు అవగాహన చేసుకొన్నారు. అయన బాల్యం నుండి శారీరకంగా బలహీనుడైనా అధ్యయనంలోనూ, రచనలుచేయడంలోనూ, సంఘంలో అనుసరించబడుతున్న పద్ధతులను నిశితంగా పరిశీలనచేయడంలోనూ చాలా ఉత్సాహంచూపిస్తూ ఉండేవారు. బాల్యదశలోనే అయన "వసుచరిత్ర" వంటి ప్రౌఢ ప్రబంధాన్ని పుస్తక విక్రేతలకు కొంత రుసుము చెల్లించి అధ్యయనం చేశారంటే అయనకు పుస్తక పఠనంపై ఉన్న మమకారం, సంస్కృత ధూయిష్టమైన గ్రంథాలను చదువు కోవడంలో అయనకు గల భాషాపటిమ మనకు ప్రస్ఫుటంగా కనుపిస్తాయి. చిన్నతనంలోనే అయనకు నాయకత్వపు లక్షణాలు ఉండేవి. విద్యాలయంలో ముఖ్య ఉపాధ్యాయుడు చదువు చెప్పడానికి అశ్రద్ధతుగా ఉన్నాడని ఆ ఉపాధ్యాయునిపై మహజర్లు పెట్టి విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకొనివచ్చి బదిలీ చేయించారట. ఒకప్పుడు తానుచదువుతున్న విద్యాలయంలో ఎవరు మంచి విద్యార్థి అని ఓటింగు తీస్తే అన్ని తరగతుల విద్యార్థులు వీరేశలింగమేనని నిర్ణయించేశారు. దీనినిబట్టి వీరేశలింగంగారికి అధ్యయన శక్తి నాయకత్వలక్షణాలు బాల్యదశనుండి ఉన్నవని గ్రహించవచ్చు.

వీరేశలింగంగారు ఒక ప్రక్క సంస్కృతాంధ్రాలు అధ్యయనం చేస్తూ, ఇంగ్లీషు బడిలో చదుకోవడంచేత ఆ భాషపై కూడా ఆధిపత్యం సంపాదించారు. ఆంగ్లభాషలో గల ప్రసిద్ధమైన నాటకాలు, నవలలు, ఇతర వచన రచనలు, పద్యకావ్యాలు పూర్తిగా పఠించారు. బెంగాలీ రచయితల రచనలు, రాజారామమోహనరాయ్‌వంటి

సంఘ సంస్కర్తల యొక్క జీవిత విశేషాలు, వాని రచనలు శ్రద్ధగా చదివారు. దేశంలో స్థానం ఏర్పరచుకొన్న దురాచారాలను, మూఢవిశ్వాసాలను నిర్మూలించే ప్రజలకు సన్మార్గంవైపు మళ్లించాలని గట్టి పట్టుదల పట్టారు.

వీరేశలింగంగారు కూడా మొదట సనాతన పద్ధతులవైపు ఆకర్షింపబడ్డవారే. ఆయన భగవత్ప్రార్థనం రెండు శతకాలు రచించారు. మొదటిది మార్కండేయ శతకము. రెండవది గోపాలశతకము. అప్పటికి వీరేశలింగంగారు విగ్రహారాధకులే ఉపవాసములు, వ్రతములు, స్తోత్రములు, భజనలు భగవంతుని ప్రీతి కలిగించగలవనీ ఆయన నమ్ముతుండేవారు. గాయత్రీ జపము, ఆ జనేయమంత్రము పునశ్చరణ చేస్తూ ఉండేవారు. కాని కాలక్రమంగా ఆయన విశ్వాసాలలో మార్పువచ్చింది. భూత వైద్యుల సహాయంతో దయ్యాలనుచూడాలని ప్రయత్నించి విఫలమనో శ్రుడు కావడం, ఎంతమంచి శకునం చూచుకొని ప్రయాణం సాగించినా పనిజరుగకపోవడం, దుర్ముహూర్తంలో బయలుదేరినప్పుడు కొన్ని సందర్భాలలో పని నిర్విఘ్నంగా సాగిపోవడం, ముహూర్తం బలంగా ఉన్నా కొన్ని చోట్ల భార్యాభర్తలలో ఒకరు అకాల మృత్యువునకు ఆహుతి కావడం మొదలైన దైనందిన సంఘటనలు వీరేశలింగంగారిలో పెద్ద మార్పును తెచ్చాయి. ఏకేశ్వరోపాసన స్వీకరించి ప్రజలను సన్మార్గంవైపు నడిపించి, మూఢ విశ్వాసాలను క్రూకట్రైళ్లతో పెకలించివేయడానికి సిద్ధపడ్డారు.

కోరంగిపాఠశాలలో వీరేశలింగంగారు ఉపాధ్యాయవృత్తిలో చేరినపుడు అమావాస్యనాడు బయలుదేరిపోయి పనిలోచేరారు. పాఠశాల అధికారులు అమావాస్య రోజున చేరడం ఎందుకని అభ్యంతరం తెలియజేసినప్పుడు ఈశ్వరుడు చేసిన దినము లన్ని సమానమైనవే; ఒకటి మంచిదినము మరొకటి చెడ్డరోజు అని తలంచడం సరియైనది కాదని వారు ఎదురు చెప్పారు. కోరంగిలో వీరేశలింగంగారు ఉపాధ్యాయులుగా ఉండగా మరో సంఘటన జరిగింది. ఒక భూతవైద్యుడు ఆ గ్రామంలోకివచ్చి భూత, ప్రేత, పిశాచాలను వెళ్లగొడతానని ప్రగల్భాలను పలికాడట దానిపై వీరేశలింగంగారికి విశ్వాసం లేకపోవడంచేత అదంతా బూటకమని ఎదిరించారట భూత వైద్యుడు కోపగించి, ప్రతినచేసి, వీరేశలింగంగారిపై మంత్రప్రయోగం చేస్తానని ఎదురింటిలో మకాంపెట్టి అంజనం వెయ్యబూనాడట. వీరేశలింగంగారు లెక్కచెయ్యలేదు. దీనిపై ప్రమాదము ఎదురొక్కొంటున్నావని ఇరుగుపొరుగువారు రాయబారాలు జరిపినా వెనుకంజవెయ్యలేదు. వైద్యుడు ఉపవాసదీక్ష చేసి కొబ్బరికాయనీరు మాత్రం త్రాగి

పెద్ద పెద్ద కేకలువేస్తూ మంత్రజపం మొదలు పెట్టి తెల్లవాడు మూమున నీరసంవల్ల ఆ వైద్యుడు తూలిపడిపోయి భయజ్వరం తెచ్చుకొన్నాడు. ఆ ఊరివారు వైద్యుని కలుసుకొన్నపుడు "శరభసాళ్వ మంత్రమును" తనపై వీరేశలింగంగారే ప్రయోగించారని కల్లబొల్లి కబుర్లు చెప్పాడట. వైద్యునికి జ్వరం తీవ్రతరంకాగా సంధిలో వీరేశలింగంగారి పేరు పలవరిస్తూ ఉండేవాడట. వీరేశలింగంగారు దయతలచి వైద్యునికి ధైర్యం చెప్పి మంత్రప్రయోగం ఏమి చెయ్యలేదని నమ్మకం కలిగించిన వెనుక వైద్యునికి జ్వరం తగ్గిందట. ఈ విధంగా మూఢవిశ్వాసాలను ఎదుర్కొన డంలో వీరేశలింగంగారిది విచిత్రమైనపద్ధతి, నిశ్చయమైన దృక్పథము.

ఆదినుండి వీరేశలింగంగారు స్త్రీ విద్యావంతురాలుకానంతవఱల్లనే మూఢవిశ్వా సాలు సంఘంలో నోటు చేసుకొన్నాయని సమ్మతింపచ్చారు. "న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అన్న ఆర్యోక్తికి ఆయన ప్రబల విరోధి. "ఆంధ్రభాషాసంజీవని" అనే పత్రికలో బ్రహ్మశ్రీ కాకొఱ్ఱంద వేంకటరత్నంపంతులుగారు స్త్రీ విద్యా నిషేధ వాదాన్ని ప్రచారం చేస్తూ వ్యాసాలు వ్రాస్తూ ఉండేవారు. ఇది 1874 నాటిమాట. స్త్రీ విద్యకు అనుకూలంగా వీరేశలింగంగారు "పురుషార్థప్రదాయిని"లో వ్యాసాలు వ్రాస్తూ వేంకటరత్నం పంతులుగారి వాదాన్ని ఖండిస్తూ ఉండేవారు.

సంఘ సంస్కరణకు స్వంతత్ర జీవనము, స్వంత పత్రిక అవసరమని వీరేశ లింగం గారు సిద్ధాంతం—స్వీయ చరిత్రలో వారు చెప్పిన మాటలివి :—

"ఏ పనియు లేక స్వతంత్ర జీవనమునైన చేయవలెను. లేదా పాపకార్యముల కంతగా నవకాశములేని యుపాధ్యాయత్వము నందైన ఉండవలెను అని నేనిప్పుడు నిశ్చయము చేసికొంటిని."

సంఘ సంస్కరణ ఉద్యమ నిర్వహణకు పరిసరాలను దిద్దితీర్చుకోవడంలో, ఆయన పద్ధతి మనకు పై వాక్యము వల్ల విశదమౌతుంది. 1874 సంవత్సరంలోనే "వివేకవర్ధని" అనే స్వంత, స్వతంత్రపత్రికను వారు సంఘ సంస్కరణ ఉద్యమ ప్రచారానికి, ఆయుధంగా భావించి స్థాపించారు. పంతులుగారు పత్రికా నిర్వహణోద్దే శాన్ని తమ స్వీయచరిత్రలో ఈ క్రింది విధంగా పేర్కొన్నారు.

"ఈ పత్రికా ప్రకటనమునందు నాయుద్దేశములు భాషాభివృద్ధియు, దేశాభి వృద్ధియు ముఖ్యముగా రెండు. నే నేర్పరచుకొన్న భాషాభివృద్ధి మార్గము తెలుగు

భాషలో మృదువైన సులభశైలిని సలక్షణమైన వచనరచన చేయుట; దేశాభివృద్ధి మార్గము జనులలో గల దురాచార దుర్వ్యర్థనముల బాపియు, వృద్ధి పద్ధతులను జూపియు వానినధిక నీతిమంతులుగా జేసి దేశము నున్నత స్థితికి దెచ్చుటకయి శక్తి వంచన లేక పాటుబడుట. దేశాభివృద్ధికలుగుటకయి విద్యావిషయమునను, వ్యవహార విషయమునను, కులాచార విషయమునను. నీతి విషయమునను, మత విషయమునను నానాముఖముల కృషి చేయవలయుననియేకాని యొక్క రాజ్యాంగ విషయములందే పనిచేయుట నాయుద్దేశము కాదు."

ఇంతటి ఉదాత్తమైన ధ్యేయంకొరకు పత్రికా ప్రకటనను పంతులుగారు ప్రారంభించారు. ప్రభుత్వోద్యోగుల అవినీతి ప్రవర్తనలు బట్టబయలు చేయడం. వితంతు వివాహాలు ఎలా శాస్త్రసమ్మతమో నిరూపిస్తూ, స్త్రీలను అణగద్రొక్కడం ఎంత నీచమైన పనో అయన పత్రికాముఖంగా ప్రచురిస్తూ వచ్చారు. మూఢ సిద్ధాంతాలపై తనవాదనా పటిమతో హేతుబద్ధమైన రచనలు చేస్తూ వచ్చారు. సత్యరాజు పూర్వ దేశయాత్రలు, రాజశేఖర చరిత్ర, ఎన్నో ప్రహసనాలు పత్రికా ముఖంగానే మొదట ప్రచురింపబడ్డాయి. పంతులుగారి వచన శైలి, వారిహాస్యరసధోరణి, విమర్శనా చమత్కారం అనన్యసామాన్యమైనని కావడం చేత చదువరులను ఇట్టే ఆకట్టుకొనేవి. వారి రచనలు. ఉపన్యాసాలు ఆంధ్రదేశంలో పెద్ద ఎమారాన్ని లేపనేత్తాయి. సనాతను లంతా ఏకమై పంతులుగారిపై ధ్వజమెత్తి అడుగడుగునా ఆటంకాలు కలుగజేయడం మొదలుపెట్టారు.

వితంతు వివాహ ఉద్యమం వీరేశలింగంగారి జీవితంలో చాలాముఖ్యమైన కార్యక్రమం, అనాటి దురాచారాలలో భ్రష్టపోయిన స్త్రీలను పనికత్తెలుగా మార్చి, ప్రతికీ నత కాలం వివిధమైన సౌభాగ్యాలకు, సౌఖ్యాలకు నోచుకోనివ్వని కట్టుబాటు పంతులుగారిని చాలా కలవరపరచింది. ఈ ఉద్యమానికి ఆంతర్భాగంగా బాల్యవైధవ్య వివాహాల నిషేధం కూడా ముడిపడిఉంది. ముందుగా రాజారామమోహన రాయ్ గారు సతీ సహగమన పద్ధతిని రూపుమాపారు. భర్తలుపోయిన పనితలు తన భర్త కళేబరాంతో కట్టబడి చితికెక్కవలసిన దౌర్భాగ్యం ఇంతరించింది. కాని వితంతువులైన పనిత లకు జీవన్మార్గంలేదు. వారు పుట్టింటివద్దనో, అత్తింటివద్దతో ఊడిగం చేసుకొంటూ, ఉప్పులేని భోజనంచేస్తూ, ఉపవాసాలతో శరీరాన్ని కృశింపజేస్తూ జీవితాంతం దుఃఖ సముద్రంలో ఈదులాడవలసిందే. వితంతువు అవినీతి కార్యక్రమాలకు పాల్పడినా పెద్ద తప్పుకాదు. కాని, పునర్వివాహం మాత్రం చాలా కూడనిపనిగా భావించేవారు.

రామమోహనరాయ్ ఉద్యమం తర్వాత ఏర్పడ్డ సాంఘిక సమస్య యిది. దీనిని ఎదు ర్కొని సరిదిద్దడానికి ఉద్భవించిన మహా పురుషుడు వీరేశలింగం పంతులుగారు. బాల్యంలో ముక్కు-పచ్చలారని బిడ్డలకు వివాహాలు చెయ్యడంలో బాల్యదంపతులు పెరిగి పెద్దవారు కాకపూర్వమే ఏదోఒక జాడ్యానికి గురియై పురుషుడు మరణించిన పక్షంలో అభమూ, శుభమూ తెలియని ఆ అమాయకురాలు సాంఘిక దురన్యాయానికి లోను కావడం ఆనాటి నిబంధన, స్ఫురద్రూపులైన బాల్యవితంతువులు శిరోముండనం చేయించుకొని వయస్సును, సర్వ సౌభాగ్యాలను ప్రక్కకు నెట్టి జీవచ్ఛవాల్లా కాల క్షేపం చేయడం చూచినప్పుడు వీరేశలింగంగారి హృదయం అందోళన చెందింది. ఈ దురాచారాన్ని ఎలాగైనా రూపుమాపాలని ఆయన ధృఢంగా సంకల్పించుకొన్నారు.

వీరేశలింగం గారిని మొదట స్త్రీ పునర్వివాహ విషయంలో పురికొల్పింది చల్లపల్లి బాపయ్య పంతులుగారు. దానికి సహాయకులుగానున్న వారు న్యాయపతి సుబ్బారావు పంతులుగారు, బసవరాజు గవ్వరాజుగారు. ఆర్థిక సహాయం పైడా రామ కృష్ణయ్యగారు చేసినట్లు స్వీయచరిత్రలో పంతులుగారే పేర్కొన్నారు. స్త్రీ పునర్వి వాహ ఉద్యమం రాజమహేంద్రవరములో పండిత సభలో ప్రారంభమైంది, 3-8-1879న రాజమహేంద్రపరంలోని విజయనగర మహారాజుగారి బాలికా పాఠ శాలలో వీరేశలింగంగారు సభ ఏర్పాటుచేసి పట్టణంలోని పండితులకందరకూ ఆహ్వా నాలు పంపించారు. మనుస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి ముఖ్యంగా చదివి వ్యాఖ్యా నంతో స్త్రీ పునర్వివాహాన్ని సమర్థిస్తూ వీరేశలింగంగారు వ్యాసం తయారు జేసి వితంతు వివాహం శాస్త్ర సమ్మతమేనని, సభలో చదివారు. దానిపై సనాతనులంతా ఆక్షేపణ చేయడం, భయపెట్టటం జరిగాయి. వీరేశలింగంగారి పట్టుదల ఆక్షేపణలకు లొంగేది కాదు. ఒకప్రక్క "వివేకవర్ధనీ"లో వ్యాసరచనచేస్తూ, వివాహాలు స్వయంగా జరిపించాలని, దానికి అవసరమైన కార్యక్రమం చిత్తశుద్ధితో ఆయన ప్రారంభించారు.

వీరేశలింగంగారు వ్యయ, ప్రయాసలకోర్చి ప్రమాదములను సహితం లెక్క చెయ్యకుండా 11-12-1881వ తేదీన రాజమహేంద్రవరంలో మొదటి స్త్రీ పునర్వి వాహం కృష్ణాజిల్లాలోనిరేపూడి గ్రామంలోఉన్న బాలవితంతువును విశాఖపట్టణంలో ఉద్యోగంచేస్తూ ఉన్న గోగులపాటి శ్రీరాములగారికి ఇచ్చి జరిపించారు. వివాహము చేసిన వున్నవారిని రాజమహేంద్రవరం చేర్చినప్పటినుండి సంక్షోభం ప్రారంభ మయింది. ఆకోలాహలం వర్ణిస్తూ వీరేశలింగంగారు తమ స్వీయ చరిత్రలో ఉదహ రించిన తీరు పరిశీలించండి.

''ఆ మరునాడి యీవార్త యీకంతయు పాకి యీ చిన్నదానిని చూచుటకయి జనులు తీర్థప్రజలవలె మాయింటికి రాసాగిరి. అందుచేత కొన్ని దినములు మాయిల్లు తిరుమల వెంకటేశ్వరుని యాలయమువలె వచ్చెడి వారితోను పోయెడివారితోను సందడిగా నుండెను."

ఈ వివాహం దిగ్విజయంగా సాగడానికి రక్షక శాఖ అధిపతులు, విద్యార్థులు, ఆర్థిక సహాయంలో పైడా రామకృష్ణయ్యగారు తోడ్పడ్డారు. మొదటి స్త్రీ పునర్వివాహం ఎంతక్లిష్టమైన వాతావరణంలో చేయవలసివచ్చిందో వీరేశలింగంగారి ముఖతః వింటే మంచిది.

"పామరులవలని భయముచేత మాయింటవంటచేయు బాపన పనికత్తె మమ్మా వరకే విడచిపెట్టెను; పురోహితుడు మాయింట శుభకర్మలు చేయించుటకయి రాక మానుకొనెకు. బంధువులందరును నన్ను బహు విధముల నిందించుచు జాతిభ్రష్టునివలె చూడసాగిరి. వివాహదినమున మా యింట మాత్రమేకాక మాయింటి చుట్టును, మా వీధి పొడుగునను రక్షక భటుల కాపలిచ్చినది."

స్వీయ చరిత్రలో పైభాగం చదివినప్పుడు వీరేశలింగంగారు ఎంత కార్యదక్షులో నిర్భయులో మనకు రూఢిగా తెలుస్తుంది. ఆయన తాను నమ్మిన దానిని ఆచరించడంలో దిట్టకాబట్టే యుగపురుషుడు సంఘ సంస్కర్త కాగలిగారు. తర్వాత అనేక వితంతు వివాహాలు ఆయన చేతిమీద జరిగాయి. మద్రాసునగరంలో కూడా ఆయన స్త్రీ పునర్వివాహకార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగించారు. ప్రథమంలో వితంతువివాహాలు చేసికొన్న వారికి సంఘ బహిష్కారం ఎదురవ్వడంచేత కొన్ని సంవత్సరాలపాటు కొద్దిపాటి నెలసరివేతనాలు, నివాసానికి గృహవసతి స్త్రీపునర్వివాహ సంస్థవారు ఇస్తూ వచ్చారు.

వీరేశలింగంగారు ఒక ప్రక్క వితంతు వివాహ కార్యక్రమం నెరవేరుస్తూ ప్రభుత్వోద్యోగులలో లంచగొండితనం, అవినీతి తొలగించడాని కూడా కృషి చేశారు. ఆనాడు ఉద్యోగులలో లంచగొండితనం ఎంత ముమ్మరంగా ఉందో వీరేశలింగంగారు కండ్లకు కట్టినట్లు చెప్పారు.

"ఆ కాలమందు వేశ్యనుంచుకోనివాడు అరసికుడనియు పౌరుషహీనుడనియు భావింపబడినట్లే లంచములు పుచ్చుకోని వాడుప్రయోజకుడనియు బుద్ధిహీనుడనియు పరిగణింపబడుచుండెను. అప్పుడు లంచములు స్వీకరింపనివారును ధర్మపరులయిన రాజకీయోద్యోగులు సహితమందందు కొందరుండుచువచ్చిరిగాని యట్టివారి సంఖ్య యత్యల్పమయియుండెను. లంచములు గైకొనుటయుద్యోగ ధర్మమని యెల్లవారును తలచియుండుటచేత నిచ్చువారుగాని పుచ్చుకొనువారుగాని దానిని తప్పుగా దలపకుండిరి. రహస్యమన్నది లేక బంటుమొదలుకొని మంత్రివరకు రాజపురుషులందరును బహిరంగముగానే స్వీకరణము చేయుచుండిరి."

వీరేశలింగంగారు ఉంచగొండితనాన్ని ఎదుర్కొన్న పద్ధతికి నిదర్శనంగా ఒక్క ఉదాహరణచాలు. 1878 లో పాలూరు శ్రీరాములుగారు రాజమహేంద్రవరం డిస్ట్రిక్ట్ మున్సబుగా వచ్చారు. అప్పటికి చిత్రపు కామరాజుగారు ప్రభుత్వ న్యాయవాదిగా రాజమహేంద్రవరంలో ఉన్నారు. శ్రీరాములు గార్కి కామరాజు గార్కి బాంధవ్యం ఉండేది. కోర్టులో వాపసుపై కేసు ప్రగతి ఆధారపడడం తగ్గిపోయింది. చట్టంలో సంఖ్య ఉదహరించినట్లు నటిస్తూ తాము ఈయగలిగిన మొత్తం తూపాయలలో కోర్టులో చెప్పడం, అది విని శ్రీరాములుగారు న్యాయం నిర్ణయంచెయ్యడం. ఇలా నడుస్తూ ండగా వీరేశలింగంగార్కి ఈ అవినీతిపై కన్నుపడ్డది. న్యాయం బహిరంగ వేలంలో అమ్మడు పోవడం ఆయన సహించలేకపోయారు. వాకబుచెయ్యగా పోలూరి శ్రీరాములుగారి తరపున చిత్రపు కామరాజుగారు మొదట జడ్జిమెంటు ప్రతిని వ్రాయడం అది చూచి శ్రీరాములుగారు మేలు ప్రతిని వారి సహస్తాలతో వ్రాసి కోర్టులో చదివడం పరిపాటి అయ్యింది. కామరాజుగారి ఇంటివద్ద చెత్తకుండీలో ఆయన వ్రాసిన జడ్జిమెంటు మేలు ప్రతి వ్రాసుకోడం పూర్తయిన తర్వాత చింపిన కాగితాలు పడుతున్నట్లు తెలిసింది. ఆ కాగితాలు ప్రోగుచేయించి సరిగ్గా అమర్చి అతికించారు వీరేశలింగంగారు. శ్రీరాములు గారిపైన, కామరాజుగారిపైన కోర్టులో అభియోగం తెచ్చారు. కేసు చాలాకాలం నడచిన తర్వాత కేసు రూఢి అయ్యింది. అవమానం భరించలేక చిత్రపు కామరాజుగారు ఆత్మహత్య చేసుకొన్నారు. పోలూరు శ్రీరాములు గార్కి మాత్రం మతి భ్రమించిందట.

వీరేశలింగంగారు పట్టుబడితే సమస్య కడతేరేవరకే విడిచే స్వభావంకాదు. వ్యయప్రయాసలకు వెనుదీయని ప్రవృత్తి వారిది. వారు వ్రాసిన ప్రతి రచనలోనూ సంఘంలోని దురాచారాలను వ్యంగ్య ధోరణిలో విమర్శిస్తూ ప్రజలకు జాగృతిని

కలిగించారు. పత్రికా ప్రచురణకూడా వారందుకే చేపట్టారు. వీరేశలింగంగారి పేరు రాగానే స్త్రీపునర్వివాహం మనకు గుర్తుకు వస్తుంది. కాని ఆయన చేసిన సాంఘిక సేవ స్త్రీపునర్వివాహాలకే పరిమితమైందికాదు. ఆయన కాలంలో ఉన్న సాంఘిక దురాచారాలన్నిటిపైన ధ్వజమెత్తిన వాడాయన. రచయితలలో మహారచయిత కాగలిగారు. నవల, స్వీయచరిత్ర, ప్రహసనాలు, వ్యాసరచన మొదలైన క్రొత్తపోకడలు తెలుగు సాహిత్యంలో ఆయన ప్రవేశపెట్టాడు. అందుకే తెలుగువారు ఆయనను గద్యతిక్కన అని ఆప్యాయంగా పిలుచుకుంటున్నారు. ఆయన గొప్ప విమర్శనా శక్తిగల పరిశోధకుడు. ఆంధ్రకవుల చరిత్ర చదివినపుడు మనకు ఆ విషయం ప్రస్ఫుటంగా కనుపిస్తుంది. వీరేశలింగంగారు ఏ విలువను సంఘంలో పునఃస్థాపించడానికి పోరాటం సాగించారో ఆ విలువలు ఇప్పటికీ లోపించే ఉన్నాయి. సాంఘిక కార్యకర్తలు సంఘ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని వీరేశలింగంగారు చూపించిన మార్గాన్ని, పట్టువలను ఒరవడిగా పెట్టుకొని కార్యక్రమ నిర్వహణ చేయవలసివుంది. కులపిశాచం హిందూసంఘాన్ని ఇంకా విడచి పెట్టలేదు. అన్నిరంగాల్లోనూ కులప్రభావం వీర విహారం చేస్తూ ఉంది. కులవ్యూహంనుండి బయటపడడానికి ఎవరికి శక్యం కాకుండా ఉంది. దీనికి పరిష్కారమార్గం వర్ణాంతర వివాహాలేనని అందరూ ఒప్పుకుంటున్నారు, దాని ఆచరణలోనే నత్తనడకలా సాగుతూంది. పూర్వులైన వీరేశలింగంగారివంటి సంఘ సంస్కర్తల జీవిత విశేషాలు చర్వితచరణంగా పారాయణంచేస్తే తప్పక మనకు కావలసిన ధైర్యస్థైర్యాలు చేకూరుతాయి. కందుకూరి కార్యక్రమం నిర్వఘ్నంగా కొనసాగుతుంది. 1937వ ప్రాంతంలోనే కందుకూరి వీరేశలింగంగారి స్వీయచరిత్ర ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు బి.ఎ. తరగతికి పఠనీయగ్రంథంగా నిర్ణయించి నట్టు చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తమ స్వీయ చరిత్ర ద్వితీయ ముద్రణ పీఠికలో పేర్కొన్నారు. యువకులు భావిపౌరులు కాబట్టి, యువకుల దృక్పథంలోమార్పు వస్తే మందు ముందు సంఘసంస్కరణ సులభమౌతుంది. ఈ మధ్య వీరేశలింగంగారి స్వీయచరిత్రను తాచినవారే లేరు. విశ్వవిద్యాలయాలవారు దీనిని పాఠ్యగ్రంథంగా నిర్ణయించాలి. క్రింద తరగతులలో స్వీయచరిత్రనుండి ఒక్కొక్క ప్రకరణాన్ని గ్రహించి పాఠ్య పుస్తకాలలో చేర్చాలి. స్వీయచరిత్ర రెండు భాగాలుకలిసి 900పేజీల

వరకూ ఉంది కాబట్టి అంత పెద్ద గ్రంథం విద్యార్థులకు చదవడానికి కష్టతరంగా ఉంటుం దని తలంచినట్లయితే హితకారిణి సమాజంవారు ప్రకటించిన సంగ్రహస్వీయచరిత్రను పఠనీయ గ్రంథంగా గ్రహిస్తే సరిపోతుంది. రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాలు వీరేశలింగంగారి స్వీయ చరిత్రను ఏదో పద్ధతిలో పఠనీయ గ్రంథంగా స్వీకరించ వలసి ఉంటుంది.

వీరేశలింగంగారు ఏ విలువలు సాధించడానికి తమ జీవిత పర్యంతం పోరాటం సాగించారో ఆ విలువలను సంఘంలో ప్రతిష్ఠించడం ద్వారానే మనంవారిని గౌరవించ గలుగుతాము. పంతులుగారికి అంతకు మించినస్మృతి చిహ్నంమరొకటిమనం నిర్మించ లేము. ప్రస్తుతం సంఘంలో అనేక దురాచారాలు చోటుచేసికొన్నాయి. లంచగొండితనం, కన్యా వ్యాపారం, దేవుని పేరున జరిగే దురన్యాయాలు అరికట్టాలంటే వీరేశలింగంగారి పట్టుదల, నిర్భీతి అలవరచుకొని చిత్తశుద్ధితో కార్యక్రమం నిర్వహించాలి.

కులద్వ్యక్షం

ఎలా పోతుంది ?

1971 డిశంబరులో జరిగిన 14 రోజుల యుద్ధంలో భారతదేశం సాధించిన విజయం. బంగ్లాదేశ్ అవతరణ–మనం పాటిస్తూ, సర్వమానవ జాతి అవలంబించ దగినవని మనంవిశ్వసించే స్వాతంత్ర్యం. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సామ్య వాదం అనే సిద్ధాంతాల ఘనవిజయంగా పరిగణింపబడింది. స్వాతంత్ర్యము సంపాదించిన అనంతరం భారత పౌరులందరికి న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం సమకూర్చు మౌలిక సూత్రాల నాధారం జేసికొని 'రిపబ్లిక్' గా అవతరించిన భారత దేశం. నేడు బంగ్లాదేశ్ అనే మరొక 'రిపబ్లిక్' స్థాపనకు దోహదకారియై ఇతర దేశాలకు ఆదర్శప్రాయమైనది. నేడు మనదేశ కీర్తిప్రతిష్టలు ఇనుమడించి. యావత్తు మానజాతి శ్రేయస్సుకు అనువగు ఆశయాలకు అంకితమై మార్గదర్శకమైనదని పలు వురి ప్రశంసల నందుకొన్నది మనభారదేశం.

ఇట్టి తరుణంలో మనం ఒకమారు మన అంతరంగిక సమాజపరిస్థితిని ఆలో కించి, ఒకరు వ్రేలుపెట్టి చూపదగిన లోపములను తొలగించుకొనుట సమయోచితమే గాక, చాల అవసరము గూడ, లేనిచో, భవనమునకు సున్నము కొట్టి ఇంటిలో బూజు తుడవకుండ వదలినట్లవుతుంది.

మనదేశంలో 'కులము' అనేపిశాచము జాతిని నిర్జీవం చేస్తూ విలయతాండవం చేస్తున్నదంటే అతిశయోక్తి గానేరదు. భారతదేశంలోని అధికసంఖ్యాకులైన హిందు వులుచిన్నాభిన్నమై నాల్గువేలకులములుగా విభజింపబడి తమ చుట్టు నిర్మింపబడిన సామాజికమైన అడ్డుగోడల మధ్య జీవించుచున్నారు. పుట్టుక కారణంగా గుర్తింపు పొందుచున్న 'కులము' అనే కట్టుబాటు పేర నానా అన్యాయాలు, అక్రమాలు,

అమానుషత్వాలు తరతరాలుగా జరిగినవి; ఇంకనూ జరుగుచున్నవి. ఈ స్వతంత్ర యుగంలో కులవ్యవస్థ మరింత బలాన్ని పుంజుకున్నది. ఇది కులాల మధ్య ద్వేషంగా పరిణితి చెంది హత్యలు, గృహదహనాలు, హింసలకు దారితీస్తున్నది.

భారత రాజ్యాంగ ముఖ్యనిర్మాత, న్యాయశాస్త్ర కోవిదుడు డా॥ అంబేద్కర్ ఇలా అన్నారు, "మరో మాటలో చెప్పాలంటే నీవెటువైపు పయనించినాసరే యీ కులమనే భూతం పీమార్గానికడ్డు తగుల్తూనే వుంటుంది. ఈభూతాన్ని తుదముట్టించనిదే ఏ రాజకీయ సంస్కరణగానీ ఆర్థిక సంస్కరణగానీ సాధ్యం కాదు."

సాంఘిక రంగంలో అభివృద్ధిని సాధించనంతవరకు తదితర రంగాలలో సైతం అభివృద్ధిని సాధింపజాలం. దురాచారాల దుష్పలితంగ దోషభూయిష్టమై పోయివున్న సంఘాన్ని సంస్కరించేందుకు నిరంతర కృషి అవసరం.

అసలు యీ కులవ్యవస్థ పుట్టుపూర్వోత్తరా సిద్ధాంతం అసంబద్ధంగా కన్పిస్తుంది. గుణకర్మ విభాగములను బట్టి బహ్మక్షత్రియ వైశ్య శూద్రులను నాలుగు జాతులను పూర్వము తానే సృష్టించినట్లు శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పారు.

సృష్టికర్త లోక శ్రేయస్సుకై తన నోటినుండి బ్రాహ్మణులను, చేతులనుండి క్షతియులను, తొడలనుండి వైశ్యులను, పాదములనుండి శూద్రులను సృష్టించెనని, తన సృష్టినంతటిని సంరక్షించుటకు యీనలుగురికి ధర్మములు నిర్ణయించెనని మనుస్మృతితో చెప్పబడియుంది. అంతేగాక బ్రాహ్మణులు-క్షత్రియ వైశ్య శూద్రులకన్న, క్షత్రియులు – వైశ్యశూద్రులకన్న వైశ్యులు – శూద్రులకన్న ఎక్కువ స్థాయి వారనియు నిర్ణయింపబడింది. న్యాయస్థానము ఎదుట చట్టము అందరికి సమానముగా ఉండగూడదని మనుస్మృతిలో చెప్పబడింది. ఒకే నేరమునకు తక్కువపర్గము వారి కున్న శిక్షలు హెచ్చుపర్గమువారికి వుండవు. బ్రాహ్మణులు గురువులుగను, క్షత్రియులు ప్రభువులుగను, వైశ్యులు వ్యాపారులుగను, శూద్రులు పై మూడు వర్గాలకు అభ్యంతరం చెప్పకుండ సేవచేయువారుగ—వారి ధర్మములు మనుస్మృతిలో చెప్పబడినవి.

ధర్మశాస్త్రవేత్తలు శూద్రుల కొరకుచేసిన కట్టుబాట్లు ఎటువంటివనగా మచ్చుకు కొన్ని ఉదహరిస్తాను—

1. సంఘములో శూద్రునిది తక్కువ స్థానము.

2. అతడు అపరి శుద్ధుడు, గనుక ఏ పవిత్రకార్యమును, అతనికి కనపడు నట్లు, వినపడునట్లు చేయరాదు.

3. ఇతర వర్ణముల వారితో సముగ అతనిని గౌరవించరాదు.

4. స్త్రీలైనా పురుషులైనా, శూద్రుల ప్రాణమునకు విలువలేదు. ఒకవేళ కొద్దివిలువవున్నా, బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులతో పోల్చినచో శూద్రుల జీవితపు విలువలు చాల తక్కువ. పరిహారము లేకుండగనే ఎవరైనను వారిని చంపవచ్చును.

5. అతడు విజ్ఞానార్జన చేయరాదు. అతనికి విద్య గఱపుట నేరము, పాపము, కర్ణుడు సూతపుత్రుడని భావించి విలువిద్య నేర్పిన పరశురాముడు అతనిని శపించుట దీనికి చక్కని ఉదాహరణ.

6. అతడు ఆస్థిని సంపాదించరాదు. అతని ఆస్థిని ఒక బ్రాహ్మణుడు తన ఇష్టానుసారము పరిగ్రహించవచ్చును.

7. ఆతడు ప్రభుత్వోద్యోగములో నుండరాదు.

8. అతని విధి. మోక్షము పైపర్ణముల వారికి సేవజేయుటలో నుండును.

9. అతడు బానిసత్వంలో జన్మిస్తాడు. సర్వదా అతనిని బానిసగానే వుంచాలి.

ఇంకా ఘోరమైన విషయమేమిటంటే 'పంచములు' అని సోదర మానవులలో మరొక వర్ణమును సృష్టించి వారు అస్పృశ్యులని, వారిని గ్రామమునకు దూరముగా నివసింప జేశారు. వారు ఎట్టి అవమానములకు క్రూర హింసలకు గురిచేయబడినో చెప్పడానికి మానవత్వమునకే సిగ్గుచేటు.

మన సమాజములో పట్టణ, గ్రామాంచలో, మన కళ్లముందు జరిగిన, జరుగు చున్న నిత్యజీవన సంఘటనలు, వార్తలను పరిశీలించినచో, పూర్వం అట్టి విషయములు జరిగి వుండవచ్చు ననుటలో ఎట్టి సందేహము వుండనవసరము లేదు.

ఇది ఇట్లుండగా అసంఖ్యాకముగ చిన్నచిన్న ఉపకులములు రాసురాను ఉద్భవించి ఈనాడు "స్వజన", "ఉచ్ఛ", "నీచ" అను భావాలకు ఆలవాలమై, స్వేచ్ఛా సమాజనిర్మాణానికి ఆటంకముగ ప్రజ్వరిల్లాయి.

మహాత్మాగాంధి 'కులము ఒక ఆచారము. దాని మూలము నాకుతెలియదు. నా ఆధ్యాత్మిక తృష్ణను తృప్తిపరచుటకు కులముయొక్క మూలమును నేను తెలుసుకొనవలసిన అవసరము లేదు". కాని "ఆధ్యాత్మిక మరియు జాతీయ అభివృద్ధికికులము హానికరమైనదని మాత్రము నాకు గట్టిగా తెలియును" అన్నారు.

"హెచ్చు–తగ్గు" భావములు ప్రాధమిక నైతిక సూత్రాలకే విరుద్ధం. శూద్రుల గురించి స్మృతులలో చెప్పబడిన శ్లోకాలు, మానవతా భావానికి విరుద్ధమైనవిగ పూర్తిగ త్రోసిపుచ్చనగునని మహాత్మగాంధి ఉద్బోధించారు.

కులమును గురించినేడుగల భావాలు, ఆదిలో మనుష్యుల వృత్తులను నిర్వహించు చాతుర్వర్ణ విభజనలో నుద్దేశింపబడిన లక్ష్యములను వక్రమార్గమును పట్టించి, చెడుగా మారినవి. ఈ రకముగ వర్ణాశ్రమ ధర్మముతో ప్రారంభమై, చెలగాటము లాడి, కడకు వాటినే విధ్వంసము చేశాయి.

మహాత్ముడు వర్ణధర్మముయొక్క అంతరార్థము అతిసూక్ష్మమైనదని చెప్పారు. అదేమన, తండ్రియొక్కవృత్తిని మనము, నైతిక సూత్రములకు అనుగుణ్యముగ నుండునంతవరకు, జీవనోపాధిని సంపాదించుకొను విషయములో మాత్రము, అవలంభించుట. ఇది సమస్తమానవజాతికి వర్తించు సత్యము. ప్రకృతి సిద్ధాంతము, అంతేకాని ఈ రోజు మనము చూచుచున్న వికృతాకారమును దాల్చిన కులవ్యవస్థకాదు. వర్ణాశ్రమమునకు కులమునకు ఎట్టి సంబంధము లేదు. 'కులము' నిస్సందేహముగా హిందూ అభివృద్ధికి ప్రతిబంధకమని గాంధీజీ ఉద్బోధించారు

హిందూమత గ్రంథములపై ఆధారపడినది 'వర్ణాశ్రమ ధర్మము' కాగా, 'కుల వ్యవస్థ' సాంఘిక అవసరములకు లోనైన ఏర్పాటుమాత్రమే.

కుల వ్యవస్థను ఎంత త్వరగాబహిష్కరిస్తే అంతమంచిదని చెప్పారు గాంధీజీ. కులవ్యవస్థ వున్నంతవరకు సంఘమునందు, అవకాశములందు, సమానత్వము అసంభవమని, మరియు రాజకీయ ప్రజాస్వామ్యమునకుగాని, – ఆర్థిక ప్రజాస్వామ్యము

నకుగాని – తాపు పుండదని శ్రీ జవహర్లాల్ నెహూ్రి అన్నారు. హిందూ తత్వ శాస్త్రవేత్త డా॥ రాధాకృష్ణన్ "కులము చురదృష్టముగ సాంఘిక దురాచారమగుట పూర్తిఅయి, ఇప్పుడు రాజకీయ పరముగను, పరిపాలనా యంత్రాంగమునందును దుష్టశక్తిగా మారినది" అని అన్నారు. ఎన్నికలు కుల ప్రాతిపదికపై నడుచుచున్నం దుకు విచారాన్ని వ్యక్తపరిచాడు. ఆ విషయము ఎంత సత్యమో ప్రస్తుత ఎన్నికల ధోరణి రూఢి పరుస్తూ ఉంది. పరిపరి విధములసమాజములో చెరుపుకు కారణభూతమైన కులవ్యవస్థను నిర్మూలించుటకన్న నేడు గత్యంతరము లేదు.

భారత రాజ్యాంగ విధానము జాతి సమైక్యతకు, ప్రగతికి ప్రతిబంధకమైన కుల వ్యవస్థకు స్వస్తి చెప్పుచున్నది. కులరహిత సమాజ స్థాపనకు దోహదము కలుగ జేయునటుల అధికర 'ఏను' అయిన డా॥ అంబేద్కర్ గారిచే, ముందు చూపుతో తగు సూత్రములను స్పష్టముగ రాజ్యాంగమునందు చేర్చారి. సమతా సాధనకు షెడ్యూల్డు కులములు, వెనుకబడిన తరగతులకు ప్రభుత్వముగా ప్రత్యేక శ్రద్ధ లభించుచున్నది. అస్పృశ్యత రాజ్యాంగము ద్వారా నిషేధింపబడినది.

కులనిర్మూలనా లక్ష్యసాధనకు కులాంతర వివాహాలు, సమిష్టిభోజనాలు ప్రధాన సాధనాలు, కులాలను తెలిపే బొట్టు, జుట్టుపంటి బాహ్యచిహ్నాలను, శర్మ, శాస్త్రి, రెడ్డి, చౌదరి వంటి సంకేతాలను దూరంచేసుకోవలసిన ఆవశ్యకత గూడవున్నది. ఇట్టి బాహ్యచిహ్నాల తొలగింపు చర్య మొదటిమెట్టు మాత్రమే. కులాల ఉప శాఖలలో పెంపులో కొద్ది మార్పులొచ్చినా, కులాలు చిరస్థాయిగా నిల్చిపుండడానికి కారణం ఒక్కటే. ఏది ఎట్లాచేసినా, వివాహం పద్దకు పచ్చేసరికి "అదేకులంలో చేసుకోవాలి" అనే కులాచారం ఇందుకు కారణం. ఈ రకంగా కులవ్యవస్థయొక్క అస్థిపంజరాన్ని కాపాడుచున్నది వివాహ పద్ధతియే. కనుక, కులప్రవృత్తిలేకుండ వివాహాలు జరిగిన నాడే కులవ్యవస్థ నశించేది. నేటి సమాజంలోని ఈ అరిష్టాన్ని శాశ్వతముగ తొలగించ టానికి కులాంతర వివాహాలు ప్రభావవంతమైన ఏకైక మార్గము.

కులంపుండకూడదన్న విషయంలో ఏ రాజకీయపార్టీల మధ్యకూడ బేధాభి ప్రాయం ఉన్నట్లు కనబడదు. కాని కులదృక్పథం పోగొట్టటానికి గట్టిప్రయత్నం ప్రభుత్వ పరంగాగాని, రాజకీయ పార్టీల ద్వారాగాని జరుగలేదు.

కుల నిర్మూలనకు ఏకైక మార్గమైనటుపంటి పర్ణాంతర వివాహాల్ని అందరూ ప్రోత్సహించటం అవసరము. ప్రభుత్వోద్యోగాలు, స్థానిక సంస్థలలో ఉద్యోగాలు ప్రభుత్వ సహాయక సంస్థలలోని ఉద్యోగాలు, కులాంతర వివాహాలు చేసుకొన్నవారికి కొంత నిష్పత్తిలో కేటాయించాలని లేదా పదవుల నియామకంలో కొంత ప్రాధాన్యం ఇవ్వాలని దీనికి అవసరమైన రాజ్యాంగ సవరణ చెయ్యాలి.

ఈ కృషిలో అవసరమగు శాసనములను రూపొందించుటకు సమాజములో కుల వ్యవస్థ ధమును పోగొట్టుటకు, ప్రభుత్వముయొక్క తోడ్పాటుతోపాటు, సంఘసంస్కరణాభిలాషులైన రాజకీయవేత్తలు, సంస్థలు ఇతర వ్యక్తుల యొక్క సహకారమును ఎంతైన అవసరం.

కులనిర్మూలన ఎలా ?

1971 లో తీసుకున్న జనాభా లెక్క ప్రకారం భారతదేశపు జనాభాలో హిందువులు 82 శాతం వున్నారు. కులతత్వం హిందూ సమాజానికి చీడ పురుగనే విషయం భారతదేశంలో వివేకులైన హిందువులంతా అంగీకరిస్తారు. కులతత్వం సామాజిక ఐకమత్యానికి హాని కలిగించడమేకాక, జాతీయ సమైక్యతకు గొడ్డలిపెట్టుగా తయారైనది. అనాదినుండి కులవ్యవస్థ, కులంపట్ల దురభిమానాలను పెంచుతూ, వివిధ కులాల మధ్య విభేదాలను వ్యాపింపజేస్తూ, మనిషికి మనిషికి మధ్య కృత్రిమ అడ్డంకులను సృష్టిస్తోంది. విదేశీయులు భారతదేశాన్ని ఎంతోకాలం పరిపాలించడం, పరరాజులు దండెత్తడం కులవ్యవస్థ భారతదేశపు జనాభాలో విభేదాలు కలుగడానికి కొంతవరకు కారణంగా పేర్కొనవచ్చు. ప్రాచీన భారతదేశంలో కులవ్యవస్థ పని పంపిణీగా ఉండేదని స్పష్టపరుస్తున్నది. పుట్టుకతో సంబంధం లేకుండా ఉపాధ్యాయులను విద్యార్థికులను, బ్రాహ్మణులని, శరీర పుష్టి కలిగి యుద్ధం చేయడానికి తగివున్న వారిని క్షత్రియులని, వ్యాపారం చేస్తున్న వారిని వైశ్యులని, వివిధ ఇతర వృత్తులు, సేవలు చేసేవారిని శూద్రులని పిలిచేవారు. కొంచరు "చాతుర్వర్ణ" సిద్ధాంతాన్ని సమర్థిస్తూ భగవద్గీతను వల్లిస్తారు. ఈ విభజన వ్యక్తి పుట్టుకనుబట్టి కాక అతని లక్షణాలు, నిర్వహించిన విధులు, చేసినసేవలు లేక చేపట్టిన వ్యక్తినిబట్టి చేయబడింది. మొదట అందరూ శూద్రులుగానే పుట్టుతారని, తరువాత ఆయా వ్యక్తులు చేసే పనినిబట్టి క్షత్రియులు, వైశ్యులు, బ్రాహ్మణులు అవుతారని, విద్యార్థికులు వివేకంగలవారు బ్రాహ్మణత్వం పొందుతారనే వేద లిపిలోని మంత్ర సంస్కృతశ్లోకంలోపేర్కొనబడింది. వేదకాలంలో విశ్వామిత్రుడు క్షత్రియకుటుంబంలో పుట్టారని బ్రాహ్మణత్వం పొంది మహర్షి అయ్యారని అంటారు. గీతలో విపరీతంగా బడిన సిద్ధాంతం గాని, వేదకాలంలో ఆచరించిన అలవాటుగాని కాల పరీక్షకు నిలబడలేదు. ఈ రెండు సిద్ధాంతాలు గాలికి కొట్టుకొని పోయాయి. తర్వాత శూద్రునిగా పుట్టిన ఏ వ్యక్తిగాని బ్రాహ్మణుడు కాలేదు. ఒక వ్యక్తి విజ్ఞానం సంపాదించడంచేత, జ్ఞానం పొందడంవల్ల బ్రాహ్మణునిగా పరిగణింపబడుటలేదు. పైగా, నిరక్షరాస్యునిగా వుండటంచేత లేక తక్కువ వృత్తి చేపట్టి బ్రాహ్మణుడుగా పుట్టిన వ్యక్తి శూద్రునిగా

దిగజారి పోవడం జరుగుటలేదు. నిర్దిష్టమయిన ఒక కులానికి లేక వర్ణానికి కేటాయించబడిన వృత్తిలోని మార్పు ఒక వ్యక్తికి పుట్టుకతో వచ్చిన కులాన్ని మార్చలేదు. వాడుకలోలేని కులవ్యవస్థకు శాశ్వతత్వం చేకూరేటట్లు చేయడానికి ఎవరైనా దైవికమైన అధికారం ఏ విధంగా చూపగలరు? పుట్టిన బిడ్డపైని, తల్లిదండ్రుల కులం అనాలోచితంగా రుద్దటం జరుగుతుంది. దీనివల్ల పుట్టుక బిడ్డ కులాన్ని నిర్ణయించిందన్నమాట ఈ చతుర్వర్ణాలు తిరిగి అనేక వందల కులాలుగా విభజించబడ్డాయి. కలిసి భోజనం చేయడం అంతర్వివాహాలు ఖచ్చితంగా నిషేధించబడ్డాయి. ఆ ఉల్లంఘనలను ఉల్లంఘించిన వారు వెలివేయబడే వారు. వారు అన్ని ఇతర కులాలకు చెందిన వారి దగ్గర అనేక అవమానాలు పొంది బాధపడేవారు. మనువు తన స్మృతిలో, శూద్రునిగా పుట్టిన వ్యక్తిగాని వేదాలు చదివినట్లయితే, అతని నాలుక కోసేయమని అదేశించాడు. అపస్తంభుడు శూద్రుడు వేద పఠనం విన్నట్లయితే, కరగించిన సీసం అతని చెవుల్లో పోయాలని వ్రాసాడు. మనువు, స్త్రీలు వేదాలు చదవకూడదని, అంతర్వివాహాలు, కలసి భోజనాలు చేయడం, వంటివి కూడదని మనువు అనేక నిబంధనలు విధించాడు. కులవ్యవస్థ పవిత్రతను కాపాడటానికి మనువు చేసిందంతా ఇప్పుడు పల్లించనవసరం లేదు.

కొందరు వ్యక్తులు ఏ విధంగా అస్పృశ్యులుగా పరిగణించబడ్డారో, కేవలం పుటుకచేత ఒక వ్యక్తి అస్పృశ్యుడు అని ఏ విధంగా కళంకం ఆపాదించారో అను విషయం గూర్చి చరిత్ర పుటలు తరచి చూడటం నిరర్థకమే అవుతుంది. ఒకానొక కుటుంబంలో ఒకని పుట్టుక, అతడు ముందు జన్మలో సంపాదించిన పాప పుణ్యాలను బట్టి భగవంతుడు నిర్ణయిస్తాడని హిందువులను నమ్మించడానికి "ప్రారబ్ధ కర్మ" "పునర్జన్మ" అను హిందూమత సిద్ధాంతాన్ని వల్లించడం జరిగింది. మంచి జన్మ కావాలంటే, ఉన్నత కులానికి చెందిన కుటుంబంలో పుట్టాలంటే అతడు ద్విజుల జీవనాధారం కొరకు, ఆచారాలు, కర్మలు, పూజలుచేసి తిండిగింజలు అర్పించాలి. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రస్తుత జన్మలోని అతని చర్యలు కూడా కొంతవరకు ముందుగానే నిర్ణయించబడ్డాయని అనగలమా? వివేకంగల వారెవరూ ఈ కాకమ్మకథలు అంగీకరించరు. "ప్రారబ్ధ కర్మ" "పునర్జన్మ" సిద్ధాంతాన్ని పుట్టుకకు ముడిపెట్టే ఈ ధోరణిని మన మనస్సుల్లోనుండి పూర్తిగా తుడిచి వేస్తేనేగాని, ఈ మూఢ నమ్మకం వలన కలిగే దుష్పరిణామాలను గుర్తిస్తేనేగాని, కులవ్యవస్థలోని ఒక స్తంభాన్ని మనం కూల్చలేం.

స్వాతంత్ర్యం సాధించిన తరువాత, రాజ్యాంగ ముఖ్య నిర్మాతయిన డా. అంబేద్కర్‌తో సహా మేధావులు కులతత్వం కూడదన్నారు. మన రాజ్యాంగము

క్షలం అనే కారణంపైనే దూషణ భూషణలను, నిషేధించి అస్పృశ్యతను రద్దు చేసింది. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, పౌరులలో సాంఘికంగాను, విద్యా పరంగాను వెనుకబడిన ఇతర తరగతులు, తదితర వర్గాలతో పోల్చిచూస్తే సాంఘికంగాను, విద్యాపరంగాను, ఆర్థికంగాను చాల శోచనీయమైన పరిస్థితుల్లో వుండడంవల్ల వారిని పురోగమించిన ఇతర వర్గాలవారితో సమానం చేయడానికి ఉద్యోగాలలోను, రాజకీయ సంస్థలోను కొన్ని రిజర్వేషన్లు కల్పించి కొన్ని ఇతర సౌకర్యాలు సమకూర్చడం రాజ్యాంగం చేసినపని. కులవ్యవస్థ పోవాలనే రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశం కాని వారి ఉద్దేశాలకు విరుద్ధంగా, స్వాతంత్ర్యం సాధించిన తరువాత కులవ్యవస్థ ఇంకా బాగా వేళ్లు పాతుకొని జాతి పురోగతికి అడ్డుకొయ్యగా నిలిచింది.

కులతత్వ ధోరణి మరింత బలపడింది. స్వాతంత్ర్యానికి ముందు భారత ప్రజలు, ధనికులు, పేదలనే భేదం లేకుండా శత్రువుతో పోరాడటానికి, మతంతోను కులంతోను భాషతోను, ప్రాంతంతోను ముడిపెట్టబడిన ఇతర భేదాలను విస్మరించి ఒక్కటయ్యారు. సర్వమానవ శ్రేయస్సు కొరకు సంయోగం, సమైక్యత, ఆదర్శ శ్రేయోరాజ్య వాదం పెల్లుబికాయి. కాని స్వాతంత్ర్యం తరువాత, ఆదర్శ నడవడిక, ,పవర్తన, అరుదైన పస్తువులుగా కనుపిస్తున్నాయి. కుల జాడ్యం పూర్తిగా పుంజుకొని పరిపాలక, ప్రభుత్వ యాజమాన్యాలలోను, ప్రైవేటు సంస్థలతో సహా అన్ని రంగాలలోను దాని వికృత రూపం ప్రతిఫలించడం మొదలుపెట్టింది. వివిధ జీవిత రంగాలలోను, ప్రభుత్వ రాజకీయ రంగాలలోను, ప్రతి ముఖ్యమైన, కీలక స్థానాలలో కొన్ని ఆధిక్య కులాలకు చెందిన వ్యక్తుల చేతిలో ఉన్నదని చెప్పడాన్ని కాదనలేము. వారు ఉన్న సంఖ్యకు వారు అనుభవిస్తున్న పదవులకు ఏలాంటి పొందికలేదు. ప్రభుత్వ సంస్థల నియోజకవర్గాల ఎన్నికలలో అభ్యర్థులను కుల ప్రాతిపదికపైన నిలబెట్టుతున్నారు. డబ్బు, అధికార దర్పం, వంశ పారంపర్య హక్కుగల పటేళ్లు, గ్రామ మునసబులకు ఓటర్లపై ఎక్కువ ప్రభావం కలిగి ఉంటారు. బలహీనవర్గాలలో ఉన్న భయోత్పాతము, వారు క్రుంగి కృశించుతున్న లేమితనం వారిని ఎన్నికలలో పోటీచేయడానికి వీలు కలిగించడంలేదు. జనాభాలో 80 శాతం మంది గ్రామాలలో నివసించడం, గ్రామాలలో కులంకున్న ప్రముఖ స్థానం, వేరుగా చెప్పనక్కరలేని సత్యం. గ్రామాలలో ఆర్థికంగా బలపడ్డ మోతుబరి ఆసాములు గూండా విధానాలను అమలుచేస్తూ, బలహీనవర్గాలకు అన్నివేళలా హానిచేస్తూ భయోత్పాతాన్ని కలిగిస్తున్నారు వారిపై క్రిమినలు దాడులను, జరిపి వారిపై నేరములను చేసినపుడు కూడా అట్టి నేరములను కప్పి పుచ్చుటకు డబ్బు, దర్పం బాగా తోడ్పడుతున్నాయి. వారిపై ఎదురుగా సాక్ష్యమివ్వడానికి కూడా కోర్టులకు, (న్యాయస్థానాలకు) సాక్షులు హాజరవడానికి మృత్యుభయముతోసున్నారు.

పట్టణాలలో కొన్ని ప్రాంతాలలో నిజానికి ఉద్యోగాలలో ఉన్న హరిజనులకు, కొన్ని వెనుకబడిన తరగతుల ఉద్యోగస్థులకు అద్దెకు ఇండ్లుగాని లేక అందులో ఒక భాగం గాని దొలకడంలేదు.

హరిజనుల సముద్ధరణ, వెనుకబడిన తరగతుల అభివృద్ధి వారి పురోగతికోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకొన్నప్పటికి, వాటిలో ఎప్పుడు మరి బీదతనంలోనే ప్రుగ్గి పోతున్నారనేది, అందరికి తెలిసిన విషయమే. ఆర్థికంగా సాంఘికంగా వారు అభివృద్ధి చెందడానికి పరిన్ని ఉదారమైన చర్యలు తీసుకోవలసి ఉన్నది. వారి విషయంలో తీసుకునే చర్యలు, వారికి సమకూర్చే సహాయం వారి పంపిణీ చేసే ఇళ్ల స్థలాల పట్టాలు గురించి ఎల్లప్పుడూ జాస్తిగా ప్రచారం చేయుట వలన వారి ప్రయోజనాలు కొంతవరకు దెబ్బతింటున్నాయి. వారి మీద, ఏహ్యభావం ఇతరులకు అధిక ప్రచారమువలన కలుగుతోంది. హరిజనుల మీద దేశంలో నిత్యం ఎక్కడో అక్కడ అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. నిస్పృహ చెందటంవల్ల, కుల భూతాల దిష్టి బొమ్మలను కూడా తగుల బెడుతున్నారు. రిజర్వేషన్ల మూలంగా నాయకులు, ప్రతినిధులు, అధికార్లు ఎందరో పైకి వచ్చారు. ఇలాంటి వారు తమ తీరిక వేళలలో గ్రామాలకు పోయి దురదృష్టవంతులైన తమ సోదరులకు తమనుండి పొందదగు చేయూతను ఇస్తున్నారా అనే ప్రశ్న ఈ సందర్భంలో రాకమానదు. రిజర్వేషన్ల మూలంగా జీవితంలో పైకి వచ్చినవారు. దురదృష్టవంతులైన తమ సోదరుల స్థితి గతులు మెరుగుపడటానికి కృషి చేస్తారనే ఆశ చాలా మందికి ఉన్నది. అలాంటి ఆశతోనే డా. అంబేద్కర్ రిజర్వేషన్ల గురించి పోరాటం సలిపి, వాటిని సాధించారు, ఈ విషయంలో ఆత్మవిమర్శ చేసుకోవాలి. వివిధ ఉప కులాల వారితో సమావేశాలు. పంక్తి భోజనాలు, కులాంతర వివాహాలు ఏర్పాటు చేయడం ద్వారాను, వారిని విడదీయడానికి ఇతర కులాలవారుచేస్తున్న కృషిని వెల్లడి చేయడం ద్వారాను, హరిజనుల హక్కులు కాపాడటానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని, వివిధ పథకాలను పౌర హక్కుల రక్షణ చట్టములోని అంశాలను తెలియజేయటం ద్వారాను, గ్రామాల్లో ఎదురౌతుంటున్న దయనీయమైన స్థితిగతులను వెల్లడి చేయటం ద్వారాను, వివిధ సమస్యలపై వారి ఉమ్మడి ప్రయోజనాలను తెలియ జెప్పడం ద్వారాను, హాస్టళ్లలో స్థితిగతులు. విద్యార్థుల చదువు సంధ్యలు, బాగోగులు విచారించి తగు చర్యలు తీసుకొనుట ద్వారాను, షెడ్యూళ్లు కులాలవారి స్థితిగతులను అభివృద్ధి చేయవచ్చును. షెడ్యూలు కులాల వారంతా కలసివుండే అగ్రకులాలు అని చెప్పబడేవారు వారిపై అత్యాచారాలు చేయడానికి వారిని ఆవహనపరచడానికి సాహసించబోరు. ప్రసిద్ధ తెలుగు కవులైన మహాకవి జాషువా, కళాప్రపూర్ణ డాక్టరు బోయి భీమన్న వారి

పుస్తకాలలో ఈ విషయం పదే పదే చెప్పారు. షెడ్యూల్డు కులాలవారు కలిసివుండి, చిలిపోకుండా, తమ అభిప్రాయ భేదాలను స్వార్థానికి వినియోగించుకోడానికి తావు లేకుండా, ఇతరుల ప్రమేయం లేకుండా తమ సమస్యలను సమిష్టిగా పరిష్కరించుకోవాలని కూడా ఈ మహాకవులు చెప్పారు. షెడ్యూల్డు కులాల వారు బయటు చెప్పకుండా వుండాలని గాని, వారికి జరిగే ఏవైనా అన్యాయాలను సహించివుండాలని గాని డా. అంబేద్కర్‌గాని, మన రక్షణ మంత్రి, ఉప ప్రధాని బాబు (శ్రీ) జగ్జీవన్‌రాం గాని చెప్పి వుండలేదు. పౌర హక్కుల రక్షణ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి కఠిన శిక్ష విధించాలని ఆ చట్టం నిబంధనలు తెలుపుకున్నాయి. ఆ విధంగా అంటరానితనం నేరమైనప్పటికీ, మన జనాభాలో 80 శాతం మంది నివసించే మన పల్లెలలో అది ఏదో ఒక రూపంలో లేదని గుండెమీద చెయ్యివేసుకొని చెప్పగలమా? చట్టం క్రింద ఎన్ని కేసులు వేయబడ్డాయి? ఎంతమంది నేరస్థులకు శిక్షించడం జరిగింది? హరిజనవాడలలోని విద్యార్థికులు, వారి ప్రతినిధులు ఈ విషయంలో చేయవలసినంత కృషిచేశారని చెప్పగలమా? షెడ్యూల్డు కులాల వారి సమస్యలతో సంబంధం లేకుండా విడిగా ఉండాలని ఆ కులాలలో చదువుకున్నవారు కొందరు అనుకుంటున్నారా? ఇది ఎంతో తీవ్రంగాను, సునిశితంగాను పరిశీలించవలసిన విషయం.

కులాలతో నిమిత్తంలేని సమాజాన్ని నిర్మించాలంటే సాంఘిక ఆర్థిక రంగాలలో సమానత్వం సాధించవలసి వున్నది. ఆర్థిక పురోగతి కాలవరకు సాంఘిక అసమానతలు తొలగిస్తుంది అయితే, హిందూ మతంలో కులవ్యవస్థ నిర్మూలించబడితేనే తప్ప, సాంఘిక అసమానతలు పూర్తిగా తొలగిపోతాయని చెప్పజాలం. హరిజనులలోని సంపన్నులను, ఇతరుల కులాలలోని సంపన్నులను ఇచ్చే గౌరవంలోను, సాంఘిక గుర్తింపులలోను, అగ్రకులాల వారు తేడా చూపుతున్నారు. అయితే పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ లేక ప్రభుత్వంలో పై తరగతి ఉద్యోగం చేస్తున్న హరిజను విషయంలో అగ్ర కులాల వారు కూడా గౌరవాన్ని ఇస్తారని, సమంగా చూస్తారని అందుచేతనే షెడ్యూల్డు కులాల వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉండాలని మన ఉప ప్రధాని శ్రీ బాబూ జగ్జీవన్‌రాం, ఇటీవలే పేర్కొన్నారు. ఆ సమాధానమే, వెనుకబడిన తరగతుల వారి విషయంలో కూడా ఇవ్వవలసి ఉంది

గాంధీజీ కులవ్యవస్థను గర్హించారు. మన జాతీయ నాయకులు, సాంఘిక సంస్కర్తలు కులవ్యవస్థను విమర్శిస్తూ కులాంతర వివాహాలు ప్రోత్సహిస్తూ వచ్చారు. అయితే, కులం అనే రాక్షసిని నిర్మూలించడం జరుగలేదు. రాష్ట్రపతితో సహా కేంద్ర రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలన్నీ కులతత్వాన్ని పూర్తిగా ప్రతిబింబిస్తున్నాయి. కులాలు

కుల వ్యవస్థ అనేవి ఒక నాణానికి ఉండే రెండు ముఖాలు. హిందూ మతంలో కుల వ్యవస్థ పాటించబడుతున్నంత వరకూ కులాలను పూర్తిగా నిర్మూలించలేం. నిప్పు లేకుండా పొగరాదు. కులం అనే నిప్పు ఉన్నన్నాళ్లు కులతత్వం అనే పొగ ఉండనే ఉంటుంది. అదే విధంగా కులాలు అనేవి లేకపోతే కులవ్యవస్థ ఉండబోదు. సమాజంలో పేదవారు కులవ్యవస్థను విస్మరించి క్రియా శీలకమైన రాజకీయాధికారాన్ని చేపట్టేంత వరకు మనసేశంలో సమ సమాజ వ్యవస్థను సాధించడం ఎండమావి లాంటే చెప్పవచ్చు. కులతత్వాన్ని తుద ముట్టించాలంటే, కులాలను రద్దు చేయడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. కులవ్యవస్థను నిర్మూలించడానికి ఏ చర్యలు అవసరం? కులాంతర వివాహాలు ప్రోత్సహించే కొన్ని సాంఘిక సేవా సంస్థలు దేశంలో పని చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో. కులనిర్మూలన సంఘం చాల విశిష్ట సేవ చేస్తుంది. చాని ఆధ్వర్యంలో అనేక వందల కులాంతర వివాహాలు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సందర్భంలో కులాంతరవివాహాల అవసరాన్ని గుర్తించి, కులాంతర వివాహం చేసుకునే దంపతులకు నగదు బహుమతులు మున్నగు పారితోషికాలను యిస్తున్నాయి కులరహిత సమాజాన్ని నెలకొల్పడానికి ఈ ప్రోత్సాహక బహుమతులు మాత్రమే సరిపోవు. సాధ్యమైనంత త్వరలో కులరహిత సమాజాన్ని నెలకొల్పడానికి సమధికోత్సాహంతో విప్లవాత్మకమైన కట్టుదిట్టమైన చర్యలు అవసరం. ఒకే కులంలో వివాహాలు నిషేధించడానికి గూడా చర్యలు తీసుకోవాలని, కులాంతర వివాహాలు చేసుకున్న వారిని మాత్రమే ప్రభుత్వోద్యోగాలలో నియమించాలని కూడా దేశంలో కొంతమంది చెప్పమన్నారు. ఈ క్రింది చర్యలు కులనిర్మూలనకు తీసికోవాలి.

1) పౌర హక్కుల రక్షణ చట్టం క్రింద నేరస్తులపై కేసులు పెట్టడానికి ప్రత్యేక యంత్రాంగం ఉండాలి. ఈ విషయంలో తగు చర్యలు తీసికోవడానికి, తటపటాయిస్తూ ఉన్న వారిపై తీవ్రమైన చర్యలు తీసికోవాలి. షెడ్యూల్ కులాలో చదువుకున్న వారు, ఇతర సేవా సంస్థలు, షెడ్యూల్ కులాలప్రతినిధులు పల్లెలను సందర్శించి, వారి సమస్యలను వెలుగులోనికి తేవడానికి వారి స్థితిగతులు తెలుసుకోవాలి

2. అన్ని కులాల్లోను పుట్టినవారు వేదాలు, తదితర శ్రుతులు చదవడానికి, పరీక్ష వ్రాయడానికి పీలు కలిగించాలి. ఆ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు జారీ చేయాలి. ఆ సర్టిఫికెట్లు పొందిన వారిని మాత్రమే గుళ్లలోను తదితర హిందూ సంస్థలోను పురోహితులు, పూజారులు, అర్చకులుగా నియమించాలి.

3. పూజారులకు వస్తున్న వంశ పారంపర్యపు హక్కులను తొలగించాలి. గర్భ గుడితో సహా అన్ని హిందూ దేవాలయాల్లోనికి ప్రవేశార్హత అన్ని కులాల వారికి ఉండాలి.

3. అంటరాని తనాన్ని నివారించటం కోన చేసిన సవరణ వలెనే కులనిర్మూలన విషయంలోను రాజ్యాంగాన్ని సవరించాలి. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులు, సాంఘికంగాను విద్యా విషయంగాను వెనుకబడ్డవారు కొంతకాలం పాటు అసలు కులాలలో అసహనతలు తొలగిపోయి సమదృష్టితో పరిగణింపబడునంతవరకు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఉండునట్లు నిబంధనలను చేర్చాలి. బాగా రాబడి ఉన్న షెడ్యూల్డుకులాల కుటుంబా లవారు, వెనుకబడిన తరగతుల ఎక్కువ రాబడిప్రస్న కుటుంబాలవారు అట్టి రిజర్వేషన్లు ఉపయోగించరాదు.

5. కులవ్యవస్థ అన్నది తక్కువగా, పరిగణింపబడే కులాలకు మాత్రం పరిమితంకాదు. అందుపల్ల, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులు, జాబితాలోని వెనుకబడ్డ కులాలు, పెద్ద కులాల్లో ఆర్థికంగా వెనుకబడ్డ వారి మధ్య కులాంతర. ఉప కులాంతర వివాహాలు జరగాలి. అంతేకాకుండా, పెద్దగా పరిగణింపబడే కులాల్లో కూడా కులాంతర వివాహాలు జరగాలి. వివాహితులు బాగా ఉన్న వారైతేనే తప్ప ప్రోత్సాహకాలు ఏ విధమైన కులాంతర వివాహానికైన ఇవ్వాలి.

6. ప్రభుత్వ సర్వీసులలో, జాతీయం చేయబడ్డ బ్యాంకులలోను, ప్రభుత్వ రంగ సంస్థలలోను, కార్పొరేషన్లలోను, స్థానికసంస్థలు మొదలైన వాటిలో పట్టి ఉద్యోగాల విషయంలో, ఇతర అన్ని విషయాలలోను సమంగా ఉన్నప్పటికి, వారి ఆర్థిక స్తోమతనుబట్టి కులాంతర వివాహాలు చేసుకొన్న జంటలకు ప్రోత్సాహకాలు చూపేటట్లు రాజ్యాంగంలో తాత్కాలిక నిబంధనను ఏర్పాటు చేయాలి.

7. అదే విధంగా కులాంతర వివాహాలు చేసుకొని సాంఘిక జాతీయ ఏకీకరణకు కృషి సల్పే వారికి కూడా శాసన సభలలోను, పార్లమెంటులోను, స్థానిక సంస్థలలోను ఎన్నిక ద్వారా భర్తీ చేయబడిన పదవులలో కొంత శాతం రిజర్వేషన్ చేసేందుకు వీలుగా రాజ్యాంగంలో తాత్కాలిక నిబంధనను ఏర్పాటుచేయాలి

8. స్వయం ఉపాధి పథకాలకోసం, ఇండ్ల స్థలాల కేటాయింపులో వ్యవసాయ భూకమతాల కనిష్ట పరిమితి చట్టాల వల్ల వచ్చే మిగుల భూముల పంపిణీలోను, వారి వారి ఆర్థిక స్తోమతలను బట్టి కులాంతర వివాహాలు చేసుకొన్న జంటలకు ప్రాధాన్యత చూపుటకు వీలుగా రాజ్యాంగంలో ఇంకొక నిబంధన చేయించాలి.

9. వారి వారి ఆర్థిక స్తోమతను బట్టి కులాంతర వివాహాలు చేసుకొన్న జంటలకు, ప్రభుత్వ క్వార్టర్లలోను, హౌసింగ్ కార్పొరేషన్లు కట్టే ఇండ్లు కేటాయింపులలోను, ప్రాధాన్యత చూపాలి.

10. పాఠశాల, కాలేజీల పాఠ్య పుస్తకాలలోను, ప్రభుత్వ ప్రచురణలలోను కులాన్ని చూపే అంశాన్ని తొలగించాలి.

11. నాయుడు, చెట్టి, రెడ్డి, చౌదరి, గౌడు, యాదవ్, శాస్త్రి, శర్మ లాంటి కుల గౌరవ వాచకాలను వాడకూడదని గట్టి ప్రచారం చేయాలి.

12. కులం ప్రాతిపదిక సూచకాలతో ప్రజలను పిలవడం ఒక నేరంగా పరిగణించాలి. కులగౌరవ సూచకాలు, పుట్టేపిల్లలకు నామకరణం చేయడం నేరంగాచేయాలి.

13. గ్రామాలకు, పట్టణాలకు ఎడంగా విడిగా కట్టు హరిజన కాలనీలను ఇక మీదట ఆపివేయాలి. మిశ్రిత కాలనీలను నిర్మించి అందులో కొంత శాతం హరిజనులకు ప్రత్యేకించగా మిగిలిన ఇండ్లలో ఉండడానికి ఇష్టపడే ఇతర కులాల వారికి తక్కువ విలువకు ఆ గృహాలను ఇచ్చి తద్వారా సాంఘిక సమైక్యతకు దోహదం చేయాలి.

14. సాంఘిక సంస్కరణ సేవా సంఘాలు, సంస్థలకు ఆర్థిక సహాయం అందజేయాలి. పూలమాలల మార్పిడితో చేసిక్ నే వివాహాలను చట్టబద్ధం చేసి వివాహాలను నిర్బంధంగా రిజిస్టరు చేయించాలి,

15. కులాంతర వివాహాలు చేసుకొనే వారికి న్యూనతలను తట్టుకొనేందుకు సహాయపడపలసించిగాను సహకరించవలసించిగాను పోలీసు వారితో సహా ప్రభుత్వ ఆధికారులకు అందరికీ సూచనలు ఇవ్వాలి. న్యూనత పరచిన వారిని శిక్షించాలి.

16. వీలును బట్టి ప్రతి గ్రామంలోను, పట్టణంలోను సాంఘిక సంస్కరణ కార్యక్రమాలు నిర్వహించడానికి, కులాంతర వివాహాలు చేయడానికి వీలుగా సరియైన హాలును నిర్మించాలి.


17. కుల నిర్మూలనకు పాటుపడి మనలను విడిపోయిన సంస్కర్తలందరి పుట్టిన రోజు పండుగలను, సంస్కరణ దినాలను జరపాలి.

167

168

RE HB 02 01 250

రచయిత



జననం 1-6-1919 గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో. న్యాయశాస్త్ర పట్టభద్రులు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా న్యాయవాదవృత్తిని చేపట్టుటకు అవకాశములేక 1942లో ప్రభుత్వోద్యోగములో ప్రవేశించారు. నీతి, నిజాయితీ, ఉత్తమకృషి గుర్తించబడి ఉన్నత పదవుల నలంకరించుతూ వచ్చారు. న్యాయశాఖ కార్యదర్శిగా ఏడుసంవత్సరములు పనిచేశారు. ప్రభుత్వము వారిసమర్థతను గుర్తించి, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషను సభ్యులుగా 1979 నవంబరులో నియమించారు; ప్రధమ సభ్యులుగా ఐదు సంవత్సరములనుంచి వ్యవహరిస్తున్నారు.

విద్యార్థి దశలోనే సాహితీ పిపాస, కళాభిజ్ఞత వారిలో కమనీయంగా రంగులు దిద్దుకున్నవి. లోగడ ఆంధ్ర రాష్ట్ర సాంస్కృతిక ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించి రాజస్థాన్, గుజరాత్ మొదలైన వివిధ ప్రాంతాలలో ఇచ్చిన అలెగ్జాండరు నాటక ప్రదర్శనలలో పురుషోత్తముని పాత్ర ధరించి, తెలుగు వెలుగులను వెలార్చారు. ఆంధ్ర ప్రదేశ్ సచివాలయోద్యోగ సహకార సంఘానికి, గజెటెడ్ ఆఫీసర్ల సంఘానికి అధ్యక్షులుగా వారి సంచాలకత్వం లభించింది. వ్యక్తిగా సౌజన్య సౌహార్ద్రతలు తోడుకాగా సంభాషణా చాతుర్యం వారికొక విభూషణం. వక్త, విమర్శకులు. మేధావి - సంఘసంస్కర్త.

1971 లో ఆంధ్ర ప్రదేశ్ కులనిర్మూలన సంఘానికి వ్యవస్థాపకాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. వీరి సారధ్యంలో కులనిర్మూలన సంఘం మూడు పువ్వులు ఆరు కాయలుగ ప్రగతి పథంలో పురోగమిస్తూ, ప్రభుత్వం గుర్తింపు, ప్రజల మన్ననలను చూరగొన్నది. వేలాది వర్ణాంతర వివాహాలు విజయవంతంగా జరిగాయి. జాతీయ లక్ష్యమైన కుల రహిత సమాజ నిర్మాణ రూపకల్పనలో కీలక పాత్ర వీరిది.

సంఘ సంస్కర్త

శ్రీ జె. వీరాస్వామి

	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	REHB0[illegible]2250
పుస్తకం పేరు	కుల నిర్మూలనాదం
తారీఖు	2/1/24
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	189
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	CI, iv, 167
లేని పేజీలు	No
తయారు చేసినది	Sandhya
పేజీలు విడదీసినది	sandhya
స్కాన్ చేసినది	Sandhya
పరీక్ష చేసినది	pragathi
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	No
పరిస్థితి	good